ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు :

దేశోద్ధారక కాశీనాథుని

నాగేశ్వరరావు పంతులుగారు

స్థాపితం : 1908

శివలెంక శంభుప్రసాద్

సంపాదకుడు : (1938-1972)

18-24 సెప్టెంబర్ '87

శ్రీ ప్రభవ నామ సం. భాద్రపద బ. ఏకాదశి

సంపుటము 80 : సంచిక 4

ముఖ్య సంపాదకుడు :

శివలెంక రాధాకృష్ణ

కార్యవాహక(యాక్టింగ్) సంపాదకుడు :

మతుకుమల్లి మాధవరావు

విడి ప్రతి వెల	రు. 2.75
పోస్టులో 6నెలల చందా	రు. 80.60
పోస్టులో 12నెలల చందా	రు. 161.20

ఆంధ్రపత్రిక కార్యాలయము,

గాంధీనగరం, విజయవాడ-520 003

విషయానుక్రమణిక

ముఖచిత్రం :

నటి : సుహాసిని

(ఫొటో : ఎం. కె. రామమూర్తి)

ఉత్తరాలు

ముఖచిత్రం

ప్రచండ ఎండలకు బీటలువారిన భూమిపై తొలకరి చినుకలుపడడంతో ఆ ధరిత్రి ఎంత సంతసిస్తుందో తెలియదు కానీ, సినీ తారల ముఖచిత్రాలతో విసుగెత్తిన మాకు (మా బోంట్లకు) జయదేవుని గీత గోవిందం దశావతార వర్ణన ముఖచిత్రంతో 21-27 ఆగస్టునాటి సంచిక మా మనో వీచికలందు తొలకరిని చిలకరించింది. చిత్రకర్త డా. సిహెచ్. మురళీ కృష్ణారావుగారికి నా ధన్యవాదములు.

-చామర్తి గణపతిప్రసాద్, ఖుర్దారోడ్.

సీరియల్స్

ప్రముఖ రచయిత్రి సి. ఆనందారామంగారి సీరియల్ 'రేపటి మహిళ' వారం వారం ఎంతో చక్కగా నడుస్తూంది. మృదుల రోజు రోజుకీ తన ఇష్టమొచ్చినట్లుగా ప్రవర్తిస్తూంది. ఆమె మనసులో ఏముందో అర్థం గావడం లేదు. డా. కొత్త రవీంద్రబాబుగారి 'ప్రేమసాగర మథనం' వారం-వారం సరదాగా నడుస్తూంది. మిగతా సీరియల్ కథలన్నీ బాగున్నాయి.

-పోలోజు వెంకటాచారి, హెచ్.సి.యల్. టౌన్‌షిప్.

★ ★ ★

రావినూతల సువర్నాకన్నన్‌గారి 'మంజీరనాదం' సీరియల్ ఆసక్తికరంగా సాగుతున్నది. కొత్త రవీంద్రబాబుగారి సీరియల్ బాగుంది.

-కాజే హనిత, ఏలూరు.

కథలు

'ఆనందం పంచని అభ్యున్నతి' కథ చివరికి మాకు విషాదాన్ని పంచి కంట తడి పెట్టించింది. కథలో సంభాషణలు సహజంగా ఉండి కథను త్వరగా ముందుకు నడిపించాయి. 'అమ్మంటే అమ్మే' కథలో అవినీతిపరులైన కొడుకుల్ని చూసి కన్న తల్లి పడే ఆవేదన బాగా చిత్రించారు. కథలో చివరి మలుపు కొడుకుల్ని వదలి ఆమె నీతికి, ఆప్యాయతకు ప్రతిరూపమైన 'విశ్వం' దగ్గరకు చేరడం బావుంది.

-గుబ్బల సత్యనారాయణమూర్తి, పెదపాడు.

★ ★ ★

వేలూరి ఉషశ్రీగారి 'అమ్మంటే అమ్మే' కథ సహజంగా వుంది.

కని పెంచిన తల్లి తండ్రులను పట్టించుకోని తనయులు ఈ సమాజంలో ఎంతో మంది వున్నారు. వారికి ఈ కథ కను విప్పు కాగలదు.

-ప్రతాప వెంకట సుబ్బారాయుడు, ప్రతాప వెంకట సోమయాజులు, హైదరాబాద్.

★ ★ ★

దశావతారముల ముఖచిత్రం వన్నె చేకూర్చింది. 'అవినీతిని అంతమొందిస్తా', 'ఆనందం పంచని అభ్యున్నతి', 'అమ్మంటే అమ్మే', 'తొలగిన మేఘం' కథలు మాకు చాలా బాగా నచ్చాయి.

-చోడవరపు నాగేశ్వరరావు, రమాదేవి, హైదరాబాదు.

శీర్షికలు

'వి.పి. సింగ్ కవితలు' చాలా బాగున్నాయి. మొదట ఈయన కూడ కవితలు రాస్తాడా?! అని ఆశ్చర్యపోయాం! అంటే నమ్మండి!!!

-భీశెట్టి ముత్యాలనాయుడు, కస్బా జగన్నాథపురం.

★ ★ ★

"దూరదర్శనం" చాలా బాగుంటున్నది. సరిగ్గా మా అభిప్రాయాలకు అద్దం పట్టినట్లుగా రాస్తున్నారు.

– దామెర్ల కృష్ణవేణి, నెల్లూరు

హైదరాబాద్ నోట్‌బుక్

21 ఆగస్టు సంచికలో హైదరాబాద్ నోట్‌బుక్‌లో వి.పి. సింగ్‌గారి అవినీతి నిర్మూలనా యాత్రని గురించి రాశారు. ప్రస్తుతం మన దేశంలో అవినీతి మూడు పాదాలపైన, నీతి ఒక పాదం పైనా అది కుంటుతూ నడుస్తున్నది. అటువంటప్పుడు ఉన్న ఈ కాస్త నీతిని నిర్మూలించడం సులభం. అవినీతిని నిర్మూలిస్తాననటం ఒట్టి భ్రమ. అధికారం కోసం పాకులాట. మనం ఇప్పుడు అవినీతి పర్వంలో అంతర్జాతీయ ఖ్యాతి ఆర్జించాము.


-కె. రామారావు, హైదరాబాద్. □

విద్యా వ్యవస్థలో విక్రమార్కుడు!

రవి కళాశాల అంటే ఆంధ్రప్రదేశ్‌లో తెలియని వారు చాల అరుదుగా ఉంటారు. అలాగే ఆ కళాశాల స్థాపకుడైన సి. వి. ఎస్. ధన్‌గారి గురించి కూడా ఎవరికీ అడగవలసిన అవసరం ఉండదు.

విద్యార్థి లోకంలో ధన్‌గారికి ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఈ స్థానాన్ని ఆయన పొందగలిగారంటే దాని వెనుక మూడు దశాబ్దాల విశిష్ట చరిత్ర ఉంది. ఆ చరిత్రకు దీక్ష ఉంది. కార్యశక్తి ఉంది. పట్టుదల ఉంది. నిరంతరం పరిశ్రమించే ఓర్పు ఉంది. అన్నింటినీ మించి అనుకున్నది సాధించాలన్న లక్ష్యశుద్ధి ఉంది.

బెనారస్ హిందూ విశ్వవిద్యాలయం నుంచి 1955లో మానసిక శాస్త్రంలో స్నాతకోత్తర పట్టా పుచ్చుకున్న సి. వి. ఎస్. ధన్ మొదట్లో మిలటరీకి వెళ్లాలని ఈయన అనుకున్నారట. కృష్ణాజిల్లా వాస్తవ్యులైన ఈయన జర్నలిజంలోనైనా స్థిరపడాలని కోరుకున్నారట. కాని అనుకోని విధంగా ఆర్థిక ఇబ్బందుల కారణంగానే కళోదయ ట్యుటోరియల్ కళాశాలలో అధ్యాపకుడయ్యారు. విద్యార్థుల ప్రేమాభిమానాలకు చలించిపోయి అధ్యాపకుడిగానే నిలిచిపోయారు.



శ్రీ సి. వి. ఎస్. ధన్

కారణాంతరాల వల్ల కళోదయ ట్యుటోరియల్ కళాశాల బాధ్యతలను ఆ కళాశాల వ్యవస్థాపకుడు రామకృష్ణశాస్త్రిగారు సి. వి. ఎస్. ధన్‌గారికి అప్పగించడంతో సరికొత్త "స్టూడెంట్స్ వరల్డ్" రూపొందింది. 1957 జులై నాటికి రవి కళాశాల రూపు దాల్చింది.

10 మంది విద్యార్థులతో మొదలైన "రవి" ప్రకాశం దిన దిన ప్రవర్ధమానమై 2700 మంది విద్యార్థులతో నిత్య నూతనంగా వెలుగొందసాగింది. ఉన్నత ప్రమాణాలను సాధించడం కోసం ఉత్తమ శిక్షణా సంప్రదాయాలను పాటించడం కోసం విద్యార్థుల సంఖ్యను బాగా తగ్గించవలసిన పరిస్థితి ఏర్పడింది.

విద్యార్థులలో ఆలోచన రేకెత్తించి సృజనాత్మక శక్తిని మొలకెత్తింపజేసి సమాజానికి ఉపయోగపడే విధంగా వారిని తీర్చి దిద్దడం రవి కళాశాల ఆదర్శ లక్ష్యాలలో మొట్ట మొదటిదని ధన్‌గారు పేర్కొన్నప్పుడు ఆయన కళ్లల్లో ద్యోతకమయిన మెరుపులు కార్యసిద్ధిలో పట్టు విడుపులు ఉండకూడదన్న ఆయన సిద్ధాంతాన్ని వ్యక్తం చేస్తాయి.

ట్యుటోరియల్ కళాశాలలంటే ఎంతో చులకన భావమున్న రోజులలో గట్టి పట్టుదలతో ఆత్మ స్థయిర్యంతో కళాశాలను స్థాపించి, పెంచి, పెద్దదాన్ని చేసి మహా వృక్షాన్ని చేసారు. ఇప్పుడా చెట్టు నీడ దొరికితే చాలని ఎదురు చూస్తున్నవారు ఎంతమందో!

> "కష్టపడి పని చేయడం, సరిగ్గా ఆలోచించడం, నిజాయితీగా ఉండడం అవసరం. ఎవరైతే ఇలా ఉంటారో వారు నిశ్చయంగా, విజయాన్ని సాధించి తీరుతారు"
>
> "సాధించింది ఏముంది కనుక? నాకు తృప్తి లేదు. నేను సాధించవలసింది ఇంకా ఎంతో ఉంది. అయ్యో సాధించలేకపోతున్నానే అన్న అసంతృప్తి ఉంది..."

రవి కళాశాలకూ సమాజహితైష కార్యాలకూ ఎంతైనా అవినాభావ సంబంధముంది. క్రమశిక్షణ, శీల సంపద ఆయుధాలుగా- సమాజాన్ని ఆదుకోవడంలో తమ వంతు పాత్రను చిత్త శుద్ధితో నిర్వహించారు ధన్‌గారు. జన్మ స్థలమైన నందిగామలో కళాశాల నిర్మాణం కోసం, నాగార్జున విశ్వ విద్యాలయం భవనం కోసం, ఉత్తమ నవలను గౌరవించాలన్న సదుద్దేశంతో ఉన్నవ లక్ష్మీనారాయణగారి పేరిట నిధి ఏర్పాటు చేయడం కోసం, బొడ్డువల్లి సోమయాజుల స్మృత్యర్థం నిర్వహించే ఎండోమెంట్స్ ఉపన్యాసాలకు డబ్బు సమకూర్చి పెట్టడం కోసం- ఇలాగ ఎన్నో రకాల కార్యక్రమాల కోసం ఎంతగానో శ్రమపడి, భారీ ఎత్తున విరాళాలు ఇచ్చి, విరాళాలు సేకరించి కార్యక్రమాలన్నీ కలకాలం విజయవంతమయ్యేలా ఊపిరిపోసిన సి. వి. ఎస్. ధన్ ఎంతయినా అభినందనీయులు.

విప్లవాత్మకమైన విద్యా విధానానికి నాంది పలికిన వారు ఈయనే. శాస్త్రీయ ఆలోచనా ధోరణి విద్యార్థుల్లో నాటుకునేందుకు రక రకాల సైన్స్ ప్రోగ్రామ్‌లను నిర్వహించి శాస్త్రం సామాన్యుడి కోసమే అన్న భావం అందరిలో కలిగేలా పరిశ్రమించిన క్రియాశీలి సి. వి. ఎస్. ధన్!

రానున్న 21వ శతాబ్దం స్త్రీలదే అంటూ మహిళలు సామాజిక అభ్యున్నతిని పొంది చరిత్ర సృష్టించే రోజులు వస్తాయని ఆశిస్తున్నారు. కష్టపడి పని చేయడం, సరిగ్గా ఆలోచించడం, నిజాయితీగా ఉండడం అవసరమని చెబుతూ ఇలా ఎవరైతే ఉంటారో వారు నిశ్చయంగా విజయాన్ని సాధించి తీరుతారని నిస్సంకోచంగా చెప్పిన ధన్‌గారి మాటలు ఎవరైనా ఆలోచించదగ్గవి.

"తృప్తి లేదు. సాధించవలసింది ఎంతో ఉంది. అయ్యో సాధించలేకపోతున్నానే అన్న అసంతృప్తి ఉంది..." అన్న ధన్‌గారి మాటలు ఎవరికైనా ఏ పరిస్థితుల్లోనైనా తట్టి లేపుతాయి.

-డాక్టర్ గుమ్మనూరు రమేష్‌బాబు




సంపూర్ణమైన పెరుగుదల కోసం రుచికరమైన ఫారెక్స్® మార్గం.

మీ పాపాయి పొడవు, బరువు తనిఖీ చేసుకోండి*	మగ పిల్లలు		ఆడ పిల్లలు	
	బరువు	పొడవు	బరువు	పొడవు
3 నెలలు	**5.2** కిలోలు	59.1 సెం.మీ.	**4.9** కిలోలు	58.4 సెం.మీ.
6 నెలలు	**6.7** కిలోలు	64.7 సెం.మీ.	**6.1** కిలోలు	63.7 సెం.మీ.
9 నెలలు	**7.3** కిలోలు	68.2 సెం.మీ.	**6.9** కిలోలు	67.0 సెం.మీ.
12 నెలలు	**8.4** కిలోలు	73.9 సెం.మీ.	**7.8** కిలోలు	72.5 సెం.మీ.

* ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రిసెర్చి ద్వారా విడుదల చేయబడినది.

ఇవి భారతీయపిల్లల కోసం సగటు బరువు, పొడవులు మాత్రమే. వీటితో సరిపోలకపోయినా, మీ పాపాయి పెరుగుదల మీ డాక్టరుకు సంతృప్తికరంగా వుంటే ఆందోళనపడే అవసరం లేదు.

పిల్లల పెంపకం సంబంధంగా తీసుకోవలసిన శ్రద్ధను గూర్చి తెలిపే చిన్న రంగుల పుస్తకపు ఉచిత ప్రతి కోసం వీరికి వ్రాయండి:
గ్లిండియా లిమిటెడ్, (FPD/57),
డా. ఆనీ బెసెంట్ రోడ్,
వర్లీ, బొంబాయి-400 025.



సంపూర్ణమైన వికాసం మరియు పెరుగుదల కోసం మీ పాపాయికి ఇవ్వండి.

ఫారెక్స్®

పెరుగుదల కోసం రుచికరమైన విధానం

సీరియల్

లాయర్ మహిళ

సి. ఆనందారామం

(గత సంచిక తరువాయి)

లాయర్ యశోధరాదేవికి ఎనభై ఏళ్ళు. అయినా పరిపూర్ణ ఆరోగ్యంతో వుంది. ఈ రోజుకి ఆవిడున్నంత చురుగ్గా, సమర్థంగా చిన్నపిల్లలుకూడా పనిచెయ్యలేరు. ఆడదానిని సమాజం అన్నివిధాల అణచివుంచాలని ప్రయత్నించే రోజుల్లో – స్త్రీకి విద్య అవసరమా, అనవసరమా – అని చర్చలు సాగే రోజుల్లో తన ధైన వ్యక్తిత్వానికి ఊపిరిపోసుకోవాలని విలవిలలాడిపోయిన మహిళ యశోధరాదేవి. చదువు, సంస్కారము వున్నయింట్లో పుట్టింది యశోధర. ఆ కారణంవల్లనే ఆ రోజుల్లోనే మెట్రిక్యులేషన్ పాసైయ్యాక పెళ్ళిజరిపించారు పెద్దవాళ్ళు. హిందూ కుటుంబాలలో జరిగే అన్ని పెళ్ళిళ్ళలో లాగానే వరుడు రూపురేఖలు – ఆస్తిపాస్తులు – చదువు – కుటుంబ మర్యాదలు యివన్నీ ఆలోచించి పెళ్ళిచేసారు. యశోధర స్థానంలోవున్న మరే స్త్రీ అయినా తను చాలా అదృష్టవంతురాలనని అనుకొని, సుఖంగా తిని పడుకొని కాలం గడిపేసేది. కాని యశోధరకిమాత్రం తినడం – పడుకోవడం – బట్టలు కట్టుకోవడం – యిదే జీవితంకాదు. ఏదో చెయ్యాలి. ఆ రోజుల్లోనే యశోధర పెద్దమ్మ కూతుర్ని, అందంగా లేదన్న కారణంతో ఆమె భర్త వొదిలేసి మరో పెళ్ళి చేసుకున్నాడు. ఆడదానికి పతి పాదసేవే శరణ్యమనే బోధలు జీర్ణంచేసుకున్న ఆ అమ్మాయి సవతికి – సవతి బిడ్డలకి సేవలు చేసుకుంటూ భర్తదగ్గిరే వుంటానని ప్రయాణమయ్యింది. ఈ రకమైన ఆదర్శాన్ని అర్థంచేసుకోలేని యశోధర, "అతడు నిన్ను వొదిలేసి మరెవరినో పెళ్ళిచేసుకుంటే అతనికి, నీ సవతికి – సవతిపిల్లలకి సేవలు చేస్తానని బయల్దేరుతున్నావు. నీ కభిమానంగాలేదా!" అని అడిగింది. ఆవిడ నిట్టూర్చి "ఆడదానికి యెన్నుంటే యేం లాభం? అవన్నీ సాగుతాయా? అభిమానపడి నేను చెయ్యగలిగిందేముంది? ఇక్కడుంటే, వదినలకి అన్నదమ్ముల పిల్లలకీ సేవలు చెయ్యాలి. ఈ చాకిరీ యేదో అక్కడే చేసుకుంటే కనీసం మొగుడింట్లో పడుందన్న గౌరవమైనా దక్కుతుంది" సమాధానం చెప్పిందావిడ నిరాశగా. ఆవిడ మాటల్లో చేదు నిజాన్ని గుర్తించింది యశోధర మనసు. ఆడదానికి జరుగుతూన్న అన్యాయానికి ఆవిడ మనసు విలవిల్లాడిపోయింది. ఎలాగైనా స్త్రీకి న్యాయం చేకూర్చాలనే తపన ఆమెలో లాయర్ కావాలనే సంకల్పానికి దారితీసింది. కాలేజీలో చేరి చదువుకుంటానని యింట్లో వాళ్ళనడిగింది. అదేదో వినకూడని ఘోరమైన మాట విన్నట్లు బుగ్గలు నొక్కుకుని ముతులు విరుచుకున్నారు భర్తతో సహా అందరూ. అయినా ఆవిడ సంకల్పం చెదరలేదు. చదువుకుంటే నిన్ను వదిలేస్తానన్నాడు భర్త. ఆవిడ నవ్వుకుంది. నా చదువుకోసం అవసరమైతే నేనే నిన్ను వొదిలేస్తాను అనుకుంది మనసులో. పుట్టింటివారుకూడా యశోధర చదువుకోసం సంసారాన్ని వొదిలేయడానికి సుముఖత చూపించలేదు. సాధారణ హిందూ కుటుంబాలలో మరిదారుణమైన పరిస్థితులెదురైతే తప్ప సంసారాలు పాడుచేసుకోవడానికి ఆడపిల్లల తల్లిదండ్రు లెవరూ యీనాటికీ వొప్పుకోరు. యశోధర ఎవర్ని లెఖ్ఖచెయ్యలేదు. ఎవరి అండకోరలేదు. అత్తవారిల్లు వొదిలేసి మెడ్రాస్‌కి వచ్చి కాన్వెంట్ హాస్టల్లోచేరి తిరిగి చదువు ప్రారంభించింది. కూతురి పట్టుదల గుర్తించిన తండ్రి ఆమెకు తన చేయూతనిచ్చాడు. యశోధర భర్త రెండో పెళ్ళి చేసుకోవాలనుకున్నప్పుడు తన ఆమోదాన్ని వ్రాతపూర్వకంగా యిచ్చేసింది యశోధర. లాయర్‌గా పట్టాపుచ్చుకుని స్థిర సంకల్పంతో తన జీవితధ్యేయం నెరవేర్చుకోడానికి నల్లకోటుతో కోర్టులో ప్రవేశించింది. ప్రధానంగా స్త్రీలకి జరుగుతోన్న అన్యాయాల గురించి వాదించి స్త్రీజాతికి న్యాయం చేకూర్చాలనేది యశోధర ఆశయం.

అయితే ఆమెకు త్వరలోనే ఒక విషయం అర్థమైంది. సమాజంలో యెన్నెన్నోరకాలుగా అన్యాయానికి గురౌతున్న ఆడవాళ్ళు ఎందరోవున్నా – "నాకు అన్యాయం జరిగింది" అని ముందుకొచ్చి చెప్పుకునే ఆడవాళ్ళు మాత్రం చాలా తక్కువ. వాళ్ళల్లోనూ కోర్టులవరకూ వచ్చేవారు మరీ తక్కువ. పాయింటు అయిదు సున్నాలు ఒకటి శాతం అని చెప్పుకోవచ్చు. ఉసూరుమనిపోయింది యశోధర. ఎంతో చెయ్యాలనివుంది. కాని ఏం చెయ్యగలదు? ఈ ఆడవాళ్ళు యిరుగు పొరుగు అమ్మలక్కలతో మొగుడిమీద – అత్తగారిమీద నేరాలు చెప్పుకోడానికి మించి యేమీ ఆలోచించటంలేదు.

తలవని తలంపుగా ఆమెకి ఒక విచిత్ర పరిస్థితి ఎదురైంది. ఏదో కోర్టు కేసు సందర్భంగా ఆవిడ ఏలూరు వెళ్ళవలసివచ్చింది. ఆనాటికి ఏలూరు లాంటి టౌన్స్‌లో ఆడవాళ్ళు నేరుగా బసచేయతగ్గ హొటల్స్ ఏమీలేవు. తెలిసిన లాయర్ ఆహ్వానంమీద అతడి యింట్లో బసచేసింది. భోజన సమయంలో వడ్డిస్తోన్న వంటమనిషిని చూసి నివ్వెరపోయింది. ఆవిడ తన భర్త రెండో భార్య. ఆవిడని తన గదిలోకి పిలిపించుకుని వివరాలు అడిగింది.

యశోధర సవతికి పిల్లలు పుట్టలేదన్న కారణంతో భర్త మూడో పెళ్ళికూడా చేసుకున్నాడు. కొన్నాళ్ళు భర్త యింట్లోనే వంట మనిషిగా గడిపింది. ఒకరోజు ఆవిడకి తీవ్రంగా జ్వరం వచ్చింది. తగిన మందుమాకు – ఆలనాపాలనా లేక టైఫాయిడ్‌లోకి దింపింది. ఆరోగ్యంగా వున్నన్నాళ్ళూ ఆవిడ చేత సకల సేవలు చేయించుకున్న ఇంట్లోవాళ్ళు, ఆమెఆతీగతీ పట్టించుకోకపోగా అంటురోగమని పేరుపెట్టి గవర్నమెంటు హాస్పిటల్‌లో పడేసి చేతులుదులుపుకున్నారు. ఆయుర్దాయం గట్టిగావుండబట్టి బతికి బయటపడ్డ ఆవిడకి భర్తయింటికి వెళ్ళాలనిపించలేదు. హాస్పిటల్‌లో డాక్టరే యిక్కడ

జరిగిన కథ – 6 : మృదుల మరెవరినైనా ప్రేమిస్తున్నదేమోనని భాగవతార్ అనుమానిస్తుంటాడు. ఎండెటో, మింగియార్, అనంగ్‌ల మీద ఆయనకు అనుమానం ఉంటుంది. అమెరికా వెళుతూ మృదుల మీద నిఘా పెట్టి పోతాడు. మృదుల ఎండెటో, మింగియార్, అనంగ్‌లను తనకొక పనిలో సాయపడవలసిందని కోరుతుంది. భాగవతార్ తెలియజేయకుండానే ముందుగా బయల్దేరి వచ్చినా విమానాశ్రయానికి మృదుల వస్తుంది. డిటెక్టివ్ సోమనాథ్ మృదుల ముందే భాగవతార్‌కి ఫైలు అందజేస్తాడు. దేవకి కోసం విమానాశ్రయానికి వచ్చానని మృదుల చెపుతుంది.

వంటమనిషిగా పనిచూపించాడు. జీతం బత్తెం లేకుండా భర్త యింట్లో పడివుండడంకంటే జీతమిస్తూ తనని గౌరవంగా చూస్తూ, మూడుపూటలా కడుపునిండా తిండిపెట్టే యీ యింట్లో వుండడమే ఎంతో బాగుందావిడకి.

అంతావిని కదిలిపోయింది యశోధర. మెద్రాస్ వచ్చాక కూడా తీవ్రంగా ఈ విషయాలే ఆలోచించసాగింది. ఆ ఆలోచనల ప్రతిఫలమే "కరదీపిక సంస్థ" కరదీపిక మహిళాసంస్థలో మొట్టమొదటి సభ్యురాలు యశోధర సవతి. సంగీతంలో ప్రవేశము – ప్రావీణ్యామూ వున్న సవతికి ఒక సంవత్సరంపాటు బాగా సంగీతం నేర్పించి అప్పటి ఆడపిల్లల గవర్నమెంటు స్కూల్లో సంగీతం టీచర్‌గా చేర్పించినప్పుడు యశోధర పొందిన ఆనందం వర్ణనాతీతం. అప్పటివరకు కోర్టులో ఆవిడ సాధించిన విజయాలు – పొందిన ప్రశంసలు – ఏవీ ఆమెకంత ఆనందాన్ని కలిగించలేదు. అలా ప్రారంభమైన కరదీపికసంస్థ క్రమక్రమంగా శాఖో పశాఖలుగా విస్తరిల్లి అంతర్జాతీయ సంస్థగా రూపుదిద్దుకుంది.

* * * * *

చర్చిగేటు ప్రాంతాలలో వున్న హొటల్ ఎంబాసిడర్‌లో భాగవతార్‌ని దింపి మలబార్ హిల్స్‌లో వున్న కరదీపిక కార్యాలయానికి వచ్చింది మృదుల. మృదుల ఒక్కర్తే రావడం చూసి, "దేవకి రాలేదా?" అని అడిగింది యశోధరాదేవి. ఇప్పుడిప్పుడు ఆవిడ యెక్కువసేపు కుర్చీలో కూర్చోలేక వాలుకుర్చీలో "యు"షేప్ దిళ్ళువేసుకుని కూర్చుంటోంది. ముగ్గు బుట్టలాంటి తల, పండుతమలపాకులాంటి శరీరఛాయ, నిర్మలంగా – ప్రశాంతంగా వుండే చూపులు, అభిమానం – ఆప్యాయత వుట్టిపడే చిరునవ్వు.

"దేవకిగారు రాలేదు. అనుకోకుండా భాగవతార్ వచ్చారు. ఆయిన్ని హొటల్ ఎంబాసిడర్‌లో దింపి యిలా వచ్చాను" అంది మృదుల. నిట్టూర్చింది యశోధరాదేవి.

"కరదీపిక కార్యవర్గ సభ్యులే ఆ సంఘంలో ఆశ్రితులుగా చేరే దురవస్థ రావచ్చునని నేనెన్నడూ ఊహించలేదు. మన దురవస్థలకి వ్యవస్థ మాత్రమే కారణం కాదు. మన ఆశలు– మన ప్రలోభాలు– మన బలహీనతలు కూడా మనల్ని ఊబిలోకి లాగుతున్నాయి. ఈ సూత్రం స్త్రీ పురుషులిద్దరికీ వర్తించినా ఊబిలో పడ్డ మగవాడు బయట పడగలిగినట్లు ఆడది బయట పడలేదు. అక్కడ వ్యవస్థ మరింత క్రూరంగా– కఠినంగా అడ్డుపడుతుంది ఆడదానికి, దేవకి చికాగో నించి బయలుదేరిందని ఇందిర ఫోన్ చేసింది. ఇక్కడికి రాకుండా ఎక్కడికెళ్ళిందో మరి?"

"ఇంత చిన్న విషయానికి మీరు ఆందోళన పడవలసిన అవసరం యేముంది మేడమ్?"

"చికాగోలో బయలుదేరిన దేవకి బొంబేక రానందుకు నేనాందోళన పడ్డంలేదు. ఇందిర నాకు చాలా విషయాలు వ్రాసింది. ఫారిన్ సైంటిస్ట్ అనే వ్యామోహంలో దేవకి పెళ్ళి చేసుకున్న యూరోపియన్ ఫ్లెమింగ్ కొన్నాళ్ళుగా కనబడటంలేదట. దేవకి ఒకసారి ఫైవ్‌స్టార్ హొటల్లో డాన్స్ చేస్తూ కనపడిందట. "ఇక్కడి హొటల్స్ చాలా ఎక్స్‌పెన్సివ్. అందుచేత మేము తరుచుగా వెళ్ళం. దేవకి రెగ్యులర్‌గా హొటల్స్‌లో డాన్స్ చేస్తోందేమో నాకు తెలియదు. ఇప్పుడు మన కరదీపిక కార్యాలయానికి కూడ తను రావడంలేదు. ఏదో గుంభనగా ప్రవర్తిస్తోంది." అని వ్రాసింది ఇందిర. అందుకే దేవకి కోసం ఆరాటంగా యెదురు చూస్తున్నాను. దేవకి రాలేదని ఆందోళన పడుతున్నాను."

"దేవకి ధైర్యంగా పరిస్థితుల నెదుర్కోగలదని మనకి తెలుసుగదా!! ఏదైనా సమస్య యెదురైనా తనే పరిష్కరించుకుంటుంది లెండి."



రేపటి మహిళ

"నీకు తెలియదమ్మా!! పసదానివి. ఎంత ధైర్యమున్నా ఏ మాత్రం, యెదుర్కోలేని సుడిగుండాలెన్నో అన్ని రకాల సమాజాల్లోను యెదురు చూస్తునే వున్నాయి. నేను చాలా దేశాలు తిరిగొచ్చాను కదా!! ఎంతో వెనుకబడి వున్నామని భావిస్తున్న మనదేశంలోనే ఆడదానికి యెక్కువ రక్షణ వున్నట్లుగా తోచింది నాకు. ఆడవాళ్ల కొకటే రోగం. వాళ్లు ప్రేమించగలరు. తల్లిని, తండ్రిని- మొగుడ్ని, పిల్లల్ని- అందర్ని ప్రేమిస్తారు. ఈ ప్రేమజ్వాలల్లో దహించుకుపోతూ కర్పూరంలా కరిగిపోతారు."

"సారీ మేడమ్! ప్రేమ- స్నేహం- ఇలాంటివి పరస్పర సహకారాలతో మరింత వృద్ధిలోకి రావడానికి తోడ్పడాలికాని కరిగిపోడానికి- హరించుకు పోడానికికాదు. ఈ రకమైన రొమేంటిక్ ఐడియాలజీ నేను భరించలేను." నవ్వుతూ మృదుల భుజం తట్టింది యశోధరాదేవి.

"నీకున్న ఆత్మవిశ్వాసం- ధార్ష్యము- స్థిర సంకల్పము యీ నాటికీ ఆడవాళ్లలో చాలామందికి లేవు. ఇప్పటికి మనలో తొంభైశాతము తిండి, బట్టలు- భర్త, పిల్లలు- అవసరమైతే ఉద్యోగము- ఇదే జీవితమనుకొంటున్నారు. ఆడవాళ్లకోసం ప్రత్యేకించి పత్రికలు రావడం బాగానే వుంది కాని ఆ పత్రికల్లో యెక్కువ భాగం, వంటా- వార్పు; అందాలు, అలంకరణలు- కుట్లూ, అల్లికలు- మొదలైన కుటుంబ జీవన ధోరణులకే పరిమితమై పోతున్నాయి. బహుశ అలా వుండేకాని ఆడవాళ్ల పత్రికలని ఆడవాళ్లు కూడ చదవరేమో?? నువ్వూ నేను ఏం చెయ్యగలము? ఈ మహాయజ్ఞంలో నువ్వే నాకు వారసురాలిగా రాగలవని అనుకుంటున్నాను."

"థాంక్యూ మేడమ్!"


"మరో మాట దేవకి ఎప్పుడు ఏ పరిస్థితుల్లో కనపడ్డా చిన్నబుచ్చుతూ మాట్లాడకు. అవమానించి నిరసించకు. ఏమీ జరగనట్లు- ఏమీ తెలియనట్లు స్నేహంగా పలకరించి ఇక్కడికి తీసుకురా. మన వాళ్లందరితోనూ నా మాటలుగా యీ విషయాన్ని చెప్పు."

యశోధరాదేవి దృక్పథాన్ని మనసులో మెచ్చుకుంది మృదుల. ఇంతటి ఉదార హృదయము – దూరాలోచన – ఉండబట్టే ఎంతో సామాన్యంగా ప్రారంభమైన కరదీపిక సంస్థ అంతర్జాతీయ స్థాయికి ఎదిగింది.

* * * * * *

ఫోటోలున్న ఎన్వెలాప్ నెగిటివ్స్‌తో సహా సోమనాధ్ టేబుల్ మీదుంచాడు సహదేవ్.

"ఇవన్నీ మింగియార్ ఇంటిలోంచి బయటకు వచ్చిన వాళ్ల ఫోటోలు" చెప్పాడు.



"వెరీ గుడ్".

ఫోటోలు ఒక్కొక్కటీ తీసి చూడసాగాడు. వాటిలో కొన్ని పరిచయస్థుల మొహాలు కనిపించాయి. అలా చూస్తూ ఒక ఫోటో చేతుల్లోకి తీసుకొని సంభ్రమంగా, "ఈ ఫోటో – ఈవిడ కూడా మింగియార్ ఇంటిలో నుంచే వచ్చిందా?" అడిగాడు.

"అవును సార్. ఈ ఫోటోలో వున్న ప్రతి ఒక్కరూ ఆ ఇంట్లోంచి వచ్చిన వారే".

సన్నగా ఈల వేసుకున్నాడు సోమనాధ్. అతి సామాన్యమైన వ్యక్తిగత విషయంగా ప్రారంభమైన ఇన్వెస్టిగేషన్ సెన్సేషనల్‌గా మలుపు తిరిగేలాగ వుంది. సోమనాధ్ స్నేహితుడు జర్నలిస్టు మహావీర్. అతడు ప్రత్యేకించి ఏ పత్రికల్లోను పనిచేయడు కాని ఎంతో ఆసక్తికరమైనవి- అత్యంత రహస్యమయినవి సమాచారాలు సేకరించి కొన్ని ప్రముఖ దినపత్రికలకు పంపిస్తూంటాడు. న్యూస్ పేపర్స్ ప్రొప్రయిటర్స్ అతడు సేకరించిన సమాచారం కొనడానికి పోటీలు పడుతూ రెమ్యూనరేషన్స్ చెల్లిస్తారు.

మహావీర్ ఒక అమ్మాయి ఫోటో చూపించి, "ఈ అమ్మాయి పేరు దేవకి. కొన్నాళ్ళుగా చికాగోలో వుంటూ ఇండియాకి వచ్చిందని తెలిసింది. ఈమె ఆచూకి తెలుసుకోగలిగితే నాకు ఫోన్ చెయ్యండి. బిల్లు ఎంతయినా ఫరవాలేదు" అన్నాడు.

ఈ ఫోటోలో అమ్మాయి ముమ్మూర్తులా దేవకే.

* * * * * *

మృదుల దినచర్యకి సంబంధించిన ఫైల్ ముందేసుకొని దాన్ని ఒక క్రమంలో పెట్టడానికి నానా అవస్థపడుతున్నాడు భాగవతార్. ఒకటో పేజీ తరువాత పదో పేజీ, పదో పేజీ తరువాత యాభైయో పేజీ, ఆ తరువాత తొమ్మిదో పేజీ అలా చిందరవందరగా వున్నాయి. అవన్నీ పేజీలవారీగా పెట్టుకోడానికి ప్రయత్నిస్తూ, సహజంగా వుండే పరాకు – ఖంగారు కారణంగా మరల కన్ఫ్యూజ్ అయిపోతున్నాడు. మధ్యలో కొన్ని కొన్ని పేజీలు పోయినట్లుగా తోస్తోంది. చదవడం మొదలు పెడితే మధ్య మధ్యలో అక్షరాలు ఎయిర్ పోర్ట్‌లో నేలమీది బురదకి అతుక్కుపోయి, "మృదుల... పీకేసి .... గాంధీ .... బోంబే ... ఎ టు జడ్ ... పగ సాధిస్తా ...." ఈ ధోరణిలో కనిపిస్తున్నాయి అక్షరాలు. తలాతోకా అర్థం కావడం లేదు. అర్థమైనంతవరకూ గాభరా కలిగిస్తున్నాయి. గాంధీ ఎవడు? బోంబే ఎప్పుడెళ్లింది? తనని రిసీవ్ చేసుకోడానికి వచ్చినట్లుగానే వూళ్లో లేనప్పుడు బోంబే వెళ్లి వస్తూండేదా? ఎందుకు? అక్కడెవరున్నారు – ఓ దేవకి..... దేవకి బొంబాయిలో వుందా? "పగసాధిస్తా"- దేవకితో కలిసి పగ సాధించాలనుకుంటోందా? వంటి నిండా చెమటలు పట్టి, భయంతోనూ – కోపంతోనూ వొణికిపోయాడు నిలువునా.

"నమస్కారం సార్!" లోపలికొచ్చి కూర్చున్నాడు నక్షత్ర. అరగంట నుంచి ప్రయాసపడుతూ నంబర్ల ప్రకారం వరుసక్రమంలో పేర్చుకుంటున్న కాగితాలన్నీ హడావిడిగా కలిపేసి చేత్తో గట్టిగా పట్టుకుని, "ఇప్పుడెందుకొచ్చారు?" అన్నాడు కోపంగా

"అదేమిటిసార్! మీరు రమ్మని ఫోన్ చేస్తేనే కదా వచ్చాను."

"ఆ! నేను రమ్మని ఫోన్ చేసానా?....ఆ....అవునవును. నేను లేనప్పుడు మృదుల కేంకావాలో కనుక్కున్నారా?"


"ఆ రోజూ వస్తూనేవున్నాను. ఆవిడకేంకావాలో నేను కనుక్కోవడమేమిటి? లోకాలన్నీ పాలించే లక్ష్మీదేవిలాంటిది మీ యిల్లాలు. ఆవిడే నా కేంకావాలో చూసేది. ఎంత అదృష్టవంతులండీ మీరు! ఎంతో పుణ్యంచేసుకుంటేనేగాని......"


భాగవతార్ మొహం చూసిన నక్షత్ర వాక్ప్రవాహం మధ్యలో ఆగిపోయింది. కనుబొమ్మలు చిట్లించి గుర్రుమంటూ చూస్తున్నాడు భాగవతార్. తను పొరపాటుగా ఏం మాట్లాడాడో అర్థంకాలేదు నక్షత్రకి.

"నిజం చెప్పండి! నేనూళ్ళోలేనప్పుడు మృదుల ఎన్నిసార్లు బొంబాయి వెళ్ళింది?"

"ఒక్కసారి. నిన్ననే బయలుదేరి యివాళ మీతో వచ్చారు. నిజమే చెప్తున్నాను."

"పచ్చి అబద్ధం. అయిదారుసార్లు బొంబాయి వెళ్ళినట్లు నాకు రూఢిగా తెలిసింది."





"అయ్యో! ఆవిడకి పాదలేపనం లాంటి దివ్యశక్తులేమైనా వుంటే బొంబాయికి ఎగిరివెళ్ళివచ్చిందేమో నాకు తెలియదు కాని నేను మాత్రం హైదరాబాద్‌లో యీ యింట్లో ప్రతిరోజూ ఉదయం చూస్తూ_నేవున్నాను. మాట్లాడుతూనేవున్నాను."

"గాంధీ ఎవరు?"

"మీరు నాతో వేళాకోళం ఆడుతున్నారా? గాంధీ ఎవరో మీకు తెలియకపోవడమేమిటి? అతను మన జాతిపిత. మనకి స్వాతంత్ర్యము తెచ్చిపెట్టిన మహానుభావుడు."

"ఆ గాంధీ గురించి కాదయ్యా!! ఆ మహానుభావుడు పేరుపెట్టుకున్న చవటవెధవలు చాలామంది వున్నారుగా! వాళ్ళగురించి అడుగుతున్నాను."

"తమరు నన్ను క్షమించాలి. చవటవెధవల్ని తెలుసుకోవడం అంత తేలికకాదు. పైకి తెలివైనవాళ్ళల్లా – గొప్పవాళ్ళల్లా కనిపించేవాళ్ళల్లో ఎందరో చవటవెధవలున్నారు. ఎంతో సన్నిహిత పరిచయం వుంటేగాని గుర్తించలేము."

మరోసారి గుర్రుమన్నాడు భాగవతార్.

"గాంధీ అన్నవాడెవడూ యిక్కడికి రాలేదా?"

"నాకు తెలిసినంతలో రాలేదు. అయినా మీకో మాట చెప్తాను. మీరేమనుకున్నాసరే! మీ అదృష్టంకొద్దీ దీపంలాంటి బంగారుతల్లి భార్యగా దొరికితే అదృష్టాన్ని అభినందించుకుంటూ ఆనందంగా జీవించవలసిందిపోయి లేనిపోని అనుమానాలతో జీవితాన్ని చిందర వందర చేసుకోవడం అవివేకం."

నోటమాట రాలేదు భాగవతార్‌కి.

"ఇదేమిటి? ఈ నక్షత్ర కూడా మృదుల వలలో పడిపోయాడా?" లోకమంతా ఒకటై మృదుల వైపు చేరిపోయి తనని హేళన చేస్తున్నట్లు అనిపించింది. చేతులు కట్టుకుకూర్చున్న నక్షత్ర తనలో నవ్వుకుంటున్నట్లు తోచింది.

"స్టాపిట్!" గట్టిగా అరిచాడు. "మీరు అబద్ధాలు ఆడినా నిజం నాకు తెలుసు. మృదుల నే వెళ్ళినప్పటి నుంచి వచ్చేవరకు ఏ క్షణంలో ఏం చేసిందో ఆ రిపోర్టు అంతా నాదగ్గరుంది."

"ఘటం బింద్యాత్, పటం చింద్యాత్ కుర్యాద్వా

గార్ధబస్వరం ఏనకేన ప్రకారేణ ప్రసిద్ధః పురుషో భవేత్"

అంటే కొందరు మనుష్యులు ప్రసిద్ధులు కావటంకోసం కుండలు పగలగొడ్తారు. బట్టలు చింపుకుంటారు. గాడిదల్లా కూస్తారు. ఎలాగైనా నలుగురు దృష్టిలోకి వచ్చి ప్రసిద్ధులు కావడమే వారిధ్యేయం. అందుకవలంబించే మార్గం మంచిదా పిచ్చిదా అనే ఆలోచన రాదు. అలాంటి మహానుభావులెవరో మీరు రిపోర్టు రాయమనేసరికి "రాయడానికి ఏమీ లేదు–" అని చెప్పటం చేతకాక వున్నవీ లేనివి రాసి మీకిచ్చివుంటారు. యిదీ నమ్ముకుని మీ సంసారం పాడుచేసుకుంటే తరువాత మీరెంత బాధపడినా ప్రయోజనంలేదు. మీరు తనని అనుమానిస్తున్నారని గ్రహిస్తే మృదులగారు మిమ్మల్ని క్షమించరు."

చివరి మాటలకు ఖంగారుపడిపోయాడు భాగవతార్.

"ఛ. ఛ. నా కేం అనుమానం! అనుమానం వుంటే యింత స్వేచ్ఛగా అంగీకరిస్తానా? భార్యలను అనుమానించె భర్తలంటె నాకసహ్యం."

"గుడ్‌మార్నింగ్ ఎవ్రిబడీ!" అంటూ నవ్వుతూ వచ్చింది మృదుల.

"ఏమిటి? అసహ్యం అంటున్నారు?" అడిగింది.

నక్షత్రకి మాట్లాడే అవకాశం యివ్వకుండా "భార్యలనుమానించే భర్తలంటే నాకసహ్యం అని చెప్తున్నాను." అన్నాడు భాగవతార్. అంటూనే తన వొళ్ళో చిందర వందరగా వున్న కాగితాలు మృదుల చూస్తుందేమోనని ఉండచుట్టి వేస్ట్‌పేపర్ బాస్కెట్‌లో పడేశాడు.

"అసహ్యం అని యింకా నెమ్మదిగా అంటున్నారా! అలాంటి మనుష్యులని వింతమృగాలుగా స్టాంప్‌వేసి 'జూ'లో పెట్టాలి." కోపంగా అంది మృదుల. నక్షత్ర గంభీరంగావున్నా అతడి మొహంలోకి బెరుగ్గా చూసి వెర్రినవ్వు నవ్వేడు భాగవతార్.

"అయినా! ఈ అనుమానించడం అనే రోగం కంటె దౌర్భాగ్యమైనదేదీ నాకు కనపడ్డంలేదు. ఒకరిపట్ల ప్రేమానురాగాలు, విశ్వాసాలు వుంటే కలిసిమెలిసి వుండాలి. లేకపోతే హాయిగా విడిపోవాలి. పెళ్ళనేది స్త్రీ పురుషులు కలిసిమెలిసి జీవించడానికి ఏర్పాటుచేసుకున్నది. ఒకరిమీద పెత్తనం చెలాయించే హక్కు మరొకరికిలేదు. వుండడానికి వీల్లేదు."

భాగవతార్ గుటకమింగి "ఔనౌను" అన్నాడు.

"ఇంతకీ అలా భార్యననుమానించే గాడిద వెధవ ఎవరో నాకు చెప్పు. వాడిపనిపడ్తాను."

"ఏం చేస్తావు?" ఏడుపుమొహంతో అడిగాడు భాగవతార్.

"వాళ్ళావిడను కలుసుకుని ఆవిడకి నచ్చజెప్పి ఆ మొగుడిమీద దావా వేయించి విడాకులు యిప్పిస్తాను. ఆస్తిలో భాగం యిప్పిస్తాను. టింగ్‌రంగామని హాయిగా బతుకుతుంది. ఎడ్రస్ తెలుసా?"

నక్షత్ర లేచి నిలబడ్డాడు. "అయ్యా! నేను వెళ్ళొస్తాను." అన్నాడు చేతులు జోడిస్తూ. అతడు తనని వెక్కిరిస్తున్నట్లుగా తోచింది భాగవతార్‌కి.

"కూర్చోండి. కాఫీ తాగి వెళ్దురుగాని" అంది మృదుల. వెంటనే కూర్చున్నాడు నక్షత్ర. వంటమనిషిని పిలిచి కాఫీలు తెమ్మంది. వంటమనిషి ట్రేలో కాఫీ కప్పులతో వచ్చి ట్రే టీపాయిమీద పెట్టింది. పక్కనేవున్న కాగితాలతో వున్న వేస్ట్‌పేపర్ బాస్కెట్ బయట పారెయ్యడానికి తీసుకెళ్ళబోయింది.

"ఆ బకెట్ దేనికి? అక్కడపెట్టు" గాభరాగా అన్నాడు భాగవతార్.

"హాల్లో వున్న వేస్ట్‌పేపర్ బాస్కెట్ ఎప్పటికప్పుడు ఖాళీ చెయ్యాలని నేనే చెప్పాను. తీసుకెళ్ళిపో!" చెప్పింది మృదుల.

బోల్డంత బిల్లు చెల్లించి సోమనాథ్ ప్రయివేట్ డిటెక్టివ్ ఏజన్సీన్‌తో తయారుచేయించిన రిపోర్టు చెత్త బకెట్‌లో చూసుకుంటూ బయట పారెయ్యడానికి వంటమనిషి తీసుకెళ్తుంటే కళ్ళప్పగించి వుండిపోయాడు భాగవతార్.

కాఫీ తాగేసి ఖాళీకప్పు ట్రేలో వుంచేసి "అయ్యా! కాఫీ తాగండి చల్లారిపోతుంది" చెప్పాడు నక్షత్ర.

(ఇంకావుంది)

మహిళా పాఠకుల శీర్షిక!

ఈకాలం పెళ్లిళ్లు

విడాకులు పునర్వివాహం

ఒక కుటుంబంలో భిన్న దృక్పథాలు ఉన్నప్పుడు బేదాభిప్రాయాలు వస్తాయి. మనశ్శాంతి లోపిస్తుంది. ఒకరిపై ఇంకొకరికి అపోహలు పెరుగుతాయి. ద్వేషం రగిలి, కక్ష పగ మొదలైనవి రాజుకుంటాయి. ఇది అన్నదమ్ముల మధ్య అయితే వేరుబడతారు. తల్లి దండ్రులకూ పిల్లలకూ వస్తే మమకారాలు నశిస్తాయి. భార్యాభర్తల మధ్య వస్తేనే అసలైన సమస్య. కుటుంబ జీవితం అశాంతి పాలవడమే గాక సంసార జీవితంలో సౌఖ్యం లోపిస్తుంది. పిల్లలు దంపతుల మధ్యన నలిగిపోతారు.

విడాకుల చట్టం మనదేశంలో వచ్చాక ఎవరూ పట్టించుకోలేదు. విడాకులు మనకి నప్పవని వాదించారు. వివాహం విచ్ఛిన్నం చేసుకోడం అవివేకమని ఘోష పెట్టారు. వివాహ జీవితంలో బాధ్యతను



మగవాడు సక్రమంగా నిర్వహించక పోయినా, అతడు సంసార జీవితానికి అనర్హుడయినా, రోగగ్రస్తుడైనా స్త్రీ తనంతతాను విడాకులు అడగరాదనే నిందించారు. అయితే భార్య రోగగ్రస్తురాలైనా, ఆకర్షణీయంగా లేకపోయినా, కాన్పులవలన నీరసించినా మగవాడు ఇంకో స్త్రీని కోరవచ్చు. నిర్దాక్షిణ్యంగా భార్యను నిస్సహాయురాలిని చేసి ఏదో కారణం లేవదీసి అతడు చేతిలో సాక్ష్యులను పెట్టుకుని అతడు విడాకులు పొందచ్చు. లేదా భార్యను బ్రతిమాలి బెదిరించి, కొట్టి తిట్టి ఆమె ఉండగా వేరే వివాహం చేసుకోడానికి అనుమతి పత్రం రాయించుకోవచ్చు. విడాకుల చట్టం బాధింపబడే స్త్రీల కోసం ఏర్పడినా చాలా రోజుల వరకూ వారికి ప్రాక్టికల్ గ్రవుండ్సులో ఏమాత్రం న్యాయం జరగలేదు. ఎన్నో జీవితాలు నివురుచాటు నిప్పులా అణిగిపోయాయి. విడాకులు అడిగిన స్త్రీని నోరు నొక్కి దూషణ భూషణలు ప్రసాదించారు. ఇది విడాకుల చట్టం వచ్చిన కొత్తలో అత్తింట, భర్త చేత విడాకులు అడిగిన స్త్రీలకు లభించిన సత్కారం. విడాకులు ఒక స్త్రీ అడిగిందంటే ఆమె కేవలం లైంగిక పరంగా ఇంకో మగాడ్ని అభిలషిస్తుందని భావించారు. ఆమెకీ వ్యభిచారిణికి వీరి దృష్టిలో తేడా లేదు. ఒక సాంఘిక దురన్యాయాన్ని ప్రతిఘటించడానికి ఈ నిందలుపడితే ఏం అనే ఆత్మవిశ్వాసం ఉన్నవారు అరుదు. తన తప్పులేదని నిరూపించుకొని, బాధలు పెట్టిన వారిని రెడ్ హేండెడ్‌గా పట్టిచ్చేంత సాహసం మన యువతులకుందా? ఉన్నా ఆమెని ఏ ఒక్క స్త్రీ అయినా అభినందించిందా? లేదు.

ఇలా విడాకుల చట్టాన్ని నిర్లక్ష్యం చేసిన మన సమాజమే ఈనాడు దానికి పట్టం కడుతోంది. స్వంత తల్లి తండ్రులే బిడ్డకు విడాకులిప్పించటానికి సిద్ధపడుతున్నారు. పునర్ వివాహం చేసుకొనే ఆదర్శవంతులైన యువకుడి కోసం తిరుగుతున్నారు. ఇది ఎవరు అంగీకరించినా అంగీకరించక పోయినా మన వివాహ వ్యవస్థలో వచ్చిన మార్పు. చేదు నిజం కూడా! దీనికి కారణం ఒక గ్రంథం వ్రాయనూవచ్చు. మూడు ముక్కల్లోనూ చెప్పవచ్చు.

నివురు చాటు నుండి నిప్పు బైటికి వచ్చినట్లే మగవారి దౌర్జన్యాలు, అత్తల ఆరళ్లు వీధినపడ్డాయి.



పెరుగుట విరుగుట కొరకేనని. ఒకసారి వివాహమయిన యువతి భర్తగాని, అత్తగా [illegible]వరణకు గురి చేస్తే చచ్చినట్లు పడుంటారు అనే విశ్వాసం దృఢమైపోయింది. ఫలితంగా హిందూ స్త్రీకి రక్షణ తగ్గింది. చిన్న కారణానికి కూడా భార్యలను చంపిన ఘనులు ఎక్కువైనారు. బిడ్డ బాధలు పడినా బ్రతికుంటుందని భరోసా తల్లి తండ్రులకి ఇప్పుడు లేదు. అందుకే బిడ్డని తల్లితండ్రులే అత్తవారింట, రక్షణ లేకపోతే వచ్చెయ్యమని చెప్తున్నారు. ఇంకో వివాహం చేస్తాం అంటున్నారు. కోర్టుకి విడాకులకి తిరగడానికి వెనుకాడటంలేదు. పవిత్రమైన వివాహ వ్యవస్థ ఇలా పతనమవుతోందని విచారించాలా? ఒక వివాహం విచ్ఛిన్నమయి ఇంకొకటి సక్సెస్ అవుతుందా అని సందేహించాలా? రెండోసారి అయినా అమ్మాయిల జీవితాలు చక్కబడాలని ఆశించాలా? ఇటువంటి వారిని చేసుకోడానికి వరులు ముందుకొస్తున్నారా?

సాధారణంగా ఏ స్త్రీ కూడా సంసార జీవితంలో ఏమాత్రం సౌఖ్యమున్నా, కనీసం ఒక్క తీపి గురుతైనా, ఒక చిన్న సంఘటనైనా బలంగా ఇరువురినీ బంధించినంత వరకూ విడనాడదు. సెక్సు సంబంధాలకైతే అసలు విడనాడదు. అత్తింట నిలవలేని, భర్తంటే రోత పుట్టించే బలవత్తరమైన పరిస్థితులు సంభవించిన నాడే బైటికొస్తుంది. స్త్రీ అంటే ఉన్న చులకనతో ఒకనాడు విడాకులను పొందిన స్త్రీని చిన్న చూపు చూశారు. కొందరు బలి అయినాకయినా ఈ చట్టాన్ని వినియోగించుకుంటున్నారు. అలాగే పసిప్రాయం వీడిన కొత్తలో దురదృష్టవశాత్తు వివాహ విచ్ఛిత్తి సంభవిస్తే ఆమె జీవితం మోడువారిందనే పిచ్చి భ్రమలు కూడా తొలగాలి. చట్టపరమయిన బంధం మంచిది. దీని వలన వ్యభిచారం, దానికి సంబంధించిన నేరాలు, రోగాలు, తగ్గుతాయి. ప్రస్తుతం వివాహవ్యవస్థ గుడ్డి దారిలో ఉంది. ఈవిధంగా విడాకులు, రెండో పెళ్లి కొంతలో కొంత మేలే కాని హానికాదు. అయితే అవసరం ఉందా? అన్న ఆలోచన కీలకమైనది.

\- కె. నాగేశ్వరి, విశాఖపట్నం □

కూపన్

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

ఈ కాలం పెళ్లిళ్లు

పంపిన వారి పేరు ....

పూర్తి చిరునామా ....

....

....

పిన్ కోడ్: ....

పత్రికాలోకంలో విశిష్ట తారక ఆంధ్ర సచిత్ర వారపత్రిక
విద్యా ప్రపంచంలో విశేష దీపిక రవి కళాశాల వేదిక
సంయుక్త ఆధ్వర్యంలో
సరి కొత్త సైన్స్ క్విజ్!

తెలుగు పాఠక లోకానికి ఎనిమిది దశాబ్దాలుగా సేవ చేస్తూ ఒక ప్రత్యేక స్థానాన్ని పొందిన ఆంధ్ర సచిత్ర వారపత్రిక, విద్యార్థి లోకానికి మూడు దశాబ్దాలుగా వెలుగు చూపిస్తూ ఒక నిర్దిష్ట స్థానాన్ని పొందిన రవి కళాశాల, బ్రాడీపేట, గుంటూరు- కలిసి తెలుగువిద్యార్థి పాఠక ప్రపంచం కోసం ఒక సరి కొత్త సైన్స్ క్విజ్‌ను నిర్వహిస్తున్నాయి.

ప్రముఖ విద్యావేత్త, రవి కళాశాల డైరక్టర్ శ్రీ సి. వి. ఎన్. ధన్ ఈ క్విజ్‌కి సంబంధించిన ప్రశ్నలను ఇస్తారు. బహుమతులు కూడా వారే ఇస్తారు. సైన్స్ ప్రోగ్రామ్‌లు- క్విజ్‌లు, ఎగ్జిబిషన్‌లు, సెమినార్‌లు వంటివి- ఎన్నో నిర్వహించిన శ్రీ ధన్ ఈ క్విజ్ వేదిక "ఆలోచనాపరులకు ఏ పనినైనా దీక్షగా కొనసాగించే కార్యశీలురకు ఎంతయినా ఉపకరిస్తుం"దంటున్నారు. శక్తి సామర్థ్యాల పరిశీలనకి ఇదొక అవకాశం కాగలదు.

ఈ క్విజ్‌లో ఇరవై ఏళ్ళు నిండని స్త్రీ పురుషులు ఎవరైనా పాల్గొనవచ్చు. క్విజ్‌కి సంబంధించిన మొత్తం 25 ప్రశ్నలు ఒక్కొక్క వారం 5 ప్రశ్నలు చొప్పున వరుసగా 5 వారాలపాటు ఇవ్వబడుతాయి. ప్రతి వారం క్విజ్‌కి సంబంధించిన ఒక ప్రత్యేక కూపన్ ఉంటుంది.

అయిదు వారాలూ పూర్తయ్యాక పాఠకులు 25 ప్రశ్నలనూ వాటి సమాధానాలను సంపాదకుడు, ఆంధ్ర సచిత్ర వారపత్రిక, గాంధీనగరం, విజయవాడ-520003 అనే చిరునామాకు పంపాలి. ప్రతి 5 ప్రశ్నల సమాధానాలతో పాటు ఆ వారపు క్విజ్ ప్రత్యేక కూపన్ జతపరచి తీరాలి. అంటే మొత్తం 25 ప్రశ్నల సమాధానాలతో వాటికి సంబంధించిన 5 కూపన్‌లు విధిగా ఉండాలి. కూపన్‌లు జత చేయకుండా వచ్చిన సమాధానాలను ఎట్టి పరిస్థితులలోనూ పరిశీలించడం జరగదు. మొత్తం అన్నీ కలిపి ఒకేసారిగా గడువు తేదీలోగా పంపాలి.

గడువుతేది: 31 అక్టోబరు, 1987

పాఠకులు పంపిన సమాధానాలను నిష్ణాతులైన విద్యావేత్తలకు పంపి వారి అభిప్రాయాలకు అనుగుణంగా ఉత్తమమైన సమాధానాలను రాసిన వారికి ఈ కింది బహుమతులను ఇవ్వడం జరుగుతుంది:

మొదటి బహుమతి రు. 750/-

రెండవ బహుమతి రు. 500/-

మూడవ బహుమతి రు. 300/-

రెండు నాలుగవబహుమతులు ఒక్కొక్కటి రు. 200/-

మూడు ఐదవబహుమతులు ఒక్కొక్కటి రు. 100/-

15 ప్రత్యేక బహుమతులు- పత్రిక ఇయర్‌బుక్‌లు 15

నిబంధనలు:

ఈ క్విజ్‌లో పాల్గొనే వారు ఈ కింది నిబంధనలను విధిగా పాటించాలి:

- ★ క్విజ్‌లో పాల్గొనే వారి వయస్సు కచ్చితంగా 20సం. లోపే ఉండాలి. ఈ మేరకు ఒక ధ్రువ పత్రాన్ని విధిగా జతపరచాలి.
- ★ క్విజ్‌లో గెలుపొందిన వారు ప్రచురణ నిమిత్తం తమ జీవిత విశేషాలను తెలుపుతూ తమ ఫొటోలను పంపడానికి సిద్ధపడి ఉండాలి.
- ★ ప్రతి వారం ప్రచురించే 5 ప్రశ్నలకు సంబంధించిన కూపన్ మరచిపోకుండా జత చేయాలి. ఈ లెక్కన 5 వారాలకు 5 కూపన్‌లు ఉండాలి. ఏ ఒక్క కూపన్ లేకపోయినా వారి సమాధానాలను పరిశీలించడం జరగదు. అన్నీ కలిపి ఒకేసారి గడువు తేదీలోగా పంపాలి.
- ★ క్విజ్‌కి సంబంధించిన సమాధాన పత్రాలు ఎటువంటి పరిస్థితులలోనూ తిప్పి పంపబడవు. కాబట్టి తగిన టపా ఉన్న తిరుగు కవర్లను జత చేయనక్కర-లేదు.
- ★ సమాధానాలు స్పష్టంగా పూర్తి తెలుగు లిపిలోనే ఉండాలి. కాగితానికి ఒకే వైపున రాయాలి. అర టావు సైజు కాగితాల మీద అయితే అనువుగా ఉంటుంది. వ్రాత ప్రతిపై పూర్తి చిరునామా రాయాలి. చిరునామా పూర్తిగా తెలుగు లిపిలోనే ఉండాలి.
- ★ ఉత్తమ సమాధానాల ఎంపికలో, బహుమతుల నిర్ణయంలో సంపాదకునిదే తుది తీర్పు. ఈ విషయంలో ఉత్తర ప్రత్యు రాలకు తావు లేదు.
- ★ గడువు తేదీ దాటాక అందిన సమాధానాలను ఎట్టి పరిస్థితులలోనూ పరిశీలించడం జరగదు.
- ★ క్విజ్ ఫలితాలను గడువు తేదీ తర్వాత సాధ్యమైనంత త్వరగా వీలును బట్టి ప్రచురించడం జరుగుతుంది. ఈ విషయంలో కూడా ఉత్తర ప్రత్యుత్తరాలకు అవకాశం లేదు.

—సం.

ఈ వారం ప్రశ్నలు

1. ఉదయాన్నే లేవగానే టూత్ పేస్ట్, సబ్బు తప్పక వాడతాం. అయితే అవి ఏ రకంగా మురికిని పోగొడ్తాయి? ఆధునిక అణు, భౌతిక శాస్త్ర మూల సూత్రాలు తెలిసిన వారెవరైనా తేలికగా అర్థం చేసుకోగలరు. ప్రయత్నించండి.
2. మీ ఇంట్లో రోజూ అన్నం వండటం చూస్తున్నారు. అన్నం ఉడికే లోపల జరిగే భౌతిక, రసాయనిక మార్పులు ఏమిటో వివరించండి.
3. మీ ఇంట్లో తిరిగే ఫానుగాని, మీ చేతిలోని విసనకర్రగాని ఏరకంగా మీకు చల్లదనాన్ని ఇవ్వగల్గుతున్నాయి?
4. నీవు, నీ మిత్రుడు, మాట్లాడుకుంటూ కొంత దూరం వచ్చారు. తర్వాత కొద్ది క్షణాల్లో కన్పడకుండా పోయాడు. నీవు చూస్తుండగానే జరిగింది. భౌతికశాస్త్రంలో దీన్ని ఎలా వివరిస్తారు?
5. మనం ఈగల్తో వేగలేం. వాటిల్లో ఒక దాన్నైన చంపటానికి ప్రయత్నించండి. అదే మిమ్మల్ని చాలాసార్లు ఓడిస్తుంది. దానికి కారణం ఏమిటి? దాని శరీర నిర్మాణంలోని ప్రత్యేకత ఏమిటి?

కూపన్-1

ఆంధ్ర సచిత్ర వారపత్రిక - రవి కళాశాల

సరికొత్త సైన్స్ క్విజ్

పేరు..

వయస్సు......................................


చిరునామా....................................

....

....

సంతకం..

గడుసులోకం —బాబు



గవాస్కర్ గుడ్‌బై!



పరుగులరాజుగా పేరొందిన సునీల్ గవాస్కర్ క్రికెట్ నుంచి తాను విరమించు కుంటున్నానని ప్రకటించారు. 17 సం.రాలుగా క్రికెట్ పిచ్ మీద తిరుగు లేని విజేతగా రాణించి 125 టెస్ట్ మ్యాచ్‌లలో 34 సెంచరీలకు పైగా సాధించిన గవాస్కర్ "గౌరవనీయంగా వెళ్ళి పోవాలి గాని, తోసేయబడే దాక ఉండగూడదు" అన్నారు. అందుకే ప్రపంచ క్రికెట్ చరిత్రలోనే అత్యధిక టెస్ట్ మ్యాచిలలో ఆడి, అత్యధిక సెంచరీలు చేసిన గవాస్కర్ ఎం. సి. సి రెండవ శతజయంతి ఉత్సవాల సందర్భంగా ఎం. సి. సి.కి, మిగతాదేశాల బృందానికి మధ్య జరుగుతున్న పోటీలో చివరిసారిగా పాల్గొంటున్నారు. తాను ఆడుతున్న ఐదు రోజుల టెస్ట్ మ్యాచి ఇదే చివరిదని, రిలయన్స్ కప్ పోటీ తర్వాత పూర్తిగా టెస్ట్ మ్యాచిల నుంచి విరమించు కుంటానని ఆయనన్నారు. అట్లాగే దేశంలోని పోటీలలో పాల్గొని యువ క్రీడాకారులకు అడ్డం రావాలని కూడా తానను కోవడం లేదని ఆయనన్నారు. గవాస్కర్ విరమణ క్రికెట్‌కు తీరని లోటని పరిశీలకులు వ్యాఖ్యానించారు.....

మత మన్నది మారణ హోమమైతే...



ఇరాన్ అధినాయకుడు అయతుల్లా రుహొల్లా ఖొమేనీకి మూర్ఖత్వం ఎక్కువని చాల మంది రాజకీయ పరిశీలకులు వ్యాఖ్యానిస్తారు. 1979 లో అధికారానికి వచ్చిన నాటి నుంచి ఆయన అనుసరిస్తున్న విదేశాంగ విధానం ఈ అంశాన్ని రుజువు చేసేటటువంటిదిగానే ఉంది. ఛాందస భావాలతో ఖొమేనీ అన్ని పాశ్చాత్య దేశాలతో సంబంధాలను చెడగొట్టుకోవడమే కాక ఇప్పుడు సోదర ముస్లిం దేశాలతో కూడ ఆత్మహత్యా సదృశమైన యుద్ధంలోకి దిగాడు. ఒక వైపు ఇరాక్‌తో ఏడు సంవత్సరాలుగా చేస్తున్న యుద్ధం చాలక, మక్కాను సౌదీ అరేబియా పాలకుల నుంచి రక్షించే పేరుతో ఆ పవిత్ర స్థలంలో దారుణమైన రక్తపాతానికి కారకుడయ్యాడు. ముస్లింలలో 70 కోట్ల జనాభా గల సున్నీ తెగ, 9 కోట్ల జనాభా గల షియా తెగ ఉన్నాయి. 87 సంవత్సరాల ఖొమేనీ షియా తెగ ప్రతినిధిగా ప్రపంచ ముస్లిం లందరినీ తన ఏకచక్రాధిపత్యం కిందికి' తెచ్చుకోవాలనే తపనతో ఈ హింసాకాండకు తలపడుతున్నాడు.

వ్యక్తిగతం


మక్కా హింసాకాండలో 402 మంది చనిపోగా, 649 మంది గాయపడ్డారు...

పరిష్కార మయ్యేనా?!



నెల రోజుల పాటు ప్రశ్నల వర్షం కురిపించి సమాధానం రాబట్ట లేక పోయిన శ్రీ రామ్ జెఠ్మలానీ మళ్ళీ ఒక సారి శ్రీ రాజీవ్‌గాంధీకి ఒక వివాదాస్పదమైన ఉత్తరం వ్రాశారు. "చాలా అయిష్టంగానే మీకీ ఉత్తరం వ్రాస్తున్నాను. కాని జాతీయ ప్రయోజనాల కోసం ఇది వ్రాయక తప్పదు. మీరు నా ఉత్తరాలు చదవరనో, లేక మీకవి అందకుండా ఎవరయినా అడ్డు పడుతున్నారనో నేను గాఢంగా నమ్ముతున్నాను. కనీసం ఈ ఉత్తరమైనా మీరు చదివారని తెలిస్తే సంతోషిస్తాను" అంటూ ఆయన ఆ ఉత్తరంలో పంజాబ్ సమస్య పరిష్కారానికి కొన్ని సూచనలు చేశారు. ఆ పరిష్కారానికి తాను సహకరిస్తానని, సుశీల్ ముని, సునీల్‌దత్ వంటి వారి సహాయంతో గాని, స్వయంగాగాని మధ్యవర్తిత్వం నెరపటానికి తాము సిద్ధంగా ఉన్నామని ఆయన వ్రాశారు. రక్తపాతాన్ని, విధ్వంసాన్ని అరికట్టే దిశలో గణనీయమైన చర్యలు తీసుకోక తప్పదని ఆయన సూచించారు. పంజాబ్ సమస్యను పరిష్కరించడం చాలా సులభమని ఆయన అభిప్రాయ పడుతున్నట్లున్నది.....

బ్రిటిష్ పౌరుడా, భారతీయుడా?



బొంబే డైయింగ్ అధిపతి శ్రీ నస్లీ వాడియాను విదేశీయుల నమోదు చట్టాన్ని ఉల్లంఘించారనే ఆరోపణపై కేంద్ర నేర పరిశోధక విభాగం వారు అరెస్టు చేశారు. బ్రిటిష్ పౌరసత్వం ఉన్న శ్రీ వాడియా 1986 నవంబర్, డిసెంబర్‌లలో ఢిల్లీలోని ఒబెరాయ్ హోటల్‌లోను, 1987 మార్చిలో ఢిల్లీలోని తాజ్‌మహల్ హోటల్‌లోను భారతీయుడుగా నమోదు చేయించుకున్నారని ఆరోపణ. ఆరు గంటల పాటు ఆయనను నిర్బంధించి విచారణ జరిపారు. కాని ఇది చాలా చిన్న నేరమని, ప్రస్తుతం ఆయన వి. పి. సింగ్ – గోయెంకాలకు సన్నిహితుడుగా ఉన్నందు వల్ల రిలయన్స్ పరిశ్రమల అధిపతి శ్రీ అంబానీకి ప్రత్యర్థిగా ఉన్నందు వల్ల వేధించేందుకే ఈ అరెస్టు జరిగిందని కొందరు భావిస్తున్నారు...

అనితా సూద్ రికార్డు!



ఇంగ్లండ్‌కు, ఫ్రాన్స్‌కు మధ్య ఉన్న 22 మైళ్ళ ఇంగ్లీష్ ఛానెల్‌ను ఈదడం ఒక విజయంగా చాలా మంది భావిస్తారు. బొంబాయికి చెందిన 22 ఏళ్ళ యువతి అనితాసూద్ ఈ విజయాన్ని సాధించి, ఇప్పటి వరకూ నమోదయిన రికార్డులను అధిగమించి చరిత్ర సృష్టించింది. ఈ ఛానెల్‌ను ఆసియన్లలో రెండు సంవత్సరాల క్రితం బిజయ్‌బైన్ 8 గంటల 42 నిమిషాలలో ఈది రికార్డు సృష్టించారు. ప్రస్తుతం 8 గంటల 15 నిమిషాలలోనే ఈ దూరాన్ని ఈదిన అనితా సూద్ ప్రపంచ గజఈతగాళ్ళలో నాలుగో స్థానాన్ని, ఆసియన్లలో మొదటి స్థానాన్ని సంపాదించింది. ఆమె ఇంగ్లీష్ ఛానెల్‌ని ఇంగ్లండ్‌లోని డోవర్ నుంచి, ఫ్రాన్స్‌లోని కాలేస్ వరకు ఈదింది.....

ప్రణబ్ ఆరాటం!



పార్టీ వ్యతిరేక కార్యకలాపాల కారణంగా గత ఏడాది కాంగ్రెసు (ఐ) నుంచి బహిష్కరింపబడిన మాజీ ఆర్థిక మంత్రి ప్రణబ్ ముఖర్జీ ఇప్పుడు తిరిగి కాంగ్రెసు (ఐ) లో చేరటానికి తొందర పడుతున్నారు. ఆయన పెట్టిన రాష్ట్రీయ సోషలిస్టు కాంగ్రెసుని పశ్చిమ బెంగాల్ శాసన సభ ఎన్నికలలో ప్రజలు పూర్తిగా తిరస్కరించారు. ఆయనతో చేతులు కలిపిన ప్రముఖులు కూడా ఇప్పుడు ఆయనని వదలి వేసి శ్రీ వి. పి. సింగ్‌తో కలవటానికి ఉత్సాహ పడుతున్నారు. 18 ఏళ్ల పాటు ఉన్న ఆయన రాజ్య సభ సభ్యత్వం ఈ మధ్యే ముగిసి పోయింది. వీటన్నిటితో 52 ఏళ్ల వయసులోనే ఆయన రాజకీయ జీవితానికి తెరపడే ప్రమాదం ఏర్పడింది. అంతా తమని కాంగ్రెసు(ఐ)లో చేరమని అంటున్నారని ఆయన అన్నారు. మరి శ్రీ రాజీవ్ గాంధీ తిరిగి ఆయనని ఆహ్వానిస్తారో లేదో తెలియదు.... □

చింతలూరు ఆయుర్వేద ఫార్మశీ వారి వైద్య సలహాలు

ఎమ్. వి. ప్రభాకర్, గుంటూరు

ప్ర : పది సంవత్సరముల నుండి కుష్టు వ్యాధి ఉంది. వివాహం కాలేదు. వయస్సు 31 సంవత్సరాలు. శరీరానికి స్పర్శ లేదు. వేడి వస్తువు పట్టలేను. ఏదైనా పుండు పడితే తగ్గదు. ప్రస్తుతం కాలి, చేతి వేళ్లలో బలంతగ్గి వంకరపోవుటకు సిద్ధంగా ఉన్నవి. నేల మీద పడిన వస్తువును తీయుటకు అశక్తుడనగుచున్నాను. నా వ్యాధి తగ్గుటకు మంచి మందురాసి అది వాడే విధానం గుంటూరులో మందు దొరకుచోటు రాయండి.

జ : చింతలూరు ఆయుర్వేద ఫార్మసీవారి దివ్య సిందూరం 10 గ్రా. కాంతాభ్రక సిందూరం 10 గ్రా. త్రిఫలా చూర్ణం కలిపి 41 పొట్లాలు చేయవలెను. ఉదయం ఒక పొట్లం, సాయంత్రం ఒక పొట్లం సేవించవలెను.

మదుస్నుహిరసాయనం 400 ఎం. ఎల్. పెద్ద ఉసిరి కాయంత గంధకరసాయనం 100 గ్రా. 3 గ్రా. మంచినీరు ఖదిరారిష్టం 400 ఎం. ఎల్. 3 మూతలు అరఖు 5 మూతలు మంచినీరు త్రాగవలెను.

కాశీ సాద్యాఘృతం 2 సీసాలు పైకి రాయుటకు (వంటికి) మాత్రమే ఉపయోగించ వలెను. ఈ ప్రకారం 2 నెలలు వాడిన తరువాత చింతలూరు ఆయుర్వేద ఫార్మసీకి లెటరు రాయవలెను. పథ్యం :- బీర, ఆనప, తోటకూర, మెంతి కూర, పాలకూర, కాబేజి, ముల్లంగిదుంప నేతి పోపుతో కారం పులుపు తగ్గించ వలెను. మజ్జిగ బాగా వాడవచ్చును.

దొరకు చోటు :-ఆంజనేయ మెడికల్స్, ఐ. సి. సి. బిల్డింగ్స్, గుంటూరు –1.

ఈ ప్రకారం 80 రోజులు వాడి తెలియ పర్చండి.

పి. ఆర్. మూర్తి, చెర్లోపల్లి

ప్ర : షుగర్ మరియు దొడ్డికి వెళ్లేటప్పుడు తెల్లగా (బొట్లు) చుక్కలుగా పడును. అంగము చివర చర్మము చిట్లినది. జ్ఞాపకశక్తి లేకపోవుట మీ నెం. 4 వసంత కుసుమాకరం వాడుచున్నాను.

జ : చింతలూరు ఆయుర్వేద ఫార్మసీ వారి వసంత కుసుమాకరం నెం. 4 . మాత్రలు క్రమం తప్పకుండా వాడవలయును.

తారకేశ్వరరసం 10 గ్రా. త్రిఫలాచూర్ణం కలిపి 40 పొట్లాలు చేసి నేరేడు గింజల కషాయంతో ఉదయం, సాయంత్రం సేవించ వలయును.

పి. రాజశేఖర్, కొడుమూరు

ప్ర : నా వయస్సు 27 సం. లు 17 సం. లు నుంచి 21 సం. వరకు హస్తప్రయోగమునకు అలవాటు పడినాను. అంగం చిన్నదగుట, శీఘ్ర స్ఖలనం సెక్సుయందు ఆసక్తి లేక పోవుట-నివారణో పాయం తెలుపండి.

జ : చింతలూరు ఆయుర్వేద ఫార్మసీ వారి పూర్ణచంద్రోదయం మాత్రలు 30 ఉదయం ఒకటి సాయంత్రం ఒకటి పాలతో సేవించవలెను. అశ్వగంధాది లేహ్యం 200 గ్రా. పెద్ద ఉసిరికాయంత ఉదయం సాయంకాలం సేవించ వలయును. 40 రోజులు వాడిన తరువాత హెచ్. ఓ కు తెలుపగలరు. 5, 6 మాసములు వాడవలసి ఉండును. □



(గత సంచిక తరువాయి)

క్షణం మాట్లాడ లేదు సూర్యదేవ్.

"చెప్పండి? .... వాడేం తప్పుచేశాడు?.... రాజావారేం శిక్ష వేశారు?" దాదాపు ఏడుస్తూ అంది భార్య.

"శిక్ష వెయ్యడం కాదే! వరం ఇచ్చారు! ఏమైనా..... మనకి మంచి రోజులొచ్చాయి!... ఇన్నాళ్ళికి ఆ భగవంతుడు నా మొరాలకించాడు." అనురాగ పూరిత దృక్కులతో రసన్ని చూస్తూ అన్నాడు తండ్రి. అంతవరకు దాచిన ఆనందం పొంగి వచ్చేసింది.

"ఏమిటన్నా?" అయోమయంగా చూశారు కొడుకులు.

"మరేం లేదర్రా! మొన్న రాజావారి తోటలో ఉన్న ఓ కొండ మీద .... వీడు ఏవో బొమ్మలు వేశాడట.....

"అయ్యో! .. .. ఎంతపని చేశావురా!" అంటూ ఏడుపు మొదలు పెట్టింది రసన్ తల్లి.

"అరె! సాంతం విను!.... ఆ చిత్రాల్ని అనుకోకుండా రాజుగారు చూశారట!... ముందు తెల్లబోయారట! ఆ చిత్రాలు ఆయన కెంతో అపురూపంగా తోచాయట. పక్కనున్న నౌకర్ని వివరాలడిగి తెలుసుకున్నారట! ... వెంటనే కబురంపారట!"

"ఎందుకు?" తేల్లబోతూ అందావిడ.

"ఎందుకేమిటి..... ఇంత చిన్న వయసులోనే ఇంత మంచి చిత్రాలు గీశాడు. కాస్త చేయూత నిస్తే పెద్దయ్యే సరికి బ్రంహాండమైన చిత్రకారుడౌతాడు, ముందు ముందు ఆస్థాన చిత్రకారుడు ఇతనే అవుతాడు అని కూడా అన్నారు!..... "ఉత్సాహంగా చెపుతున్నాడు సూర్యదేవ్.

తల్లి మొహం వెలిగిపోయింది.

జరిగిన కథ –7 : భాను గుహ దగ్గరి అడవిలో నిధి కోసం తవ్వకాలు జరపడం మొదలు పెడతారు అరవింద్, కాంతి, భట్టు. తవ్వకాలలో ఒక పెట్టెలో ఒక యువకుడి శవం బైట పడుతుంది. ఆ శవం తల కింద పాళీ భాషలో 'ప్రేమకు మరణం లేదు' అనే పుస్తకం దొరుకుతుంది. రాజా పాంథూ, ఆయన కూతురు చందనల గురించి, వ్యాపారి సూర్యదేవ్, అతని చిన్న కొడుకు, గడుగ్గాయి అయిన రసన్ గురించి ఆ పుస్తకంలో రాసి ఉంటుంది. రసన్‌ను రాజుగారు ఆస్థానానికి పిలిపిస్తారు.

అన్నల మొహాలు కళకళలాడి పోయాయి.

"అయితే .... వీడికి చిత్రకళని నేర్పిస్తారా?.... అంది రసన్ తల్లి.

భార్య మాటలకి చిన్నగా నవ్వాడు. సూర్యదేవ్.

"నేను చెప్పించడం కాదే!.... రాజావారే చెప్పిస్తారట... వీణ్ని వారి ఆటాణానికి పంపమన్నారు! .... వీడి మంచి చెడ్డలన్నీ ఇంక వారే చూసుకుంటారట!" అన్నాడు సూర్యదేవ్ ఆనందంగా.

ఈ మాటలు మరీ పన్నీరు కురిసినంత ఆనందాన్నిచ్చాయందరికీ.

కొడుకుని అక్కున జేర్చుకుని ముద్దాడింది తల్లి. అన్నలు ఆప్యాయంగా అభినందించారు.

అయితే వారందరి ముఖాల్లోనూ ఉన్న ఆనందం రసన్ మొహాన మచ్చుకైనా లేదు. పైగా ఒకవిధమైన గాంభీర్యం తొంగిచూస్తోందతని ముఖంలో.

అందరూ అన్నీ మాట్లాడుతూ వున్నా అతను మాత్రం అలానిర్లిప్తంగా ఉండిపోయాడు.

"అయితే ఎప్పుడు పంపుతారు?" అంది భర్తతో. ఆమె కీ రూపేణా అయినా కొడుక్కాస్త దార్న పడతాడని మహా ఆనందంగా ఉంది.

మంచి రోజు చూసి దించమన్నారు. ఈ లోగా వారి ఉద్యానవనంలో ఓ చక్కని కుటీరం వీడికోసం అమరుస్తారుట!.... చిత్రకళకి కావల్సిన సరంజామా అంతా కూడా సిద్ధం చేస్తారట!..... అలాంటి కుటీరంలో అయితే చిత్రకళ అభ్యసించ డానికి అనువైన స్థలంట!" గర్వంగా చెప్పుకు పోతున్నాడు సూర్యదేవ్.

"నా కొడుకు ఎంత అదృష్ట వంతుడు!"

కళ్ళొత్తుకుంది తల్లి కొడుక్కేసి చూస్తూ.

"కానీ .... ఈ అదృష్టం నాకక్కర్లేదు!" హటాత్తుగా అన్నాడు రసన్.

"ఏమిటి?"పిడుగు పడ్డట్టు చూశారంతా.

"నేను అక్కడికి వెళ్ళను!"

"ఏమిట్రా?" అన్నాడు సూర్యదేవ్ పొరపాట్న విన్నానేమో అని!

"అవును నాన్నా!.... నేను రాజాగారి దగ్గిరి కెళ్ళను!" మెల్లగానే అన్నా స్థిరంగా ఉంది రసన్ గొంతు.

"నీకు మతి పోయిందా?" అరిచాడు తండ్రి.

"సిరి వస్తుంటే మోకాళ్ళడ్డు తారట్రా ఎవరైనా?.... అసలు ఇంతటి భాగ్యం ఎందరికి కలుగుతుంది?" అన్నాడు పెద్దన్న.

"ఇదే మమ్మల్ని పిలిస్తే .... ఎగిరి గంతేసి ప్రయాణం కట్టేవాళ్ళం!" అన్నారు



చిన్నన్నలు.

"నా మాట విన్నావా! రాజాగారి ధర్మమా అని నువ్వో పెద్ద చిత్రకారుడివై పోతావ్!.... దేశ దేశాల్నించీ నీకు పిలుపు లొస్తాయి!.... ఎంతో పేరు ప్రఖ్యాతులొస్తాయి....." ఎంతో నచ్చ చెప్పి చూసింది తల్లి. అయితే రసన్ మాత్రం అందరికీ ఒకే సమాధానం చెప్పాడు.

"నేను చచ్చినా వెళ్ళను!" అని.

"నిస్సహాయంగా చూశారంతా.

రసన్ పట్టుదల అందరికీ తెలుసు!

వాడికిష్టం లేని పనులు ఆ రుద్రాదులు దిగి వచ్చినా చేయించలేరు. వాడిచేత.

అందుకే.... మరీ కృంగి పోయారు.

తల్లి ఏదో చెప్పబో తుంటే విసురుగా బైటికెళ్ళి పోయాడు రసన్.

ఓ రెండు గంటలు వూరంతా తిరిగాడు. కాస్సేపు చెరువు వొడ్డున కూర్చుని

మంజీరనాదం

ఇసుకలో పిచ్చి గీతలు గీసాడు.

అతనికింటికెళ్లాలని అనిపించలేదు. స్నేహితుల్ని కలుద్దామనీ అనిపించలేదు. అయితే హఠాత్తుగా అతనికి రాజుగారి తోటలోని తేనె ఫలాలు గుర్తొచ్చాయి. వెంటనే నోరూరింది.

అంతే! చటుక్కున లేచాడు.

కను చీకటి పడుతున్నా లక్ష్య పెట్టకుండా రాజుగారి తోటకేసి నడిచాడు. మెల్లగా తోట దగ్గరికెళ్లి పక్కగా వున్న కొండ రాయి నెక్కి లోపలికి చూశాడు.

పక్షుల అరుపులు తప్ప ఇంకే శబ్దాలూ లేవు. తోటలో ఎవరూ లేరనుకున్న రసన్ గభాల్న గోడ దూకి లోపల ప్రవేశించాడు. తోటలోని ఫల వృక్షాలన్నీ అతన్ని ఆహ్వానిస్తున్నట్టు మెల్లగా తలలూపుతున్నాయి గాలికి.

ఓసారి తలెత్తి తేనె ఫల వృక్షంకేసి చూశాడు. తేనె ఫలాలు ఆకు కనిపించనంతగా విరగ పండి తినమంటూ ఆహ్వానిస్తున్నట్టున్నాయి.

నిజానికా తేనె ఫల వృక్షాలు రాజావారి తోటలో తప్ప ఎక్కడా వుండవని అతనికి బాగా తెలుసు. అందుకే ఆ తోట నెన్నుకున్నాడా రోజు.

ఓసారి ఇటు అటు చూసి ఎవరూ రావటం లేదన్న నమ్మకం కుదిరాక గబగబ కోతిలా ఆ చెట్టు ఎక్కేశాడు. చక చకా నాలుక్కాయలు కోసి రెండు జేబుల్లోనూ కుక్కుకున్నాడు. మరో కాయ అందుకోబోతూండగా ఎవరో వస్తున్నట్టు అలికిడి అయి తృళ్లిపడి చూశాడు.

దూరంగా ఓ అందమైన ఓ ఆరేళ్ల అమ్మాయి బంతిని తన్నుకుంటూ వస్తోంది. సుకుమారమయిన ఆమె పాదాలకున్న స్వర్ణ మంజీరాలు లయబద్ధంగా మోగుతున్నాయి.

కొయ్యబారి పోయాడు రసన్.

భయంతో ఆకుల మాటున దాగి చూస్తున్నాడు. ఆమె రాకుమారిగా వూహించిన అతని ఒంటి నిండా చిరు చెమటలు పట్టేస్తున్నాయి.


"ఛ! ఛ! ఎన్నడూ లేంది ... ఇంత చిన్న పిల్లకితను భయపడ్డమా" అంటూ తనని తానే విసుక్కున్నాడు. ఆమె ఎప్పుడు వెళ్తుందా అన్నట్టు ఆశగా చూస్తున్నాడు.

ఆమె చేరువగా వచ్చేసింది.

అంత భయంలోనూ ముద్దొచ్చే ఆమె చిన్న చిన్న పాదాలనీ, ఆ పాదాల నలంకరించడమే తమ భాగ్యమన్నట్టు మిలమిల మెరుస్తున్న పద మంజీరాల్ని దీక్షగా చూస్తున్నాడు.

చెట్టు దగ్గరికొచ్చి ఆమె ఆగింది.

శిరిమువ్వల సవ్వడీ ఆగింది.



అయితే అతను ఆశించినట్టు ఆమె వెళ్లిపోలేదు. ఏదో అనుమానంతో తల పైకెత్తింది.

అతని గుండె జల్లుమంది.

ఆమె కళ్లు వింతగా ముడుచుకున్నాయి. చెట్టు గుబుర్లోకి చూస్తూ -

"ఎవరు?" అంది గట్టిగా.

రసన్ మరింత కంగారు పడిపోయాడు.

"ఎవరు?" మళ్లీ అరిచిందామె.

"నె ... నే ... ను ..." అతన్నోటి నుంచి మాట రాలేదు.

"ముందు చెట్టు దిగు!" అందా పిల్ల అధికారపూర్వకంగా.

అతను మెల్లగా దిగుతుండగానే చెలికత్తెలు, ఒకరిద్దరు నౌకర్లు, మాలి బిలబిల్లాడుతూ వచ్చేశారు.

రసన్ పైప్రాణాలు పైనే పోయాయి.

"పొద్దున అమ్మా వాళ్లు భయపడింది. ఇప్పుడు నిజంగానే జరిగేట్టుంది!" అనుకున్నాడు మనసులో.

"ఓర్నివ్వా బాబూ! ... నువ్వంటయ్యా? సూసి సూసి మా రాజా వారి తోటలోకే వచ్చేశావేటి? ముందు దిగు! నీ సంగతేత్తులుత్తాను!" అన్నాడు మాలి కోపంగా.

రసన్ చరిత్ర అతనికీ తెలుసు.

భయంగా చూశాడు రసన్.

అతని నేత్రాలు మరింత విశాలమయ్యాయి.

"ఓ రబ్బ ... దొంగతనం సేసేటప్పుడు లేని బెయ్యం ... దొరికి పొయ్యాకొచ్చిందా నాయ్నా? ... ముందు దిగొహో!" అరిచాడు మాలి.

అప్పటికే అక్కడికి చాలామంది చేరిపోయారు.

"అమ్మో! ఎంత ధైర్యం! ... రాజావారి తోటలోకే దొంగతనానికొచ్చాడా" అంటూ ముక్కున వేలేసుకున్నారు కొందరు. కొందరు రసన్ని చూచి జాలిపడ్డారు.

"దిగమంటే నీక్కాదేటి?" మళ్లీ అరిచాడు మాలి. ఇంక తప్పదన్నట్టు మెల్లగా చెట్టు దిగాడు రసన్.

"ఏయ్! ... ఆ తేనె ఫలాలిలా ఇవ్వు!" ... హఠాత్తుగా అంది రాకుమారి.

మౌనంగా జేబులోంచి పళ్లు తీసి ఆమె చేతిలో పెట్టాడు రసన్.

"ఏమిటి? ... నాలుక్కాయలు కోశావా? ... నేను పది కాయలు కొయ్యమన్నానుగా?" చిరాగ్గా అందామె.

బిత్తరపోయాడు రసన్.

ఆశ్చర్యంగా చూశారు పరివారం.

"ఏంటమ్మాయిగారూ?" అన్నాడు మాలి.

"అవును మాలీ! ... మా పిల్లలంతా కలిసి బొమ్మలాట ఆడుకోవాలనుకొంటున్నాం ... ఆటలోకి తిండానిక్కావాలి కదా ... అందుకే ... తేనె ఫలాలు కోసిస్తావేమోనని నీ దగ్గరికొచ్చాను - నువ్వు లేవు ... పోనీ ఇంకెవరైనా కనిపిస్తారేమోనని చూశాను ... ఊహు! ఎవరూ లేరు. ఇంతలో అటిటూ కనిపించాడు. నేను పిల్చి కాసిని పళ్లు కోసిమ్మన్నాను. పాపం. భయం వేసింది కాబోలు ముందు ఎక్కనంటే ఎక్కనన్నాడు. మాలి చూస్తే చంపేస్తాడు అని కూడా అన్నాడు. నేనే ధైర్యం చెప్పి ఎక్కించాను. కానీ ఏం లాభం? ... పది కాయలు కొయ్యమంటే నాలుక్కాయలు కోశాడు విసుక్కుంది రాకుమారి.

రసన్ నిర్ఘాంతపోయి అలా నిల్చుండి పోయాడు.

"సేసింది శానగానీ ... ఇంకెల్లు! ...ఇయ్యాల నీ రోజు బాగుండాది." ఆదోలా అన్నాడు మాలి.

రసన్ మెల్లగా కదిలాడు.

"ఆగు!" వెనక నించి అందా అమ్మాయి.

అతను ఆగాడు.

"ఇలా రా!" ఆజ్ఞాపూర్వకంగా ఉందామె పిలుపు.

రెండడుగులు ఆమెకేసి వేశాడు రసన్.

"ఇంద ఈ కాయలు నువ్వు తీసుకో!" చేతిలోని కాయలు చూపిస్తూ అంది రాకుమారి.

"ఊఁహుఁ" అన్నాడతను అభిమానంగా.

"ఫరవాలేదు. మళ్ళీ నేను కోయించుకుంటాలే. ఇవి నువ్వు తీసుకో" స్నేహపూర్వకంగా అందామె.

ఓసారి భయం భయంగా మాలికేసి చూశాడు రసన్.

"ఏటాలోసిస్తుండావ్! - అమ్మాయిగోరిత్తుంటే! - తీసుకో" అన్నాడుమాలి. ఓసారి రాకుమారికేసి, ఆమె చేతిలోని కాయలకేసి మార్చి మార్చి చూశాడు రసన్.

"తీసుకో!" కళ్ళతో నే నవ్వింది రాకుమారి.

రసన్ ఆమె చేతిలోని పళ్ళు అందుకున్నాడు.

"అమ్మాయిగోరికి దణ్ణమెట్టు!" అన్నాడు మాలి.

ఓసారి రెండు చేతులూ జోడించి వెను తిరిగాడతను.

అతనికి అయోమయంగా వుంది.

అంతేకాదు ఆశ్చర్యంగానూ, ఆనందంగానూ కూడా వుంది.

"రాకుమారి ఎందుకు అంత పెద్ద అబద్ధం చెప్పినట్టు? తన నేరం రుజువైతే రాజావారు శిక్షిస్తారనా? తనని శిక్షిస్తే ఆమెకేం నష్టం?"

ఇలా వున్నాయతని ఆలోచనలు.

అలా ఆలోచిస్తూనే ఇల్లు చేరాడు.

ఎందుకో అతని కళ్ళ ముందు రాకుమారి రూపం నిల్చి కదలనంటోంది. ఆమె మాటలు చెవుల్లో ప్రతిధ్వనిస్తున్నాయి.

"రాకుమారి చాలా మంచిది!" అనుకున్నాడు పదే పదే.

★ ★ ★ ★ ★ ★

సూర్యదేవ్ వీధి గదిలో ఎవరితోనో మాట్లాడుతున్నాడు. రసన్ మెల్లగా వరండాలో కొచ్చాడు.

అలికిడికి తలెత్తి చూసిన సూర్యదేవ్ కళ్ళకి రసన్ కనిపించాడు. అసలే చిరాగ్గావున్న అతనికి కొడుకు బైటికెళ్ళడం చూశాక మరింత చిరాకు కలిగింది.

"ఎక్కడికి?" అన్నాడు కర్కశంగా.

"అలా వెళ్తొస్తాను!" మెల్లగా అన్నాడు రసన్.

"అదే ఎక్కడికి అని అడుగుతున్నాను!" విసురుగా లేచొచ్చాడు సూర్యదేవ్.

కొడుకు రాజావారి దగ్గరి కెళ్ళననడంతో అతనికి మతిపోయినట్టయింది. రాజా వారికేం చెప్పాలో అర్థం కాక తికమక పడిపోతున్నాడు.

"హాయిగా గదిలో కూర్చోరా రసూ!" అంది తల్లి బ్రతిమిమాలుతున్న ధోరణిలో.

"ఆ బుద్ధే వుంటే ... మనకీ పాట్లెందుకు ... హాయిగా రాజావారి దివాణంలో యువరాజులా పెరిగేవాడు" కోపంగా అన్నాడు సూర్యదేవ్.

రసన్ మాట్లాడలేదు.

"నా మాట విని ఇంట్లోనే వుండిపోరా! మీ నాన్న రాజావారికి ఏదో సర్ది చెప్తారు" అతని చెయ్యి పట్టి ఆపుతూ అంది మాయ.

"ఇపుడే వచ్చేస్తానమ్మా!" సున్నితంగా తల్లి చేతుల్ని విడిపించుకుని, వెనకనించి తండ్రి ఏదో అంటున్నా వినిపించుకోకుండా బైటికి నడిచాడు రసన్.

అతని కాళ్ళు రాజావారి తోటకేసి నడిచాయి. ఎప్పటిలా పిల్లలతో పోలోమంటూ వెళ్ళలేదతను. ఒంటరిగా అలా ఆలోచిస్తూ వెళ్ళాడు.

సాధారణంగా అతను రాజావారి తోటకేసి వెళ్తే పక్కగా వున్న కొండరాయి మీద కూర్చుని తోటలోకీ, దూరంగా ఉన్న అడవిలోకీ చూడ్డం అలవాటు, ఆ అలవాటు ప్రకారమే కొండరాయి దగ్గరికెళ్ళి ఆగాడు.

రాజావారి తోట ప్రహరిగోడ ఎత్తుగా వుంటుంది. కొండ ఎక్కితే అక్కణ్ణుంచి తోట, తోటలోని పొదరిల్లు, చక్కని పూలచెట్లు, ఫల వృక్షాలూ కనిపిస్తాయి. అవి చూస్తూ గంటలు గంటలు గడిపేస్తాడతను. చూసినవి చూసినట్టు ఏ గోడమీదో చిత్రాలుగా గీసేస్తాడు.

అయితే ఆ రోజు మాత్రం అతని ధ్యాస పూదోట మీద గానీ, తేనె ఫలాల మీద గానీ లేదు.

ఎవరి కోసమో ఆరాటంగా, ఆశగా, వెతుకుతున్నాయతని కళ్ళు.

అతను వెతికేది తనకి శిక్షపడకుండా కాపాడిన చిన్నారి రాకుమారి కోసం.

ఈసారి తోటంతా కలయచూశాడు.

అతని కళ్ళు తళుక్కుమన్నాయి.

అప్పటికే రాకుమారి వచ్చి తోటలోంచి ఇటు కేసే చూస్తోంది. రసన్ని చూసి పలకరింపుగా నవ్వింది. రసన్ కూడా నవ్వాడు.

"ఇలా రా!" అన్నట్టు చెయ్యి వూపిందామె.

ఉత్సాహంగా ఆమె దగ్గరికెళ్ళాడు రసన్.

"నీ పేరేమిటి?" అందామె చిన్నగా నవ్వుతూ.

"రసన్!" మెల్లగా అన్నాడు రసన్.

"నా పేరు చందన".

"బావుంది!"

"ఏమిటి?"

"మీ పేరు ..."

పక్కున నవ్వింది చందన.

"ఎందుకు నవ్వుతున్నారు?" నొచ్చుకున్నట్టు అన్నాడు రసన్.

"ఏం లేదులే! ఒకటడుగుతాను! ... నిజం చెప్తావా?" గంభీరంగా అందామె.

"ఊ... చెప్తాను."

కొత్త శీర్షిక

రచయిత్రి



జవాబులు

సుప్రసిద్ధ రచయిత్రి శ్రీమతి రావినూతల సువర్ణాకన్నన్ తమ సీరియల్ నవల "మంజీర నాదం"పై పాఠకుల ప్రశ్నలకి సమాధానాలు ఇస్తారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోదలచిన పాఠకులు తమ ప్రశ్నలని 'రచయిత్రి జవాబులు' శీర్షిక పేర సంపాదకుడు, ఆంధ్రసచిత్ర వారపత్రిక, గాంధీనగరం, విజయవాడ –520003 అనే చిరునామాకి పంపవచ్చును. రచయిత్రి ఎంపిక చేసిన ప్రశ్నలని, వాటికి ఆమె ఇచ్చిన సమాధానాలని వారం వారం ఈ సీరియల్ పేజీలలో ప్రచురించగలము. ప్రతి వారం రచయిత్రి ఉత్తమంగా ఎంపిక చేసిన ప్రశ్నని పంపిన వారికి ఆమె రాసిన నవల ఒకటి బహుమతిగా లభిస్తుంది. పాఠకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోగలరని ఆశిస్తున్నాము. –సం

మంజీరనాదం

"ఈ తోట మీదా?"

ఓసారి ఆమెకేసి చూసి వెంటనే తల దించేసి -

"ఊఁహూఁ!" అన్నాడు రసన్.

"కాయలు కోసుకొనే ముందు ఎవరి అనుమతైనా తీసుకున్నావా?"

"ఊఁహూఁ!"

"మరి. ఈ తోట మీది కానప్పుడూ, ఎవరి అనుమతి అడక్కుండా ఇందులో అడుగు పెట్టడం, చెట్లెక్కి కాయలు కొయ్యడం తప్పుకదూ?"

"......."

"అది దొంగతనం కాదూ? ..."

దానికీ మాట్లాడలేదు రసన్.

"దొంగతనం ఎంత నేరమో, దానికి ఎలాంటి శిక్షలుంటాయో నీకు తెలియదా?"

"తెలుసు!" అన్నట్టు తల ఊపాడు రసన్.

"మరెందుకీ పని చేశావ్?"

మౌనంగా ఉండిపోయాడు రసన్.

ఆరేళ్ల పిల్ల తనని అలా దబాయిస్తున్నందుకు అతనికి కోపం రాలేదు. పైగా తను చేసిన పనికి మొదటిసారిగా సిగ్గుపడ్డాడు.

"చెప్పు అది దొంగతనమేగా?"

"అవును!" అనేశాడతను.

"పోన్లే! ... జరిగిందేదో జరిగిపోయింది! ఇంకెప్పుడూ అలా చెయ్యకు!" స్నేహపూర్వకంగా నవ్వుతూ అంది.

"ఊఁహూఁ!. చెయ్యను!" మనస్ఫూర్తిగా అన్నాడు రసన్.

"ఇంకనించీ మనం స్నేహితులం ...మా తోటలో ఏ పళ్ళు కావాలన్నా, ఏ పూలు కావాలన్నా నన్నడుగు నేనిస్తాను! సరేనా?"

"అలాగే! ..."

ఇంతలో ఎవరో పిలవడంతో -

"అదిగో! ఎవరో పిలుస్తున్నారు ... నేను వెళ్తాను ...నువ్వు కూడా వెళ్ళిపో!" అనేసి చందన పరిగెత్తుకుంటూ వెళ్ళిపోయింది.


రసన్ మొహం పున్నమినాటి చంద్రుళ్లా వెలిగిపోతోంది. తెలియని ఆనందం అతన్ని ఉక్కిరిబిక్కిరి చేసేస్తోంది. పరుగున ఇంటికొచ్చి పడ్డాడు.

"ఏం నాయనా? ... ఇల్లు కనిపించిందా?" అన్నాడు పెద్దన్న వ్యంగ్యంగా.

"అప్పుడే బలాదూర్లు తిరగడం అయిపోయిందా" అన్నాడు చిన్నన్న.

ఎవరికీ సమాధానం చెప్పకుండా చిరునవ్వు నవ్వుతూండి పోయాడు రసన్.

తండ్రి వీరి సంభాషణంతా వింటూ మౌనంగా ఉండిపోయాడు.



ఆయనకి రాజాగారి నుంచి ఎలాంటి శిక్ష అనుభవించాలో అన్నట్టు భీతిగా ఉంది.

"నాన్నా!" మెల్లగా వచ్చాడు రసన్.

"ఏమిటి?" కర్కశంగా అన్నాడు తండ్రి.

"నేను ... నేను రాజాగారి దగ్గరికెళ్తున్నాన్నా!" ఉత్సాహంగా అన్నాడు రసన్.

తృళ్లిపడ్డారంతా.

"ఏమిట్రా?" అన్నాడు తండ్రి అయోమయంగా.

"నేను రాజావారి తోటలో వుండి చిత్రకళని అభ్యసిస్తాను!" అన్నాడు రసన్.

అతని మొహంలోకి పరిశీలనగాచూశారంతా ... అయితే అతని కళ్లలో వెలుగు, ఆనందమే తప్ప అయిష్టత ఏమాత్రంలేదు.

నిన్న చచ్చినా వెళ్లను! అన్నవాడు ఇవాళ తనంతట తానే వెళ్తాననడం చాలా వింతగా తోచింది వాళ్లకి. అయినా "పోన్లే! ఎలా అయితేనేం! వాడి మనసు మారింది! అంతే చాలు!" అనుకుని మురిసి పోయారు.

తల్లి ఆనందంగా దైవానికి నమస్కరించింది. అన్నలు, తండ్రి తేలిగ్గాఊపిరి తీసుకున్నారు.

, మర్నాటి సాయంత్రం మళ్ళీ రాజావారి తోటకేసి నడిచాడు రసన్. ఈసారి అతనికి మరింత వుత్సాహంగా వుంది.

రసన్ వెళ్లేసరికి తోటలో చందన బంతి ఆట ఆడుకుంటోంది.

"అమ్మాయిగారూ!" అన్నాడు రసన్ కొంచ ఎక్కి.

"రసన్! ... రా ... బంతి ఆడుకుందాం" అంది చందన.

బిత్తరపోయాడు రసన్.

కంగారు పడిపోయారు రాకుమారి పరివారం.

"రా రసన్! ... నీకు బంతాట వచ్చా?" వుత్సాహంగా అడిగింది చందన.

"ఓ! వచ్చు" అన్నాడతను మరింత వుత్సాహంగా.

ఆ పిల్లని చూస్తుంటే ఎన్నాళ్ల నుంచో పరిచయం వున్నట్టనిపించిం దతనికి.

"మరి ... రా! ...

అతను రాబోయాడు.

"ఆగు!" అరిచినట్టు అంది ఓ దాసి.

బిక్క మొహం వేశాడు రసన్.

చందన ఏదో అనబోతుంటే -

"అమ్మాయిగారూ! - మీరతనితో ఆడకూడదు" అంది ఓ దాసి గంభీరంగా-

"ఏం?"

."రాజావారికి తెలిస్తే ..."

"నన్నేం అనరు" దాసీ మాట పూర్తి కాకుండానే గర్వంగా అంది చందన.

"మిమ్మల్ని ఏం అనరు. కానీ, మమ్మల్ని, ఆ కుర్రాణ్ని మాత్రం చంపేస్తారు!" అంది దాసి.

"ఎందుకు?"

"ఆదేమో!. నాకు తెలియదు".

"పోన్లే రసన్! ... మా నాన్నగారితో చెప్తాను. ఆయన కాదనరు. అప్పుడు ఆడుకుందాం!" అంది చందన.

"అలాగే! ... కానీ రాజాగారితో చెప్పకండి. ఇంకనించీ నేను మీ తోటలోనే వుంటానుగా. బోల్డు సేపు ఆడుకోవచ్చు. ఎన్నో కబుర్లు చెప్పుకోవచ్చు!" మెల్లగా అన్నాడు రసన్.

"అదేవిఁటి?"

"అవును రాజావారు నాకు చిత్రలేఖనం నేర్పిస్తానన్నారు" వుత్సాహంగా జరిగిందంతా చెప్పాడు రసన్.

చందన కళ్ళు తళుక్కున్నాయి.

"చూశావా! నేను చెప్పలేదూ! మా నాన్న చాలా మంచివారు" అంది విశాల నేత్రాలు రెప రెపలాడిస్తూ.

అతను ఆమె దగ్గర శలవు తీసుకుని వెళ్ళిపోయాడు. చందన కూడా ఆటని కట్టిపెట్టి దాసీలతో అంతఃపురంలోకి వెళ్ళిపోయింది.

(ఇంకా ఉంది)



రైతు చెమటతో తడిసి పునీతమైన నేల, సరియైన ఎరువు అందితే ఆశించిన ఫలం తప్పక అందిస్తుంది.

అధునాతన పరిజ్ఞాన ఫలమైన "స్వస్తిక్ యూరియా" రైతు అవసరాలకు అనుగుణంగా తయారైన ఎరువు.

సమృద్ధిగా నత్రజనిని కలిగిన "స్వస్తిక్ యూరియా" పుష్కలంగా పంట ఫలాన్ని అందిస్తుంది.

క్రితం సంవత్సరం రాష్ట్రంలో "స్వస్తిక్ యూరియా"కు లభించిన అత్యధిక ఆదరణే అందుకు నిదర్శనం.

రామగుండంలో తయారయ్యే "స్వస్తిక్ యూరియా", ఆంధ్రరాష్ట్రంలో తయారయ్యే ఏకైక యూరియా !

ఒక్క మాటలో చెప్పాలంటే –

"స్వస్తిక్ యూరియా"తో వ్యవసాయం, అందిస్తుంది తెలుగు రైతుకు ఎనలేని ఫలసాయం !

శుభ, సౌభాగ్యాలకు చిహ్నం – ప్రఖ్యాత రామగుండం వారి స్వస్తిక్ యూరియా

ది ఫర్టిలైజర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లి.

(కేంద్ర ప్రభుత్వ యాజమాన్య సంస్థ)
మార్కెటింగ్ డివిజన్, హైదరాబాద్-500 004.

Sobhagya H/FCI/87/1

అస్థిపంజరం

గన్ను కృష్ణమూర్తి

అస్థిపంజరం వెళ్తోంది!

అందరూ చూస్తుండగానే నడిచి బజార్లోంచి వెళ్తోంది!

పట్టపగలే నడిచి వెళ్తోంది!

ఎవ్వరూ దాన్ని చూసి, పారిపోడం లేదు. జడుసుకోవడం లేదు. పైగా నవ్వుకుంటున్నారు.

ఆ అస్థిపంజరం నేరుగా వెళ్ళి చౌరస్తాలో నిలబడింది. నలువైపులా చూచింది. ఓ కిళ్ళీ షాపు వైపు దారి తీసింది. కిళ్ళీ షాపు వాడితో ఏదో మాట్లాడింది. వాడు కూడా దాంతో పరాచికాలాడాడు. ఏదో యిచ్చి, పంపించాడు.

ఆ అస్థిపంజరం ఎంతో దర్జాగా, బీడీ కాలుస్తూ, పొగ వదుల్తూ వెళ్తోంది.

ఇంతలో మరో అస్థిపంజరం వచ్చింది.

దాని వెనకాలే సైజులువారీగా మరో నాల్గుగు అస్థిపంజరాలు ఎగురుతూ, దూకుతూ వచ్చాయి.

రెండో అస్థిపంజరం సరాసరి వచ్చి. మొదటి అస్థిపంజరం ప్రక్కనే బైఠాయించింది. మిగతా పిల్ల అస్థిపంజరాలన్నీ చుట్టూ చేరి, గంతులేయసాగాయి.

వాటిని చూడ్డానికి అందరికీ వినోదంగా ఉంది. తమాషా చూసినట్లు చూడసాగారు.

ఇంతలో బలంగా గాలి వీచింది.

ఆ గాలికి ఆ అస్థిపంజరాలన్నీ ఆమడ దూరం ఎగిరిపడ్డాయి. ఒకదాన్నొకటి గట్టిగా కావలించుకున్నాయి. గాలి పోగానే, మట్టి దులుపుకుని, మళ్ళీ లేచి నిలబడ్డాయి. పెద్ద అస్థిపంజరం చుట్టూ మూగాయి.

"ఆకలేస్తోందయ్యా!" అడిగిందో పిల్ల పంజరం.

"ఆకలేస్తే ఛావు!" కసురుకుంది పెద్ద పంజరం.

"ఊఁ ... ఊఁ ... ఊఁ" అంటూ ఏడవసాగిందా పిల్ల పంజరం.

"అమ్మకు జొరంగా ఉందయ్యా!" అంది మరో పిల్ల పంజరం రెండు చేతుల్తో తలకాయని బరుక్కుంటూ.

"అందరూ కట్టగట్టుకు ఛావండి" విసుక్కుంది పెద్ద పంజరం.

"నాకూ ఆకలేస్తోందయ్యా!" అడిగింది మరొకటి.

"ఏం కూడు తిన్లేదూ?"

"నేదు."

"ఏటికి?"

"అమ్మ యియ్యాల కూడొండనేదు".

"ఏం తెగులు దానికి?"

ముందే చెప్పాగా. జొరమొచ్చినాదని!"

"ఎందుకొచ్చింది జొరం? ... నానేం రోగం నేక ఉన్నానా? ... నాకు నేదూ జొరం, దగ్గు? ... ఛస్తుండాను. రొండు దినాల్నుంచి" దగ్గిందా పంజరం.

గంట నుండీ సిటీ బస్సు కోసం ఎదురు చూస్తున్న నాకు ఈ దృశ్యం కంటబడింది. అందరికి ఆనందంగా ఉన్నా, నన్ను మాత్రం కలచివేసింది.

అందరినీ పంపించి. ఓ బుల్లి అస్థిపంజరాన్ని వెంటేసుకుని, నడక సాగించాడు ఆ అస్థిపంజరంలా ఉన్న వ్యక్తి. నావైపే రాసాగాడు. నన్ను సమీపించాడు.

"అగ్గి వుందా సామీ!" అంటూ చేయి చాచాడు ఆరిపోయిన బీడీని ఊదుతూ.

మొలకి లంగోటీ తప్ప, ఒంటిపైన మరో వస్త్రంలేదు. ఎముకలు బయటపడి, లెక్కెట్టడానికి వీలుగా ఉన్నాయి. వాడి వెంటున్న పిల్ల బొచ్చు కుక్కని తలపింపజేస్తోంది. తైల సంస్కారం లేని జుత్తుతో! ఆకాశంలో ఉన్న నక్షత్రాలెన్నో చెపొచ్చుగానీ, అది వేసుకున్న గౌనుకి చిరుగులెన్నో చెప్పడం కష్టం.

నాకు బీడీ, సిగరెట్ కాల్చే అలవాటు లేదు. అందువల్ల లేదని చెప్పాను. వాడు ముందుకు వెళ్ళబోయాడు. పిల్చాను. దగ్గరగా వచ్చాడు. జేబులోంచి పావలా బిళ్ళ తీసి, ప్రక్కనే ఉన్న కిళ్ళీ కొట్టులో ఓ పెట్టె తీసుకొమ్మని యిచ్చాను.

వాడు అగ్గిపెట్టెని తీసుకొచ్చి, పెట్టె, చిల్లర డబ్బులు ఇవ్వబోయాడు.

"నీ దగ్గరే ఉంచు" అన్నాను.

వాడి కళ్ళు కృతజ్ఞతతో వెలిగాయి. వంగి దణ్ణం పెట్టాడు. నేను కాళ్ళని వెనక్కి తీసుకున్నాను.

వెళ్ళబోతుంటే కూర్చోమన్నాను.

వాడూ, వానితోబాటు వాడి కూతురూ నేను కూచున్న బెంచీ ప్రక్కనే నేలమీద కూలబడ్డారు. వాడు బీడీ వెలిగించి దమ్ము లాగుతూ, తన లంగోటీలో ఏదో వెదకసాగాడు.

"ఏమిటీ?" అన్నాను.

"బీడీలండీ!" అన్నాడు గుప్పిటి నిండా ఎంగిలి బీడీ ముక్కల్ని బయటకు తీస్తూ. నాకు డోకొచ్చినంత పనయింది.

ఆ బీడీ ముక్కల్లోంచి ఓ ముక్కని వెలిగించి, ఆ పిల్లకిచ్చాడు. ఆ పిల్ల దగ్గుతూ, ఆయాసపడుతూ దమ్ము లాగసాగింది.

"ఏం పేరు?" అడిగాను.

"భీవుఁడు" అన్నాడు వాడు తాపీగా.

నాకు నవ్వాగలేదు. "అదేం పేరోయ్? అన్నాను నవ్వుతూనే.

"పీనుగులా ఉన్నోడికి యిదేటి పేరనుకుంటుండారా బాబూ? మడిసన్న తరువాత వో పేరుండాలి గంద సామీ! ... అయినా తమఁరడిగేరుగానీ, నా పేరెట్టి పిలిసేవోడేడండీ. యీ భూపెపెంచకంలో!" అన్నాడు.

"సరేకానీ భీవుడూ! నువ్వు కాల్చితే కాల్చావుకానీ, ఆ పిల్లకెందుకిస్తున్నావు బీడీలు?" అన్నాను.

"గదా సామీఁ!" అంటూ వాడు నాకన్నా హెచ్చుగా నవ్వాడు. వాడినవ్వుకు నాకు అర్థంతో చలేదు.

"ఆ పిల్లకి బీడీలిచ్చి దాని ఆరోగ్గెం యెందుకు పాడుసేత్తున్నావనేగా మీరంట! అయ్యా! తమఁరున్నోరు. మేము లేనోళ్ళం! తమఁరన్నట్టుగా మేము బీడీలు కూడా మానేత్తే, ఎట్టా బతకాలంటారుసామేఁ!... నేనంటే రెండుదినాలైనా నీళ్ళుతాగి వుండగల్ను! గీ పొల్లెట్లుంటదంటారు? ఈ బీడీముక్కైనా కాలిత్తే కాస్త ఊపిరి నిలుత్తాది. నేదా ఈ పేనం గాల్లో కల్సిపోతాది."

"మరి జబ్బుచేయదూ?" అన్నాను.

"జబ్బేటిసామీ! ఈ బీడీ తాగితే రేపు పోతాది పేనం. తాగకుంటే ఈరోజే పోతాది! గిన్నెడు బువ్వ సేసేపని ఈ ఒక్క బీడీముక్క సేత్తాదిసామీ! అన్నం పెట్టమంటే కసురుకుంటాడు మడిసి! ఇక బీడీలంటారా? ఎంగిలిముక్కలు ఏడైనా దొరుకుతాయి. ఏ అయ్యాని నిప్పడిగినా యిస్తాడు. ఇక ఆరోగ్గెమంటారా? ఏదోనాడు రాలిపోవాల్సిందే ఈ సెత్త! ఈ సెత్తుండి ఏర్ని బాగుసేత్తుందాది సామీ! మాలాటోళ్ళు ఎంత తొందరగా రాలిపోతే, దేశానికి అంతమంచిది సామీ!" అన్నాడు వేదాంత సారాన్ని వెలిగ్రక్కుతూ.

"ఏంపనిచేస్తుంటావు?" ప్రశ్నించాను మళ్ళీ. వాడు మళ్ళీ నవ్వాడు.

"మాకెవరిత్తారండీ పని?... మమ్మల్ని సూత్తేనే అసయ్యించుకుంటారు. కూలిదొరికితే సేత్తాం!... నేదా అడుక్కుతింటాం" అన్నాడు.

"పోనీ, రిక్షా తొక్కకూడదూ?" అన్నాను. వాడు మళ్ళీ పొట్టచెక్కలయ్యేలా నవ్వాడు.

"ఏదో అన్నట్టుగా వుందండీ తమఁరు సెప్పేది.

నాకు రిచ్చా దొరకాలముందు. రిచ్చా దొరికాక, ఆర్నెల్లు నన్నేసామ్మైనా మేపాలా. నాకు ఒళ్ళు రావాల! అప్పుడుగాని నేను రిచ్చా నడపాల!... ఇదంతా సాద్దెమేనాసామి!" అన్నాడు.

నాకేం మాటాడాలో తోచలేదు.

"నీ కెందరు సంతానం?" అడిగాను మాటమారుస్తూ.

"అరుగురండీ. నలుగురు ఆడ. ఇద్దరు మొగ."

"ఇందర్నెందుకు కన్నావు? ఆపరేషన్ చేయించుకోలేకపోయావ్?"

"అయన్నీ పెద్దోరికేనండీ! మాకు ఆపరేషన్ ఎవరుసేయాల? సేసినా ఈ కట్టికి పెనం నిలుస్తుందంటారా? ఆ కత్తి సూసేసరికే మాపైపేనం పైనే పోతుంది.... అయినా మాకేటికండీ అప్రేషను! కూడు లేనోళ్ళకి?... మీలాంటి దొర్లకు కావాలసామే!"

"ఎందుకు?"

"ఎందుకేంటి?... నల్గురం నాలుగు దార్లెంట ఎల్తేగాని, ఏ ఒక్కరికైనా కూడు దొరకదు. రోజు గడువదు. కూలిసేసినా నలుగురి సంపాదన కలితేగాని రోజెళ్ళదు".

నా కెందుకో వాడిమాట నమ్మబుద్ధికాలేదు. ఆ మాటే అన్నాను వాడితో.

"మోసేవాడికెరుకన్నారుసామీ కావిడి బరువు!... మా విసెయం మీరాలోచించలేరు. అర్థం సేసుకోలేరు. అయినా ఏట్లో ఎన్ని బుడగలు పుట్టినా. పుట్టకున్నా ఏటికేంలోటుసామీ! ఏరుదారి ఏరుదే!... బుడగల దారి బుడగల్దే! అట్టాగే మేమూ!" అన్నాడు.

నేను ఆలోచనల్లో పడ్డాను.

"ఏసిన పిందెలన్నీ పూలుకావు సామే! అయిన పిందెలన్నీ కాయిలు కావు. అట్టాగే ఈల్లూనూ! నాకు పదిమంది పుట్టేరు. అర్లో ఈ అర్గురు మాతరం మిగిలేరు. ఈరు పెరిగి పెద్దయేలోగా ఎందరు రాలతారో ఏటో! మమ్మల్ని తగిలేడానికి ఒక్కరైనా మిగిలితే మాకదే పదేలు సామీ! అల్లే నేకుంటే మాసెవాల్ని కుక్కైనా ముట్టదు సామీ!" అన్నాడు.

వాడి మాటల్లో కొంతైనా నిజం లేకపోలేదని పించిందినాకు. వా డన్నట్టు ఏట్లోవాడూ, ఏటి ఒడ్డున నేనూ! ఎన్ని నీతులు చెప్పి ఏం లాభం! ఆ ఏట్లోకి దిగి చెయ్యందిస్తే తప్పు! అనుకున్నాను.

యాంత్రికంగా జేబులోకి వెళ్ళింది చెయ్యి! ఓ రూపాయి బిళ్ళా, ఏ యాభై రూపాయనోట్లూ తగిలాయి.

"ఈ రూపాయిచ్చేస్తే?" అనుకున్నాను.

"కానీ వాడికే మొదలవుతుంది? గంజినీళ్ళైనా దొరకవు ఈ కరువుకాలంలో! పోనీ, ఈ యాభై రూపాయల్నోటిచ్చేస్తే?... పదినిముషాల సంపాదన! రామూర్తి, వేంకటేశమూ కలిసి బలవంతంగా పేకముక్కలు పంచితే, వచ్చిన బాపతు!... రాలేదనుకుందేసరి!... కనీసం ఓ వారం రోజులైనా కడుపునిండా తింటాడు" అనుకున్నాను.

"ఒరేయ్ భీముడూ! ఈ డబ్బు నీదగ్గరుంచు!" అంటూ వాడిచేతిలో ఆ పెద్దకాగితాన్నుంచాను.



వాడు పక్షవాతం వచ్చినట్టుగా మెడలు వారగిల వేసి ఓ చెయిప్రక్కకు వాల్చేసి, గ్రుడ్లు మిటకరిస్తూ, నోరు తెరిచేశాడు. ఓ నిముషందాకా వులుకూ పలుకూ లేదు!

నాకు కంపరం వేసింది. ఈ శాల్తీ టిక్కెట్టు

పుచ్చుకోలేదుకదా! అనుకున్నాను.

"ఏమిటోయ్ భీముడూ!" అన్నాను గాభరాగా.

ఆ నోటుని కిందామీదా త్రిప్పిచూస్తూ "ఇది నాకేనా సామీ!" అన్నాడు నమ్మకం కలగక.

"నీకేనోయ్!"

"నన్నో ఆటపట్టించాలని సూత్తుండారు! నాకింత ఆశనేదు సామీ!" అంటూ ఆ నోటుని నా చేతిలో వుంచుతూ.

"టీ డబ్బులీయండి సాలు!" అన్నాడు.

"అబద్ధం కాదు భీముడు! నిజం!... నీ దగ్గిరే వుంచు!" అన్నాను మళ్ళీ వాడిచేతుల్లో పెడుతూ.

"నానంత ఎడ్డి మడిసిని కానండీ! నాకేటి మీ రు యాభైరూపాయలు ఈడమేటి?... నానంత ఎడ్డి మాలోకంలా వుండానా సామీ? వొద్దు సామీ వొద్దు ఈ పేదోల్లతో సెలగాటాలాడొద్దు!" అన్నాడు రెండుచేతులూ జోడిస్తూ.

"నిజంగా భీముడూ! ఇది నీకే! తీసుకో!... నీ పిల్లల కేమైనా కొనిపెట్టు!" అంటూ మళ్ళీ వాడిచేతిలో నే పెట్టాను.

"వొద్దుబాబూ వొద్దు!... మీరుణంలో పడేబోకండి! మీ కాళ్ళట్టుకుంటాను" అన్నాడు వంగి వంగి దండంపెడుతూ.

"ఫరవాలేదు వుంచు. అంతగా అయితే నెమ్మదిగా తీర్చుకుందుగానీ... వుండనీ" అంటూ బలవంతంగా వాడిచేతుల్లో ఆ నోటు వుంచాను. వాడి కళ్ళలో అశ్రువులు ధారలుకట్టాయి. జీవనదిలా పరుగులు దీశాయి. మరుభూమిలోంచి పాతాళగంగ దూకుతున్నట్లుగా వుంది వాడి కళ్ళకేసి చూస్తుంటే!

వాడి నోట మాట రావడంలేదు. పెదాలు అదురుతున్నాయి. జోడించిన చేతులు వణుకు తున్నాయి! మనిషి నిలువెల్లా కంపించి పోతున్నాడు.

నా కళ్ళు కూడా అర్ద్రాలయాయి.

బస్సు వచ్చిందికూడా గమనించలేదు.

"బాబూ బస్సొచ్చేసింది! తీసుకోండి!..... వద్దు! నా

అస్థిపంజరం

కీ డబ్బులొద్దు! మీ కాళ్ళట్టుకుంటాను!..... సచ్చి మీ కడుపున బుడతాను.....తీసుకోండి?" అంటూ నా చేతిలో పెట్టేశాడు.

నేను వారించి కదుల్తున్న బస్సునెక్కేసాను. వాడు బస్సు వెంట చాలా దూరం పరుగెత్తు కొచ్చాడు.

కానీ, అందుకోలేక వెనకబడిపోయాడు. పడిపోయాడు.

బస్సులోని ప్యాసెంజర్లు నావైపే ఆశ్చర్యంగా చూస్తున్నారు. యదార్థంలోకొచ్చి కళ్ళు తుడుచుకున్నాను.

మళ్ళీ క్షణాల్లో ఊహల్లోపడిపోయాను.

వాడా యాభై రూపాయలు ఇంటికి తీసుకెళ్ళినట్లూ, భార్యాకు మందులిప్పించినట్లూ, పిల్లలకు చవకరకం బట్టలు కొనిపెట్టినట్లూ, కడుపునిండా తిండి తిన్నట్లూ, కంటినిండా కునుకుతీసినట్లూ, క్రమక్రమంగా పని సంపాదించుకున్నట్లూ, తన కాళ్ళపై తాను నిలబడగలిగినట్లూ, సమాజంలో కలిసిపోయి నట్లూ వాడు నా కళ్ళముందు మెదిలాడు.

ఆలోచనల్నుండి తేరుకునేసరికి. బస్సు చివరి స్టాపులో ఆగివుంది. ఎంతసేపయిందో తెలీదు. బస్సులో నేనుతప్ప మరెవ్వరూలేరు. నా పరధ్యానానికి నవ్వుకుంటూ బస్సు దిగిపోయాను.

★ ★ ★ ★ ★

ఓ వారం రోజుల్తరవాత అదే బస్టాపులో కనిపించిందా అస్థిపంజరం. అప్పటికిప్పటికీ ఏమాత్రం తేడాలేదు. పైగా ముఖంలో కళలేదు. వెలవెలాబోతోంది. నన్నుచూసి ఉడుములా పట్టుకుంది.

"సామీ ఆగండాగండి" అంటూ.

"ఏమిటోయ్! బాగున్నావా?" అన్నాను.

"ఇదుగోండి మీ డబ్బులు!... హమ్మయ్య!... ఇన్నాళ్ళకి దొరికారు మిమ్మల్ని వెతకలేక చస్తున్నాను" అంటూ నేనిచ్చిన యాభై రూపాయల నోటు రొంటిలోంచితీసి, నా చేతిలో వుంచాడు. సందేహంలేదు. అదే నోటు. కాకపోతే కాస్త నలిగిపోయింది.

"ఏమిటిది?" అన్నాను నా కళ్ళను నేనే నమ్మలేక.


"వొద్దు సామీ!... వొద్దు!... ఈ డబ్బుల్తో మా పేనాలు పోయేట్టున్నాయి" అన్నాడు.

"ఎందుకు?" అడిగాను.

"అయ్యోయ్యో!... ఏం చెప్పమంటారుసామీ!... ఈ డబ్బులట్టుకెళ్ళిందగ్గిర్నించీ అన్నీ కష్టాలే!" అన్నాడు.

నేనర్థంగాక తెల్లమొహం వేశాను.

"ఈ డబ్బులెట్టి మా ఆడదానికి మందులు కొందామనుకొన్నాను. అది మంచానపడి శానా పొద్దులవుతానాది. మూల్గుతూ, మూల్గుతూ పనిసేత్తా వుంది. నాకూ పిల్లలకీ! నేనే అంటే నాకంటే పీలగా, ఉలిపిరికట్టెలా తయారైనాది. కానీ ససేమిరా ఇనుకోడం లేదు. దానిసిగదరగ! దాంది మొండి- పట్టంటే నమ్మండి. 'నాకు మందుమాకూ ఏపీం వొద్దు. నాకేటి నే బాగానే వుండాను. నువ్వు మగమడిసివి. కష్టంచేవోడివి. సాకేవోడివి నువ్వే మందులు కొనుక్కో'మంటూ పేనాలు తోడతా వుంది. ఎంతసెప్పినా ఇనుకోదు. నాకే మందూ, మాకూ వొద్దని మొత్తుకుంటే, బట్టలు కొనుక్కో మంటున్నాది. పోరలకు ఒంటిమీద మొలతాడు కూడా నేదాయె. వాళ్ళనిడిచి, నేనెట్టా కుట్టించుకుని కులకమంటారు? మీరే సెప్పండి సామీ!... నేను ఒప్పుకోనేదు. ఇప్పుడు పిల్లలు ఎంటబడుతున్నారు. 'మాకు కుట్టించండయ్యా! మాకు' అని ఒక్కరు గాదు. ఇద్దరుగాదు. ఆరుగురు పోరీలు. ఎరినిడిచి, ఎరికి కుట్టించమంటారు సెప్పండి!... పోనీ ఎలాగో తంటాలుబడి కుట్టిస్తానే అనుకోండి, ఈళ్ళు కొత్తగుడ్డలేసుకుని తిరిగితే, ఈళ్ళమొహాన బిచ్చ మెవడు ఏస్తాడు?... ఇట్టా తల్లికడుపుల్నుంచి ఊడినట్టుంటేనే ఈజనాలకు కనికారం కలుగడం నేదాయె! ఇక బట్టలేసుకుంటే ఏదూ దగ్గిరకిరానీదు. పోనీ గింజలు కొందామనిచూశా! కానీ గింజలు కొనుక్కొని సుష్టుగా తిండం నేర్సితే, ఈ యెదవలు సోమర్లైతారనీ, ఈ కొడుకులు మళ్ళీ బిచ్చ మెత్తసావరనీ, పాడైపోతారనీ ఓ దిగులు! అందుకని ఏటి సెయ్యాలో పాలుపోడంనేదు సామీ! రోజా యింట్లో గడబిడే! కూస్త డబ్బులు నాసేత కనిపించేసర్కి, దొంగనాయెదవలు సుట్టూ తిరుగుతుండారు మా గూడేన. నాకు అప్పిమ్మంటే, నాకంటూ! తాగుబోతునాయెదవలు! ఈట్ని కాపాడు కోడాన్కి నిద్దరకూడా పోడంనేదీమధ్య! ఈటికన్నిటి కంటే మీ డబ్బు మికీడం మేలనిపించింది బాబు గోరూ! మీ డబ్బులు మీదగ్గిరే వుంచండి! మీకు పున్నెముంటుంది" అంటూ రెండు చేతులూ దొరికించుకొని, ఆ యాభైరూపాయలు నాకిచ్చేసి, పరుగులాంటి నడకతో వెనక్కి చూడకుండా, పిలిచినా మాట్లాడకుండా వెలుగుల్ని భరించలేని గబ్బిలంలా చీకట్లలో కలిసిపోయాడు. □



డాక్టర్ సలహాలు



ఎల్. టి. ఆర్. రొట్టవలర

నాకు చేతి మీద, చెంప పైన మచ్చలు వున్నవి. డాక్టర్లకి చూపించి మందులు వాడినా గాని నయము కాలేదు. వారు లెప్రొసి అని చెప్పారు.

లెప్రొసి అని రోగ నిర్ధారణ జరిగినప్పుడు కనీసం మూడు సంవత్సరముల పాటు 'డాప్సోన్' మాత్రలు వాడవలసి వుంటుంది. ఆ తర్వాత వైద్యులు ఇంకా కొంత కాలం వాడవలసి వుంటుందని తెలియజేస్తే తప్పకుండా నిర్ణీత కాలం వరకు ఈ మందుని వాడవలసి వుంటుంది. ఈ మచ్చల రంగు మారటం, సైజు చిన్నదవటం మొదలైనవి రోగం తగ్గటానికి కొన్ని ఆధారాలు.

ఎం. ఐ. ఆర్. ఆర్. బెంగుళూరు

నా వయస్సు 16 సంవత్సరములు. బలహీనముగా వుంటాను. మల విసర్జన సమయంలో పెద్ద ప్రేగు బయటకు వస్తున్నది. మలములో చీము పడుతున్నది. నోటిలో కూడా కొద్దిగా కఫం ఎప్పుడూ వస్తుంది. ఈ విధంగా 6 నెలల నుండి వుంటోంది.

దీనిని ప్రొలాప్సరెక్టం అని అంటారు. దీనికి శస్త్ర చికిత్స అవుసరం అవుతుంది.

మల విసర్జన ద్వారం ఉన్న ప్రాంతంలో కండరాల బిగుతు సడలినా, వాటి పటుత్వం తగ్గిపోయినా ఇలా జరిగే అవకాశం వుంటుంది. చిన్నపిల్లలలో అధికంగా విరోచనాలవుతున్నప్పుడు ఇలా జరిగే అవకాశం వుంది.

గుర్రపు స్వారీ మొదలైన స్థానిక వ్యాయామాల వల్ల అపరేషన్ తర్వాత కండరాల పటుత్వం వృద్ధి చెందుతుంది.

ఆర్. ఆర్. బి. హోస్పేట

నాకు చిన్నప్పటి నుంచి చెవి చీము కారుతూ వుంటుంది. ఎన్ని మందులు వాడినా ప్రయోజనం లేదు. ఇ. ఎన్. టి. స్పెషలిస్టులకి చూపించాము. టాన్సిల్స్ అపరేషన్ చేసి 1 సంవత్సరం అయింది.

మిడిల్ ఇయర్ ఇన్ఫెక్షన్ వచ్చిన వారికి ఇలా నిరంతరం చీము కారుతూ వుంటుంది. ఈ చీము మాస్టాయిడ్ అనే ఎముకభాగానికి విస్తరించకుండా చూడవలసి వుంటుంది.

చెవి భాగాన్ని ఎక్స్‌రే తీయించి వైద్యులకి చూపించ వలసి వుంటుంది. చెవిలో నుండి వచ్చే చీముని కల్చర్-సెన్సిటివిటీ టెస్టు చేయించి ఫలితం ప్రకారం యాంటీ బయాటిక్ మందులను స్థానికంగాను, ఇంజక్షన్ల రూపం గానూ తీసుకోవలసి వుంటుంది.

కె. యస్., నడిపూడి

నా వయస్సు 30 సంవత్సరములు. నాకు చిన్నప్పటి నుండి ముక్కుకు వాసన తెలియదు.

ఇ. ఎన్. టి. వైద్యులకు ముందుగా చూపించుకొని ముక్కు భాగంలో ఏ లోపమూ లేదని నిర్ణయించుకోవాలి. తర్వాత న్యూరాలజిస్టులు మెదడులో ఏ లోపమూ లేదని నిర్ణయానికి రావాలి.

పుట్టుక నుండి వాసన తెలియక పోవటం వల్ల మందుల వల్ల పెద్దగా పరిస్థితిలో మార్పు వుంటుందని నేననుకోను. దీనిని అనాస్మియా అంటారు. □

నిత్య నూతన సీరియల్

కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ



వేయిపడగలు

సుబ్బన్న పేటకు దక్షిణమున గుండేరు ప్రవహించుచున్నది. దాని వెడల్పు రెండు గజములకు మించి ఉండదు. దానికి గట్లు లేవు. అది ఎప్పుడును తొడ లోతు కన్న ఎక్కు వుండదు. అది నిజాము రాష్ట్రములో ఎచటనో పుట్టినదట. దాని పుట్టుక ఎవ్వరు ఎరుగరు. ఎక్కడో కొన్ని రేవులలో తప్ప నేలంతయు దొంగ ఊబి. అందుచేత లోతు తక్కువైనను దానిని దాటుటకు ప్రజలు భయపడుచునే ఉందురు. పదియేండ్ల కొకసారి - ఎప్పుడో తెలియదు దాని యిష్టము వచ్చినప్పుడది పొంగి వరదలు కట్టును. దాని మూలముగా సుబ్బన్న పేటనుండి బెజవాడకు పోవుటయే కష్టము. కృష్ణమ నాయుడు దానికి వంతెన కట్టించెను. ఈ ఏరు సుబ్బన్న పేటకు మైలు దూరమున ఉన్నది. ఏటి వరదలు వచ్చెనా నీరు ఊరికి నాల్గు వైపులా తనాయించును. చుట్టున నున్న పొలములన్నియు ఆ యేడు నిర్ధూమధామము. కాని పూర్వము నేలంతయు మెట్ట పొలాలైనప్పుడీ వరదలు దేశమునకు.


(గత సంచిక తరువాయి)


లాభకారులే అయ్యెను. ఒక ఏడాది గుండేరు వచ్చి ఆ ఏడునకు సస్యమంతయు పాడు చేసినను, ఒండు మట్టి అడుగెత్తున పేర్చి పోవును. తరువాత పదేండ్లదాకనో, ఆరేండ్ల దాకనో మరల వరదలు వచ్చు వరకు ఆ నేల పండినదే పంట, మిరప, జొన్న, మొక్కజొన్న, రాగులు, తవిదలు, పొగాకు, పసుపు, నీలి -సస్యమునకు బదులు ధనమే పండును. గుండేరు కోపము వచ్చిప్పుడు కొట్టినను తరువాత ఎత్తుకొని చన్నిచ్చి సముదాయించిన తల్లివలె ఆ చుట్టుపట్ల జనమునకు ప్రాణదాత్రి, అన్నదాత్రియు అయ్యెను. మాగాణి కడచిన పదేండ్లుగా ఆ చుట్టుపట్ల క్రమముగా వృద్ధి పొందెను. పదేండ్లయినది. గుండేరు పొడిచి క్రొత్త పంటల కలవాటు పడిన క్రొత్త ప్రజలకు గుండేరు పొడువు తెలియదు. సుబ్బన్న పేట చుట్టుపట్ల ఎండలు మండి పోవుచుండెను. ఒకనాడు తెల్లవారు వరకు గుండేరు పుట్టిన చోట ఎంత వర్షించెనో తెలియదు. గుండేరు వరదల మీద ఉండెను. నేడు తీయును, రేపు తీయునన్న ప్రవాహము నేటి రేపటి నిబ్బడి ముబ్బడిగా పొంగి, ఉబికి పొలాలమీద పరువెత్తెను. మొదట ఒడ్డున నున్న పైరును, పుక్కిట పట్టెను. కొంత పైరునకు తలమునక కొంత పైరునకు నడుము దాక, మరికొంతకు మూలస్పర్శ. ఇది మొదటి నాటి కథ. రెండవ నాడు దక్షిణపు పొలమంతయు పైరే కనపడలేదు. గుంపులు గుంపులై కొంగలు జలోపరిభాగమున చాళ్ళు కట్టి పరువులెత్తెను. దుబ్బులెదిగి పోరంబోకలున్న చోట్ల చుట్టుపట్ల నీరు లోతైనను అచ్చట మాత్రము నీరందుచుండుట చేత కృష్ణాజినము పరచినట్లు ఒక ధ్యానము సాగెను. చేపలు మాటి మాటికిని తలలెత్తి నిలుపీత ఈదపోయినట్లు తికమకలు పడెను. నీరు, సుబ్బన్న పేట చుట్టు పట్లనున్న పేదకొంపలకు ముట్టడి వేసెను. వారు వాకిళుల ముందు మట్టితో కట్టలు వేసికొని, తెల్లవారులు దీపములు పెట్టుకొని, గట్లు తెగిపోకుండ చూచుకొనుచుండిరి. పేటకు పడమటి వైపున ప్రవహించు కాలువకు నేటిసర్దు (వెల్లువ)

పొడిచి, పశ్చిమోత్తర దిక్కులందును వరద విజృంభించెను. వంతెన విరిగి పోయెను. బెజవాడ సుబ్బన్న పేటల మధ్య రహదారి లేదు. అంతకు మూడు నాళ్ళకు పూర్వము రంగారావు గారును, శశియు పేటకు వచ్చిరి. వారి యేటి వరదల మూలమున చెన్నపురికి సాగిపో వీలులేకుండెను. మోటారు నడువదు.

శశి పూర్వపురాణులవలె పేట సంప్రదాయముల కొరకైనను చీరకట్టవలెనని, ఘోషా సాగించవలెనని రంగారావుగారి హృదయ గుహా కుహరములోని మనస్సుదాక రాని ఒక ఊహాంకురము. దానిని ఆయన మనస్సెప్పుడును పరామర్శించలేదు. సృష్టమనస్కమే కాని దానికి స్పష్ట వాక్య మెక్కడిది? శశి కట్టు భావస్థితిని కూర్చి కూడ సందేహము లేదు. ఆమె ఒక స్వతంత్ర దేశమున పుట్టినది. అచ్చటి మరియాదలకు, అలవాటులకు పరదేశముల వారు వచ్చి భిన్నముగా నడచినచో ఆమె మనస్సు చాల బాధపడి యుండును. కాని యీ భిన్న ప్రవర్తన యిచ్చటి దేశ ప్రజలకు బాధ కలిగించునని ఆమెకు ఊహయే కలుగలేదు. కలుగవలసిన అవసరము లేదు. ఈ దేశ ప్రజలు వచ్చిన కష్టములు దైవికములని వాని నోర్పుతో సహింతురు. తమ కిష్టములేమి సూచించరు. ఒక విషయమున ఒక కార్యాచరణమున తమ కిష్టము లేమిని ప్రతిఘటించి తెలుపుట శశి పుట్టిన దేశమున ప్రధాన ధర్మము, తత్ప్రకృతులకు ప్రతిఘటించక పోవుట అంగీకారము క్రిందనే లెక్క.

వరద మూడవనాడు శశి ప్రాతఃకాలమున లేచి, దక్షిణపు దిక్కుగా పోయి అందినంత మట్టుకు జలములో తిరిగెను. ఒక పంచముని యింటి వెనుక పొంచి తుపాకితో ఒక కొంగను చంపెను. ఇద్దరు మాల కుఱ్ఱవాండ్రు పోయి చచ్చిన కొంగను తెచ్చిరి. తుపాకి మ్రోత విని తుంగల మీద, కాడిగట్టుల, నీరు లోతు లేనియెడల కూర్చున్న జలపక్షులన్నియు బెదరుకన్నులతో, నిక్కించిన మెడలతో, రెక్కలు నీటిలో గొట్టుకొని ముందునకు తూలిపోవుచు ఎగిరి, వరద లోతైన యెడలకు పరుగెత్తి, అచ్చట నిలుచుటకు నీడలేక, మరల ఒక అరగడియలో తిరిగి వచ్చి యథాస్థానము లందే కూర్చుండెను. ఆ కొంగలు తమలో తాము లెక్క చూచుకొనలేదు. చచ్చిన కొంగ జమకు రాలేదు. నీటి మీద అందందు కాజపూలు తెల్లనై పైకి కనపడుచుండెను. కొందరు మాలెత లా పూవులను కోసి తెల్లని రేకలు తుంచి, వానిని గొలుసులుగా అమర్చి కొప్పులో నుండి చెవుల వరకును శిరోలంకారములుగా అమర్చికొనిరి. ఆ అల్పికకు అయలంకార ప్రియత్వమునకు శశి చాల ముచ్చటపడెను. అనాగరికులైన యీ ప్రజలకు ఇంత రసజ్ఞత్వ మెచ్చటిదో వారి మనస్సులు సహజముగా మెత్తనివి కావలయును. కాని వారి నల్లని దేహచ్ఛాయలు వారి బుద్ధిలో మార్పు తేలేదు. ఆమె పడమట దిక్కుగా నడచెను. ఆ వైపున కొన్ని పొలములు మునిగిపోలేదు. ఎరువుతోలిన కొన్ని చోట్ల పైరు దుబ్బుకట్టి కొద్దిగా వచ్చిన నీటిని పరిహసించుచుండెను. కలువు తీయని ఆ పొలములో నమ్మపూలు పైని తేలి ఆడుచుండెను. ఆ ఉదారంగు పూలను చూచి, అది పూవో కాయయో శశికి తెలియలేదు. ఆమె ఒక పూవు వద్దకు పోయి మాల పిల్లల "నదియేమి" అని అడిగెను. ఇచ్చటనున్న యీ రెండు నెలలలో ఆమె తెలుగులో పది పదునొకండు మాటలు నేర్చినది. ఆ పిల్లలవి నమ్మ పూవు లని చెప్పి, "వాని కింద దుంపలుండును. అవి ఉడుకపెట్టి తినినచో రుచిగానుండు"నని చెప్పి, నీటిలో దిగి ఒకదోసెడు దుంపలు తెచ్చి ఆమె కిచ్చిరి. శశి రాక గూడెములకు, మిషనరీ పేటకు మహదశ పట్టినట్టున్నది. వారందరును మనసా ఊరికన్న కోటకు దగ్గర వారైరి. అందుచేత శశి అన్న వారందరకును ప్రాణమైపోయెను. ఆమె చంపిన కొంగను కోటకు తెచ్చెదనని ఒక మాలపిల్లవాడు వెంట రాగా ఆమె వానిని వారించి, జేబిరుమాలులో నమ్మదుంపలు కట్టుకొని, తుపాకి చంకను పెట్టుకొని, కొంగ ఎడమచేత పుచ్చుకొని వస్త్రములన్నియు ఒందుమట్టి కొట్టుకొని ఆమె కోటకు నడచివచ్చెను. ఏ ఆఫ్రికా దేశముననో, యూరోపియనుల తుపాకి మ్రోత శబ్దించని ఆకాశము కల యే దక్షిణపు అమెరికా మహారణ్యముల మధ్యనో నూత్నజాతులు, నూత్నాచారమును కనుగొనుటకు పోయిన సాహసుల గుంపులో నొకరుకవోలె ఆ వేషమున ఉన్న తన్ను ఆమె ఊహించు కొనెను. జనులందరు ఆమె వంక నివ్వెరపోయి చూచిరి. స్వతంత్రభావ సంస్కృతులు కాని





కొందరికి ఆమె ఎడల జుగుప్స కలిగెను. అనూహమానమతులు, అమాయకులు అగువారికి ఆమె వేషము రమణీయముగ, నూత్న భావాభిరామముగ, స్వతంత్రతా చిహ్నముగ గోచరించెను. ఆమె కోటకు వచ్చెను.

స్నానము చేసి, మంచి దుస్తులు ధరించి జమీందారుతో కలసికొనెను. అక్కడామెను గౌరవించి ఏదో మాట్లాడి చివరకు "నీవిట్లు తిరిగినచో ఈ ఊర బాగుండదు. చెన్నపురిలో మనము యథేష్టముగ ఉండవచ్చును. మఱియొక చోట ఉండవచ్చును. కాని యిచ్చట బాగుండదు' అని చెప్పెను. శశి కొంత సేపు వాదించి, "సరే! నీ కిష్టము లేనిచో చేయనులే" అని వాగ్దానమొసంగెను.

భోజనము ముందు కూర్చుండిరి, దాసీవాండ్రు కొంగను వండలేదు. ఆమె "కొంగ మాంసమేది" అని అడిగెను. అది పొలము కొంగ కొక్కిరాయి, దానిని నీచజాతులు తిందురుగాని రాజులు తినర"ని చెప్పిరి. ఆమె మరొకప్పుడైనచో నవ్వెడిదే

ఇంతకుముందే రంగారావు కొంత యీ విషయము ప్రస్తావన చేయుట వలన ఊరకున్నది. మరల నమ్మదుంపల కొరకడిగెను. దానికి సమాధానము రాలేదు. పరిచారకులకు అదే సమాధానము మరల చెప్పుటకు జంకి ఊరకుండిరి.

వరద నాల్గు రోజులకు తీసెను. నీరు మాత్రము విజృంభించియే ప్రవహించుచుండెను. తరువాత వారము రోజులకే తన పరిమాణమును తాను పొందెను. రంగారావుగారికి పేటలో ఇన్నాళ్ళు కదలకుండుట సుఖ హేతువుగా లేదు. శశిని ప్రతిదినమును మేడ పై భాగమునందే కూర్చుండి జలావృతమైన ధరణీశోభ తిలకించు చుండెను. ఏరుతీసినను దారి అంతయు బురద అయ్యెను. రాతి బాటపై అడుగెత్తున ఒండు పేరుకొని రోడ్డు కొరకు దారి త్రవ్వవలసి ఉండెను. ఆ రోడ్డు జమీందారు గారిదే. దానిని మరల బాగు చేయుటకు ప్రయత్నము లారంభింపబడెను.

ధర్మారావు ప్రతిదినము హరప్పనాయనికి చదువు చెప్పుటకు కోటలోనికి వచ్చుచుండెను, పోవుచుండెను. ఒక్కనాడైన అతనికిని రంగారావునకును సమావేశము జరుగలేదు. సెప్టెంబరు మొదటి తారీఖున ఈట్సను గారు మోటారు మీద వచ్చి, రంగారావు గారిని కలిసికొని రెండు నెలల జీతము రెండు వేల నాలుగు వందలు పుచ్చుకొనిరి. ఆయన హరప్పను పలుకరించి, హస్తస్పర్శ చేసి సెలవు తీసికొనెను. హరప్పనాయనికి ధర్మారావు జీతము జ్ఞాపకము వచ్చెను. నాయనగారితో చెప్పవలయు ననికొన్నాడు. ఇప్పుడే వేడిలో వేడి ధర్మారావు గారికి కూడ అతని రెండు వేల నాలుగు వందలు అతని కిచ్చినచో బాగుండును అనుకొన్నాడు. కాని తండ్రి వద్ద కొడుకునకు మిక్కిలి పరిచయము లేదు ఒకవేళ పోయి కలిసి కొందమన్నను శశిని అతనికి నిత్య సమీపవర్తిని, శశియన్నచో హరప్పనాయనికి చాల విచిత్రముగా ఉండును. అతని ఆ భావము జుగుప్సయో, యీర్ష్యయో, భయమో, ప్రేమయో ఏదియు గాదో ఏమియు తెలియదు. గణాచారిని చూచి పసిరిక వలె శశినిని చూచి హరప్ప పారిపోవును. కాని పసిరిక యందు గణాచారి ఊహ ఎట్టిదో, హరప్ప యందు శశిని ఊహ అట్టిదవునో కాదో.

హరప్ప బక్కపలుచనివాడు. అర్భకాకారి. పదియేండ్ల వాడు ఎనిమిదేండ్ల వానివలె

వేయి పడగలు

ఉండును. తండ్రి కాఫీలు పోసి పెంచెను. ఇతర దేశముల నుండి వచ్చు డబ్బా పాలతో పెంచెను. కృష్ణమనాయడు చనిపోయినప్పటి నుండియు పిల్లవానిని మోటారు మీదనే త్రిప్పిరి. ఆ వంశమున నాయనలందరు ఆరేండ్ల నాటికే గుర్రపుస్వారి చేసిరి. గుజ్జయిన గుర్ర మొకటున్నది. దాని మీద రంగారావు గారే ఆరేండ్ల నాడు స్వారీ చేసెను. ఆ స్వారి హరప్ప ఎరుగడు. హరప్ప సహజముగా ఉద్విగ్నమైన ప్రకృతి గలవాడు మనో లక్షణములన్నియు తాతగారివి. ఆయన రసజ్ఞత ఆయన ఉదారత, ఆయన వివేచనాశక్తి కుర్రవాని యందుండును. ఆయన శరీర పుష్టిలేదు. ఏదో బలహీనపు గాలి మనదేశము మీదికి విసరెను. ఆజానుబాహువులై, విశాల వక్షులై, ఏనుగు తొండము వంటి విరువగల జాతికి, గుజ్జులై, బక్కపలుచనై, తెల్లవారి లేచినంతనే ఏదియో ఆహారము లేకపోయినచో తపతపలాడిపోవు జనులు పుట్టిరి. హరప్ప మనో వైశాల్యమునకు తగినంత శరీరదార్ఢ్యము లేక, మన శ్శరీరముల మధ్య విసంధి కలిగెను. మనస్సు సముద్రమువలె విస్తారమైనది. శరీరము కాలువ వలె గట్టులదుముకొన్నది. అంత నీరు వడబోసికొని యీ కాలువ గట్టులు పొర్లిపోవును. తెపకలు కొట్టుకొని వడ్లు కోసికొని పోవును. హరప్పశరీరమంతయు వణకిపోవును. చూచిన వారు "పిల్లవాడు బలహీను" డందురు. అది మనస్సు మహాబలవంత మగుటచేత వచ్చిన దోసము. ఈ రహస్య మెవ్వరికిని తెలియదు.

మరునాడు రంగారావుగారు మేడపై సావడిలో ఒంటరిగా తిరుగుచుండిరి. శశిని సౌధాగ్రభాగమున ఉండి కట్టబడుచున్న వంతెన వద్ద జనులు గుంపులు కూడి యుండుట, వారు చీమల బారుల వలె కనబడుట, దారి అంతయు ఒండు త్రవ్వబడి ప్రక్కను పోయుటచేత పాడు పడిన పొలములు తుంగ పెరిగి పచ్చనై ఆ బాట తీసిన పాపట వలె సుమనోహరముగా ఉండుట ఈ శోభ నామె తిలకించుచుండెను. అందుచేత రంగారావున కేకాంతము లభించెను. అది మధ్యాహ్నము హరప్ప తండ్రి ఒంటరిగా ఉండెనని రంగన్న ద్వారా తెలిసికొని, తండ్రికి కబురంపించి తాను దర్శనము చేయబోయెను. రంగారావుగారు కుమారుని ప్రక్కనున్న సోఫా మీద గూర్చుండ నియమించి "బాగుగా జదువుకొనుచున్నారా" అని అడిగిరి. వారు "చిత్త" మనిరి. "ఏమి పని మీద వచ్చితి"రని తండ్రి ప్రశ్నించెను. కుమారుడు మాట్లాడలేదు చెప్పుద మనుకొనినీ ఆయన నోటికి మాట రాలేదు. మరల కొంచెము సేపుండి తండ్రి "ధర్మారావు వచ్చు చున్నాడా" అని అడిగెను. హరప్ప మనస్సు "ధర్మారావుగా" రనునందుకు రేఖా మాత్రము కదలెను. అతడు "చిత్త" మని మరికొంత సేపాగి, "వారి జీ..." అని ఆగెను. రంగారావుగారు కొంత సేపూరకుండి జీతమేమి యీయవలయు ననిరి. హరప్పనాయని కీప్రశ్న అర్థము కాలేదు. మరల రంగారావుగారు "నెలకు పదునేను రూకలు చాలునా?" అనిరి. వంగి కూర్చున్న హరప్ప శరీరోర్ధ్వ భాగమును దీర్ఘీకరించి, మొగమెత్తి, ఎత్తిన మొగమంతయు లజ్జ, కోపము, విస్మయము నైపోయెను. ఎక్కువ భాగమం దర్థముకాక పోవుటయే తోచెను. తండ్రి కొడుకు వంకనే చూచుటలేదు. నిముసమైన తరువాత హరప్ప యథాస్థితికి వచ్చెను. తండ్రి హరప్ప వంక అప్పుడు చూచెను. "సరే రెండు నెలలకు కలిపి ముప్పదియు ఇమ్మని ఖజానాదారునకు కబురంపించు" మని రంగారావుగారు చెప్పి తాము సౌధోపరిభాగమునకు పోయిరి. హరప్ప కూర్చున్న వాడు కూర్చున్న వాడల్ల క్రుంగిపోయి కనుగొలుకులకు వచ్చిన నీరు నెమరు కణతలవెనుకదాక అదిమి, ఎద పగిలిపోవునేమో అని గుండెపై చేయాచి పట్టుకొని తలవంచి కూర్చుండెను. భావనకన్న శూన్యతయే అతని మనస్సున తాండవించెను. పసిగుండె ఓర్చుకొనలేక పోయెను. పసి మనస్సు భావ వైశాల్యమును ఇముడ్చుకొనలేక పోయెను. ఒక గడియలో హరప్ప నిదురపోవు చుండెను. ఎవరును నిద్ర మేల్కొలుప లేదు. సాయంకాల మగుసరికి తనంత తానే లేచి నెమ్మదిగా మెట్లు దిగి వచ్చి తన గదిలో తాను కూర్చుండెను.

ధర్మారావునకును హరప్పనాయనికి మిక్కిలి పరిచయ మేర్పడెను. చదువు చెప్పుటకే కాక, ఊరకయు ఇదివరకే ధర్మారావు రెండు మూడు సార్లు వచ్చెను. ఈ నాడు సాయంకాలమున మరల వచ్చెను. హరప్ప మనస్సు గుండేరు పొంగి పొలము లన్నియు తుడిచి వేసిన తరువాత బీడు వడ్డ మాగాని ఎట్లుండునో అట్లుండెను. ధర్మారావు రాక మరల ఎచట నుండియో తెచ్చిన నారూడ్చినట్లు అకాలపు పసిమి కనిపించెను. ధర్మారావు వచ్చినంతనే హరప్ప లేచి నిలుచుండును. ధర్మారావు కూర్చున్న తరువాత హరప్ప వచ్చినచో, ధర్మారావును లేచి నిలుచుండును. పది యేండ్ల పసివాడు, తల్లి చనిపోయిన వాడు, తండ్రి కంత సమాదరణీయుడు కానివాడు హరప్పనెట్లు చూచినను చూడవచ్చును. కాని ధర్మారావునకు హరప్ప – వీరప్ప నాయడు నాగన్ననాయడు హరిహరనాయడు, గోపాలస్వామి నాయడు హరప్పనాయడు, కృష్ణమనాయడు – వీరి రక్త

జరిగిన కథ –23 :రంగారావుగారు భార్య మరణించిన తరవాత కొడుకు హరప్పనాయని సుబ్బన్నపేటలోనే వదలి మదరాసు వెళ్ళిపోతారు. తల్లి చెప్పిన మాటల వలన ఒకనాడు ధర్మారావును చూచి హరప్పనాయడు తనకు చదువు చెప్పమని అడుగుతాడు. ధర్మారావు హరప్పనాయని కారణంగా కోటలోనికి వెడుతూ ఉంటాడు. రంగారావుగారు ఈట్సన్ అనే ఒక దొరను హరప్పనాయనికి ఆంగ్లము బోధించుటకు ఏర్పాటు చేస్తారు. రంగారావుగారు ఇంగ్లాండు పోయి ఒక దొరసానిని తెచ్చి ఆమెను పెండ్లి చేసుకుంటారు. ఆమె సుసానీ అనే తన పేరును శశిని అని మార్చుకొంటుంది. పురపాలక సంఘము వారు ప్రజలపై 30 సంవత్సరాల వరకు సాగే పన్నును విధిస్తారు. ప్రజలందరూ ఈ విషయంలో వ్యతిరేకిస్తారు. పన్నులు పెరుగుతాయి. పురపాలక సంఘంలో పదవులు దొరికిన వారందరూ ఎంతో సంతోషిస్తారు.


బిందువులు నివసించు తేజోలేశముగనే కన్పించును. ఉప్పునిన కొట్టుకొని పోవునంత యీ బలశాలి శత్రుశిరఃకలిత కోటీరమణులు కత్తి పదునుతో రాచిన జోదుల బిడ్డగా భాసించెను. ఈ పరిత్యక్త జీవి పరిదీనముఖు డయ్యెను, పూర్వాంధ్రదేశ పరిపాలనాధిశున రాజవర్చస్విగా గోచరించును. అతడతని చూచినపుడు సుమంత్రునకు రామచంద్రుడు కనిపించినట్లే ఉండును. హరప్పకు ధర్మారావును చూచినపుడెల్ల ఆనందముగా ఉండును. ఆ ఆనంద మెట్టిదో అతడు విమర్శించుకొనలేదు. విమర్శించు కొనుటకు పరిచయము చాలదు. ఆయువు చాలదు. కాలము గడవవలయును.

కొంత సేపు కూర్చున్న తరువాత అనలేక అనలేక "తమకు జీతమెంత కావలయును అని హరప్ప అడిగెను. ధర్మారావు తన కేమియు అక్కరలేదని, తన వంశమునకు వారి వంశమునకు కల సంబంధము కథగా హరప్పతో చెప్పెను. హరప్ప మనస్సులో ధర్మారావు చెప్పిన కథ అంతయు స్వర్ణకథవలె తోచెను. ధర్మారావు చివరకు "మీరు వేణుగోపాలస్వామికి ధర్మకర్తలు. మీరా ధర్మకర్తలుగ ఉండినచో నా కది యిచ్చినట్లే. నేను బి. ఏ. పరీక్ష యిచ్చితిని. ఎచ్చటనైనను నలుబది రూపాయల జీతము తెచ్చుకొనగలను" అని అనెను. హరప్ప "అంతేనా" అనెను. "రోజంతయు చెప్పిన నెలకు నలుబది రూపాయలేనా? నాకు మా దొరగారు రోజునకు గంటయైన చెప్పరు. చాల భాగము నా కావస్తువులు ఈ వస్తువులు చూపించుట తోడనే కడవును. ఆయనకు నెలకు పన్నెండు వందల రూపాయల జీతమిచ్చుచున్నాము కదా! రోజెల్ల చెప్పినందులకు మీకంతయైన ఈయరా?" అనెను. ధర్మారావు నవ్వి "తమరికి చిన్నతనము, పెద్దలయిన తరువాత తెలియును అనెను.

తరువాత మరల ధర్మారావు జీతమును గురించి ప్రస్తావన రాలేదు హరప్ప అతనితో సంభాషణ మాత్రమే చేయును. ధర్మారావు బలవంతముగా చదువు చెప్పును. హరప్ప నానాటికి పరమకుశాగ్ర బుద్ధి వలె కన్పించెను. తరువాత నెలనాళ్ళకు ఈట్సన్ దొరగారు హరప్పను పట్టి మందమతి అనుకొనెను. ధర్మారావు హరప్పను మహా మేధావి అనుకొనెను. హరప్ప దొరను, జీతగాడనుకొనెను, ఉపాధ్యాయు డనుకొనెను, ధర్మారావును మిత్రు డనుకొనెను, మహా దారుడనుకొనెను.

వంతెన మరల కట్టబడి శశీ రంగారావులు చెన్నపురికి చేరిరి. గుడివాడ సీమ నుండి క్రొత్త నారు తెచ్చి, బీడు పడ్డ పొలాలు మరలదమ్ము చేసి ఊడ్చిరి. ఆ పైరును మూర్ఖుడైన ధనవంతుడు పెండ్లి పీటల మీద వలె వెలవెలపోయెను అది పండిననాడు, గల్లాకుంచాలతో గొలిచిననాడు.

పురపాలక సంఘసభ మరల సమావేశమయ్యెను. రయితుల పక్షపు సభ్యుడు "పైరంతయు యథాయథ లయ్యెను. ఈ సంవత్సరమున మట్టి ప్రోగు చేసి కొనవలసినదే! ఈ ఏటి పన్ను కూడ ముందు నాటికే



ప్రారంభం

జ్యోస్యులు గారి దగ్గరి నుంచి తిరిగి వస్తూనే మా నాయనగారు, "ఒరేయ్ వేంకటేశ్వర్లూ" అని కేక వేశాడట...

మా నాయనగారు వాళ్ళు ముగ్గురన్నదమ్ములు, ఇద్దరప్పచెల్లెళ్ళు. రాజ్యలక్ష్మమ్మ గారు అందరిలో కీ పెద్దది. "అమ్మన మంచి" వారి కోడలు. ఆవిడంటే మా కందరికీ హడల్!! ఇంతటి మహా పన్యాసకుడు, మా నాయనగారే ఆవిడ ముందు నోరెత్తే వాడు కాదు.

"చెలియలికట్ట" నవలలోని సరస్వతమ్మ పాత్ర ఆవిడే!! సంస్కారం గల యింటి, పెద్ద ఆడపడచుకి – యింట్లో ఎంత మర్యాద ఎంత గౌరవం ఉంటాయనేవి ఆవిడ నుంచి గ్రహించి – రామాయణ కల్పవృక్షంలో రాముడి అప్పగారైన "శాంత" పాత్రను చాలా భాగం తీర్చి దిద్దాడు మా నాయనగారు. ఆవిడను గురించి వ్రాయాలంటే అది వేరే పెద్ద గ్రంథం. ఒదిలి పెడదాం ఆవిడ తరువాత మరొక అప్పగారు అచ్చమ్మ (అచ్యుతలక్ష్మి) గారనే ఆవిడ పుట్టి, కొంత కాలం పెరిగి, చిన్నతనంలోనే పోయింది. (ఈవిడతో మొత్తం ఆరుగురు.)

మా నాయనగారు మూడవ కాన్పు.

ఆయన తర్వాత మా చిన్న మేనత్త "మహాలక్ష్మమ్మ" గారు. ఈవిడ "గుంటూరు" వారి కోడలు.

ఈవిడ తర్వాత మా పెద్ద బాబాయి వేంకటేశ్వర్లు గారు. ఈయన గురించి రామాయణ కల్పవృక్షంలో మా నాయనగారు–

"అతని వ్రాసిన వ్రాతల క్రొమ్ముత్తియముల సేతల్"

"....." మరి నా కవనం బిడెల్లధీ
శౌండదు తత్పరీక్షబడి సంకున బోసిన
తీర్థమై చనున్" అని అన్నారు. అంతటి వాడాయన!

ఆయన తరువాత మా చిన్నబాబాయి రామమూర్తిగారు. ఈయన గురించి– ".... చిన తమ్ముడు సన్మతి రామూర్తి చిత్తమ్మున నేను వాని కొక దైవముగా కనిపింతు నెంతయున్" అని అన్నాడు. విష్ణు భక్తుల పరంపరలో "ప్రహ్లాద నారద పరాశర పుండరీక వ్యాసాది" అంటూ ప్రహ్లాదుని పేరు ఎలా ముందు చెప్తారో, అలా మా నాయన గారి శిష్య పరంపరలో ఈయన పేరు మొదట చెప్పాలి...

అన్నదమ్ములు ముగ్గురూ ఆ నాటికి ఉమ్మడి కుటుంబంగా, బందరు బచ్చుపేటలో ని స్వగృహంలో కలిసే ఉన్నారు. మా నాయన గారు ఇంటికి వస్తూనే "ఒరేయ్ వేంకటేశ్వర్లూ" అని కేక వేసింది ఆ మా పెద్ద బాబాయినే "ఏమిటన్నయ్యా?" అంటూ ఆయన బయట కొచ్చారు. "రేపు నవల మొదలు పెడుతున్నాం" నవల పేరు వేయి పడగలు. తొమ్మిది వందల తొంభై తొమ్మిది పేజీలు వ్రాయమన్నాడు జ్యోస్యులు గారు" అన్నాడట మా నాయనగారు.

మర్నాటి నుంచి వ్యాస విఘ్నేశ్వరు లల్లే తిక్కన గురునాథులల్లే వారిద్దరూ సాగించిన ఆ "తెలుగు వాడి మహాభారతం" ఇరవై తొమ్మిది రోజుల్లో పూర్తి అయింది.

(ఇంకా ఉంది)

–విశ్వనాథ పావని శాస్త్రి

వేయి పడగలు

వసూలు చేయవలయు"నని తీర్మానము పెట్టెను. రాచరికపు సభ్యులు కాదని వాదించిరి. "మొదటి ఏటనే వాయిదా తీర్చక పోయినచో రాచరికము వారికి మన మీద విశ్వాసము కుదరదు. ఎట్లో అట్లిచ్చియే తీరవలెను అనిరి కాని వోటుకు పెట్టగా ప్రజాపక్షమే గెలిచెను. గ్రామమంతయు సంతోషించెను.

చంద్రారెడ్డికి సభాధ్యక్షుడుగా తాననుకొనినంత స్వతంత్రుడు గాదని తెలిసెను. ఎలయనగా ఒక కమీషనరీ సభ్యుడు తాను ప్రజాభిప్రాయమునకు వ్యతిరేకముగా వాదించినను ఓటు మాత్రము ప్రజానుకూలముగానే యిత్తుననియు, చంద్రారెడ్డి గారిని కూడ యిట్లే యిమ్మనియు చెప్పెను. చంద్రారెడ్డి "నాకు నీ హితము చెప్పుట ఎందుకు? నేనెట్లును ప్రజ కనుకూలముగానే యిత్తును అనెను. మిషనరీ "మిమ్ము రాచరికమువా రేర్పాటు చేసిరి. మీరు వారి యందే గౌరవమును చూపవలయును. వారు చెప్పినట్లే నడువవలయును" ఆ అనుటలో తాన రాచరికము వారికి లొంగియే ఉండవలయు ననుట ధ్రువపడెను.

పసిరికకు పదునారేండ్లు అతడదివరకెన్నడును జ్వరున చీది ఎరుగడు. వరద వచ్చినన వతనికి జ్వరము వచ్చెను. మంగ డాక్టరును తీసికొని వచ్చెను. డాక్టరు చేయి చూచి సీసా ఒకటి పుచ్చుకుని ఆసుపత్రికి రమ్మని మంగతో చెప్పి తాను పోయెను. మంగ వెళ్ళి మందు తెచ్చెను. పసిరికను త్రాగుమనెను. పసిరిక మందు పారబోసి చిర్రుబుస్సు లాడెను. కొడుకు పుట్టినప్పటి నుండి పాము భయ మెరుగని మంగ కది మొదలు పసిరిక జ్వరము తగ్గు వరకు పామన్నచో భయము పుట్టెను. మందు లేకుండగనే పది రోజులలో జ్వరము తగ్గెను. తగ్గెను కాని పసిరిక బలిసెను. జ్వరము వచ్చిన చిక్కిపోదురు. పసిరిక బలిసెను. అతనికి పూర్వము శరీర రేఖలు కనపడెడివికావు. అవురుగడ్డి కాడ నడచుచున్నట్లుండెడివాడు. ఇప్పుడతడు నడచు వేళ పచ్చివాసము నడచుచున్నట్లుండెను. బలమో, దొందమో! మనిసి నిలచి నడచుచుండెను.

ధర్మారావు కోటకు వచ్చెను. హరప్పయు అతడును కలసి సాయంవాహ్యాళికి పోయిరి. తక్కిన రాజబంధువుల కిది యిష్టము లేదు. కాసావాంధ్రకు ఇష్టము లేదు. కాని శశిని రాక మొదలెల్లరకును ఆచారముల యందు సడలుట కొద్దిగా అలవాటయ్యెను అందుచే వారి సాయంవాహ్యాళి ఎవరి మనస్సు నుండియు బయటకు రాలేదు.

హర : మనస్వామిని నేనెన్నడును చూడలేదు. ఆయన ఎట్లుండును? కాదు కాదు – చూచితిని. మా అమ్మగారి వెంట ఒకసారి పోయి చూచితిని. మా తాతగారి వలె ఉండును.

ధర్మా, పూర్వము స్వామికి ప్రతి సంవత్సరమును కల్యాణములు జరిగెడివి. కృష్ణమనాయడు గారు బ్రతికియుండగా చివరి నాలుగేండ్లు కళ్యాణములు చేయలేదు. ఐదవ యేట వారు చేయించవలయును అనుకొనిరి. వైశాఖ మాసములో కల్యాణము. వారు మాఘ మాసములోనే పోయిరి.

హర : నేను పెద్దవాడనైన తరువాత మరల చేయించెదను.

ధర్మారావునకు హరప్పను ముద్దాడవలె ననిపించినది. అతని ఒడలిలో రాచనెత్తురున్నది. అతనిని తాను స్పృశించరాదు. కనుక మనసులోనే ముద్దాడెను.

ధర్మా : నేను నాలుగైదు రోజు లూరిలో ఉండను. కృష్ణా పుష్కరములు వచ్చినవి. బెజవాడకు పోయి పుష్కరములు పెట్టుకొని రావలయును. సెల విప్పించవలయును.

హర : పుష్కరములు పెట్టుటనగా ఏమి?

ధర్మా : బృహస్పతి పన్నెండు సంవత్సరముల కొకసారిగా ఒకానొక నదీ జలమును సమాకర్షించును. తత్ఫలయోగము చేత ఆ నదీ జలమునందితర సమయముల యందు లేని శక్తులుద్భ విల్లును.

సర్వదేవత లా జలము నందు సన్నిహితులై ఉందురు. ఆ సమయము పితృదేవతలకు తర్పణాదికములు వదలినచో అది ఎక్కువ ఫలమునిచ్చును. మా నాయన గారు చనిపోయిరి కనుక, నే నాయనకు పుష్కరములు పెట్ట వలయును. హర : మా అమ్మగారు చనిపోయిరి కదా! నేను పెట్టవలయునా? అయినచో నేను కూడ వత్తును.

దర్మా : మీ నాయనగారు కర్మల మీద నమ్మకము లేనివారు. మీ రట్లు చేసినచో వారికి కోపము వచ్చునేమో పైగా నేను మీ చేత నా యిష్టము వచ్చినట్లు చేయించుచుంటినని అనుకొన వచ్చును. అదియు గాక రాణిగార్లకు మాసికములే లేవు పదునేను రోజుల కర్మయే జరుగలేదు. శాస్త్ర ప్రకారమైనచో తమకు అశౌచమే వదల లేదు. మీ రీ సమయమున పుష్కరములు పెట్టరాదు.

హర : అయినచో నే నిప్పుడేమి చేయవలయును?

ధర్మా : ముందు కర్మ చేయవలయును. చనిపోయిన వారు ప్రేతము లగుదురు. అనగా అది ఒక ఆకారము. మనకు కనపడదు. వారు నల్లని గుజ్జుగూపులై ఆ శరీరములలో ఉండలేక చాల బాధపడుచు పుత్రులు తిలోదకములు వదలి తమ కా రూపము తీసివేయుదురని ఎదురు చూచుచుందురు. మనము కర్మ చేయనిచో ప్రేతత్వ విముక్తి లేక వారు గాలిలో భూతములై అల్లాడుచుందురు.

హర : నన్ను మా దొరగా రేదియో అడిగిరి. ఇంత విస్పష్టముగా కాక పోయినను చచ్చిపోయిన వారిని గురించి ఆయనతో నేనేదో చెప్పితిని. మే మీ రీతిగా నమ్మెదమంటిని. ఆయన "ఇవన్నియు పిచ్చి ఊహలు బ్రాహ్మణులు ధనము తీసికొనుట కివి ఏర్పరచిరి. చచ్చిన వారు ప్రేతములై ఉందురని మనకెట్లు తెలియును?" అని అన్నారు. అవును. చచ్చిన వారిట్లుందురని మన మెట్లు చెప్పగలము? ఉండిరో, లేరో?


ధర్మా : బాబుగారూ! అట్లు గాదు. అట్లయిన ప్రతి మతములోనను ప్రత్యక్షము కానివి చాల ఉండును. అప్పుడే మతములోనను దేనిని నమ్మ నక్కరలేదు. ఒక దొకదానిని విశ్వసించినచో మరొక డింకొకదానిని విశ్వసించును. చనిపోయిన జీవాత్మలన్నిటిని ఏసుక్రీస్తు ఎప్పుడో భవిష్యత్కాలమున మరల లేవదీయునని క్రైస్తవులు విశ్వసింతురు. అట్లే మరెన్నియో విషయములను విశ్వసింతురు. మన పూర్వుల్లు చెప్పిన వానిని మనము విశ్వసింతుము.

మరునాడు ధర్మారావు బెజవాడ పోయెను. పుష్కరములు పెట్టెను. పెట్టిన మరునాడు సూర్యపతియు, ధర్మారావును కలసి ఊరి వెంట తిరుగుచుండగా సూర్యపతి ఎరిగిన ఒక పెద్దమనిషి కనపడెను. ఆయన పేరు పశుపతి. పశుపతికి సూర్యవతి ధర్మారావును చూపించి "యీయనేనండి ధర్మారా"వని చెప్పెను. పశుపతి నమస్కారము చేసి "అయ్యా! తమ పేరు వినుటయే కాని చూచినది లేదు. మీ కవిత్వము పత్రికలలో చూచుచునే ఉన్నాను. మీ రచన నాకు చాల బాగుండును అనెను.

రాత్రి పదువరకను ముప్పురును కలసియే తిరిగిరి. పశుపతి ధర్మారావు లిర్వురును ఏదో ఫలాహారము చేసి ఆ రాత్రికి భోజనము మానివేసిరి. ముప్పురును సూర్యపతి మేడ మీద శయనించిరి. నాటక ప్రదర్శనలు, కవిత్వము – కాలమంతయు వీని విమర్శతోడనే సరిపోయినది. రాత్రి నిద్రపోవు వేళకు పశుపతి ధర్మారావుతో "నీ వింక నిద్రపొమ్ము. నాకు నిద్ర వచ్చుచున్న"దనెను. అని, వెంటనే "క్షమించవలెను, క్షమించవలెను. నోరుజారి "నీ" వని వచ్చినది" అని అనగా ధర్మారావు "కాదు, కాదు, మన మిద్దరము ఇంక నీవనియే అనుకొనవలయును" అని మిగిలిన నాలుగు మాటలును తాను "నీ" వనుచునే ఆడెను. ఇద్దరును నిద్రించిరి. మరునాడు మేల్కొనిరి. ధర్మారావు ఒడిలో పశుపతి కూర్చుండి "యింక నిద్రలే" అనుచుండగా, ధర్మారావునకు మెలుకు వచ్చి మేల్కొలుపుచున్నది సూర్యపతి అనుకొనెను. కన్నులు తెరచి పశుపతిని చూచి కౌగలించుకొనెను. పశుపతి కిరువది రెండేడ్ల వయస్సు. ధర్మారావున కిరువది నాలుగేండ్లు వారి యీ తొలి కౌగిలింత పురానుభూతమై పాతిక యేండ్ల వ్యవధి గలిగిన దాని వలె పునఃప్రాప్తిలో వ్యవధిగత మహాశా పరిపూర్తికృత సౌఖ్యమంతయు సాంద్రముగా గోచరించినది, కౌగిలి వదలి ఆబాల్య మిత్రుల వలె వారొకరి వంక నొకరు చూచుకొనిరి. మరునిముసము నుండి వారి పరస్పర పవర్తనలో క్రొత్తదనము గాని, తద్గత భావము గాని, తత్కృతి గాని లేకుండపోయెను. ఆ సాయంకాలమున పశుపతి ధర్మారావును ఊరు రమ్మని అడిగెను. అతడంగీకరిచెను.


(ఇంకా ఉంది)

నమ్మకానికి ప్రతీకయైన ప్రసిద్ధ సామర్థ్యం.



క్రికెట్ తార దిలీప్ వెంగ్‌సర్కార్. ఇంతవరకూ ఎప్పుడూ మిమ్మలను నిరాశ పర్చలేదు.

ఈ సీజన్‌లో వీరి నుంచి అద్భుతమైన ఆటను ఆశించవచ్చు. విజ్డన్‌వారి విశ్వపు ఐదుగురు 'క్రికెట్ ఆఫ్ ది ఇయర్'లో వీరికి స్థానాన్ని అందింపజేసింది వీరి ఆటలోని విశ్వసనీయ సహజశైలి. డెలాయిట్స్ కంప్యూటర్ కూడా వీరికి విశ్వపు నంబర్ 1 బ్యాట్స్‌మ్యాన్ అనే గౌరవాన్నిచ్చింది. అయితే ఈ ప్రకటన మరో నిత్య విజేత తార గురించి. క్రాంప్టన్ గ్రీవ్స్ కలర్ టెలివిజన్. ఆధునికమైన, అత్యంత అధునాతనమైన సాంకేతిక విజ్ఞానంతో నిర్మించబడ్డ టీ.వీ. ఎంతో ప్రత్యేకమైన ఈ టీ.వీ.ని సొంతం చేసుకుని తీరాలనిపించే అనేకానేక విశిష్టతలతో.



అన్నిటినీ మించి మరో విశేషం ! క్రాంప్టన్ గ్రీవ్స్ టీ.వీ. 12 నెలల పరిపూర్ణమైన బీమాతో వస్తుంది– అది మీ టీ.వీ.లో అన్నింటికన్న ఖరీదైన భాగం పిక్చర్ ట్యూబ్‌కి కూడా వర్తిస్తుంది. ఇంకా, అమ్మకాల తర్వాత కొందరే అలా ఇవ్వగల సేవా సౌకర్యం. గుర్తుంచుకోండి. ఇది క్రాంప్టన్ గ్రీవ్స్ టీ.వీ. ఇక క్రాంప్టన్ గ్రీవ్స్ ఏళ్ళ తరబడి గడించుకున్న తమ ఖ్యాతిని నిలుపుకునేందుకు ఎంతటికైనా వెనుకాడదని మరువకండి.

Crompton Greaves

క్రాంప్టన్ గ్రీవ్స్ టీవీ

ఎందుకంటే కొన్ని వస్తువులు ఆనందాన్నిస్తూనే వుంటాయి ఏళ్ళకేళ్ళు.

కన్స్యూమర్ ఎలెక్ట్రానిక్స్ & హౌస్‌హోల్డ్ అప్లయన్సెస్

బ్రాంచ్: శ్రీనిధి కాంప్లెక్స్, 86, సరోజినీ దేవి రోడ్, సికింద్రాబాద్-500 003.

Enterprise/CGL/

అద్భుత శిల్ప కళా నిలయం చంద్రాదిత్యేశ్వర ఆలయం

విశాఖపట్నం నుండి పర్వత శ్రేణుల మీదుగా, 54 టన్నల్స్‌లో గుండా ప్రాకుతూ కొండచిలువలాగ దూసుకు పోయే రైలులో 324 కి. మీ. ప్రయాణిస్తే బస్తర్ జిల్లా రాజధాని అయిన జగదల్‌పూర్ వస్తుంది. అక్కడ నుండి 96 కిలో మీటర్లు పశ్చిమంగా ప్రయాణిస్తే బార్‌సూర్ అనే కుగ్రామం వస్తుంది.

బార్‌సూర్ క్రీ. శ. 11వ శతాబ్ది మొదలులో నాగవంశీయుల రాజ ధానిగా దేదీప్యమానంగ వెలిగిన పట్టణం. నల, గంగ, నాగ, చాళుక్య, కాకతీయ వంశీయులు ఈ ప్రాంతాన్ని పరిపాలించినట్లు శాసనాలు తెలుపు తున్నాయి. నాగులలో కాశ్యప గోత్రీయులయిన ఛిద్రక కులజులు బార్‌సూర్‌ని శాసించారు. వీరిని 'ఛిద్రక నాగులు' అని కూడా అంటారు. ఆ కాలంలో ఈ ప్రాంతాన్ని చక్రకూట్ లేక భ్రమరకూట్ మండల్ అనేవారు. శావకసంయుక్త వ్యాఘ్రం, సర్పంతో కూడిన ధ్వజం కలిగిన నాగులు శివుని ఆరాధిస్తే, ధనుస్సు, వ్యాఘ్రం, కమలం, కదళీపత్ర చిహ్న యుక్త ధ్వజీయులు విష్ణుభక్తులయ్యారు. ఫలితంగ అనేక శివాలయాలు, వైష్ణవాలయాలు వెలిశాయి.

క్రీ. శ. 1060లో జగదేక భూషణుని సామంత రాజు మహామండలేశ్వరుడు చంద్రాదిత్యుడు బార్‌సూర్‌లో అపూర్వ శిల్ప కళా వైభవంతో విలసిల్లే ఒక శివాలయం చంద్రాదిత్యేశ్వర మందిర్ అనే పేరుతో నిర్మించాడు. ఆలయం వెనుక భాగంలో చంద్రాదిత్యేశ్వర తటాకం త్రవ్వించాడు.

ఆలయ రూపు రేఖలు

ఈ ఆలయం ఒరిస్సా శైలిలో నిర్మించబడింది. చతుష్కోణాలలో నిర్మించిన మండపం, విశాలమైన సుఖనాశి తర్వాత గర్భగృహం ఉన్నాయి. గర్భగృహం షట్కోణాకృతిలో ఉంటుంది. ఆలయంపై అనేక శిల్పాలు గూళ్ళలో బిగించ బడిఉన్నాయి. శిఖరం కూలి, కుడిభాగం కూడా ధ్వంసం కాగా మిగిలిన – మిథున శిల్పాలు, నాయికలు, కాముక తరుణులు, దిక్పాలకులు, సపక్ష సింహము, బ్రహ్మ, నృసింహ మొదలయిన శిల్పాలు యాత్రికులు దర్శిస్తారు.

అపురూప శిల్పాలు

చంద్రాదిత్యేశ్వర మందిరం లోపలి మండపంలో, గర్భ గృహంలో శతాధిక శిల్పాలున్నాయి. బార్‌సూర్ ప్రాంతంలో శిథిల ఆలయాల అవశేషాల నుండి తెచ్చిన శిల్పాలు, భూమి త్రవ్వకాలలో బయల్పడిన శిల్పాలు, చంద్రాదిత్యేశ్వర మందిర శిఖరం కుడ్యములు ధ్వంసం కాగా వెలికి తీసిన శిల్పాలు వివిధ కాలాలలోని సంస్కృతిని ప్రతిబింబిస్తుంటాయి.




వాత్సల్య వనిత



బిడ్డ తలకు నూనె రాయపోతున్న మాతృమూర్తి



అతికాముక శిల్పం



మైధున శిల్పం

అన్నింటి కంటె ముఖ్యమయినది శివశక్తి శిల్పం. ఇందులో ఉమాశంకరుల ఏకరూపం వ్యక్తమౌతుంది. అంతేకాదు. శివపార్వతుల దాంపత్య మహాసుఖం ప్రతిబింబిత మౌతుంది. చతుర్భుజ రూపంలోని ఈ ప్రతిమలో యవ్వనం, దైవీకరణం యొక్క తాంత్రిక స్వరూపం తెలియ వస్తుంది. శివశాంకరీలు అర్ధనిమీలిత నేత్రాలతో శాంత, స్థిర, శుష్క దృక్కులతో ఒకరి నొకరు చూస్తుంటారు. శివుని ఎడమ తొడపై కూర్చున్న ఉమ భర్త మెడలో ప్రేమగా చేయి వేస్తే, ఇంద్రియాతీత శివుడు ఒక చేత్తో పార్వతి వామవక్షాన్ని ఆప్యాయతగా పొదివి పట్టుకున్నాడు. తాంత్రిక విధానాన్ననుసరించి శివశక్తుల ఈ శిల్పాన్ని ద్విత్వంలో ఏకత్వ సాధనగా అత్యంత ఉత్కృష్ట విధానంతో మలిచాడు శిల్పి. ఈ శిల్పాన్ని ఎవ్వరు ఛాయాచిత్రం తీయకూడదు.

తర్వాత యాత్రీకుల దృష్టిని ఆకట్టుకునేది ఒక అపూర్వమైథున శిల్పం. భౌతికసుఖం ద్వారా ఆత్మానందం పొందవచ్చు అనే భావన ఈ శిల్పంలో కానవస్తుంది. శివశక్తుల అపూర్వ సంధానం జీవన ఉద్దేశ్యంగా వామ మార్గం చెబుతుంది. గుప్త తంత్రంలో పేర్కొన బడిన కొన్ని ప్రక్రియలు ఇక్కడ శిల్పాల రూపంలో ప్రత్యక్షమౌ తాయి.

అతికాముక శిల్పం

స్త్రీకి పరమావధి పాతివ్రత్యం. స్త్రీ అత్యధిక కామాసక్తురాలయి పరపురుష సాంగత్యం కోరినట్లయితే, మరణానంతరం ఆమె నరక కూపంలో పడుతుంది. అప్పుడు యమభటులు ఆమెను వివిధ హింసలకు గురి చేసి, కాముక 'మేకపోతు' లతో బలాత్కారంగ ఆమెతో రతి క్రియ చేయిస్తారు. అంటే పరపురుష వాంఛ పశుత్వమనీ, అలాంటి స్త్రీలు చనిపోయిన తర్వాత పశువులతో క్రీడించ వలసి వస్తుందని ఈ అద్భుత శిల్పం వివరిస్తుంది. ఇలాంటి శిల్పం మరెక్కడా కన్పించడం దుర్లభం.

బిడ్డ తలకు నూనె రాయబోతున్న స్త్రీ, బిడ్డ తలను ఆప్యాయంగ పొదివి పట్టుకొని వాత్సల్య పీయూషాన్ని వర్షిస్తున్న వనిత శిల్పాలు సజీవాకృతులు. ఇలాంటి శిల్పాలు కూడా మరెక్కడా కానరావు.

ఇవికాక, శివ- మహేశ్వరీ, విష్ణు, లక్ష్మి, బ్రహ్మ, కాళి, దుర్గ, కార్తికేయ, భైరవ, చాముండా, గణేశ, నాయికలు, అష్టదిక్పాలకులు, నంది, సపక్ష సింహం మొదలైన విశిష్ట కళావిన్యాసంతో కూడిన శిల్పాలు యాత్రీకులు దర్శిస్తారు. వేయి సంవత్సరాల నాటి అనేక శిల్పాలు ఇప్పటికి కూడా ప్రక్కనున్న తటాకంలో లభ్యమవు తుంటాయి. ప్రజలు ఎక్కడయినా మట్టి త్రవ్వితే ఏదో ఒక శిల్పం బయట పడుతుంది. బార్సూర్‌ను బస్తర్ జిల్లా యొక్క 'ఖజూరాహో' అంటారు.

ఇక్కడ ధాపులో 8 అ. ఎత్తుగల విశాలకాయ గణేశ విగ్రహం సామాన్య ప్రజ మొదలు ఇతిహాస కారుల వరకు ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. వేయి సంవత్సరాల నాటి ఈ శిలాప్రతిమ ఎదుగుతుందని ప్రజలు చెప్పుకుంటుంటారు.

శిల్పకళ ఒక యజ్ఞం. ఆ కళను పోషించే ప్రభువు యజ్ఞకర్త అయితే శిల్పి ఋత్విక్కు. యజ్ఞకర్తకు, ఋత్విక్కుకు స్వర్గ ప్రాప్తి కలుగుతుందని వేదం ప్రమాణీకరిస్తుంది. అయితే ఈ విషయాన్ని నమ్మినా, నమ్మక పోయినా కళకు ఆకర్షింప బడని మానవ హృదయం అంటూ ఉండదు. అంటే యుగయుగాల ప్రజలు ఆ కళాఖండాలు దర్శించి పులకరించే హృదయంతో ఆ కళాస్వరూపాలకు కారకు లయిన వారిని స్మరిస్తూ ఉంటారు. అదే వారికి స్వర్గం.

(నన్ను మధ్య ప్రదేశ్‌కు ఆహ్వానించి ఈ అపూర్వ కళాఖండాలు దర్శింప చేసి, ఇంకా నా పర్యటనకు అన్ని విధాల తోడ్పడిన శ్రీ తెన్నేటి సూర్య నారాయణ మూర్తి గారికి, శ్రీ వేంకట రమణా చార్యులకు నా ధన్య వాదములు).

వ్యాసం, ఫోటోలు

—కెప్టెన్ షేక్ మౌలాలీ





అతని కోరిక

కొచ్చెర్లకోట వెంకటసుబ్బారావు

రాత్రి భోంచేసి పడకగదిలోకి ప్రవేశించాడు ాధవరావు. సిగరెట్ ముట్టించి పెదాలను సున్నాగా ంట్టి విలాసంగా రింగులు వదులుతున్నాడు. ంచం మీద మాధవి. సౌందర్యాన్ని అందంగా ప్యాక్ సిన మాధవి జాకెట్టు మీదుగా మెల్లగా కొంతల ంద తేలిపోయే పొగమంచులా సిగరెట్టు పొగ, చ్చని స్పర్శ, నరాలు జివ్వు మనిపించే స్పర్శ, ఆ ర్శ అతనికి ఎంతో పరిచయమయినప్పటికీ ఆ ణం ఎందుకో అనిర్వచనీయమైన ఆనందం. న్నగా మత్తుగా వస్తున్న మల్లెల పరిమళం. ాధవిని గుండెలకు హత్తుకుంటూ లాలనగా న్నాడు.

"మాధవీ!! నువ్వు ఏమీ అనుకోకుండా వుంటే క్కమాట. చిరకాలంగా ఓ చిన్న కోరిక ముల్లులా గుండెల్లో కలుక్కు మంటూంది. వాయిదా సుకుంటూ వచ్చాను. ఇహ జాప్యం. రించలేకుండా వున్నాను. ఈ రోజు నువ్వు మాంఛి మూడ్‌లో వున్నావని అడుగుతున్నా. తీరుస్తావా?" ంరోసారి గుండెల నిండా దమ్ములాగి రింగులు పైకి ధిలాడు. వాటిని చూడగానే మాధవి మూడ్ ారిపోయింది. తన చక్రాల్లాంటి కళ్లను ఈ హమ చక్రాలు వెక్కిరించటమా!

"నాకూ ఓ పెద్ద కోర్కె వుంది. అరుస్తారా? ంరుస్తారా?" చాలా నిష్ఠూరంగా అంది.

"తప్పకుండా! సందేహమా? కంచి పట్టు చీర ావాలా? రవ్వల నెక్లెస్ కావాలా? రేపే కొందాం" ాటక పక్కలో చెప్పుకు పోతున్నాడు. అతని ూటలకు అడ్డుపడుతూ అంది మాధవి–

"వెధవ చీరలూ, బోడి నగలూ ఎవరికి కావాలి? ముందు మీరు ఆ సిగరెట్లు మానితే చాలు. అదే పదివేలు. అప్పుడే మీ కోర్కె ఏదైనా సరే తీరేది."

పిడుగు పడ్డట్టు అయింది. సిగరెట్టు మానటమా!! భోజనం మానినా ఏమంత కష్టం కాదేమో! కాలేజీలో చేరిందగ్గర్నుంచి అతడు నిత్యాగ్ని హోత్రి. అకస్మాత్తుగా యిప్పుడు వ్రతభంగం చేయటమా! కాని తప్పదు. మాధవి కోరిక ముందు తీరాలి. ఆవిడ మంచి మూడ్‌లోకి రావాలి. తన కోరిక తీరాలి. అందుకే "సరేనని" ఒప్పేసుకున్నాడు.

తెల్లవారి లేవగానే అప్రయత్నంగా అతని చేతులు సిగరెట్టు పెట్టె పైకి పోయాయి. మరుక్షణంలో మాధవి గుర్తుకొచ్చింది. దీనంగా దాని వంక చూస్తూ మిన్నకుండి పోయాడు. లంచ్ అయింతర్వాత మళ్లీ సిగరెట్టు తాగాలనిపించింది. మాధవికి తెలియదుగా. కాల్చినా ఫర్వాలేదు. కానీ అతని మనస్తత్వం అలాంటిది కాదు.

ఎలాగైతేనేం పగలంతా ఒక్క సిగరెట్టు కూడా ముట్టించలేదు. మాధవి సంబర పడిపోతుంది. ఈ రాత్రికి తన చిరకాలవాంఛ తీరుతోంది "జయించాను" అనుకున్నాడు. కానీ అతను అనుకున్నంత తేలికగా సమస్య పరిష్కారం కాలేదు. కనీసం వారం రోజులన్నా నిగ్రహంగా వుంటేనే కాని తను లొంగనని మాధవి ఖరాఖండిగా చెప్పింది. మాధవరావు హతాశుడయ్యాడు.

పళ్ల బిగువున వారం రోజులు గడిపాడు. క్రమంగా సిగరెట్టు అలవాటు తప్పిందనే చెప్పాలి. అతని శ్రీమతి కూడా సంతోషించింది.

ఆనాడు సాయంత్రం అభ్యంగన స్నానం చేసి, కురులు ఆరబోసుకుంటూ వరండాలో నిలబడి, భర్త కోసం ఎదురు చూస్తూ వుంది మాధవి.

"ఏమిటి, శ్రీమతిగారు గాలిలో తేలిపోతున్నారు? ఈ రోజు ఏమైనా స్పెషలా?" అని కొంటెగా అంటూ వచ్చాడు మాధవరావు.

"అవును మరి. వారం రోజులు ఘోర తపస్సు చేసి, సిగరెట్టు త్రాగడం మానేసి దేవిని ప్రసన్నం చేసుకున్నారుగా. మీ కోర్కె తీర్చక తప్పుతుందా? అంటూ జబ్బ పట్టుకొని లోనికి అతడ్ని తీసుకుపోయింది.

రాత్రి బాగా ముస్తాబై గదిలోకి ప్రవేశించింది మాధవి. కాలం ఆమె అందంతో కుస్తీ పట్టింది. కానీ చివరకు ఓడిపోయి బహుమతిగా నాజూకైన మరింత బిగువు యిచ్చింది. ఆమె ముంగురులు అతని మనస్సున ముసిరే కోర్కెలా వున్నాయి. ఇప్పుడు అతనికి సిగరెట్టు తాగాలనిపించటం లేదు.

పరిపూర్ణ ఆనందంతో ద్విగుణీకృత ఉత్సాహంతో ఎత్తైన తన వక్షస్థలాన్ని, బలిష్ఠమైన అతని ఛాతీపై మోపి, మృదువుగా అధరాలను కదిలిస్తూ అమృత ఝరిలా అంది.

"చెప్పండి శ్రీవారూ!!! యింత కాలంగా అణచుకున్న తమ తీయని కోర్కె. ఏది అడిగినా ఈ రోజు మనం ఓ. కె. 'లేదు' అనేది లేదు. నా ముచ్చట తీర్చేరుగా మరి. తమరి ముద్దు తీర్చద్దూ. ఊ..... కానీయండి. ఆలస్యం ఎందుకు? ఏమిటి తమ కోర్కె?" అంటూ మాధవి అతడ్ని ఉక్కిరి బిక్కిరి చేసింది.

"ఏమీలేదు మాధవి. మన మొదటి రాత్రే చెబుదామనుకున్నా కానీ,"

"అబ్బ సరేనండి. ఈ రోజు తీరుతుందిగా సస్పెన్సులో. పెట్టక సెలవియ్యండి." అంటూ అధరాలను మృదువుగా చేతి వేళ్ళతో స్పృశిస్తూ అంది.

"నేను ఓ సైంటిస్టును కావాలని, విదేశాలకు వెళ్ళాలని, గొప్ప గొప్ప శాస్త్రవేత్తలతో కల్సి పని చేయాలనే అద్భుతమైన విషయాలు కనిపెట్టాలని ఎన్నెన్నో కలలు కనేవాడ్ని. మా ఆర్థిక పరిస్థితులవల్ల ఒక్కటీ నెరవేరలేదు. చివరికి ఓ సామాన్యమైన డాక్టరుగానే మిగిలిపోయాను.

"ఇప్పుడు మునిగిపోయిందేముందీ, మీకు యిప్పుడు ప్రాక్టీసు బాగానే వుందిగా, బాగా డబ్బు సంపాదించి కూడ బెడదాం, దాంతో విదేశాలకు వెళ్ళవచ్చు."

"ఇప్పుడు అంత వుత్సాహం లేదు. నాకు సాధ్యపడదు. అందుకే మన సంతానమైనా అంతటి గొప్పవాళ్ళు కావాలి. మనం సాధించలేనిది మన పిల్లలు సాధించాలి. అది చూసి మనం గర్వపడాలి. ఇలా కోరుకోవడంలో తప్పులేదు కదూ"

"తప్పు ఏముంది? ప్రతి వాళ్ళూ తమ పిల్లలు గొప్ప వాళ్ళు కావాలనే ప్రజలు వేయి నోళ్ళ వాళ్ళను పొగడాలని అనుకుంటారు. మీరు అలా అనుకోవడంలో తప్పేముంది?"

"అయితే ఒకటే మార్గం. మామూలు పద్ధతిలో అయితే నా కోరిక నెరవేరక పోవచ్చు. నేను వుహించిన సంతానం కలగక పోవచ్చు. అందుకే నేను ఓ ఉపాయం ఆలోచించాను."

"ఏమిటా?"

"నీకు టెస్టు ట్యూబ్ బేబీ అంటే ఏమిటో తెల్సా?"

"ఏదో పిల్లలు కలిగేందుకు కృత్రిమమైన పద్ధతి అని చదివాను. పిల్లలు లేనివాళ్ళు కూడా ఆ పద్ధతి ద్వారా సంతానం పొందగలరట. అయినా ఆ టెస్ట్ ట్యూబ్ బేబీ గొడవ యిప్పుడెందుకు?"

"చాలా అవసరం. నా కోరికకు దానికి చాలా సంబంధం వుంది. మనకు ఓ మేధావి జన్మించాలంటే ఆ పద్ధతినే అవలంభించాలి. స్త్రీ తన శీలం పోగొట్టుకోకుండానే, యిది సాధ్యపడుతుంది. దీనికి పరపురుషుని సంపర్కం అవసరంలేదు. పురుషుని స్పెరంని స్త్రీ ఓవాన్ని టెస్ట్ ట్యూబ్‌లో ఫ్యూజన్ చేసి, స్త్రీ యొక్క వూంబ్‌లోకి ప్రవేశ పెడతారు. అలా స్త్రీ గర్భం ధరిస్తుంది. తనలో పెరగటం వల్ల స్త్రీ అది తన సంతానమే అనే అనుభూతిని కూడ పొందుతుంది."

"ఇంతకూ ఈ సైన్సు పాఠాలు నా కెందుకు చెబుతున్నారు.?"

"మనం ఆ పద్ధతే అవలంబిస్తే బాగుంటుందని నా ఉద్దేశ్యం. ఇలా చేయటంలో ఏమీ తప్పులేదు. ప్రమాదం అంతకన్నా లేదు. డబ్బు ఖర్చు అంటావా మనకు అది పెద్ద లెక్కలోనిది కాదు. మనకు మేధావంతులైన సంతతి కలుగుతుంది."

"ఆపండి ఇలాంటి తుచ్ఛమైన కోరిక మీకు కలుగడం నా దురదృష్టం."


"ఇది దురదృష్టం కాదు అదృష్టం. నేను సాధించలేని విజయం నా బిడ్డలు సాధిస్తే చూడాలని కోరుకోవడం తప్పంటావా? నా బిడ్డ ఓ సైంటిస్టు అయ్యి పేరు ప్రతిష్టలు పొందుతుంటే మనకు గర్వంగా ఉండదా? మాధవీ! నీకు మాత్రం బిడ్డలు గొప్పవాళ్ళు కావాలనే కోరిక ఉండదూ?"

"ఉంటుంది. తమ బిడ్డలు గొప్పవాళ్ళు కావాలని ప్రతీ తల్లిదండ్రులు కోరుకుంటారు. కాని తమ సంతానం సక్రమ సంబంధంతో పుట్టాలనీ అనుకుంటారు గాని అక్రమ సంబంధంతో కాదు."

"ఇందులో అక్రమ సంబంధం ఏముంది' శారీరకమైన సంబంధం ఉంటేనే దానిని అక్రమ సంబంధం అంటాం. శారీరకంగా అతడెవరో నువ్వెవరో."

"చాలా పొర బడ్డారు. "ఆత్మావై పుత్ర నామాసీ అన్నారు పెద్దలు. మన ప్రతి బింబాన్ని చూసుకోవాలని మనం బిడ్డల్ని కంటాం. మన ప్రతిబింబాలే కాబట్టి మనం సంతానాన్ని ప్రాణపదంగా ప్రేమిస్తాం. వారి అభివృద్ధే మన అభివృద్ధి అనుకుంటాం. వారి కష్ట సుఖాలను మనవిగా భావిస్తాము. కాని ఇదంతా ఎప్పుడు? వారు మన బిడ్డలే అయినప్పుడు. పరాయి బిడ్డ అని తెలిసినప్పుడు మనకు ఈ సంతృప్తి ఉండదు."

"మీ కోరిక నిజంగా తీర్చినా రేపు పుట్టిన బిడ్డను చూసి మీరు ఆనందించ లేరు. వాడు నా వాడే అనే భావన మీలో కలుగదు, కారణం? వాడు మీకు కలిగిన సంతానం కాదు. మరో వ్యక్తి జీవకణాలతో జీవం పోసుకున్న సంతానం. మరో విషయం, ఇలా కనడంలో తృప్తి ఉండదు. శారీరక సంపర్కంతో ఉద్భవించిన బిడ్డ మీద ఉన్న మమకారం ఆయాచితంగా పొందిన బిడ్డపై ఎందుకుంటుంది? మహాభారతంలో. కుంతీదేవి మీకు తెలియదా? కర్ణుడు అనుకోకుండా పుట్టిన బిడ్డ. అందుకే ఎంతో నిర్దయగా నదిలో నెట్టివేయ గలిగింది. అదే





ప్రేమ్
మీకోసమే
NEW
PREM
ఇప్పుడు అనువైన ఆకారంలో క్రొత్త పరిమళంతో వస్తోంది.

ధర్మపథం

భయవాత్సల్యాలు

ప్రజా పాలన విషయంలో ప్రభుత్వం అతి కఠినంగా గాని, అతిమార్దవంగా గాని ప్రవర్తించకూడదని కాళిదాస మహాకవి రఘువంశంలో దిలీపమహారాజును గురించి చెప్తున్నప్పుడు తెలియ జేశాడు. దిలీపుడు ప్రజలపట్ల భీకరంగానూ, శాంతంగానూ కూడా ప్రవర్తించేవాడట. కేవలం కఠినంగానే ప్రవర్తిస్తే ప్రజలు అతనిదగ్గరకు వెళ్ళడానికే భయపడతారు. అందువల్ల ప్రభువుపట్ల వారికి అసంతృప్తి కలుగుతుంది. ప్రభువు మిక్కిలి సాధువుగా ఉంటే ప్రజలు అతని తలపై కెక్కి కూర్చుంటారు. ప్రభువు చేతకానివాడనే అభిప్రాయం కలుగుతుంది. అందువల్ల సమయానుకూలంగా ఆయన భీకరంగానూ, ఆకర్షణీయుడు గానూ ఉండేవాడట! దానికి చక్కని దృష్టాంతం కూడా చూపబడింది. సముద్రంలో ప్రాణాలు తీసే జలచరాలూ ఉన్నాయి. అందరినీ ఆకర్షించే రత్నాలూ ఉన్నాయి. క్రూరమైన జలచరాలున్నందున సముద్రంలోకి వెళ్ళడానికి భయం వేస్తుంది. అందలి రత్నాలను సంపాదించాలనే ఆశకొద్దీ సముద్రంలోకి పోవాలనే ఆసక్తి ఉంటుంది గదా!కాళిదాసు దీన్నే ఇలా చెప్పాడు.

"భీమ కాంతైః నృపగుణైః
సబభూవోపజీవినామ్,
అధృష్యశ్చాభిగమ్యశ్చ
యాదో రత్నైరివార్ణవః"



జన సామాన్యం విషయంలోనూ ఇదే పద్ధతి. తమ సంతానానికి తమ పట్ల భయభక్తులు ఉండేటట్లు చూస్తూ, వారి యెడల వాత్సల్యాన్ని చూపుతూ ఉండాలి. తలిదండ్రులు బిడ్డలను మిక్కిలి గారాబంతో చూస్తూ, తామంటే భయం లేకుండా ఉండే రీతిని ప్రవర్తిస్తే వారికి స్వేచ్ఛ ఎక్కువ అవుతుంది. తాము ఎలా ఉన్నా తలిదండ్రులు ఏమీ అనరుగదా!అని యిచ్ఛ వచ్చినట్లు సంచరించడానికి సిద్ధపడతారు. చదువు సంధ్యల మీద బుద్ధి పోదు. అది వారి భవిష్యజ్జీవితానికి గట్టి దెబ్బ! ఇక- వాళ్ళ విషయంలో ఏమాత్రం వాత్సల్యం చూపకుండా ఎప్పుడూ కోపిస్తూ ఉంటే భక్తి ఉండదు సరిగదా. అనిష్ట భావం కలుగుతుంది. అందువల్ల బిడ్డలు తలిదండ్రులను తప్పించుకొని తిరుగుతారు. తమ వంటి వారి సాహచర్యం వల్ల వారు ఇల్లు విడిచి పోవడం కూడా సంభవించవచ్చు. ఒకవేళ ఇతరులు వారికి హితాన్ని బోధించి "బిడ్డలను బాగా గమనించవలె" నని తలిదండ్రులకు చెప్పి – ఇంట్లోనే ఉండేటట్లు చేసినా– ఆ పిల్లలకు పెద్దలపట్ల గౌరవభావం ఉండడం కష్టం. వయస్సు పరిపక్వమై, తలిదండ్రులు ఆర్థికంగానూ, శారీరకంగానూ బాధ పడుతున్నప్పుడు వారిని గమనించ గలరని అనుకోలేము.

అంచేత తలిదండ్రులు తమ బిడ్డలను తగిన పాళ్ళలో వాత్సల్యం తోనూ, తమయందు భయభక్తులు ఉండే విధంగానూ ఉండడం అవసరం. "అతి సర్వత్ర వర్జయేత్" అనే ఆర్యోక్తి అందరూ ఎరిగినదే!

–బులుసు వేంకటరమణయ్య

నవమాసాలు మోసి కనిపెంచిన తల్లి అలా చేయ గలుగుతుందా? కర్ణుడు దైవ యోగంతో జన్మించి అద్భుతమైన వీరు డయ్యాడు. అయినా కుంతి సంతోషించ గలిగిందా? పది మందికి చెప్పుకొని గర్వించ గలిగిందా? ఈ టెస్టుట్యూబు వల్ల కలిగిన సంతానం వల్ల మీరూ అంతే! పోతే తెలివితేట లంటారా? మీకున్న తెలివితేటలు చాలవా? మీలో వున్న యిన్ఫీరియార్టీ కాంప్లెక్సు పోగొట్టుకుంటి నోబెల్ బహుమతి పొందే సంతానం కలుగుతుంది. వెర్రి మొర్రి ఆలోచనలు మానెయ్యండి."


మాధవి మాటల్లో నిజం వుందని పించింది. ఏదో తీరని కోరిక తీర్చుకునేందుకు తను చాలా తప్పుగా ఆలోచించాడు. అయినా ప్రతి టెస్ట్‌ట్యూబ్ బేబి గొప్పది కావాలనే నియమం లేదుగా. పైగా హీనంగానూ వుండవచ్చు. అంతేకాదు. రేపు నిజం తెలిస్తే ఆ బిడ్డ తనని ఎంత నీచంగా చూస్తాడు.

అతని కోరిక

సామర్థ్యం వుండికూడా తన తండ్రి ఎంత దౌర్భాగ్యానికి పాలపడ్డాడు. అని అనుకోడూ! తమకు సంతానం కలిగే యోగం లేక ఈ దారి ఆలోచిస్తే ఆ ధ్గారి వేరు. కానీ ఇదో? అలా కాదే. నిజంగా తనకు ఇన్ఫీరియార్టీ కాంప్లెక్స్ వుంది. లేకపోతే తను యిలా ఆలోచించడు. తనలో ఆత్మ స్థైర్యం పెంచుకోవాలి. అప్పుడు తను సాధించాలను కునేది సాధించ గలుగుతాడు. అందుకు యితరుల మీద ఆధార పడక్కర్లేదు. చివరికి బిడ్డల మీద కూడా. ఆడవాళ్ళని గురించి కూడా తను తప్పుగా అంచనా వేశాడు. శీలమనేది శారీరక మైనదనే తను ఆలోచించాడు. అది నిజం కాదు. పవిత్రమైన స్త్రీ పరాయి మగాణ్ని గురించి ఆలోచించటమే తప్పుగా భావిస్తుంది. అటువంటప్పుడు పర పురుషుని స్పెరంను తనలో ఎలా దాచుకో గలుగుతుంది? తొమ్మిది నెలలు ఎలా మోయ గలుగుతుంది? అలా మోస్తూ ఎంత చిత్ర క్షోభ అనుభవిస్తుంది. మాధవి వల్ల తనకు జ్ఞానోదయం కలిగింది.

"మాధవీ! చాలా పొరబడ్డాను. ఎంత కోరికతో నీలో అలజడి రేకెత్తించాను. ఆడదాని హృదయం తెలియక అలా అడిగాను. నన్ను క్షమించు" ఆవేదనగా అన్నాడు.

"అయితే ఓ కండిషను. మీరు కొన్నాళ్ల పాటు బయట ప్రాక్టీసు కట్టిపెట్టి రాత్రిళ్లు త్వరగా దేవి సన్నిధికి చేరుకోవాలి. ఫామిలీ ప్లానింగ్ మానేసి ఆనందంలో ముంచెత్తాలి. అప్పుడు మనకు ఓ బుల్లి "ఎడిసన్" కన్నుల్లో విద్యుత్ కాంతులు నింపుతాడు" అంటూ మాధవి లతలా అతణ్ని పెనవేసుకు పోయింది. □



(గతసంచిక తరువాయి)

"సార్! బాబు స్నానం చెయ్యనని మారాం చేస్తున్నాడు" అన్నాడు నౌకరు కుర్రాడు రాము.

రామూది కూడా మామూలు పేదకథే. దొంగతనం వృత్తిగా స్వీకరించిన ఆవారాగాడు కాదతను.

పేదరికం, నిరక్షరాస్యత... పెరిగిన వాతావరణం, పరిస్థితుల ప్రాబల్యం అతన్ని చిల్లరదొంగగా మార్చాయి.

ఒకసారి ఎవరి జేబో కొట్టేస్తూ విజయ్‌కి పట్టుబడ్డాడతను.

కొన్ని నెలలు జైలుశిక్ష అనుభవించి బయటపడ్డాడు రాము. పధ్నాలుగేళ్ళ వయసుంటుం దతనికి.

గుప్పెడన్నంకోసం అలమటిస్తూ ఆకలితో మృత్యువుకు చేరువకాబోతున్న తల్లి కోసం పదేళ్ళు నిండీ నిండని వయసులో మొదటిసారిగా వాడు దొంగతనం చేశాడు. పట్టుబడి శిక్ష అనుభవించాక బయటకొచ్చాడు. దొంగ అనే ముద్ర అతన్ని వెంటాడి వెంటాడి వేధించింది. ఎవరూ పని యివ్వటానికొప్పుకోలేదు. చివరికి ఒకళ్ళింట్లో పని దొరికింది. వయసుకు మించిన పనిని పెదవి విప్పకుండా చేసుకుపోయేవాడు. ఒకరోజు ఆ యింటివాళ్ళమ్మాయి చెవి కమ్మ పోయింది. ఎంత వెతికినా దొరకలేదు. రామునిపట్టుకొని నాలుగు బాదారు.

"నాకేం తెలీదయ్యా, మా అమ్మతోడు" అని ఏడ్చి మొత్తుకున్నాడువాడు.

తరువాత వాడు పనిలోనుంచి తీసెయ్యబడ్డాడు. వాడు వెళ్ళిపోయాక బాత్‌రూం గూట్లో సబ్బుపెట్టి వెనకాల కుప్పగావున్న కుంకుడుకాయపెచ్చుల్ని వూడుస్తుంటే. ఆ కుప్పలో చెవికమ్మ దొరికింది.

"పాపం! వాడు మంచోడే! అనవసరంగా తీసేశాం" అన్నది యజమానురాలు.

"ఏడిశాడులెద్దూ! ఎప్పటికైనా అలాంటివాళ్ళు ప్రమాదకరమైనవాళ్ళే" అన్నాడు యజమాని. తను వాడి నలా అమానుషంగా కొట్టటం తప్పు అని ఒప్పుకోటానికి – కనీసం మనసులో అయినా అలా అనుకోటానికి అహంభావం అడ్డొచ్చిందాయనకి.

ప్రతిచోటా యిలాంటి చేదు అనుభవాలే ఎదురయి బలవంతాన రాముని తిరిగి పాత జీవితంలోకి నెట్టసాగాయి.

సహజమైన నేరప్రవృత్తి అతనిలో లేకపోవటంమూలాన ప్రతిసారీ ఎంతో సంఘర్షణ ననుభవించేవాడు.

ఇంకా వాడిలో మానవత్వం తాలూకు మార్దవం చచ్చిపోకముందే రాము విజయ్ దృష్టిలో పడ్డాడు.

అతన్ని తన యింటికి తీసుకొచ్చేశాడు విజయ్. అలా ఒక నేరస్థుణ్ని యింట్లో పెట్టుకోటం మంచిదికాదని విజయ్ శ్రేయోభిలాషులు హెచ్చరించినా అతను లెక్కచెయ్యలేదు.

తను నమ్మినదాన్ని ఆచరించటంలో ఎప్పుడూ ఎవర్నీ కేర్‌చెయ్యడు విజయ్.

రామూ విజయ్ నమ్మకాన్నెప్పుడూ వెబ్బతియ్యలేదు. నమ్మినబంటులా..... అభిమానం, కృతజ్ఞత కలబోసుకుని, విజయ్ యింట్లో అన్ని పనులూ శ్రద్ధగా చేస్తూవుంటాడు రాము.

సరిఅయిన పరిస్థితులు కల్పిస్తే రామూలాంటివాళ్ళు అతి తేలికగా మంచివాళ్ళుగా మారిపోతారు.

అలాఅని నేరస్థులంతా యిలాగే వుంటారనుకోటం పొరపాటు.

వాళ్ళలో పెట్టిన చేతిని కాటేసేవాళ్ళే ఎక్కువ.

ఆలోచనల్లోనుంచి బయటపడి "ఏం? ఎందుకనట? అన్నాడు విజయ్.

"ఏమోసార్, చెప్పటంలేదు."

"నానీ" అంటూ గదిలోకెళ్ళాడు విజయ్.

"ఎస్ అంకుల్" అన్నాడు నానీ లేచి నిలబడుతూ.

"స్నానం చెయ్యనన్నావా!"

"........."

"ఎవరైనా స్నానం చెయ్యటానికి పేచీపెడతారా?"

జరిగిన కథ –8 : విజయ్ మారు వేషంలో గోగినేని పల్లెకు వెళ్ళి రంగారావు గురించి సమాచారం సేకరించటం మొదలు పెడతాడు. రాత్రి వేళ గదిలోకి వెళ్ళి అక్కడ మేనేజరును. మరొక కాపలాదారును దెబ్బతీసి భూగృహం లోపలికి చేరతాడు. అక్కడ బందీగా ఉన్న నానీ వైజయంతి కొడుకేనని తెలుసుకుంటాడు. ఇంతలో భూగృహం తలుపు మూసుకుపోతుంది. ఒక బిలం గుండా బైటపడి, మురికి కాలువలో అతికష్టం మీద ఈది వెంచులగూడెం చేరతాడు. విజయ్, నానీలు మరణించారని రంగారావు అనుకుంటాడు.

"......."

"దర్టీగా వుండటమంటేనే నీ కిష్టమా?"

"........."

"అలా వుండేవాళ్ళంటే నా కిష్టముండదు."

"నాకు.....నాకు బట్టల్లేవుగా?"


నాని కళ్ళలో నీళ్ళు తిరిగాయి. అభిమానంగా తలవంచుకున్నాడు.

"ఓహ్! సారీ! నా దెంత మొద్దు బుర్ర" అంటూ అప్పటి కప్పుడు రామూను పంపి నానికి కావలసిన వస్తువులన్నీ తెప్పించాడు విజయ్.

స్నానంచేసి నీట్‌గా డ్రస్ చేసుకునివచ్చి "ఇప్పుడు నేనంటే మీకిష్టమే గదంకుల్!" అన్నాడు నాని.

"చాలా యిష్టం" వాడిని దగ్గరకు తీసుకుంటూ అన్నాడు విజయ్.

తీరికగావున్నప్పుడల్లా నానీతో కబుర్లు చెపుతూ.....వాడి చిన్ని చిన్ని సందేహాలకు జవాబులిస్తూ, కలిసి బ్రేక్‌ఫాస్ట్ తీసుకుంటూ వుండటం గమ్మత్తయిన అనుభవంలా వుంది విజయ్‌కి.



కొత్త శీర్షిక

నాకు నచ్చిన సన్నివేశం

ప్రముఖ రచయిత్రి శ్రీమతి ఆదూరి సావిత్రి రాసిన "డి. ఎస్. పి. విజయ్" సీరియల్‌ని ఆసక్తితో చదువుతున్న పాఠకులందరూ ఈ శీర్షికలో పాల్గొనవచ్చును. ఈ సీరియల్ నవలలో తమకి బాగా నచ్చిన సన్నివేశాన్ని గురించి వివరిస్తూ 250 అక్షరాలకి మించకుండా రాసి ఫొటోతో సహా పంపవచ్చును. వాటిలో ప్రచురణ యోగ్యంగా ఉన్న వాటిని వారం వారం ఈ సీరియల్ పేజీలలో వేస్తాము. ప్రచురణకి అర్హంగా లేని వాటిని తిప్పి పంపగోరేవారు తమ రచనలతో పాటు తగినన్ని తపాలా బిళ్లలు అతికించిన స్వంత చిరునామా కల కవరు జతపరచి పంపాలి. వ్రాత ప్రతి మీద రాసిన వారి పేరు, పూర్తి చిరునామా ఉండాలి.

ఈ సీరియల్ ముగిసేలోగా ప్రచురింపబడిన రచనలలో ఉత్తమమైనవిగా తాము ఎంపిక చేసిన మూడింటిని ఫొటోలతో సహా ఈ సీరియల్ పుస్తక రూపంలో ముద్రించేటప్పుడు అందులో వేయటం జరుగుతుందని, ఆ ముగ్గురు పాఠకులకీ ఆ నవల ప్రతిని తమ అభినందనలతో అందజేయగలమని రచయిత్రి తెలియచేస్తున్నారు.

ఈ అవకాశాన్ని వినియోగించుకోదలచిన పాఠకులు తమ రచనలని 'నాకు నచ్చిన సన్నివేశం' శీర్షిక పేర సంపాదకుడు, ఆంధ్రసచిత్ర వారపత్రిక, గాంధీనగరం, విజయవాద – 520003 అనే చిరునామాకి పంపవచ్చును. –సం.

డి. ఎస్. పి. విజయ్

తను వచ్చేవరకూ బ్రేక్‌ఫాస్ట్ చెయ్యకుండా కనీసం పాలయినా తాగకుండా వాడు వెయిట్‌చెయ్యటం, చెప్పినా వినకపోవటం తమాషాగా వుందతనికి.

ఈ అనుభూతి బావుంది! ఇంకా ఇంకా కావాలనిపిస్తోంది.

ఒంటరితనంపోయి యిష్టమైన తోడు అయాచితంగా దొరికినట్లుంది.

మెకానికల్‌గా వుండే తన లైఫ్‌లోకి అహ్లాదకరమైన రిలీఫ్ జొరబడ్డట్లుంది.

నానీకి ప్రతివిషయంలోనూ కుతూహలమే.

విజయ్ డ్రస్‌చేసుకుంటుంటే విప్పారిన కళ్ళతో చూస్తూ "బుజంమీద ఆ త్రీ స్టార్స్ దేనికంకుల్? మీరు ఎస్. పి. అయితే ఫోర్ స్టార్స్ పెట్టుకోవాలా? బుజంచుట్టూ వున్న ఆ బెల్ట్ బావుంది తమాషాగా.....ఓ సారి విజిలూదరూ. మీ నేమ్ ప్లేట్ బుజంమీదుంటే బావుంది.

మా మమ్మీ నన్ను ఐ. పి. ఎస్. చదివిస్తాను అనుకొనేది.

అంకుల్....మా మమ్మీని రంగారావే ఎక్కడో దాచివుంటాడు. మమ్మీని కూడా మీరెళ్ళి విడిపించరూ?"

తల్లిమాట తలుచుకోగానే నానీ గొంతులో అప్పటివరకూ వున్న కుతూహలంపోయి దీనత్వం చోటుచేసుకునేది.

"తప్పకుండా మీ మమ్మీని విడిపిస్తాను. ప్రామిస్" అర్ధంగా అనేవాడు విజయ్.

ఈ రాత్రికయినా నానీని కొన్ని ప్రశ్నలడిగి, వాడి మనసు నొచ్చుకోకుండా కొన్ని విషయాలు రాబట్టాలి.

వచ్చిందగ్గర్నుంచీ వూపిరితిప్పుకోటానికికూడా తీరికలేకుండాపోయింది. ప్రతి రాత్రీ మరీ పొద్దుపోయి తను యింటికిరావటం, అప్పటికే వాడు మంచి నిద్రలో వుండటంతో వీలుకుదరటంలేదు.

ఇదో రకం సీజన్ అయినట్లు చుట్టుపట్ల ఊళ్ళల్లో దొంగతనాల బెడద ఎక్కువయిపోయింది. ప్రతిరోజూ ఏదో ఒక కంప్లయింట్. అక్కడి ఎస్. ఐ. లకు దిక్కుతోచటంలేదు.

ఈపరిస్థితి యిలాగే కొనసాగితే ప్రజలు పోలీసుల్ని దుమ్మెత్తిపోస్తారు. పత్రికలు యిప్పటికేపతాకశీర్షికలుపెట్టి ఏకుదు ప్రారంభించేశాయి.

బజార్లో జరిగే సకల జీవన్మరణ సమస్యలకూ పోలీసులే బాధ్యత వహించాలి.

ఏ ఆపదొచ్చినా ప్రజలు ముందుగా అర్థించేది పోలీసుల సహాయాన్నే.

అయినా సరే. ప్రజలకు పోలీసులకూ మధ్య సత్సంబధాలుండవు.

ప్రజలకు పోలీసులంటే గిట్టదు. వాళ్ళే తమ ప్రథమ శత్రువులనుకుంటారు.

ఆందోళన జరిగేప్రదేశానికొచ్చిన పోలీసులమీద రాళ్ళు రువ్వి గాయపరచటం లాంటి హింసాత్మక చర్యలకు పాల్పడతారు.

రెచ్చిపోయిన పోలీసులు నిగ్రహాన్ని కోల్పోయిన ఫలితంగా లాఠీచార్జీ...... ఫైరింగ్ జరగటం......తత్ఫలితంగా ఎందరో అమాయకులు ప్రాణాలను కోల్పోవటం, ఎందుకిలా జరుగుతోంది? మంచీ చెడూ అన్నిచోట్లా వుంటుంది.

అయితే పోలీసులు ప్రజల హక్కుల్ని పరిరక్షించాల్సిన బాధ్యత కలిగి వుండటంచేత, ఆ డిపార్ట్‌మెంటులో ఏమూల జరిగిన అక్రమమైనా బాగా ఎక్స్‌ప్లాయి చెయ్యబడి....పెద్ద పబ్లిసిటీ యివ్వబడి ప్రజల్ని పోలీసులపట్ల విముఖులుగా తయారుచేస్తుంది.

ఈ విషయాన్ని గుర్తించి సరిగ్గా ప్రవర్తించి మంచిపేరు తెచ్చుకుని ప్రజల్ని తమపట్ల సుముఖులుగా చేసుకోవాలనే యింగితజ్ఞానం తమలో చాలామందికుండదు.

కొందరు చేసే వెధవ పన్లవల్ల మొత్తం తమ డిపార్ట్‌మెంటుకే అప్రతిష్ఠ వస్తోంది. వాళ్లని ఏరిపారేసి కఠినంగా శిక్షించ గలిగినప్పుడే పోలీస్ డిపార్ట్‌మెంటును ప్రజలు అసహ్యించుకోటం మానేస్తారు. సన్నిహితంగా చూడగలుగుతారు.

కానీ.... ఆ ఏరిపారెయ్యట మనేదానికే సవాలక్ష అడ్డంకులు. ఒక రాజకీయనాయకుడు ఎంతటి దుష్టుడయినా... ఎలాంటి గూండాయిజానికి పాల్పడినా.. ఎంత నీచంగా ప్రవర్తించినా ప్రజలు ఎంతో క్షమాగుణంతో ప్రవర్తించి తమ ఓట్లు కురిపించి అతన్ని మళ్ళీ మళ్ళీ గెలిపిస్తూనే ఉంటారు.

ఉదాహరణకి ఇక్కడి స్థానిక ఎం. ఎల్. ఏ. ధర్మారావు. వాడికి రంగారావుతో సన్నిహిత సంబంధాలున్నాయి. రంగారావు ఎందరు ఆడపిల్లల జీవితాల్ని కాలరాశాడో. ఎన్నిదారుణ హత్యలు చేయించాడో... ఈ విషయాలన్నీ ప్రజలకు తెలుసు. ధర్మారావుకి కూడా ఇందులో భాగముందనే విషయం కూడా వాళ్లకు తెలుసు. అయినా ప్రజలు ఎన్నుకునేది ఎప్పుడూ ధర్మారావునే?? గత ఎన్నికల్లో తనకు ప్రత్యర్థిగా నిలబడ్డ పాతికేళ్ల యువకుడూ... గ్రాడ్యుయేటు... ప్రజాశ్రేయస్సు కోసం పాకులాడే మంచి మనిషి అయిన చిదంబరాన్ని రాత్రి ఎనిమిది గంటలవేళ తన ఇంటికి వెడుతుండగా కిరాయిరౌడీలు దారుణంగా పొడిచి చంపారు.

ఆ రౌడీలను నియమించింది ధర్మారావేనని అందరికీ తెలుసు. అయినా ప్రజలు ఆ విషయం తమకు సంబందించిందికాదు అన్నట్లు మౌనంగా ఊరుకున్నారు. పెద్ద మెజారిటీతో ధర్మారావుని గెలిపించారు!

ప్రజలలో ఉన్న ఈ ఓర్పు... క్షమాగుణం తమను చూసేసరికి సాంతం హరించుకుపోతాయి.

తాము నాగులాంటి పచ్చి నెత్తురు తాగే రాక్షసుల్ని ప్రాణాలకి తెగించి వేటాడి అరెస్టు చేస్తే ప్రజలు స్వయంగా గెలిపించిన ఈ పెద్ద మనుషులే వాడికి


కోటయ్య అనుభవం-
కోటయ్య నోటనే విందాం
కోటయ్యా సూరయ్యా ఇరుగు పొరుగు ఊళ్ళ రైతులు. ఎన్నాళ్లనుంచో మిత్రులు. ఒకసారి అనుకోకుండా కలిశారు...
అరె, కోటయ్యా నువ్వా!
ఏరోయ్ సూరి, ఎలాగున్నావ్!
బాగానే ఉన్నాలే. నీ ఎడ్ల గురించి రామన్న చెప్పాడు. చాలా బాధైందనుకో!
ఏంజేస్తాం... దేవుడలా పెట్టాడు.
కోటయ్య ఎడ్లు మేస్తుంటాయి... ఉన్నట్టుండి చెవులు దద్దరిల్లే శబ్దం... రాళ్లూ మట్టీ దొర్లివస్తాయి. గాభరా పడ్డ కోటయ్య ఎడ్లను కాపాడుకునే ప్రయత్నంలో...
భగవంతుడా... నా ఎడ్లను కాపాడు తండ్రీ!
ఎంత ఘోరం! ఇపుడెట్టా గడుపుతున్నావ్ మరి!
అదృష్టం కొద్దీ న్యూ ఇండియా వాళ్లతో పశువుల భీమా చేయించుంచా. లేకుంటే మునిగిపోయుండేవాణ్ణి.
... కిందటి సంతలో రెండు కొత్తెడ్లు కూడా కొన్నా!
అబ్బో! అంత డబ్బు కూడబెట్టావా!
డబ్బెక్కడ కూడబెట్టాను! పశువుల భీమా చేయించానని చెప్పాగా!
పశువుల భీమా, పశువుల భీమా అంటున్నావు. అదేమిటీ!
పశువుల భీమా అంటే... ప్రమాదంలోనో రోగంతోనో నీ పశువులు చచ్చిపోయాయంటే న్యూ ఇండియా వాళ్లు నీ నష్టానికి డబ్బు కట్టిస్తారు.
ఉట్టినే డబ్బిచ్చేస్తారా?
ఊహుం. ఏడాదికింత అని మనం కాస్త డబ్బు కట్టాలి. మన పశువు 100 రూపాయల్దనుకో, మహా అంటే 4 రూపాయలు చాలు!
అలాగా! ఈ సంగతి నాకు తెలీదే!
ఇప్పుడు తెల్సింది కదా! నష్టాలు వచ్చినప్పుడు భీమాయే మనకు ఆధారం!
SAA/NIA/2802/TL

డి. ఎస్. పి. విజయ్

జామీనుండి విడిపిస్తారు. అలా కుదరకపోతే అడ్డంవచ్చిన వాళ్లను నిర్దాక్షిణ్యంగా కాల్చి పారేసి వాడిని జైలు నుంచి తప్పించి తీసుకుపోతారు.

ఇవన్నీ తెలిసిన ప్రజలు కిక్కురుమనరు. పైపెచ్చు. పోలీసుల అసమర్థత అని నిందిస్తారు.

ఈ వ్యవస్థ ఎప్పటికి మారేను?

ప్రజలూ పోలీసులు ఒకరి నొకరు శత్రువుల్లా చూసుకోవటం మానేసి. సదవగాహన... సత్సంబంధాలు ఏర్పరచుకుంటే వేల సంఖ్యలో నేరాలు సులభంగా అరికట్టబడతాయి.

అలాంటి రోజులు ఎప్పటికైనా వస్తాయా??

తప్పు ఎవరిది అనే ప్రశ్నకు తావులేదిక్కడ.

ఎందుకంటే... ఎవరివేపు నుంచి చూసినా రెండో వాళ్లదే ఫాల్ట్ అంతా అనిపిస్తుంది గనక.

ప్రజలు తమకు సహకరించరని పోలీసులనుకుంటారు. ప్రజలకు పోలీసుల పట్ల కొన్ని ఊహలుంటాయి.

వాళ్ల దృష్టిలో పోలీసులంటే సకలగుణ సంపన్నులై ఉండాలి.... ఇద్దరు వ్యక్తులు పోట్లాడుకుంటే వెంటనే సర్దుబాటు చేసి ఎవరికి వారే తాము నెగ్గామనుకుని తృప్తి పడేలా చెయ్యగల దౌత్య నీతి కలిగి ఉండాలి....

ఒక విషయంమీద నిర్ణయం తీసుకోటానికి లాయరుకుగానీ, జడ్జీకిగానీ, కొన్ని నెలలు లేదా కొన్ని సంవత్సరాలు పడితే... పోలీసులు మాత్రం నిమిషాలమీద ఆ నిర్ణయం చేసెయ్యగల కెపాసిటీ కలిగి ఉండాలి... పోలీసులకు సర్వం తెలిసి ఉండాలి. తెలిసినదాన్ని బహిర్గతం చెయ్యరాదు.


దౌర్జన్యపూరితులైన దొంగలు, హంతకులతో.. ఒళ్లుపై తెలియని తాగుబోతులతో సైతం పోలీసులు సంయమనంతో వ్యవహరించాలి.

ఇలా జరగదు!

జరగదు గాబట్టి ప్రజలకు పోలీసుల పట్ల అసంతృప్తి. ఇందులో సాధ్యాసాధ్యాల ప్రసక్తి లేదు.

ఈ సమస్యకుతోడు పోలీసు డిపార్ట్‌మెంటులో రాజకీయ నాయకుల జోక్యమొకటి!!

"తమ ఆశ్రితులు ఎలాంటి గూండాలయినా పోలీసులు వాళ్లను కాపాడాలి. వాళ్ల జోలికెళ్లగూడదు. కావాలంటే వాళ్లను బదులు ఇంకో అమాయకుల్నయినా అరెస్టు చేసుకోవాలి. వారి చర్యలను ప్రశ్నించకూడదు. అడ్డం వెళ్లకూడదు. వాళ్లు చెప్పినట్లు వినకుండా ఎదురు తిరిగిన ఏ ఆఫీసర్నయినాసరే.... శంకరగిరిమాన్యాలు పట్టించటం. ప్రమోషన్లు రాకుండా



అడ్డుపడటం మానసికమైన ఒత్తిడి తేవటం ఇంకా లొంగకపోతే మర్డర్ చేసి పారెయ్యటం. సరాసరి ఐ.జి మీద ఒత్తిడి తెచ్చి ఆయనచేతే తమకు చెప్పించి నేరస్థుల్ని విడుదల చేయిస్తారు.

ఈ విధంగా ప్రజలకు ప్రభుత్వానికి మధ్య గోడ దెబ్బ చెంప దెబ్బ లాగా నిరంతరం నలుగుతూ ఉండే అతి కీలకమైన డిపార్ట్‌మెంట్ తమది ఒక్కటే.

మిగతా డిపార్ట్‌మెంట్లలో ఉద్యోగస్థుల్లాగా సాయంత్రం కాగానే ఫైళ్లవతల పడేసి హాయిగా ఇంటికెళ్లిపోయే అవకాశం తమకు లేదు.

పండగా పబ్బం... రాత్రీ పగలు అనే తేడా లేకుండా ఇరవైనాలుగ్గంటలూ తాము డ్యూటీ మైండ్‌తోనే ఉండాలి. అయినా... మిగతా వాళ్లకన్నా ఎక్కువ ఫెసిలిటీస్ తమకేం ఉండవు.

"అంకుల్... ఉప్మా చల్లారిపోతోంది...." నానీ హెచ్చరికతో తన పరధ్యాన్నానికి నవ్వేస్తూ స్పూన్ అందుకున్నాడు విజయ్.

అతను బయల్దేరుతుంటే వరండా వరకూ వచ్చి చెయ్యి పట్టుకుని "త్వరగా వచ్చెయ్యండంకుల్" అన్నాడు నానీ.

"వచ్చేస్తానమ్మా" అభిమానంగా అన్నాడు విజయ్.

"నేను ఎదురు చూస్తూ ఉంటాను."

"అలాగే."

ఇన్నేళ్లకు తన రాక గురించి పట్టించుకునే చిన్న ప్రాణి తనకు తోడుగా రావటం... త్వరగా రమ్మని ప్రాధేయ పడటం... వచ్చేవరకూ ఎదురు చూస్తూ... రాగానే. విప్పారిన కళ్లతో తనకు స్వాగతం పలకటం...

ఈ అనుభూతి తియ్యని స్పందనను కలగజేస్తోంది విజయ్‌కి.

వైజయంతే తనదగ్గరున్నంత ఇదిగా ఫీలవుతున్నాడతను.

నానీకి టాటా చెప్పి జీపెక్కాడు విజయ్.

జీప్ గెస్ట్ హౌస్ వేపుగా పరుగెత్తింది.... అప్పటికే ఆహ్వానితులంతా గెస్ట్ హౌస్ దగ్గరకు చేరుకున్నారు.

ముందు అల్పాహార విందు తరువాత మీటింగ్ ప్రారంభమయింది.

విజయ్ మైక్ ముందుకొచ్చాడు...

"చుట్టుపట్ల గ్రామాల్లో ఈ మధ్య తరచుగా జరుగుతున్న దొంగతనాల విషయమై చర్చించటానికి సమావేశం ఏర్పాటు చెయ్యబడిందని మీకందరికీ తెలుసు. అందుకే ఆ గ్రామాలకు చెందిన వాళ్లనే ఆహ్వానించాము. ఇంద్రాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న నలభై గ్రామాలకు చెందిన పోలీసాఫీసర్లు..... గ్రామపెద్దలు... కొందరు ఉత్సాహవంతులైన యువకులూ ఇప్పటి ఆహ్వానితుల్లో ఉన్నారు. నేను చెప్పేది జాగ్రత్తగా వినండి...

దొంగతనాల నరికట్టడంలో ఆయా గ్రామాలకు చెందిన పోలీసులకు ప్రజలు.... ముఖ్యంగా యువకులు. అధికార్లు. పెద్దలు సహకరించాలి.

రోగం వచ్చాక మందువేసి. ప్రయాసలకోర్చి నయం చేసుకోటంకన్నా, ముందుగానే రోగ నిరోధక చర్యలు తీసుకోటం వివేకవంతమైన లక్షణం.

అలాగే దొంగతనం జరిగే వరకూ వేచివుండి. జరిగాక పరిశోధనకు పూనుకోకుండా వాటిని ముందుగానే అరికట్టే మార్గాలన్వేషించాలి.

ఇందుకుగాను. ప్రాథమిక చర్యగా.... మీమీ గ్రామాల్లో యువకులూ ఉత్సాహవంతులూ కలిసి దళాలు ఏర్పరచుకుని గస్తీ తిరగాలి వంతులవారీగా.

గ్రామాలలో ఉన్న కల్లు. సారాయి దుకాణాల్లోకి ఎవరైనా కొత్తవాళ్లు వచ్చినా... వాళ్ల ప్రవర్తన అనుమానాస్పదంగా అనిపించినా వెంటనే ఈ విషయాన్ని పోలీసులకి తెలియ చెయ్యండి.

నేరానికి సంబంధించిన అత్యవసర సమాచారం తెలపటానికి ఎవరైనా ఫోన్ చేస్తే ఆ ఖర్చు మేం భరిస్తాం. లైసెన్స్ తుపాకులున్న గ్రామస్థులు మీ గ్రామాలమీద దాడి చేసిన దొంగల్ని. బందిపోట్లని బెదిరించో... గాయపరిచో లొంగదియ్యండి...

తరవాత-

నేరం జరిగినప్పుడు ఆ ప్రదేశానికెవరూ వెళ్లకుండా కాపలాకాస్తూ పోలీసులొచ్చేవరకూ ఎక్కడి వస్తువులక్కడ అలాగే ఉండనివ్వండి. లేకుంటే జనమంతా ఆ ప్రదేశంలో చేరి అస్తవ్యస్తం చేస్తారు. అందువల్ల అనేక సాక్ష్యాధారాలు దొరక్కుండా పోతాయి. అంచరికాలివేలి ముద్రలా ప్రదేశంలో

చిందరవందరగా పడటంచేత ఒక్కోసారి పోలీస్ కుక్కలు కన్ఫ్యూజయి అమాయకుల్నే నేరస్థులుగా భ్రమసి వాళ్ళని పట్టుకోవచ్చు.

ఇలాంటి ప్రాథమికమయిన విషయాలు మీరంతా తెలుసుకోవాలి.

మీరూ మేమూ శత్రువులం కాము. మన మధ్య పూడ్చలేనంత అగాధమేం లేదు. మీరు మీకు తోచిన రీతుల్లో మాకు సహాయ పడొచ్చు.

ప్రతి మూడు గంటలకూ ఒక్కో బ్యాచ్ చొప్పున మారుతూ మీరు ఏర్పరచుకున్న రక్షణ దళాల ద్వారా గస్తీ తిరగండి. మా పోలీసులు మీకు అండగా ఉండనే ఉంటారు.

మీరు మాకీ విధంగా సహకరించినట్లయితే దొంగతనాల బెడద మీ గ్రామాల్లో పూర్తిగా తగ్గిపోతుంది" అన్నాడు విజయ్.

"తప్పకుండా మీరు చెప్పినట్లే చేస్తాం సార్" ఉత్సాహంగా అన్నారు యువకులు.

సర్పంచులు, ఇతర పెద్దలు కూడా ఈ విషయంలో తమ ఆసక్తిని కనపరిచారు.

పోలీసాఫీసర్లకు కూడా కొన్ని హెచ్చరికలు... సలహాలు... ఆజ్ఞలు ఇచ్చి పంపాడు విజయ్.

అంతా కలిసి విజయ్ సూచనలను పూర్తిగా అమలు జరుపటంతో ఆయా గ్రామాల్లో దొంగతనాల సంఖ్య గణనీయంగా పడిపోయింది.

"ప్రజలకూ పోలీసులకూ మధ్య సామరస్యాన్ని ఏర్పరచి ప్రజలను ప్రోత్సహించి తమను తామే రక్షించుకునేలా చొరవ చూపి అద్భుతమైన ప్రొగ్రెస్ సాధించినందుకు విజయ్‌కి పై వాళ్ళ నుంచి అభినందనలు అందాయి. ఈ విషయం తెలిసిన డి. ఐ. జి. కూడా విజయ్‌ని ప్రత్యేకంగా అభినందించాడు. అందరూ ఆ విధంగా చొరవ తీసుకుని సమావేశాలేర్పాటు చేసి ప్రజల్లో మార్పు తెస్తే బావుంటుందని సూచించాడు.

ఇలా అందరి అభినందనలూ అందుకున్నందుకు విజయ్‌కేం సంతోషంగా లేదు.

దొంగలని స్పష్టంగా మార్కు వేసుకుని, ఎవరి అండా లేని చిన్న చిన్న దొంగల మీద తాను విజయం సాధించాడు. నిజమే!

కానీ.... పైకి పెద్ద మనుషులుగా చలామణీ అయ్యే అసలు దొంగలయిన రంగారావు లాంటి వాళ్ళ సంగతేమిటి? వాళ్ళ మీదికి ఏ ప్రజల్ని ఉసిగొల్ప గలడు? వాళ్ళదాకా వచ్చేసరికి పై అధికారులు కూడా అభినందన పరంపర లాపేసి హఠాత్తుగా మౌనం వహిస్తారు.... వాళ్ళ జోలి నీ కెందుకని మందలిస్తారు...., "నువ్వు పెద్ద నిజాయితీ పరుడివిలే" అని హేళన చేస్తారు.... అనేక విధాలుగా బెదిరిస్తారు!

రంగారావు పచ్చి దొంగ! బ్లూ స్టార్ పేరిట ఫైవ్‌స్టార్ క్లాసు వ్యభిచార గృహాన్ని నడుపుతున్న నీచుడు....

వాడి చేతికింద ఉన్న గూండాలు చేసే అకృత్యాలకు.... మర్డర్లకు, కిడ్నాపింగ్‌లకు అంతు లేదు.

వాడు చెయ్యని దారుణాలు లేవు. ఎందరో బందిపోటు దొంగల్ని మించిన కిరాతకుడు వాడు....

ఇవన్నీ అందరితో పాటు తమ పై అధికార్లకు కూడా తెలుసు. ప్రజలకూ తెలుసు.

కానీ.... రంగారావు జోలి కెవరూ పోరు....

వాడిని పెద్ద మనిషిలాగే గౌరవిస్తారు....

వాడి కనుసన్నలలో మెలగాలని.... వాడి మెప్పు పొందాలని తహ తహ లాడతారు....

వాడి శక్తి యుక్తులు, పలుకుబడీ అలాంటివి!

వాడు ప్రమోషన్నిప్పించ గలడు.... అవి రాకుండా అడ్డు పడగలడు. కాన్ఫిడెన్షియల్ రిపోర్టుల వగ్గర్నుంచే ధ్వంసం చెయ్య గలడు....

కావాలనుకున్న వాడిని కోరిన ఊరికి ట్రాన్స్ఫర్ చేయించ గలడు.... ఎదురు తిరిగిన వాడిని మంచి నీళ్ళు కూడా పుట్టని మారు మూల ప్రదేశాలకు తోయించి పారెయ్య గలడు.... రాజకీయ చక్రాన్ని అపర శ్రీ కృష్ణుడిలా తిప్పెయ్య గలడు....

ఏదయినా చెయ్యగలడు.... తన కనుకూలమైన ఎవిడెన్సు సృష్టించుకుని ఇందుకు మినిస్టర్ల చేతనే సాక్ష్యాలు పలికించ గలడు....

ఇలాంటి వాళ్ళు సంఘంలో వేళ్ళూని.... ఊడలు విస్తరింప చేసుకుని బలంగా వ్యాపించ డానికి కారణం ఎవరు?

ప్రజలు!

వాళ్ళే కారకులు!!


వాళ్ళ అమాయకత్వం కన్నా మూర్ఖత్వమే దీనికి మూల కారణం.

ప్రజాశక్తి తిరగబడిన నాడు ఇలాంటి వాళ్ళంతా వేళ్ళతో సహా కూలిపోతారు.

అది జరగదు! జరిగేదని కాదు.

కనీసం.... ఇలాంటి రంగారావుల్ని పట్టుకుని ఏరి పారేసి, శిక్ష విధించ బడేలా చెయ్యగల స్వతంత్రం.... ఇండివిడ్యుయాలిటీ తమ డిపార్ట్‌మెంటు కున్ననాడు.... ఇందుకు అధికార పక్షం అడ్డు పడకుండా ఉన్నప్పుడు చాలా వరకూ విజయం సాధించొచ్చు. అనేక దారుణాల్ని అరికట్టొచ్చు. అమాయకుల్ని రక్షించొచ్చు.

అది నిజమైన విజయం. అందరికీ ప్రయోజనాన్ని అందించగల ఘన విజయం. ఎన్నో అమాయక.... నిరుపేద నిరాధార కుటుంబాల కన్నీళ్ళు తుడి చెయ్యగల అపూర్వమైన విజయం.



కానీ.... అలాంటి అద్భుతాలీ రత్నగర్భ మీద జరగవు.

ఇలా ఆలోచించి తను నిరుత్సాహ పడడు. రంగారావుతో తలపడ తలపడ తలపడతాడు. వాడిని పట్టి బంధించి కఠిన శిక్షపడేలా చేసేవరకూ తను ఊరుకోడు.

మళ్ళీ ఏ నాయకుడి జోక్యంతోనూ కూడా బయటపడలే నంత తిరుగులేని సాక్ష్యాధారాలు సంపాయించాలి. కనీసం బెయిలు కూడా దొరకనంత పకడ్బందీగా వాడిని పట్టాలి.

ఈ విజయ్ ఏరియాలో అలాంటి రాచపుళ్ళు మళ్ళీ మళ్ళీ సెల వెయ్యకుండా చూడాలి.

అందుకే ఎంతో వేదనను మనసులో దాచుకుని బలవంతాన ఇంత నిగ్రహం చూపుతున్నాడు తను.

హఠాత్తుగా వాడి స్థావరా లన్నిటి మీదా ఒకేసారి దాడి చేసి వైజయంతిని వెతికి తెచ్చుకోవాలనే కోరికను బలవంతాన నిగ్రహించు కుంటున్నాడు.... ఈ గాయాన్ని.... అది ఎంతగా సలుపుతున్నా పళ్ళ బిగువున అణుచు కుంటున్నాడు. ఫోమ్ బెడ్ మీద పడుకుని, మెడ వరకూ తెల్లని బ్లాంకెట్ కప్పుకుని మందంగా వెలుగుతున్న జీరో బల్బు మీద దృష్టి నిలిపి ఆలోచిస్తున్న విజయ్ తల తిప్పి నానీకేసి చూశాడు.

(ఇంకా ఉంది)

పుత్రేషణ

భమిడిపాటి భాస్కర రామారావు

విజయ విచారంగా ఉంది. పెళ్ళయి పన్నెండేళ్ళయినా సంతానం కలగలేదు విజయకు. ఆమె విచారానికి మూల కారణం కేవలం అదికాదు. ఆ రోజు సాయంత్రం మూడూ నాలుగు గంటల వేళ తన అత్తగారు పక్కింటి పిన్నిగారితో అన్న మాటలు ఆమె హృదయాన్ని ములుకుల్లా తాకి గాయ పరిచాయి. ఆ నాడు మనవణ్ని చంక నేసుకుని వచ్చిన పిన్నిగారితో తన అత్త, "నీకేమమ్మా! మహరాజువి. మనుమలు మనుమరాండ్రతో నీ యిల్లు పొదరింటిలా కళకళలాడుతూ ఉంటుంది. ఇక నా యింట్లో సంటావా, ఏది? ముచ్చటకేనా ముద్దు ముద్దుగా చిలుక పలుకులు పలికే చిన్నారి ఒక్కరు కూడా లేరు.

నా కొడుక్కి పెళ్ళి చేసి పుష్కరం గడిచింది. ఏదీ? అంతా నా తలరాత. నా ఖర్మ! మా వాడి పాలికి ఈ గొడ్రాలు దాపురించింది.

అక్కడికీ నా కొడుక్కి చిలక్కి చెప్పినట్టు చెబుతూనే ఉన్నాను. ఈ గొడ్డుమోతు మొహాన్ని విడిచి పెట్టి ఎంచక్కా మరో పెళ్ళాన్ని తెచ్చుకోరా అని. అబ్బే! వింటేనా వాడు. ఈ వగలమారి బొమ్మ మోజులో నా మాటలన్నీ చెవిటికి శంఖూదిన చందమేనాయె! అంతా నా ఖర్మ" అంది.

విజయతో రాజశేఖరానికి పెళ్ళయి పన్నెండేళ్ళు గడిచినా పిల్లలు పుట్టలేదని పక్కింటి పిన్ని గారికీ తెలుసు. పిల్లల కోసమని ఆ దంపతులు చేయని వ్రతాలూ నోచని నోములూ లేవని కూడా తెలుసు. రాజశేఖరం అన్నగార్లకు గంపెడు గంపెడు సంతానం ఉన్న సంగతీ ఆవిడకు తెలుసు.

అయితే ఆమెకు అర్థంకాని దల్లా ఒక్కటే! ఏ తోటికోడలూ చేరనివ్వని అత్తగారిని దగ్గర పెట్టుకుంది విజయ. అంతేకాక కన్నతల్లి కంటే ఎక్కువగానూ ఎంతో అపురూపంగానూ చూచుకుంటుంది. అలాటి కోడలు మీద ఆవిడ ఎప్పుడూ ఎందుకు అల్లా విరుచుకు పడుతూ ఉంటుందో అని.

అసలే బిడ్డలు లేరన్న దిగులుతో కృంగి పోతోంది కోడలి మనసు. అలాటిది యిక తన మాటలనే ఈటెల ఘాతాలకు మరెంత వ్యధకు లోనవుతుందో ఒక్క క్షణమైనా ఎందుకు ఆలోచించదా అన్న విషయం కూడా ఆమెకు అర్థం కాని సమస్యే!

ఇంకా తాను ఆలస్యం చేస్తే విజయ మీద ఆమె దాడి మరింత ఉధృతం అవుతుందన్న సత్యం ఎరిగినది కావడంతో, "ఇదిగో వదినా! ఈ రోజు పురాణం సీతా కళ్యాణఘట్టం. మంచి రసవత్తరంగా ఉంటుంది. లే! ఆలస్యం అయితే ఎక్కడో వెనుక వరుసల్లో కూచో వాల్సి వస్తుంది" అని హెచ్చరించింది.

"ఔనౌను సుమా!" అంటూ బయలుదేరింది విజయ అత్తగారు.

అదిగో! ఆ క్షణం నుండి రంపపు కోతకు గురవుతోంది విజయ హృదయం. అలా పరధ్యానంగా కూచున్న విజయకు దిగంతాల్లో మసక చీకట్లు కమ్ముకుంటున్న వైనం కూడా తెలియటం లేదు. భర్త తన వ్యాపార స్థానం నుండి తిరిగి వచ్చే వేళ అవుతోందనే స్పృహ కూడా లేదు. కళ్ళ వెంటనయితే ధారలుగా కారడం లేదు గాని ఆమె గుండె మూగగా రోదిస్తోంది.

చీకట్లు నలుదిశలా కమ్ముకుంటున్న ఆ సమయంలో రాజశేఖరం ఇంట్లో అడుగు పెట్టాడు. హాల్లో సోఫాలో కూచుని ఉన్న విజయ మసక మసకగా కనిపిస్తోంది. ఆ వేళకు ఇంట్లోని స్థితిని చూచి విజయ విచారిస్తోందని గ్రహించాడు రాజశేఖరం. అందుకు కారణం కూడా అతడికి తెలిసినదే! ఆ రోజు కూడా తల్లి విజయను ఏవో సూటీపోటీ మాటలతో బాధించిందన్నమాట.

నిశ్శబ్దంగా హాల్లోకి నడిచి టక్కుమని స్విచ్చి నొక్కాడు రాజశేఖరం. ట్యూబ్ లైట్ కాంతి పాల వెన్నెలలా హాలంతా ఆవరించింది.

తపోభంగమయిన యోగినిలా చటుక్కున తల ఎత్తి చూచింది విజయ. ఎదురుగా భర్త.

వెంటనే లేచి ఆమె వంట యింటి వైపుగా నడిచింది.

రాజశేఖరం ఉస్సురని నిట్టూరుస్తూ ఫాంటు స్లాకుల నుండి లుంగీలోకి మారి బాత్‌రూమ్‌కు వెళ్ళికాళ్ళూ చేతులూ ముఖంకడుక్కుని తువ్వాలుతో తుడుచుకుంటూ వచ్చి హాల్లో సోఫాలో కూచున్నాడు.

విజయ కాఫీ కప్పుతో వచ్చింది.

రాజశేఖరం మౌనంగా కాఫీ తాగాడు. కప్పు సాసరు ఎదురుగా ఉన్న టీపాయ్‌మీద పెట్టాడు.

"ఏమండీ!" పిలిచింది విజయ.

"ఏం విజయా!" అంటూ ఆమె వైపు చూచాడు రాజశేఖరం. విజయ ముఖం వర్షించడానికి సిద్ధంగా ఉన్న మేఘంలా ఉంది.

"ఏమండీ!" మళ్ళీ పిలిచింది విజయ.

"చెప్పువిజయా!" లాలనగా అన్నాడు రాజశేఖరం.

విజయ చటుక్కున రాజశేఖరం కాళ్ళ ముందు కూచుంది.

"నేనీ చిత్తక్షోభ భరించలేనండీ!" అంటూ ముఖం అతడి ఒడిలో ఉంచి వెక్కి వెక్కి ఏడ్వసాగింది.

"మా అమ్మ ఇవాళ కూడా నిన్ను బాధ పెట్టిందా విజయా?" ఆమె తలనిమురుతూ లాలనగా అన్నాడు రాజశేఖరం.

"ఏమండీ! ఈ గొడ్డు మోతు దానితో ఎన్నాళ్ళు కాపురం చేస్తారండీ! మానవుడు ఈషణ త్రయానికి అతీతుడు కాడండీ! అందులో పుత్రేషణ కూడా ఒకటండీ! నా మాట వినండి. మీరు మరో ఆమెను చూచి పెళ్ళాడండి. కనీసం ఆమె కడుపునన్నా ఓ కాయ కాస్తే ..."అంటూ వెక్కిళ్ళ మధ్య మాట పూర్తి చేయలేక పోయింది విజయ.

విజయ స్థితి చూచి రాజశేఖరం కళ్ళలో కూడా గిర్రున నీళ్ళు తిరిగాయి. కాని నిగ్రహించుకున్నాడు. ఉపశమన పూర్వకంగా విజయ తల నిమురుతూ కొద్ది క్షణాలు మౌనంగా ఉండిపోయాడు.

విజయ కాస్త స్థిమితపడింది.

"విజయా!" పిలిచాడు రాజశేఖరం.

చెప్పండన్నట్టు తలఎత్తి చూచింది విజయ.

రాజశేఖరం విజయ భుజాలు పట్టుకుని లేవదీసి సోఫాలో తన పక్కన కూచో పెట్టుకున్నాడు.

"విజయా! మనం ఇద్దరం కలిసి స్పెషలిస్టుల చేత పరీక్షలు చేయించుకున్నాం. మనిద్దరిలో నూ కూడా లోపం లేదని ప్రతి స్పెషలిస్టూ చెప్పాడు.

మా అమ్మ ఏదో మూర్ఖంగా అలా అందే అనుకో! నువ్వూ అదే పట్టుకు కూర్చుంటే ఎలా?"

"ఏమోనండి. ఎవరి అదృష్టం ఎలాటిదో మనం ఏం చెప్పగలం?" నిస్పృహగా అంది విజయ.

"అవునా? అలాటప్పుడు నేను మరో పెళ్ళి చేసుకుంటే మాత్రం పిల్లలు పుట్టి తీరుతారని గ్యారంటీ ఏమిటి? విజయా!ఇప్పుడంటే అన్నావు కాని మరింక ఎప్పుడూ ఆ ప్రసక్తి తేకు సుమా!' అన్నాడు రాజశేఖరం.

"మరి మనమూ పెద్దవాళ్ళం అయిపోతున్నాం, మనకంటూ మనవాడనే పిల్లాడు ఒకడుండొద్దు టండీ!"

"విజయా! మన వాడనే వాడు ఒకడుండాలని నాకూ ఉంది. కాని యింతవరకూ ప్రకృతి సహజంగా మనకా అదృష్టం కలగలేదు" అని, "నాకో ఆలోచన తోస్తోంది చెప్పనా?" అన్నాడు.

విజయ కళ్ళు ఆనందంతో మెరిశాయి.

చెప్పమన్నట్లు చూచింది.

"ఎవరయినా దిక్కులేని బిడ్డను ఒకడిని చేరదీసి పెంచుకుంటే?" భార్య మొహం వైపు సందేహంగా చూస్తూ అన్నాడు రాజశేఖరం.

విజయ మొహంలో అతడాశించిన ప్రోత్సాహం కనిపించలేదు. మనసు కాస్త నిరాశకు గురయింది. అయినా-

"ఏం విజయా ఏమంటావ్?" అన్నాడు.

"దిక్కులేని బిడ్డను చేరదీస్తే నలుగురూ చిన్నతనంగా చూస్తారండీ! అప్పుడు మనం మరింత మానసిక క్షోభకు గురి కావలసి వస్తుందేమో! కాస్త మీరూ ఆలోచించండి".

"విజయా! నీ మనసులో వేరే ఉద్దేశ్యం ఏమన్నా ఉంటే చెప్పు, బాగుందంటే అలాగే చేద్దాం".

"ఇంతకూ ఎవరిని దత్తు తీసుకుంటే బాగుంటుందంటారు?"

"అది కాస్త ఆలోచించ వలసిన విషయమే విజయా. ఎందుకంటావా, ఏ పిల్లవాడిని మనం చేరదీసినా వాడి కోసం మాటికి మాటికీ వాళ్ల వాళ్లు ఎవరో ఒకళ్లు తరుచు వస్తూండడం జరుగుతూంటుంది. దత్తు తీసుకోగానే వాడు నీ కొడుకేనని మనసారా భావించే నువ్వు వాడు చేసే అల్లరి పనులకు కోపించడం కూడా చాలా సహజం.

అది పట్టుకుని నువ్వు వాళ్ల కన్న బిడ్డను ఏదో ఆరడి పెడుతున్నావని భావించి వాడిని వాళ్లు వెనకేసుకు రావడం జరుగుతుంది. నీ మనసు కష్టపడుతుంది. ఈ రభస మధ్య ఆ పిల్లవాడికి మనకీ మధ్య అనుబంధం ఏర్పడడం కష్టమౌతుంది.

దానితో ఆ దత్తుడు ఆకును అందకుండా, పోకను పొందకుండా అన్న చందంగా తయారవుతాడు. కేవలం మనడబ్బు కోసమే మన



"బంధువర్గంలో ఎవరైనా పిల్లవాణ్ణి దత్తు తీసుకుందామండీ!"

"నీ మాట నేనెప్పుడయినా కాదన్నానా? అలాగే చేద్దాం".

రాజశేఖరం మాటలతో విజయ ముఖం వికశించిన పుష్పమే అయింది.

"ఏమండీ!" పిలిచింది విజయ.

"ఊఁ! చెప్పు".

ఎదుట ప్రేమాభిమానాలు ఒలకపొయ్యడం జరుగుతుంది.

"ఏం పెడితే మాత్రం నువ్వు మా అమ్మవవుతావా" అన్న సామెతకు అనుగుణంగా వాడి యొక్క నిజమయిన ప్రేమాభిమానాలు వాడిని కన్న తల్లిదండ్రుల మీదే ఉంటాయి. అందుచేత నువ్వు కాస్త సావధానంగా ఆలోచించు".

"మీదంతా మరీ చోద్యం సుమండీ! ఎక్కడో ఎవరినో అలాటి వాళ్లను చూచి ఉంటారు. దానితో అందరిని అదే గాట కట్టేస్తున్నారు."కాస్త నిష్ఠూరంగా అంది.

"ఛ! ఛ! అదేంలేదు. మనలో కలిసిపోయే పిల్లాడూ, చీటికీ మాటికీ వాడిని చూసి పోవడం అనే వంకతో మాసాల తరబడి మన యింట తిష్ఠ వేసేవారూ కాని కుటుంబం ఉంటే చెప్పు. తప్పక తీసుకుందాం. కాని ఇంతకూ వాళ్ళు పిల్లాడిని దత్తత యివ్వడానికి అంగీకరించడం కష్టం అనుకుంటాను."

"మీ వెర్రిగాని ఎందుకివ్వరండీ! ఎగిరి గంతేసి మరీ యిస్తారు. మనకా ఇప్పటికే బోలెడు డబ్బుంది. మీరా ఈనాటికీ వ్యాపారంలో రెండు చేతులా ఆర్జిస్తున్నారు".

"విజయా! దత్తతకు నిర్ణయింపబడ్డ పిల్లవాడు మరణించినట్లు భావించి వాడికి అపరకర్మలు చేయిస్తారు ఆ తల్లిదండ్రుల చేత.

తరువాత వాడిని అగ్నిహోత్రం మీదుగా దత్తు తీసుకునే దంపతులకు జననీ జనకులచేత మంత్రాలు చదువుతూ అందజేయిస్తారు.

అప్పుడు వాడు వారి గర్భవాసాన జన్మించినట్లు బారసాల నామకరణం వగైరా తంతు జరిపిస్తారు.

సాధారణంగా ఇలాటి తంతుకు అంగీకరించే వాళ్ళు దొరకరేమో?"

"మీకన్నీ సందేహాలే. మనం నోరు విడిచి అడగాలే గాని మా అన్నయ్య తన కొడుకును కళ్ళ కద్దుకుంటూ ఇస్తాడు". ఆనందంగా చెప్పింది విజయ.

సరే నీ యిష్టం. అలాగే అడుగుదాం".

"ఒరే అబ్బాయ్! నేనంతా వింటూనే ఉన్నాను.

పుత్రేషణ

దత్తతకు సంబంధించిన కర్మ కాండ అంతా బాగానే చెప్పావు. కాని ఒకటి మరచిపోయావు. అదే ముఖ్యమయినది. అప్పుడే లోపల కడుగు పెడుతూ అంది రాజశేఖరం తల్లి.

రాజశేఖరం విజయ ఆ వైపుగా చూస్తూ ఉండిపోయారు.

"ఆ తెచ్చుకొనే పిల్లాడు స గోత్రంలో వాడే అయి వుండాలి. పరాయి గోత్రాల వాళ్ళు పనికిరారు" చెప్పిందావిడ.

తన అత్తగారు ఏదో మడత పేచీ వేస్తోందని అర్థం చేసుకుంది విజయ.

"అయితే యిప్పుడు మేమేం చెయ్యాలో చెప్పవే అమ్మా!" అన్నాడు రాజశేఖరం.

"నీ పెద్దన్నయ్య రెండో కొడుకు లేడూ! వాణ్ణి దత్తు తీసుకో. ఇహానికి ఇహమూ పరానికి పరమూను".

తన భర్త పెద్దన్నయ్య అనంతనారాయణ. ఆతడి రెండో కొడుకు పేరు లక్ష్మణరావు. పేరు మాత్రమే లక్ష్మణరావు. వయసు పదహారుకు మించకపోయినా వాడు వెయ్యని వేషాలు లేవు. పోని పోకిళ్ళు లేవు. వాడినే కనక దత్తుడుగా తెచ్చుకుంటే తమ పాట్లు కుక్కలు కూడా పడవని విజయకు తెలుసు.

తన అత్తగారి ఎత్తు వేరు. దత్తత పేరుతో యిక్కడిది పెద్ద కొడుక్కి దోచి పెట్టి తద్వారా పెద్ద కోడలి మెప్పు సంపాదించాలని.

తను ఏమయినా ప్రత్యేకంగా చెపితే తాను తన అన్నగారిని వెనకేసుకు వస్తోందని భర్త అపార్థం చేసుకుంటాడని భయం. దానితో ఆమె ఏమీ మాటాడకుండా ఉండిపోయింది.

పెద్ద బావగారి కొడుకును దత్తు తీసుకుందుకు వీల్లేదని తను ఖచ్చితంగా చెప్పిందంటే తన భర్త కాదనడని తెలుసు. కాని దానితో ఎవరో ఒకరు తమ బిడ్డగా దొరికే భాగ్యం చెయ్యి జారిపోయిందని భయమూ, విజయ మనసును కల్లోల పెట్టాయి. అందుకే మౌనంగా ఉండిపోయింది.

విజయ ముఖం వైపు చూచాడు రాజశేఖరం.

తన తల్లి ప్రతిపాదన ఆమెకు నచ్చలేదని ఆమె మొహం చూడగానే అర్థమైంది.

"అయినా, "విజయా! మా అమ్మ ఏదో అంటోంది కదా! నీ ఉద్దేశ్యం ఏమిటి?" అని అడిగాడు.

"నా ఉద్దేశ్యానికేం లెండి". అని, "పోనీ ఓ పని చేద్దామా?" అంది.

"చెప్పు".

"మీ అన్నయ్యగారి పిల్లాడు లక్ష్మణరావునూ మా అన్నయ్యగారి కొడుకు నరసింహాన్ని కూడా తెచ్చి కొన్నాళ్ల పాటు మన దగ్గర అట్టి పెట్టుకుందాం. కొంత కాలం అయేటప్పటికిఆ ఇద్దరిలో ఎవరు బుద్ధిమంతులో తేలిపోతుంది. అప్పుడు ధత్తత నిర్ణయం తీసుకుందాం. ఏమంటారు?" అంది విజయ.

మూడో నాటికల్లా రాజశేఖరం అన్నయ్య అనంత నారాయణ, వదిన కాంతమ్మ, కొడుకు లక్ష్మణరావు వచ్చి వాలారు.

రెండు మూడు రోజులు గతించాయి.

అనంతనారాయణ రాజశేఖరంతో, "తమ్ముడూ! అమ్మ పెద్దదయింది. చాకిరీ చెయ్యలేదు. ఇక మరదలా? ఇన్నాళ్ళూ చిన్న సంసారం నెట్టుకొస్తోంది, ఇప్పుడు కుర్రాడొకడు చేరాడు. ఇందరిని సమర్థించుకు రావడం మరదలు వల్ల కాదు. కాస్త అలవాటయే దాకా మీ వదిన ఇక్కడుంటుంది. ఇవాళ బయలుదేరి నేను వెళతాను". అని, "మన శాస్త్రుల్లుగారి చేత దత్తతకు ముహూర్తం పెట్టించమంటావా?" అన్నాడు.

"ముహూర్తానికేం తొందర లేదన్నయ్యా! కావాల్సిన వాళ్ళం ఆయాక దత్తత ఒకటీ అడ్డు వస్తుందా! ఆ విషయం తరువాత చూద్దాం". అన్నాడు రాజశేఖరం.

అనంతనారాయణ తన భార్య కాంతమ్మకు ఏవో జాగ్రత్తలు చెప్పి ఆ రోజే బయలుదేరి వెళ్లాడు.


మరో రెండు రోజుల్లో విజయ అన్నయ్య భావనారాయణ వచ్చాడు. ఆతడితో పాటు కొడుకు నరసింహం వచ్చాడు.

భావనారాయణ వస్తూనే రాజశేఖరంతో, "బావా! మా చెల్లి ఏదో పుట్టింటి అభిమానం కొలదీ మా నరసింహాన్ని దత్తు తీసుకోవాలని కుతూహల పడుతోంది, కాని మీ అన్నగారి కొడుకుండగా మరొకర్ని దత్తుడుగా చేసుకోవడం బాగోదని నా ఉద్దేశ్యం". అన్నాడు.

"ఆ విషయంలో ఇప్పుడేం తొందరలేదు బావా! పిల్లవాణ్ణి ఎలాగూ తీసుకు వచ్చారు. ఈ వేసవి అయే వరకూ యిక్కడే ఉంచండి. ఒకవేళ నేను మీ వాణ్ణి దత్తు తీసుకోకపోయినా వాడి భవిష్యత్తుకు బాట వేస్తాను" అని చెప్పాడు రాజశేఖరం.

భావనారాయణ కొడుక్కి తగిన బుద్ధులు చెప్పి వెళ్ళాడు.

రోజులు గడుస్తున్నాయి. లక్ష్మణరావు రాజశేఖరం మధ్య మధ్య యిచ్చే డబ్బుతో జల్సాగా సినీమాలు షికార్లు కానిస్తున్నాడు.



అవసరమైతే రాజశేఖరం దగ్గరకు వచ్చి, "బాబాయ్! నాకిది కావాలి. అది కావాలి" అని ఆజ్ఞాపూర్వకంగా చెప్పి జరిపించుకుంటున్నాడు.

నరసింహం అందుకు భిన్నంగా విజయా రాజశేఖరాలకు తలలోని నాలుకలా వ్యవహరిస్తున్నాడు.

అది చూచి రాజశేఖరం తల్లి పెద్దకోడలితో ఓ నాడు, "అదేమిటే నీ కొడుకు? వాడిని ఏదో అందలం ఎక్కించాలని నేను చూస్తూంటేను" అంది.

అందుకు కాంతమ్మ, "ఇంకా కుర్రాడు కదత్తయ్యా!" అంది ముసి ముసిగా నవ్వుతూ.

"అదేమిటే అలా అంటావు. ఆ నరసింహం కూడా మన లచ్చన్న ఈడు వాడే! వాడెలా ఉంటున్నాడో చూడు" అంది అత్త.

"ఆఁ! పోనిస్తురూ. మీ మనవడికేమండీ మహరాజు! పూటకు గతిలేని ఆ నరిసి గాడితో వీడికి పోలికేమిటి?" ఈసడింపుగా అంది కాంతమ్మ.

విజయ అన్నీ వింటూనే ఉంది. కాని తనకెందు కన్నట్టు చూచీ చూడనట్టు ఊరుకుంటోంది. తమ యింటికి యిద్దరు పిల్లలను చేరదీసారు. కాని ఏ పిల్లడూ తమను అమ్మా నాన్నా అని పిలవడం లేదు. వరుసలు పెట్టే పిలుస్తున్నారు.

కుర్రాళ్ళిద్దరికీ ఓ రోజు విజయ ఆ విషయం చెప్పింది కూడాను.

బావగారి కొడుకు, "పిన్నీ! ఇంకా దత్తత అవలేదు కదా! అయ్యాక చూచుకుందాంలే!" అన్నాడు తలెగరేస్తూ.

ఇక అన్న కొడుకు. "అదేమిటో అత్తయ్యా! అన్నీ తెలిసే వయసు వచ్చిందేమో ఎంత ప్రయత్నించీ అలా పిలవ లేకపోతున్నాను. నన్ను మన్నించత్తయ్యా" అన్నాడు.

ఎన్ని చెప్పినా విజయ ఓ స్త్రీ హృదయమే! 'అమ్మా!' అని నోరారా పిలిపించుకోవాలనే కోరిక ఆమెకూ సహజమే! అయితే ఇద్దరు పిల్లలను చేరదీసినా ఆమె కోరిక కోరికగానే మిగిలిపోతోంది.

ఇక తన కోరిక తీరాలంటే భర్త సూచించిన మార్గం వినా గత్యంతరం లేదనే అనిపిస్తోంది.

ఆ రోజు తన నిర్ణయం భర్తకు చెప్పాలనే నిర్ణయానికి వచ్చింది.

తన బిడ్డ లక్ష్మణరావు తోటి కోడలు విజయకు నచ్చలేదని అర్థమయింది కాంతమ్మకు. ఏది ఏమయినా తన కొడుకే ఆ యింటికి యజమాని కావాలని ఆమె దృఢసంకల్పం.

అందుకు నరసింహం అడ్డు వస్తున్నాడు.

వాడి అడ్డు తొలగించాలి ముందు.

కొడుకు లక్ష్మణరావును పిలిచి వాడి చెవిలో ఏదో చెప్పింది. వాడు సరేనన్నాడు.

* * * *

"విజయా!" పిలిచాడు రాజశేఖరం.

"ఏమండీ!" అంటూ వచ్చింది విజయ.

"నా జేబులో పర్సు కనిపించడం లేదు. నువ్వు తీసి ఎక్కడయినా పెట్టావా?"

"లేదండీ! మీకు చెప్పకుండా తీస్తానా?"

"మరేమయినట్టు?"

"ఏమయ్యోయ్ మరిదీ! ఇందాకా ఆ నరసింహం అక్కడ తచ్చాడుతూండగా చూసాను. ఏదో కుర్ర తనం కొద్దీ వాడు తీసాడేమో అడుగు" అంది వదిన కాంతమ్మ.

రాజశేఖరం నరసింహాన్ని పిలిచి అడిగాడు.

"నే తియ్యలేదు మామయ్యగారూ!" ఏడుస్తూ చెప్పాడు నరసింహం.

"మొగుణ్ణి కొట్టి మొగసాలకు ఎక్కి పోయిందన్నట్టు అడగడానికి ముందే ఏడుపు లంకించుకున్నాడు చూడు. వాడి పెట్టె వెతకండి ముందు" అంది రాజశేఖరం తల్లి.

ఆ మాట అంటూనే ఆమె, పెద్ద కోడలూ కలిసి వెళ్ళి నరసింహం పెట్టె తెరిచారు. పెట్టెలో పైనే ఉంది పర్సు. కాని అందులో డబ్బు మాత్రం లేదు.

"డబ్బెక్కడ దాచావురా దౌర్భాగ్యపు వెధవా!" అంటూ నరసింహం జుట్టు పట్టుకుని చావబాద సాగింది రాజశేఖరం తల్లి.

"నాకేం తెలియదు బామ్మగారూ! నాకేం తెలియదు బామ్మగారూ!" అంటూ దెబ్బలు తింటూనే ఏడ్వసాగాడు నరసింహం.

"వేలెడు లేడు! దొంగ వెధవ! ఎంత నాటకం ఆడుతున్నాడో చూడండత్తయ్యా! పోలీసుల్ని పిలిపిస్తే సరి." అని సాగదీసింది కాంతమ్మ.

అంతవరకూ మౌనంగా ఉంది విజయ.

నరసింహం ఎలాటివాడో ఆమెకు బాగా తెలుసు. అత్తగారూ తోటి కోడలూ కలిసి ఏదో పెద్ద పన్నాగమే పన్నారని ఆమె అనుమానం.

విజయకు విపరీతంగా కోపం వచ్చింది.

"ఆగండి!" అని ఒక్క కేకపెట్టింది.

ఆ కేకతో అంతవరకూ ఒళ్ళు తెలియని వీరావేశంతో నరసింహాన్ని కొడుతున్న అత్తగారు ఉలిక్కి పడింది. నరసింహాన్ని కొట్టడం ఆపింది.

"అక్కయ్యా!" తోటికోడలు నుద్దేశించి అంది విజయ.

"ఏమమ్మా?" అంది కాంతమ్మ.

"అక్కయ్యా! నువ్వు చెప్పింది బాగుంది. పోలీసులనూ పిలవ వలసిందే!" అంది విజయ.

కాంతమ్మ మొహం చింకి చాటంతయింది ఆ మాటతో.

"ఒరేయ్ లచ్చిగా! పోలీసులకు ఫోన్ చెయ్యరా!" కొడుకు నుద్దేశించి అంది కాంతమ్మ.

లక్ష్మణరావు ఫోన్ |ఫోన్ నడవ బోతూండగానే వారించి, "అక్కయ్యా! పోలీసులను పిలిచేముందు మన లక్ష్మణుడి పెట్టె కూడా ఒకసారి చూద్దాం." అంది.

అందుకు అత్తా పెద్ద కోడలూ అభ్యంతరం పెట్టారు.

విజయ బలవంతంగా లక్ష్మణరావు పెట్టె తెరిచింది.

పెట్టెలో బట్ట లన్నిటికీ అడుగున దొంతిగా కనిపించాయి రూపాయలు.

ఇప్పు డేమంటా వన్నట్టు తోటికోడలు వైపు చూచింది.

కాంతమ్మ మొహం పాలిపోయింది. కొడుకుతో పర్సు డబ్బుతో సహా నరసింహం పెట్టెలో పెట్టమని చెప్పింది తను.

"నైజగుణానికి తప్ప కంటికి మందు లేదు" అన్న సామెతగా వాడు వాడి గుణం పోనిచ్చుకున్నాడు కాదని వివారించింది.

తమ్ముడి టెలిగ్రాం చూచుకుని వెంటనే

పుత్రేషణ

బయలుదేరి వచ్చాడు అనంత నారాయణ.

తమ్ముడి నోట కథంతా విన్నాడు.

అవమాన భారంతో అతడి తల వాలిపోయింది.

తమ్ముని మాటకు మారు పలుకకుండా భార్యనూ కొడుకునూ వెంట పెట్టుకుని బయలు దేరాడు.

"అన్నయ్యా! అమ్మ పోషణ నిమిత్తం నెల నెలా డబ్బు పంపిస్తాను. అమెను కూడా నీ వెంట తీసుకుపో!" చెప్పాడు రాజశేఖరం.

తల్లి, తన భార్య కలిసి చేసిన దౌర్భాగ్యపు పనికి అనంత నారాయణ అప్పటికే ఎంతో బాధపడు తున్నాడు. తల్లిని దగ్గర ఉంచుకోవడం అతడికి యిష్టం లేదు.

కాని అప్పటి పరిస్థితిలో తనేం మాటాడినా చెల్లదు.

అనంత నారాయణకు తల్లిని వెంట పెట్టుకుని వెళ్ళడం తప్పింది కాదు.

దొంగతనం పేరుతో ముసలమ్మ కొట్టిన దెబ్బలకు నరసింహానికి ఆ రాత్రికే ఒక్క పెట్టున జ్వరం ముంచు కొచ్చింది.

మూడు రోజులయినా కళ్ళు తెరవ లేదు.

"నాకేం తెలియదు బామ్మగారూ! నేను దొంగను కాదు మామయ్యగారూ!" అంటూ సంధి ప్రేలాపన.

ఓ రోజు విజయ, "ఏమండీ! ఈ దత్త పుత్ర శోకం నేను భరించలేను. వీడికేమయినా అయితే యిక నలుగురిలో నూ తల ఎత్తుకోలేం. మా అన్నయ్యనూ, వదిననూ వెంటనే రమ్మని పిలిపించండి!" అంది ఏడుస్తూ.

రాజశేఖరం కబురందుకుని భావనారాయణ దంపతులు వెంటనే బయలుదేరి వచ్చారు.

ఆ పట్టు పట్టు నెల్లాళ్ళకు గాని తేరుకోలేదు నరసింహం.

అందరూ "అమ్మయ్య!" అనుకుని తేలిక పడ్డారు.

ఓ రోజు రాజశేఖరం భావనారాయణతో, "బావా! జరిగిన దానికి చాలా సిగ్గుపడు తున్నాను. నన్ను మన్నించు. మీ పిల్లవాడు మీ దగ్గరే ఉండడం ఉభయులకూ శ్రేయస్కరం.

అయితే నువ్వేం బాధపడక్కర లేదు. నేను ముందుగానే వాగ్దానం చేశాను. నరసింహం చదువు సంధ్యల కయ్యే ఖర్చు గురించి నువ్వు దిగులు పడకు. ఆ భారం అంతా నాది." అన్నాడు.

భావనారాయణ సరే నన్నాడు.

ఇక యింటికంతా మిగిలినది విజయా రాజశేఖరాలు.

జరిగిన రభస తాలూకు మచ్చ మాసిపోవడానికి కొన్ని మాసాలు పట్టింది విజయా రాజశేఖరాలకు.

విజయకు ఇంట్లో ఒంటరిగా కాలం గడవడం లేదు.

ఓ నాడు భర్తతో, "ఏమండీ! మీరన్నట్టే ఎవరైనా మనకు తగిన అనాథ బాలుణ్ణి పెంచుకుందామండీ! అది కూడా పురిటి కందయితే మరీ మంచిది." అంది విజయ.

"అలాగే!" అన్నాడు రాజశేఖరం.

"ఏమండీ! ఆ బిడ్డ ఏ యింటికి చేరుతున్నదీ కన్నవారికి తెలియ కూడదు." అంది విజయ.

"అయితే అలాటి ఏర్పాటు చేయమని ఈ రోజే మన ఫ్యామిలీ డాక్టరుకు చెబుతాను విజయా!" అన్నాడు రాజశేఖరం. □

నేనే

అక్షరాల అరణ్యంలో
అందమైన పూలు వెతికి
పరిమళాన్ని చిందించే
పరాగమాఘ్రాణిస్తూ
మనసుల మైమరపించే
మకరందాన్నొలికిస్తూ...
అంతులేని లోతుల్లో
అవపడకుండా దాక్కుని
అంత ఎంత ప్రపంచాన్ని
అవలీలగా సృజించిన
భగవంతుణ్ణైనా సరే
భావాలలో బంధిస్తూ...
సూటిగ చెప్పాలంటే
సాటిలేని రసజ్ఞుల ఎదలను
మాటిమాటికీ తీయని
మాటలతో స్పందిస్తూ
మనిషికీ, బ్రతుకుకూ మధ్య
మంథనలో ప్రాప్తించిన
విషమైనా అమృతంలా
వినియోగం చేసేందుకు
ప్రతి శబ్దములో సొగసును
ప్రజలకు పంచేది నేనే-
రవి మెట్టని
భువి మెట్టిన
కవిని
సృష్టికర్త ఛవిని

-ఏల్చూరి విజయరాఘవరావు



దూరదర్శనం

లత

ఉషోదయం

నాటిక. రచన: లలితా చలం. ఈ నాటికలో కొప్పరపు సరోజిని గారు అమ్మమ్మగా చక్కగా నటిస్తున్నారు. ఆమె ఒకప్పుడు గొప్ప నటి అని వినటమే గాని చూడటం ఇదే మొదలు.... ఏం లాభం? నాటిక పూర్తి కాకుండానే వార్తలు వచ్చినయ్. ఇది ద్వితీయ భాగం ఉన్న నాటిక కాదను కుంటాను. కాల ప్రమాణాన్ని హైద్రబాద్ టి. వి. పట్టించుకోక పోవడం ఇది మొదటిసారి కాదు. నాటికా రచన ప్రయోజనాత్మక మైనది. స్త్రీల కట్నాల చావుల గురించి– ఇక ముందయినా ఇలాటి మంచి నాటికల్ని పూర్తిగా ప్రదర్శిస్తారని ఆశిద్దాం.

తెనాలి రామకృష్ణ

మాటలు నడిమింటి నరసింగరాజు గారు. దర్శకుడు జయంత్ పరాంజీపే.

తెనాలి రామకృష్ణ వేసిన అశోక్ కుమార్ అభినయంలో, వాచికంలో – చిరునవ్వు చిందులాడే చక్కని రూపముతో ఆ నాటి రామకృష్ణుడు నాగేశ్వరరావు గార్ని జ్ఞాపకం చేస్తున్నాడు. అంతకంటే అతనిని పొగడటం నా చేతకాదు. రచన బాగుంది. ఆహార్యం దర్శకత్వం గొప్పగా ఉన్నాయి. ఇది మద్రాసు వారి అనుగ్రహం. హైద్రాబాద్ మీదకి ప్రసరించినది. మొదటిలోనే ఈ నాటకం రక్తి కట్టినందుకు యూనిట్ వారికి అభినందనలు– చరిత్ర వదిలేద్దాం.

కాలాజల్

ఉగనీ రోషన్‌కి మధ్య వయసు వచ్చింది. తల్లి పోవటంతో ఒక అధ్యాయం అయిపోయింది. దురలవాట్లు అబ్బినయ్. పిల్లలు పెద్ద వాళ్ళయినారు. తండ్రి తన రోజుల్లో ఉండె ముషాయిదాల్ని ప్రేమాభిమానాల్ని మనమలకు చెపుతూ జీవితం గడుపుతాడు. ఒక రోజున ఉన్న పంచదార వృద్ధుడికి టీలో వేస్తుంది కోడలు. మూర్ఖుడైన రోషన్ దానికీ అరుస్తాడు. అది విన్న వృద్ధుడు చనిపోదామని ప్రయత్నించీ చావలేక, కోడలితో చెప్పి ఇల్లు విడిచి పోతాడు. ఈ భాగం హృదయ విదారకంగా ఉంది. కన్నీరు తెప్పించింది. అయిపోయిందా?

వార్తలు

రాజీవ్ గాంధీపై కొలంబోలో హత్యా ప్రయత్నం జరిగిందంటే– సింహళీయులకు కోపం ఉందను కోవాలా? విదేశీ హస్త ప్రావీణ్యమా? టి. వి.లో కనపడ్డ ప్రకారం నౌకాదళంలోని ఒక రాస్కెల్ రైఫుల్‌తో తల మీద కొట్టబోగా భుజం మీద దెబ్బ తగిలింది. ప్రధాన మంత్రి చాలా చురుగ్గా తప్పుకున్నారు– కాని అతని ప్రాణానికి క్షణంలో ఎంత ప్రమాదం తప్పిందో టి. వి.లో చూశాం– భగవంతుడి దయ.

శోధ్

సత్యజిత్‌రాయ్ సమర్పణ. కిందటి వారం కథ తరువాయి భాగం –క్షమించాలి ప్రేక్షకులు. కిందటి వారం ప్రదోష్ అన్నట్లు నాకు వినబడింది ఎనౌన్సరు అన్నదో ఇప్పుడు చెప్పలేను. తనూజ – అనుపమ్‌ఖేర్ ఓంపురి నటిస్తున్నారు ఇందులో.

దీర్ఘ జీవితం మీద ప్రమోద్ చేసిన రిసెర్చి అంతా ఓంపురి తన డైరీలోకి మార్చి ప్రమోద్ డైరీ (నోట్‌బుక్)ని తగల పెడతాడు. అయితే లండనులో ఉన్న స్నేహితుడని ప్రమోద్ తన రిసెర్చిపర్యు గురించి ఉత్తరం వ్రాస్తాడు. అతను ఇండియా వచ్చి ఓంపురిని అడుగుతాడు. అక్కడ ఓంపురి నటన చాలా బాగుంది. ఈ లోగా ఓంపురి లాబ్‌లో వర్కు చేస్తున్నట్లు అందర్ని నమ్మిస్తాడు. ఇదీ కథ.

బంధు

సత్యజిత్‌రాయ్ రచన. సమర్పణ, దర్శకత్వం సందీప్‌రాయ్.

సాధూ మాస్టారు పిల్లలకి పాఠం చెపుతూ హిమాలయాల్ని, సహారా ఎడార్ని, సముద్రపు లోయల్నీ చూడాలని చెపుతాడు. అతని ఊహల్లో హిమాలయాలకి వెళ్ళలేననే వ్యథ ఉంది. తను ఆర్డినరీ స్కూలు మాస్టరు. స్కూలు విడిచి పెట్టాక ఇంటికి వస్తుంటే ఆకాశంలో చంద్రబింబం లాటి పళ్ళెం కదులుతూ కనిపిస్తుంది. ఏదో ఉపగ్రహం అంటాడు. తనతో వస్తున్నతనితో– ఆ రోజు నలుగురూ కలిసి బుద్ధూకి రాని పాట పాడమని అవమానిస్తారు. అది భరించలేక ఇంటికి వచ్చేస్తాడు. వెదురు చెట్ల మధ్య ఏదో మెరుస్తూ కనిపిస్తుంది. ఈ భాగంలో ఎక్కడా ఫ్లయింగ్ సాసర్ పేరు ఎత్తలేదు గాని కథ ఫ్లయింగ్ సాసర్ల మధ్యే నడిచే సూచన కనిపిస్తున్నది– సాధు మాస్టారుని ఠాకూర్ ప్రభృతులు బుద్ధూ అంటారు. తెలివి తక్కువ వాడిని హిందిలో బుద్ధూ అనడం వెక్కిరింత. సాధుని బుద్ధూ అని వెక్కిరించారు.

ఈ భాగంలో ఇంకా కెమెరా గొప్పతనం వర్ణన మివ్వలేదు. సైంటిఫిక్ ఫిక్షన్‌లో కెమెరాదే ప్రాధాన్యత. సాధు మెల్లిగా కొమ్మల్ని తొలగించి ఫ్లయింగ్ సాసర్ వంక చూడటం బాగుంది– మూడు రకాల కథలు పదమూడు వారాలు ప్రసార మవుతున్నాయి అంటున్నారు. గొప్ప నటులు పాల్గొంటున్నారు. మొదటి భాగంలో ఠాకూరు ఉత్పల్‌దత్ అనుకుంటు న్నాను. సాధు– అనుపమ్ ఖేర్ కాదు కదా? □

"శోధ్"లో ఒక దృశ్యం



Printed and Published for Nageswara Rao Estates Private Ltd., by S. Nageswara Rao, at the Andhra Patrika Press, Gandhinagar, Vijayawada - 520 003. Acting Editor: M. Madhava Rao, Chief Editor: S. Radhakrishna.
Phones: Business: 61247, 61248, 75569 Editorial: 75667

ప్రేమసాగరమథనం

డాక్టర్ కొత్త రవీంద్రబాబు



సీరియల్

(గత సంచిక తరువాయి)

విజయరాఘవన్ చెప్పినట్లు కారు ఆఘమేఘాల మీద పరుగెత్తుకు వచ్చింది. మహాబలిపురం!

కారును సరాసరి బీచ్ వ్యూహోటల్ ముందుకు పోనిచ్చాడు డ్రైవర్ రంగస్వామి.

రంగస్వామి కొత్తగా విజయరాఘవన్ గ్రూప్‌లో జేరాడు. అందువల్ల యింకా పోలీసు రికార్డులలోకి ఎక్కలేదు అతను.

కొత్త చీపురు శుభ్రంగా వూడుస్తుంది అన్నట్లు గ్రూపులో కొత్తగా చేరినవాడు గావటంతో ఎక్కువ వుషారుగా, మెలకువగా చలాకీగా అప్పగించబడ్డ పనులు చేసుకు వస్తున్నాడు!

హోటల్ రిసెప్షనిస్టు దగ్గరకు వెళ్ళి " మా బాస్ రియాద్ హుసేన్ ది సౌదీ అరేబియా! అర్జంటు పనివుండి మదరాసులో ఆగిపోయాడు. ఆయన రెండు మూడు రోజులలో యిక్కడకు రావచ్చు అప్పటి వరకు వారి జనానా యిక్కడే వుంటారు. ఆరుగురు బీగంలకు ఆరు ఎయిర్ కండిషన్డ్ గదులు ఒకే వరుసలో యివ్వండి! బాస్‌కు ప్రత్యేకంగా డబల్‌బెడ్ రూం రిజర్వ్ చేసి వుంచండి!" అన్నాడతను.

తల ఎత్తి ఆశ్చర్యంగా చూస్తున్న రిసెప్షనిస్ట్ ముందు వందరూపాయల దొంతర పడవేసి.

"ఎడ్వాన్స్ నాలుగు వేల రూపాయలు తీసుకోండి! రూం సర్వీసు బాగుండాలని బోయిస్‌కు చెప్పండి. బాస్ మంచి బక్షీస్ యిస్తారు!" అన్నాడు రంగస్వామి.

రిసెప్షనిస్ట్ నోరు మెదపే లోపలే రూం సర్వీసుకుర్రాళ్ళు పరుగెత్తుకొచ్చారు వినయంగా.

రంగస్వామి కోరినట్లు రూమ్‌లు ఎలాట్ చేసాడు రిసెప్షనిస్టు!

రియాద్ హుసేన్ బీగంలు విడివిడిగా రూములు తీసుకున్నాక అరగంటలోనే ఒకేకారులో ఎక్కి మహాబలిపురంలోని విశేషాలను చూద్దామని వెళ్ళిపోయారు.

పంచపాండవుల రథాలున్న తావు, బీచ్ వొడ్డున వున్న ఆలయం ప్రాంతంలో బీగంలు సరదాగా తిరిగారు.

ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మహాబలిపురం శిథిల శిల్పాలుగాని, బీచ్‌గాని బీగంలకు తృప్తినివ్వలేక పోయాయి గాబోలు వెనుదిరిగి వెళ్ళింది కారు.

జరిగిన కథ – 16 : విలూ, దీప్‌ల ఆచూకీ తెలుసుకుని వచ్చిన నాగరాజు, కోటి స్నేక్ పార్క్‌లో హతమైపోతారు. విలూ, దీప్‌లు కంచి చేరతారు. అక్కడ వాళ్ళకు డివైన్ గ్రూప్‌లో రాణి కనబడుతుంది. టైగర్ బృందంతో సహా కంచికి చేరి దీప్ చేతిలో చనిపోతాడు. రాణి పారిపోవడానికి ప్రయత్నించి బలవంతంగా అనుభవించబడుతుంది. విజయరాఘవన్ కూడా కంచికి బయల్దేరతాడు.

అద్దూ అపూ లేకుండా మైళ్ళ బారున పెరిగిన సరివితోట చూడగానే బేగంలకు స్వదేశంలోని ఎడారులు, ఖర్జూరపు చెట్లగుంపులు గుర్తొచ్చాయి కాబోలు కారు ఆపించి బిలబిలమంటూ తోటలో పరుగులు మొదలెట్టారు!

సరివి తోటంతా యిష్టం వచ్చినట్లు విహరించి కాళ్ళు నొప్పెట్టాయో ఏమో మరలా తిరిగి వచ్చి కారులో కూర్చున్నారు. కారు హోటల్ దగ్గరకు వెళ్ళగానే ఎవరి గదిలోకి వాళ్ళు వెళ్ళి పోయారు!

హుసేన్ సాబ్ యిచ్చే బక్షీష్ మీద ఆశతో రూం సర్వీసుబోయిస్ బీగంలు ఏమి అడిగితే అది క్షణాలలో తెచ్చి సప్లయి చేయసాగారు. షేక్‌రియాద్ హుసేన్ గారి జనానాను ముఖాముఖి చూడాలనే కుతూహలం మాత్రం తీరలేదు రూం సర్వీస్ బాయిస్‌కు!

రాత్రిం బవళ్ళు సర్వకాల సర్వావస్థలయందు వాళ్ళు నల్లటి బురఖాలు తగిలించుకుని వుండటమే అందుకు కారణం!

వాళ్ళు వొక్కొక్కళ్ళూ రూముకు తెప్పించుకు తింటున్న మెను చూసి బేరర్ల గుండెలవిసి పోయాయి. "ఒక్కొక్క బేగం యిద్దరు మగవాళ్ళు తిన్నంత తిండి తినిపారేస్తున్నది! సౌదీ అరేబియా షేక్ చాలా ధనవంతుడు కాబోలు!". అనుకున్నారు.

"లంభిణుల్లా తిండి తినటమే గాక అస్తమానం సరివితోటలెంట బలాదూరు తిరుగుతారు షేక్‌గారి జనానా దంతా తమాషా పద్ధతి లావుంది!" అని తమలో తాము గుసగుసలాడుకో సాగారు బేరర్లు.

* * * * * * * * * *

నాగరాజు, కోటిల శవాలను పోస్ట్ మార్టమ్ చేసిన తర్వాత వాళ్ళ బంధువులెవరైనా వస్తారేమోనని ఎదురు చూసారు హాస్పటల్ వాళ్ళు. నాగరాజు రూములో యంగ్‌మెన్స్ రిక్రియేషన్ క్లబ్ అడ్రస్ ఫోన్ నంబరు వుంటే అక్కడకు ఫోన్ చేసాడు పోలీస్ యిన్స్పెక్టరు...

నాగరాజు భయంకర మరణ వార్త విని ఇందిర గోడు గోడున ఏడ్వసాగింది.

"ఒక్కగా నొక్క తమ్ముడు! కళ్ళన్నీ వాడి మీద పెట్టుకుని బతుకుతున్నాను! పాపిష్టిది విలాసిని వాడిమీద ఏమరులు చల్లిందో ఏమో లోకం గొడ్డుబోయినట్లు దాన్నే పెళ్ళి చేసుకుంటానని భీష్మించుకుని వుండి పోయాడు.

దాని వెంటపోయి ప్రాణాలకు చేటు తెచ్చుకున్నాడు!" అని ఏడుస్తూ గల్లంతు చేయసాగింది.

రాఘవరావుకు మనసులో బావమరిది చనిపోయినందుకు పెద్ద దిగులేం లేదు గాని పెద్దమ్మాయి ఆచూకీ తెలియకపోవటం బాధ కల్గించింది. చిన్నమ్మాయి రాణి నాగరాజు వెంట మద్రాసు వెళ్ళిన సంగతి కైలాసం ద్వారా విని యిన్నాళ్ళు వూరుకున్నాడు.

నాగరాజు చచ్చాడన్న సంగతి తెలిసింది గాని రాణి గూర్చిన వార్తేమీ రాలేదు– రాణి తిరిగిరాలేదు.

"ఇందిరా! వూరుకో! నేను యిప్పుడే కారులో మద్రాసువెళ్ళి నాగరాజు శవాన్ని తీసుకువస్తాను!" అన్నాడతను భార్యతో!

నాగరాజు శవం తీసుకు వస్తానని అనగానే పెద్ద పెట్టున ఏడ్వసాగింది ఇందిర.

* * * * * * * * * *

రాఘవరావు కారు మద్రాసులో కింగ్‌కాంగ్ బసచేసి వున్న హోటల్ ముందాగింది.

హోటల్ లాంజిలోంచి పరిగెత్తుకు వచ్చాడు కింగ్‌కాంగ్. విజయవాడ నుండి కైలాసం అంతకు ముందే ఫోన్‌చేసి రాఘవరావు వస్తున్నాడని చెప్పాడు!

"ఘోరం జరిగిపోయింది బాస్" అన్నాడు కింగ్‌కాంగ్ రాఘవరావును చూస్తూనే!

"అమ్మాయి కనపడిందా?" అని అడిగాడు రాఘవరావు.

"పెద్దమ్మాయిని క్షేమంగా మనకొప్పగించేట్లు సందీప్‌ను సఫా చేసేట్లు ఏర్పాట్లు చేసాను" అన్నాడు కింగ్‌కాంగ్.

"నేనడిగేది పెద్దమ్మాయి సంగతి గాదు! చిన్నమ్మాయి రాణి సంగతి!"

"బాస్! చిన్నమ్మాయిగారింకా యింటికి రాలేదా? నాగరాజు గారితో పాటు మద్రాసు వచ్చిన మర్రోజు నుండి కనపడక పోతే యింటికి వెళ్ళి పోయారేమో ననుకున్నా!"

"ఊహూ! అమ్మాయి యింటికి రాలేదు! ఇందిర అమ్మాయి ఏదీ అని అడిగితే ఎక్స్‌కర్షన్‌కు వెళ్ళిందని అబద్ధం చెప్పాను. నిజం తెలిస్తే గల్లంతు చేసి ఇల్లు పీకి పందిరేస్తుందామె! వెంటనే రాణి ఆచూకీ తీసి క్షేమంగా యింటికి తీసుకురా!"

"అలాగే బాస్! ఇక నుండి ఆపనిమీదే వుంటాను!" అన్నాడు కింగ్‌కాంగ్.

"నాగరాజు బాడీ విజయవాడ తీసుకు వెళ్ళే ఏర్పాట్లు చేయించావా?"

"మీరు వెళ్ళి బాడీ గుర్తుపట్టి సంతకం చేస్తే చాలు! మిగిలిన విషయాలన్నీ ఏర్పాటు చేసి వుంచాను."

"సరే! చిన్నమ్మాయిని భద్రంగా యింటికి జేర్చకపోతే ఇందిర గగ్గోలు పెడుతుంది! బి ఎలర్ట్!"

"అలాగే బాస్!"



ప్రేమసాగర మథనం

"నాగరాజు బాడీ తీసుకెళ్ళి అంత్యక్రియలు జరిపించాల్సిన పని వుందీ గనుక విజయవాడ వెళ్తున్నాను! లేకపోతే నేనిక్కడే వుండి స్వయంగా అమ్మాయి ఆచూకీ తీసే వాడిని".

"బాస్! ఇక నుండి క్షణం వృథా పోకుండా మద్రాసంతా గాలించి అమ్మాయి ఆచూకీ తీస్తాను. మీరు నిశ్చింతగా వుండండి."

* * * * * * * * * *

రాఘవరావు కిచ్చిన మాట ప్రకారం క్షణం వృథాపోకుండా విజయవాడ డైరెక్ట్ డయల్ చేసి కైలాసంతో రాణి ఫొటోలు అర్జంటుగా పంపమని చెప్పాడు కింగ్‌కాంగ్.

ఫోన్ చేసిన ఎనిమిది గంటలలోపల రాణి ఫొటోలు అతని చేతిలోకి వచ్చాయి. అవి తీసుకుని ఆరుముగం దగ్గరకెళ్ళాడు.

"వణక్కం ఆరుముగం సార్".

"వణక్కం కింగ్‌కాంగ్ భయ్యా! నువ్వు చెప్పిన పని యింకా కాలేదు!"

"ఆపని కోసం కాదుసార్! మరో పనిపడింది".

ఏమిటన్నట్టు చూశాడు ఆరుముగం.

"మాబాస్ చిన్న కూతురు రాణి వాళ్ళ మేనమామ వెంట మద్రాస్ వచ్చింది!"

"ఎవరు? నాగరాజు వెంటా?"

"అవున్సార్! అతను దుర్మరణం పాలయ్యాడు. అమ్మాయి ఆచూకీ తెలియటం లేదు!" అంటూ రాణి ఫొటోలు రాఘవరావు సంతకం వున్న మరి రెండు బ్లాంక్ చెక్‌లు ఆరు ముగం ఎదురుగా వున్న బల్ల మీదుంచాడు కింగ్‌కాంగ్.

"సరే! చూస్తాలే!" అన్నాడు ఆరుముగం.

* * * * * * * * *

రాణికి మెలకువ వచ్చింది. బరువుగావున్న కనురెప్పలు తెరుచుకుని చూచిందామె. కళ్ళముందు తెల్లగా చక్రాలు గిరగిర తిరుగు తున్నట్టు అనిపించిందామెకు.


ఇసుక నేలమీద పడుకుని వున్నట్టు అర్థం అయిందామెకు. డివైన్ గ్రూప్ టెంట్‌లో వున్నానని తెలుసుకుంది.

టెంట్ బయట షణ్ముఖం, వినాయక్‌లు మాట్లాడుకోవటం వినపడిందామెకు.

"ఆరే షణ్ముఖం! చిలుం పీల్చి ఎంత సేపయిందో వళ్ళంతా ఎలానో వుంది!"

"తప్పురా వినాయక్! డ్యూటీలో వున్నప్పుడు చిలుం పీల్చగూడదురా!"

"అమ్మాయికి కాపలానే గదా మన డ్యూటీ! చూడు రాణి ఎలా గుర్రుపెట్టి నిద్రపోతుందో!"



"ఒరేయ్! డ్యూటీ అంటే డ్యూటీనే! మనిద్దరం చిలుంకొట్టి నిద్రపోతే అమ్మాయి మేలుకొని పారి పోతుంది! పైగా కాళ్ళు చేతులు కట్టి వేసి లేవు!"

"పోరా అనుమానప్పక్షీ! నువ్వు అమ్మాయికి కాపలావుండు. నేను కొంచెం చిలుం పీలుస్తాను!"

షణ్ముఖం టెంట్‌లో పలకు రెండడుగులు వేసి రాణిని కాలితో దొర్లించాడు. మగతనిద్రలో వున్న రాణిని చూసి సంతృప్తిగా బయటకు వెళ్ళి

"ఆరే! వినాయక్! వుండరా!" అంటూ తనూ చిలుంపీల్చసాగాడు.

"ఆరేయ్! చూద్రా వళ్ళెలా పెరిగి పోతుందో".

"ఒరే! నాకు రెక్కలొచ్చినయ్‌రా! ఎగిరిపోతున్నా ఆకాశంలోకి!"

"దూరాన ఆ మంటలు చూడరా! సముద్రపుటలలా హోరున శబ్దం చేస్తున్నాయి!"

"ఆరే మంటలు నన్ను చుట్టుముట్టేస్తున్నాయిరా ఒరే చూద్రా మంటలు ఎంత చల్లగా వున్నాయో? దుప్పటి కప్పురా!"

"ఒరే! పిచ్చి వెధవా! మంటలు చల్లగా వుంటాయట్రా? తెలివి తక్కువ సన్నాసీ!"

"అవున్రా! చలిమంటలు అంటారు వాటినే!"

"వొరేయ్! నన్నెగతాళి పట్టిస్తావురా! చూడు నిన్నేం చేస్తానో?"

"వొరేయ్! ఆపరా నీ వాగుడు! ఎవరయినా చూస్తే నాకు పిచ్చెత్తిందను కుంటారు".

"ఆరే రాస్కెల్!"

"ఆరే స్కౌండ్రల్".

టెంట్ బయట వినాయక్ షణ్ముఖం అలా చిలుం పీల్చి వాదించుకుంటుంటే రాణి నెమ్మదిగా లేచి కూర్చున్నది.

వళ్ళంతా బరువుగా వుండి కీళ్ళన్నీ నొప్పి పుట్ట సాగాయి. మార్ఫిన్ ఎఫెక్టు పూర్తిగా పోలేదేమో కళ్ళు బూజులు గమ్మినట్టు అనిపించ సాగింది.

టెంట్ ఒక మూల సందు చేసుకుని బయటకు వచ్చిందామె!

కాళ్ళల్లో సత్తువ లేక తూలిపడబోయింది! కాని డివైన్ గ్రూప్ సభ్యుల చేతిలో అనుభవించిన హింసలు గుర్తొచ్చి లేని వోపిక తెచ్చుకుని ముందుకు నడిచింది!

ఇసుకలో భారంగా అడుగులు వేస్తూ ముందుకు సాగిందామె.

పోవాలి! ఇక్కడ నుండి వీలయినంత దూరం పారి పోవాలి!

సాంబశివ వచ్చాడంటే వేటకుక్కలా వెంటాడి పట్టుకుంటాడు. అతను వచ్చేలోపలే పారిపోవాలి!

మనసు పెట్టే తొందరలో నీరస శరీరాన్ని ముందుకు నడిపించ సాగింది రాణి.

పదహారేళ్ళ జీవితంలో కావాలన్నది పొందటం, చుట్టూ వున్న వాళ్ళను శాసించటమే ఎరుగునామె!

కొత్తరకం అనుభవాన్ని చవిచూడాలని డివైన్ గ్రూప్‌లో చేరిందామె.

మొదట్లో బాగానే వుందని పించింది. కాని దీప్‌తో మాట్లాడిన దగ్గర్నుంది అతని దగ్గరకు వెళ్ళాలని పించింది!

ఫలితంగా నరక యాతనలను అనుభవించింది. డివైన్ గ్రూప్ నుండి బయటకు వెళ్ళనివ్వరు! వాళ్ళతో నే వుంటే చిత్ర హింసలు పెడతారు!

రాణికి విపరీత మైన భయం కల్గింది! శరీరంలోని శక్తినంతా కూడగట్టుకుని పరిగెత్త సాగిందామె.

విలూ అక్క గుర్తొచ్చిందామెకు! అక్కతన నెంత ప్రేమగా చూసేది! ఈ ప్రపంచంలో తనను ప్రేమగా చూసేది అక్క వొక్కతే అని పించిందామెకు ఆక్షణాన! "అక్కా! అక్కా!" అని అరుస్తూ పరుగెత్త సాగింది రాణి!

ఎండుసరివి కొమ్మ కాలికి తగిలి బోర్లా బొక్కలా యిసుకలో పడి పోయింది రాణి.

* * * * * * * * * *

రాణి "అక్కా!" అని పిలవటం విన్న విలూ వులిక్కిపడి లేచి నుల్చుంది!

దూరంగా ఎవరో అమ్మాయి యిసకలో కుప్ప గూలిపోవడం కనపడిందామెకు.

రచయిత



జవాబులు

కె శివనాగేశ్వరి దేవరపల్లి

ప్ర సుశ్రుత నర్సింగ్‌హోంలో జీవించి ప్రేమసాగర మథనం వరవడిలో కొట్టుకు పోతున్నారు! ఏమంటారు?

జ ఏమీ అనను

కె పద్మావతి చంద్రరావు కాజులూరు (తూ గో జిల్లా)

ప్ర వైద్యవృత్తి యిష్టమా రచనా వృత్తి యిష్టమా

జ రెండూను!

కె శ్యామ యానాం

ప్ర మీ సీరియల్ అసహజ సంఘటనలతో నిండి వుంది సుశ్రుత నర్సింగ్ హోం నచ్చింది

జ ప్రేమసాగర మథనం సస్పెన్సు థ్రిల్లర్ ఈ నవల చాలా సహజత్వం వుట్టి పడుతున్నట్టు రాస్తున్నానని చాలా మంది వుత్తరాలు రాసారు

ఏ సురేష్‌కుమార్ హైద్రాబాద్

ప్ర మీరు రాసుకోటానికో రూము వున్నదా?

జ వున్నది!

జి హరిప్రసాద్‌రాజు బోదన్

ప్ర ప్రజలలో అర్థం పర్థం లేని నమ్మకాలు పోవాలంటే రచయితలు డాక్టర్ల కృషి ఎంతైనా అవసరం

జ మూఢనమ్మకాలు జీర్ణించుకు పోయిన దేశం మనది! ఒక్క సారిగా వాటిని పోగొట్టలేము

హెచ్ ఆర్ ఏ రాజ్‌కుమార్ బళ్ళారి

ప్ర ఎలాటి రచయిత గొప్పవాడనిపించుకుంటాడు

జ సమాజాన్ని ఉద్ధరించ లేక పోతే పోనీ యింకా చెడగొట్టకుండా వుండే రచయిత నాదృష్టిలో (ఈ కాలంలో) గొప్పవాడు

కె ఏ రాజేశ్వరి మైలవరం

ప్ర మీ సీరియల్ మమ్మల్నెంతో ఆకట్టుకుంది

జ థాంక్యూ

ఉత్తమ ప్రశ్న

ఎ రవీందర్ అమ్మాపాలెం (వరంగల్)

ప్ర ఉత్తమ నవల ఎలా వుండాలి?

జ చదువుతున్నంత సేపూ ఆహ్లాదపరుస్తూ ఆ తర్వాత ఉత్తేజాన్ని స్ఫూర్తిని యిచ్చి చిరకాలం గుర్తుండే నవల ఉత్తమ నవల మరికొన్ని మంచి లక్షణాల గురించి యిదివరలో చెప్పాను

సి హెచ్ ప్రసాద్ వీరభద్రం కోటనందూరు

ప్ర మీ సీరియల్‌లో హీరో వూరి నుండి పారిపోయాడేమిటి?

జ స్ట్రాటజిక్ రిట్రీట్!

ఎం కల్యాణి బెండమూర్లంక

ప్ర కత్తి గొప్పదా? కలం గొప్పదా?

జ అక్షర రూపం దాల్చిన సిరాచుక్క లక్ష మెదళ్ళ కదలికకు కారణ మవుతుందన్నారు!

సి హెచ్ వి నాగలక్ష్మి తెనాలి

ప్ర మిమ్మల్ని ఎక్కువగా స్పందింప జేసిన సంఘటన వుందా? వివాహానికి వున్న ప్రాధాన్యత ఎటువంటిది

జ స్పందింప జేసిన సంఘటనలనేకం వున్నాయి! పది వేల సంవత్సరాలుగా మానవ సమాజాన్ని సాంఘిక నైతిక కట్టుబాట్లలో వుంచ గల్గింది వివాహ వ్యవస్థ □

ప్రేమసాగర మథనం

పరుగెత్తుకు వెళ్ళింది విలూ! వెంటనే దీప్ వచ్చాడు

ఇసుకలో పడివున్న రాణిని చూడగానే విలూ మనసు ద్రవించింది

రాణీ!

చెల్లీ! అంటూ బోర్ల బొక్కలా పడివున్న రాణిని వెల్లికిలా తిప్పింది విలూ రాణి వంటినిండా ముఖంనిండా అతుక్కున్న ఇసుక రేణువులను చేతితో తుడిచి వేసింది రాణి తల తన వొడిలో వుంచుకుని రేగివున్న ఆమె ముంగురులు సవరిస్తూ పరీక్షగా చూస్తుంది రాణి శరీరాన్ని!

రాణి వళ్ళంతా కమిలిపోయి వున్నది! చర్మం చిట్లి అక్కడక్కడా రక్తం కమ్మివున్నది వంటి మీద కాలిన మచ్చలు చీముపట్టి వున్నాయి పాదాలు పగిలి వాచి పోయివున్నాయి! వంటి మీద బట్టలు చినిగి పేలికలై వున్నాయి

రాణీ! ఆప్యాయంగా పిలుస్తూ వళ్ళంతా సవరించ సాగింది విలూ!

ఆక్షణాన విలూ మనసు రాణి స్థితిపట్ల జాలితో నిండిపోయింది

దీప్! గుణం ఎలాంటిదయినా యీమె నా చిన్నారి చెల్లెలు! నా చేతుల మీదుగా ఎత్తుకుని అల్లారు ముద్దుగా పెంచిన చిట్టితల్లి!

జన్మత వచ్చిన అహంకారం వలన పిన్ని పెంపకం వల్ల వచ్చిన మకురు తనం వలన అప్పుడప్పుడూ నా మీద అరచి కేకలు వేసినా ఆమెకు నేనంటే మనసులో ఆపేక్ష వున్నది!

అందుకె ఆపదలో వున్నప్పుడు అక్కా అని అరుస్తూ పరిగెత్తుకు వచ్చింది గద్గదకంఠంతో అన్నది విలూ

విలూ! రాణి కళ్ళు తెరిచింది! చూడు!

అక్కా! బలహీనంగా అంది రాణి

నేనే! విలూ అక్కను!

అక్కా! దాహం!

దీప్! వాటర్ బాటిల్ పట్రా! దీప్ పరుగెత్తుకుని వెళ్ళి వాటర్ బాటిల్ పట్టుకొచ్చాడు

విలూ వాటర్ బాటిల్ లోంచి నీళ్ళు పోస్తుంటే గటగట తాగింది రాణి! చీరచెంగు నీటితో తడిపి రాణి ముఖం తుడిచింది విలూ

అక్కా! నిజంగా నువ్వేనా?

నేనేనమ్మా! విలూ అక్కను!

అక్కా! వళ్ళంతా నొప్పులు పుడుతుంది డివైన్‌గ్రూప్ వాళ్ళు నన్ను చావగొట్టి వదిలారు! భయంతో గడగడవణికి పోసాగింది రాణి

భయపడకు రాణీ! భయపడకు! జరిగిందంతా మర్చిపో! నిన్ను విజయవాడ పంపించే భారం నాది!

అక్కా! వాళ్ళు సిగరెట్‌తో వళ్ళంతా కాల్చారు! కొరడాతో బాదారు! అక్కా!

చెప్పకమ్మా! ఆ విషయాలన్నీ గుర్తు తెచ్చుకుని మరీ భయపడకు

దాహం!

విలూ మళ్ళీ వాటర్ బాటిల్‌లో నీరు రాణి నోటిలో పోయసాగింది! నీళ్ళు అయిపోయినా దప్పిక తీరక బాటిల్ వోపెనింగ్ నోటిలో వుంచుకుని బాటిల్ పైకెత్తింది రాణి ఆఖరి చుక్క తాగివేసి దాహం తీరక మళ్ళీ

అక్కా! దాహం! అంది

దీప్! వెళ్ళి నీళ్ళు పట్టుకొస్తావా? అని అడిగింది విలూ

బాటిల్ యిలాతే! అంటూ లేచి వెళ్ళాడు దీప్! రోడ్ వైపుగా వెళ్ళేకంటే రెండో వైపుకు వెళ్ళటం ఎక్కువ శ్రేయస్కరం అనుకున్నాడు దీప్ ఎంత దూరం నడచిందీ గమనం లేకుండా పోయింది దీప్‌కు అంతు దరిలేదనుకున్న సరివి తోట చివర కొచ్చాడు తను కొంత దూరంలో చిన్న పాక కనపడింది కొబ్బరి ఆకులు వేసి కప్పు వేసారు! పాకలో ఎవరూ లేరు లోపల మట్టి కుండలో నీరుంటే వాటర్ బాటిల్ ముంచుకుని నిండా నీరు నింపాడు ఎక్కడా మనుష్య సంచారం కనపడలేదు వచ్చిన దారినే వడివడిగా అడుగులు వేస్తూ తిరిగి వచ్చాడు దీప్ విలూ రాణిలు వున్న చోటికి తిరిగి వచ్చాడు అక్క చెల్లెళ్ళ జాడ లేదు! విలూ అని పెద్దగా అరిచాడు దీప్!

(ఇంకా ఉంది)



ప్రతిఫలం

కందుకూరి వెంకట మహాలక్ష్మి

గడియారం కేసి చూసాడు. గుండె ఆగినంత పనయింది. పరీక్షకి సరిగ్గా ఒక్క గంటే వుంది. కోపం పట్టలేక స్కూటర్‌ని కాలితో ఒక్క తన్ను తన్నేడు.

స్నేహితుడు స్కూటర్ యిస్తా నన్నాడు కదా అని నెమ్మదిగా తయారయ్యాడు స్కూటర్ ఎక్కితే యిరవై నిమిషాల్లో కాలేజీకి చేరిపోతానన్న ధీమాతో. తీరా స్టార్టు చెయ్యబోయే సరికి "నేను స్టార్టవన"ని మొరాయించుకుని కూర్చుంది స్కూటర్. ప్లగ్ డిఫెక్టేమో అని అది తీసి క్లీన్ చేసాడు. అయినా

స్టార్టవ లేదు. టైము గడుస్తున్న కొద్దీ అతనికి కంగారు ఎక్కువవుతోంది. చమటలు పట్టసాగేయి. ఆ గాబరాతో హేండిల్ బార్ అటూ, ఇటూ తిప్పుతూ, వైర్లు అన్నీ కదిపి చూస్తూ, స్కూటర్ పట్టుకుని పరిగెత్తి గేర్ వేస్తూ నానా తంటాలూ పడుతున్నాడు. ఆఖరికి ఏ దేముడి దయవల్లో "బర్"…. మంటూ స్టార్టయింది. వెయ్యి దేముళ్ళకి మొక్కుకుంటూ, ఆపితే మళ్ళీ స్టార్టవదేమో! అన్న భయంతో ముఖానికి పట్టిన చమటన్నా తుడుచుకో కుండానే మంచి స్పీడ్ మీద అడ్డ త్రోవని నడపడం ప్రారంభించాడు.

కాకినాడ ఇంజినీరింగ్ కాలేజీ దరిదాపులకి వచ్చాడు. మామిడి తోటల మధ్య లోంచి స్కూటర్ వెళ్తోంది. టైముకి చేరుతున్నానన్న ఆనందంతో "హమ్మయ్య" అనుకున్నాడు సుధాకర్.

మరో ఫర్లాంగు ముందుకు వెళ్ళిన సుధాకర్‌కి తోటలో కీచుగా అరుస్తున్న ఆడగొంతుక వినిపించింది. మంచి వేసవి కాలం కావడంతో ఎక్కడా జన సంచారం లేదు. అనాలోచితంగా ఆ కేకలు వినపడ్డ వైపుకి స్కూటర్ తిప్పాడు సుధాకర్.

కొంత దూరం వెళ్ళిన అతనికి ఓ అమ్మాయిని యిద్దరు దుండగులు ఓ చెట్టు క్రింద పడవేసి వంటి మున్న గుడ్డలు వూడపీకడానికి చేస్తున్న ప్రయత్నాన్ని ఆపాలని తంటాలు పడుతూ, ఏడుస్తూ అరుస్తున్న దృశ్యం కంట పడింది. అది చూసిన సుధాకర్ శరీరంలోని రక్తం ఒక్కసారిగా ఉడక సాగింది. ఆదే స్కూటర్ మీద వారి మధ్యకి వెళ్ళి, వాళ్ళ మీదకి తిరగబడ్డాడు. ఓ పది, పదిహేను నిమిషాలు వాళ్ళతో పెనుగులాడిన మీదట వాళ్ళు పారి పోయారు.


ఏడుస్తూ లేచి నిలబడ్డ ఆ అమ్మాయిని ఊరడించి, స్కూటర్ వెనక ఎక్కించుకుని ఆమె చెప్పిన ఎడ్రస్‌కి తీసు కెళ్ళి దింపాడే గానీ తను పరీక్ష రాయవలసిన టైము దాటి పోయిందన్న సంగతి గుర్తు రాలేదు సుధాకర్‌కి. గాబరాగా స్కూటర్ తీసుకుని కాలేజీకి వెళ్ళిన సుధాకర్‌ని లెక్చరర్ గుమ్మం దగ్గిరే అడ్డగించి లోపలికి వెళ్ళ నివ్వలేదు. సుధాకర్ జరిగిన దంతా చెప్పి కాళ్ళా వేళ్ళా పడ్డాడు. అయినా ఏమాత్రం చలించలేదు. అంతా విని "ప్రిన్సిపాల్‌తో వెళ్ళి చెప్పి, ఆయన రాయమంటే లోపలికి పంపిస్తా" నన్నాడు. తిన్నగా ప్రిన్సిపాల్ రూం వైపు నడిచాడు. ఆయన దగ్గర కూడా జరిగిన దంతా చెప్పి పరీక్ష రాయడానికి అనుమతి యిమ్మని బ్రతిమాలాడు.

"పరీక్షలని తెలిసినప్పుడు సామర్లకోట నుంచి రావడ మెందు"కని అడిగాడు ప్రిన్సిపాల్.

"మా నాన్నగారి ఉద్యోగం అక్కడే సార్! ఇక్కడ నన్ను పెట్టి చదివించే స్తోమతలేక రోజూ అక్కడి నుంచే వచ్చి వెళ్తూ వుంటాను సార్! పేదవాళ్ళం. ఇంటికి పెద్ద కొడుకుని. ఫైనలియరు. నేనీ పరీక్ష రాసి పేసయితే, మా కుటుంబానికి కాస్త ఆసరా అవుతానని మా వాళ్ళంతా ఎంతో ఆశ పెట్టుకుని అప్పుచేసి మరీ చదివిస్తున్నారు సార్!" అంటూ బ్రతిమాల సాగాడు.

"నీవు చెప్పిన దంతా నిజమే అని ఋజు వేమిటి? నిర్లక్ష్యంగా తిరిగి, ఇలాంటి కట్టు కథ లల్లి చెప్పే వాళ్ళని చాలా మందిని చూసాను. నీ పరీక్ష సంగతి అంత మర్చిపోయి వూళ్ళో వాళ్ళకి ఉపకారానికి వెళ్ళడ మెందుకు? ఇప్పుడు వాళ్ళనే వెళ్ళి సహాయ మడుగు- 'వచ్చే ఏడాది పరీక్ష రాసేదాకా నీ కుటుంబాన్ని ఆదుకుంటారేమో! ఇప్పు డేడ్చి ప్రయోజనం ఏమిటి? ఆ బుద్ధి అప్పుడుండ వలసింది! ఇప్పుడు నేనేం చెయ్యలేను. అయినా రూల్సు ఒప్పవు." అని కఠినంగా చెప్పగానే దిగులుగా నిరుత్సాహంగా బైటి కొచ్చేసాడు.

సుధాకర్ తల తిరిగి పోతోంది. "ఏడాదంతా ఎంతో కష్టపడి చదివాను. అంత శ్రమా బూడిదలో పోసిన పన్నీరయి పోయింది. ఇన్నేళ్ళ చదువూ గంగ పాలయి పోయింది. ఇంక ఏ ముఖం పెట్టుకుని యింటి కెళ్ళను?" అనుకున్నాడు. పిచ్చివాడిలా వూరంతా తిరిగాడు. ఇంటికి వెళ్ళాలని పించటం లేదు. అంత ఎండలోనూ స్కూటర్ వేసుకుని సముద్ర పొడ్డుకి బయలు దేరాడు. స్కూటర్ ఓ ప్రక్కగా ఆపి యిసకలో కూర్చున్నాడు. అలా ఎంతసేపు కూర్చున్నాడో తెలీదు. ఆలోచనలు అతనిని ఏ



అమాయిత్యానికైనా పాల్పడేలా గున్నాయి తల మొద్దుబారి పోయింది తల్లో నరాలన్నీ చిట్లి పోతున్నట్లున్నాయి

ఉదయం తల్లి పెట్టిన టిపెన్ కుడా ఎరీక్ష రాయాలన్న టెన్షన్‌తో తినలేదు ఆ తరువాత మళ్ళీ యింతవరకూ ఏమీ తినలేదు ఎండవేడి దానికి తోడు మానసిక వ్యద ఉదయం ఆ గూండాల చేత తిన్న దెబ్బలకి వళ్ళంతా నొప్పులు- అన్నీ ఒకటికి మరొకటి తోడై నీరసం వచ్చి స్పృహతప్పి పడిపోయా డక్కడే

తెలివొచ్చేసరికి తనో యింట్లో వున్నట్లు తెలుసు కున్నాడు చల్లటి పేన్ గాలికి కాస్త ఉపశమనంగా వుంది ఇంతలో గ్లాసులో పండ్లరసం తీసుకుని వచ్చిందో అమ్మాయి కళ్ళు తెరిచి తేరిపార అమెనే చూసాడు గుండె శరవేగంతో కొట్టుకో సాగింది కళ్ళు చిట్లించి మళ్ళీ చూసాడు

ఆ అమ్మాయే! ఉదయం తను ఉపకారం చేస అపకారాన్ని పొందిందీ అమ్మాయి వల్లే'' హే బగవాన్! మళ్ళీ యిక్కడి కెందుకు తీసుకొచ్చావు?

అనుకుంటుండగా అది గ్రహించినట్లు నేను నా స్నేహితులతో సాయంత్రం బీచ్‌కి షికారు వెళ్ళి మీరు అక్కడ స్పృహతప్పి పడిపోయి వుండటం చూసి మా కారులో తీసుకొచ్చాం డాక్టర్ వచ్చి మందులిచ్చి బలానికి ఇంజక్షన్ చేసాడు ఎలాగుం దిప్పుడు? అంటూ చేతికి పళ్ళ రసం గ్లాసు అందించింది ఏం జవాబు చెప్పాలో తెలీక నిట్టూర్చి బాగానే వుంది అంటూ కళ్ళు మూసుకున్నాడు ఉదయం జరిగిందంతా మళ్ళీ తలలో తిరగ సాగింది ఇంక అక్కడ వుండ బుద్ధివెయ్యక లేచి వెళ్ళిపోదామని ప్రయత్నించాడు నీరసంతో లేవలేక పోయాడు ఈ అమ్మాయి వల్లే నా బవిష్యత్తంతా నాశనం అయింది అనుకుంటూ కసిగా పళ్ళు పిండు కున్నాడు

ఎవరొచ్చారమ్మా శీలూ! బైట ఎవరిదా స్కూటర్? అంటూ అడుగుతున్న ఆయనతో నాన్నా! నాన్నా! అంటూ ఉదయం జరిగినదంతా చెప్పి తన్ని సుదాకర్ ఎలా రక్షించి యింటికి తీసుకొచ్చిందీ చెప్పాకా మళ్ళీ సాయంత్రం అతను సముద్రపు వొడ్డున పడున్న కదనం తను యింటికి తీసుకొచ్చి చేస్తున్న సపరిచర్యల గురించి చెప్పసాగింది అన్నీ విని ఎడమ్మా మన పాలిట దేముడిలా వచ్చి నీ మానాన్ని కాపాడి నిన్ను మళ్ళీ మా కప్పగించిన ఆ దేవుడు? అతనే అడ్డుకోకపోతే పెళ్ళి కూడా కుచరివున్న నీ నూరేళ్ళ జీవితం ఎమయిపోయే దీవేళ?! అతనేడి తల్లీ! అంటూ ఆ అమ్మాయిని అక్కున చేర్చుకుని తిన్నగా సుదాకర్ గదిలోకే వచ్చి అతను పడుకున్న మంచం మీద కూర్చున్న శీలూ తండ్రి కరెంట్ తీగ తగిలి షాక్ కొట్టిన వ్యక్తిలా పాలిపోయిన ముఖంతో అతన్నే చూస్తూ కూర్చుండి పోయాడు మాటలు రానివాడిలా

సుదాకర్ పరిస్థితీ అలాగే వుంది

ఒకరి నొకరు చూసుకోలేక తలలు దించు కున్నారు

'హే బగవాన్! యితన్నేనా ఉదయం పరీక్ష రాయనివ్వకుండా కట్టు కదలు చెప్పొద్దనీ దొంగ నాటకా లాడొద్దనీ కఠినంగా తిట్టి నానా మాటలూ అడి పంపిస్త! ఇతనే అడ్డుకోకపోతే నా కూతురి శీలం ఏమయ్యేది? నా కూతురి బవిష్యత కాపాడిన వాడి బవిష్యత్‌ని నేను నాశనం చేసానా'' నా బిడ్డని కాపాడినందుకు నేనతని కిచ్చిన ప్రతిపలం యిదేనా"! అనుకుంటూనే అతని రెండు చేతులూ పట్టుకున్నాడు క్షమించ మన్నట్లు

మరి క్షమించ మనడంలో అర్ధం''

అతని బవిష్యత్ చక్క దిదు తానన''

సుదాకర్ మనసు మాత్రం ఒడ్డున పడ చేప పిల్లలా కొట్టు కుంటోంది అతని చూపులక అర్ధం తెలీక □

ఇ·వేమన·పద్యాలు



మరణకాలమునను మదినిల్పు సుజ్ఞాని
పరముగోరి తాను పట్టువిడక
వెనుక కోర్కెలందు విలపించు నజ్ఞాని
విశ్వదాభిరామ వినురవేమ

వారఫలం

18-9-1987 శుక్రవారం మొదలు 24-9-1987 గురువారం వరకు

★ **మేషం:** అశాంతి ఎక్కువ, ఆదాయం తక్కువ. ఆరోగ్యరీత్యా చికాకు. అనుకొన్న పనులు సాగిరాక పోవటం, ఉత్తరాల మూలంగా అనానుకూల విషయాలు గ్రహించటం జరుగుతుంది. స్త్రీలకు: శుక్రవారం అనుకూలం, రాజకీయంగా మేలు.

★ **వృషభం:** పనులన్నీ సక్రమంగా నెరవేర్చుకో గలరు. గ్రహానుకూల్యత గల వారం. ధనాదాయ మున్నది. సంపాదనా విషయంగా క్రొత్త దారులు తొక్కవచ్చు. ప్రయాణానుకూలత, ఆరోగ్యాభి వృద్ధికి ఆకరమైన దినం. స్త్రీలకు: సభా గౌరవం, ధనాభివృద్ధి.

★ **మిధునం:** శుక్ర, శని వారాలందు, ధనాదాయ ముంటుంది. విరోధి వర్గం కొంచం పలచబడు తుంది. రాజకీయంగా అనుకూలం. ఆదాయ మున్నది. వ్యాపారం చేసే వారికి అనుకూలత గల వారం. స్త్రీలకు: సంతాన నిమిత్తం, వారి ఉద్యోగ వ్యవహార రీత్యా చేసే యత్నాలు ఫలవంత మవుతాయి.

★ **కర్కాటకం:** నూతన వ్యవహారా లందు జోక్యం కలుగ జేసి కొంటారు. నూతన మిత్ర సమాగమ ముంటుంది. స్థిరాస్తి వ్యవహార మందు చెప్పదగిన మార్పు వస్తుంది. వస్తు సేకరణకు అవకాశం. స్త్రీలకు: బంధు మిత్ర గృహానందం. వృత్తిలో మార్పు, అనుకూలం.

★ **సింహం:** క్రితం వారమే బాగున్నదని పిస్తుంది. ఏ పని చేసినా వెనుక ముందులు ఆలోచింప వలసి వస్తుంది. రాజకీయ వాదులకు మేలు గాదు. అనవసరపు గొడవలు రావచ్చు కుటుంబానందం కుంటుపడుతుంది, జాగ్రత్త వహించాలి. స్త్రీలకు: వృత్తి యందు అనుకూలత, సభా గౌరవాధిక్యత.

★ **కన్య:** అనుకొనేది ఒకటి, అంటే ఒక రంగాన, అది వ్యాపారం కావచ్చు, వ్యవహార సంబంధం కావచ్చు, కాని అయ్యే దొక్కటి. ఇలాంటి విషయం గ్రహానుకూలత వలన జరుగుతుంది. వారాంతం లాభదాయకం, వృత్తి యందు అనుకూల దాయకం. స్త్రీలకు: శుభ కార్యాను కూలత, రచయితలకు అనుకూలం. ధనదాయక వారం.

★ **తుల:** "శని" గ్రహానుకూల్యత గల వారం. సుఖ శాంతులకు అవకాశ మున్నది. రాజకీయ మిత్రులు దాపునకు రాగలరు. కార్యానుకూల సమయం. వృత్తి యందు వికాసం. ఉద్యోగాను కూలత గల వారం. స్త్రీలకు: సుఖానుభూతి, ధనలబ్ధి, ఆరోగ్యాభివృద్ధి.

★ **వృశ్చికం:** అశాంతి ఎక్కువవు తుంది. అనుకొన్న పనులు సక్రమంగా నెరవేర గలవనే నమ్మకం లేదు, వృత్తి యందు వికాస ముంటుంది. ప్రజ్ఞానుల సాహచర్యం లభ్యం కావచ్చు. స్త్రీలకు: ఆశించిన విధంగా పనులు సానుకూలం గావు. ప్రసిద్ధుల సాహచర్యంఉంటుంది. ప్రయాణానికి కొందరకు అవకాశ మున్నది.

★ **ధనుస్సు:** ఇల్లుగాని, భూమి గాని సంపాదించుకొనే అవకాశం గల సమయం. కొందరకు యిండ్లు మరమ్మత్తు చేసికొనే అవకాశ మున్నది. తలవని తలంపుగా ప్రయాణించ వలసిన ఆగత్య ముంటుంది. ఆదాయ మున్నది. స్త్రీలకు: వృత్తి రీత్యా మేలు, సుఖ శాంతులు, రాజకీయంగా మేలు చేకూర వచ్చు.

★ **మకరం:** నూతన వ్యక్తుల పరిచయం ఏర్పడ గల వారం. స్త్రీ పురుషాదులకు "శుక్ర, శని" వారాలందు అనుకొన్న విధంగా కార్యానుకూలం. రాజకీయ వాదులకు మేలైన సమయం. ఎవరేమనుకొన్న అన్ని రీతులా మేలైన వారం. స్త్రీలకు: సభా గౌరవం, వృత్తి రీత్యా ఆదాయం గల వారం.

★ **కుంభం:** రాజకీయ వాదులకు అనుకూలం. విద్యా విషయంగా పెంపు. క్రొత్త వారి పరిచయం. వృత్తి రీత్యా మేలు. కార్యానుకూలం, "గురు" గ్రహానుకూల్యత, సాంఘికంగా ఏదో మేలు జరుగ గల వారం. స్త్రీలకు: వృత్తియందు వికాసం, ధనలబ్ధి, శుక్రవారం అనుకొనని విధంగా ధనాదాయం.

★ **మీనం:** వారమంతా అందంగా ఆనందంగా సుందరంగా జరిగి పోతుంది. వృత్తి రీత్యా పెంపు చెప్పదగిన తరుణం. అప్పుసొప్పులు వసూలవుతాయి. విద్యావంతులకు విశేషాదరణ మున్నది. స్త్రీలకు: కార్యానుకూలం, ధనాదాయం, శుక్రశని వారాలందు ఏదో మేలు జరుగుతుంది.

విద్వాన్ కోట సత్యరంగయ్యశాస్త్రి







హైదరాబాదు నోట్‌బుక్

మహా వైభవంగా వినాయకచవితి

ఈసారి జంటనగరాలలో వినాయకచవితి జంటనగరాలలో మహోత్సాహంగా జరిగింది. నగర వాసులు తమ ఇండ్లలో పూజలు జరుపుకొనడంతో పాటు ఆయా ప్రాంతాలలో స్థాపించిన వినకయ్య దర్శనానికి వెళ్లారు. ఈ వినకయ్యలు వివిధాకారాలలో వివిధ పరివారాలతో ముచ్చటగా వున్నారు. దాదాపు 5000 వినాయక విగ్రహాలు జంటనగరాలలో స్థాపించినట్లు తెలియవచ్చింది. విగ్రహాలు స్థాపించి మండపాలు రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకృతమయి మరింత వన్నె తెచ్చాయి. భక్తులు తండోపతండాలుగా వస్తూ



ఖైరతాబాదులో స్థాపించిన 40 అడుగుల గణపతి విగ్రహం

ప్రసాదం స్వీకరించారు. ఎక్కువ విగ్రహాలు బేగంబజార్, సిద్ది అంబర్ బజారులలోను, తత్పరిసరాలలో ప్రతిష్ఠించారు. బేగంబజారులోని సనాతన ధర్మ సభా భవన్ ఒక పెద్ద మకర ముఖ ద్వారం. నిర్మించి దాని వెనుక వినాయక విగ్రహం ప్రతిష్ఠించింది. ఆ మకర ముఖంపై రామలక్ష్మణులు, హనుమంతుడు వినాయకుని అంగరక్షకులుగా వున్నారు. ఏమైనా, విగ్రహాలన్నిటిలోను ఖైరతాబాద్ వినాయక విగ్రహం పెద్దది. దీని యెత్తు 40 అడుగులు. బరువు ఎనిమిది టన్నులు. దోమల్ గూడాలోని వినాయక విగ్రహం విశిష్టత పంచముఖాలు వుండడం. ఉత్సవ సమయంలో ఎలాంటి దుర్ఘటనా జరగకుండా పోలీసు బందోబస్తు బాగా ఏర్పాటు చేయబడింది.

డాక్టర్ శ్రీరామచంద్రుడుగారికి రాష్ట్రపతి పురస్కారం:-

రాష్ట్రపతి ఏటా విశిష్ట సంస్కృత పారసీక అరబ్బీ విద్వాంసులను ప్రత్యేక పురస్కారాలతో సన్మానిస్తారు. ఈసారి రాష్ట్రపతి సన్మానించిన ఎనిమిది మంది సంస్కృత విద్వాంసులలో ఉస్మానియా విశ్వవిద్యాలయం సంస్కృత శాఖాధ్యక్షులు డాక్టర్ పుల్లెల శ్రీరామచంద్రుడుగారు ఒకరు. తక్కిన వారు శ్రీయుతులు రామచద్ర ద్వివేది (రాజస్థాన్ విశ్వవిద్యాలయం సంస్కృత శాఖాధ్యక్షులు), కరుణాపతి త్రిపాఠీ (సంపూర్ణానంద సంస్కృత విశ్వవిద్యాలయం మాజీ వైస్ చాన్సలర్), శ్రీనివాసశాస్త్రి (దక్కన్ కాలేజి, పూనా), రామానుజ తాతాచార్య (తిరుపతి), విశ్వనాథ బెనర్జీ (శాంతినికేతన్), సర్వదానందఝా, ప్రభుదయాళ్ అగ్నిహోత్రి (ఉజ్జయినీ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్). డాక్టర్ శ్రీరామచంద్రుడుగారు మద్రాసు సంస్కృత కళాశాలలో అధ్యయనం చేసి, వేదాంత శిరోమణి, వేదాంత విశారద డిగ్రీలు పొందారు. సాహిత్య శిరోమణులయ్యారు. పిదప సంస్కృత, తెలుగు, హిందీ ఎం. ఏ. లు ప్యాసయి రసగంగాధరంపై పరిశీలన చేసి, సిద్ధాంత వ్యాసం సమర్పించి పి. హెచ్. డి.డిగ్రీ పొందారు. ధమ్మపదం, బామహాలంకారం, కావ్య ప్రకాశం, వక్రోక్తి జీవితం మున్నగు అలంకార శాస్త్ర గ్రంథాలను ఆంధ్రీకరించి వ్యాఖ్యలు రచించారు. 1960 నుంచి ఐదేళ్లపాటు వరంగల్లులోను, 1965 నుంచి ఉస్మానియా విశ్వవిద్యాలయంలోను పనిచేసి, సంస్కృత శాఖాధ్యక్షులై ఉత్తమ ఆచార్యులుగా పేరు పొందారు. సంస్కృత అకాడమి అధ్యక్షులుగా ఉన్నారు. సురభారతీ సమితి సంచాలకులుగా వుంటూ సంస్కృత ప్రచారానికి విశేష కృషి చేస్తున్నారు. సురభారతీ సమితి పక్షాన పెక్కు సంస్కృత గ్రంథాలు, వార్షిక సంచికలు ప్రచురించారు. ఇంతటి కృషి చేస్తున్న శ్రీ శ్రీరామచంద్రుడు గారు ఇతోధిక సన్మానాలు పొందాలని కోరుతున్నాను.

అభినందన బాలల ఆటల పోటీలు

అభినందన మహిళా మండలి 40వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భానపది సంవత్సరాల లోపు బాలబాలికల ఆటల పోటీలు జరిపి ఆగస్టు 14వ తేదీన ఇందిరా ప్రియదర్శిని హాలు విజేతలకు బహుమతి ప్రదానం చేసింది. ఈ బహుమతి ప్రదానోత్సవానికి సుప్రసిద్ధ రచయిత్రి శ్రీమతి తురగా జానకీరాణి (ఆకాశవాణి) అధ్యక్షత వహించారు. రాష్ట్ర హవుసింగ్ బోర్డు కమిషనర్ శ్రీ రాంబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శ్రీయుతులు గుడిపూడి, శ్రీహరి, ఎల్లారెడ్డి ప్రత్యేకాహ్వానితులుగా పాల్గొన్నారు. పది సంవత్సరాల లోపు పిల్లల నృత్య కార్యక్రమం జరిగింది. రేడియో అన్నయ్య వ్రాసిన "బొమ్మల పెళ్ళి" ఈ నృత్య కార్యక్రమంలో ప్రత్యేకాకర్షణ. ఈ నృత్య కార్యక్రమంలో కుమారి కప్పగంతుల ప్రజ్ఞ మున్నగు బాలికలు పాల్గొన్నారు. ప్రారంభంలో సంస్థ అధ్యక్షురాలు శ్రీమతి జయశ్రీ సారథి స్వాగతం చెప్పారు. శ్రీమతి భవాని సంస్థ కార్యక్రమాలు వివరించారు. శ్రీమతి భూజాతాదేవి వందన సమర్పణతో ఉత్సవం సమాప్తమైంది.

ఉపశ్రుతి:-

ఏమి సార్, ఇటీవల ప్రభుత్వం డిగ్రీలు, పట్టాలు ప్రసక్తి లేక పండితులను వెదుక్కుంటూ వచ్చి విశ్వవిద్యాలయాలలో వారి జ్ఞాన భాండారాన్ని వినియోగించుకుందామని పూర్తి పుట ప్రకటనలు చేసిందే పత్రికలలో. మీకేదీ ఉద్యోగం రాలేదా?- అనడిగాను. ప్రముఖ విద్వాంసులు శ్రీ చిమకుర్తి శేషగిరిరావును. స్వామీ ఏ విద్యా సంస్థయినా యూనివర్సిటీ మూసలో పడితే అంతే. రేట్లు, డాక్టరేట్లు ఉండాలి. రేట్లు అంటే, బిరుదుల రేట్లు లేండి- అన్నారు మా సంభాషణ వింటున్న ఒక లోకజ్ఞులు. !-తిరుమల రామచంద్ర

40వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా ఆగస్టు 14వ తేదీన "అభినందన "నిర్వహించిన స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల సభలో ప్రసంగిస్తున్న సభాధ్యక్షులు శ్రీమతి తురగా జానకీరాణి, హౌసింగ్ బోర్డు కమిషనర్ శ్రీ రాంబాబు, శ్రీ గుడిపూడి శ్రీహరి, సంస్థ అధ్యక్షురాలు శ్రీమతి జయశ్రీ సారథి, శ్రీమతి భవాని.



క్రికెట్‌కి గవాస్కర్ "గుడ్ బై"

ప్రముఖ ముఖసాముద్రికవేత్త పండిట్ విద్యాపతి శర్మ సునీల్ గవాస్కర్ గురించి పరిశీలించి 1987 తర్వాత అంతర్జాతీయ క్రికెట్ పోటీ లలో పాల్గొను అవకాశములు కనిపించుట లేదని అన్నారు. (ఆం. ప. వారపత్రిక ది 3-9 ఏప్రిల్ '87). సాముద్రిక శాస్త్రము నందు నమ్మకము లేనివారు అంతగా పట్టించుకో లేదు. ఆగస్టు 21 శుక్రవారం గవాస్కర్ ప్రకటన యదార్థము చేసినది. విశ్వ క్రికెట్ రంగములో అత్యధిక టెస్టు పోటీలలో పాల్గొని, ఎక్కువ సెంచరీలు సాధించిన మన "లిటిల్ మాస్టర్" ప్రకటన ఎంతో సమంజసము అనిపించినది. యం. సి. సి. క్రికెట్ సమాఖ్య 200వ వార్షికోత్సవ సందర్భమున "రెస్టు ఆఫ్ వరల్డ్"– ఎం. సి. సి. మధ్య జరిగిన పోటీలో ఆడుచు తాను యింతవరకు సాధించిన రికార్డులతో తృప్తి చెందుచున్నట్లు తెల్పారు. ఇప్పటికి 125 అధికార టెస్టు పోటీలలో ఆడి 10,122 పరుగులు, 34 సెంచరీలు సాధించి ప్రపంచ రికార్డులు నెల కొల్పారు. ఆఖరి అయిదు రోజుల టెస్టు పోటీలో ఆడి 188 పరుగులు చేసారు. రాబోవు ప్రపంచ కప్ క్రికెట్ పోటీ లలో మాత్రము ఆడాను, వెస్టిండీస్‌తో కాని స్థానిక యితర పోటీలలో ఆడను అని తమ నిర్ణయము తెల్పారు. గవాస్కర్ 349 వివిధ స్థాయిల ప్రథమశ్రేణి క్రికెట్ పోటీలలో, 556 యిన్నింగులలో ఆడి మొత్తం 25,785 పరుగులు చేయుట ఆశ్చర్య కరము కలిగించును. అంతేగాక 81 సెంచరీలు కూడా చేసారు. 103 సార్లు యాభైకు పైగా పరుగులు చేసారు. గవాస్కర్ 124 పోటీలలో కెప్టెన్‌గా ఉన్నారు. అందులో 47 టెస్టు పోటీలు, 39 రంజీట్రాఫీలో పాల్గొన్న బొంబాయి జట్టునకు, పదిసార్లు పశ్చిమ జోన్ జట్టునకు, ఆరుసార్లు ఇరానీ ట్రాఫీ పోటీలు కలవు.

గవాస్కర్ మొదటిసారిగా హైదరాబాద్‌లో జరిగిన మొయిన్ దౌలా గోల్డ్ కప్ పోటీలో వజీర్ సుల్తాన్ స్పోర్ట్సు క్లబ్‌నకు ఆడారు. 1966 మార్చిలో జరిగిన యీ పోటీలో ఆడారు. రంజీ పోటీల్లో 300 పరుగులు, తొమ్మిది డబుల్ సెంచరీలు, 20 వికెట్లు సాధించారు.

గవాస్కర్ సాధించిన విజయాలు, సృష్టించిన "రికార్డులు" ప్రపంచ క్రికెట్ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించ బడ్డాయి. గవాస్కర్ ప్రథమశ్రేణి పోటీల నుంచి విరమించు కొనుటకు తీసుకొన్న నిర్ణయముతో ఒక శకం పూర్తి అయినట్లుగా యున్నది.

సునీల్ మనోహర్ గవాస్కర్ 1949 జూలై 10న బొంబాయిలోని పురందారు ఆసుపత్రిలో రాత్రి సరిగ్గా 8-42కు జన్మించారు. అప్పటివరకు బొంబాయిలో వర్షములులేక నీటి ఎద్దడిగా యుండినదట. గవాస్కర్ జనన సమయమున భారీ వర్షము కురిసి ప్రజలను నీటి కరువు నుండి కాపాడినదట. గవాస్కర్ పుట్టిన తర్వాత మరొక వింత జరిగినది. సునీల్ తల్లి ఉన్న ప్రసూతి వార్డులో ప్రక్క మంచముపై ఒక బెస్త ఆవిడ కూడా మగపిల్ల వానిని కన్నది. ఆసుపత్రి ఆయాలు పిల్లలను స్నానము చేయించినప్పుడు పొరపాటు జరిగి పిల్లలు మారి పోయారు. సునీల్ కుడి చెవి వద్ద సన్నని గీత యున్నది. అది మేనమామ అయిన నారాయణ మజారేకర్ గుర్తించాడు. మరునటి రోజు తల్లి ప్రక్కన ఉన్న పిల్లవానికి ఆ గుర్తు కనిపించక పోవటం మేనమామ గుర్తించి పిల్లవాడి మార్పు తెలుసు కొన్నాడు. అసలు సునీల్ బెస్త స్త్రీ వద్ద యున్నాడు. ఆ పొరపాటు అప్పుడు గుర్తించి యుండకపోతే ప్రపంచ అగ్రగామి క్రికెట్ యోధుడు ఇప్పుడు ఎక్కడ ఎలా ఉండేవాడో!

సునీల్ తల్లి తండ్రులకు క్రికెట్ అంటే అభిమానం. తండ్రి మనోహర్ గవాస్కర్ కూడా క్రికెట్ ఆటగాడు. 1940- 45లో బొంబాయి ఎలిఫిన్‌స్టోన్ కళాశాల జట్టుతో ఆడేవాడు. తండ్రి ఆట తిలకించుటకు వెళ్ళేవాడు సునీల్. "క్రాస్ మైదానం"లో పిల్లలతో మొదట క్రికెట్ ఆట ఆడటం ప్రారంభించాడు. తండ్రి రెండు వందల రూపాయిలు సంపాదించు చిరు ఉద్యోగి. కుటుంబ పోషణ కష్టముగా యుండెడిది. మనోహర్ గవాస్కర్ ఎంతో కష్టపడి సునీల్‌ను పోషించాడు. సునీల్ చిన్న వయసులో కుస్తీ అంటే ఆసక్తి కలిగి యుండేవాడు. కింగ్‌కాంగ్, బ్లాక్‌స్కార్పియన్ జోదులను అభిమానించే వాడు. ఇంటిలో తల్లి సరదాగా బంతిని "బౌలు" చేసేది. తల్లి ప్రథమ గురువు.

విద్యార్థిగా సునీల్ ఉన్నప్పుడు అతని తోటి విద్యార్థి రమేష్ నాగదేవ్ మంచి ఆటగాడు. 1969లో ఆస్ట్రేలియాతో అతను మన జట్టులో ఆడాడు. ప్రస్తుతము కాలిఫోర్నియాలో ఉన్నాడు. బొంబాయిలోని "చికల్‌వాడి"లో బాల్యం గడిచినది. మిల్లింద్ తాజీ వీధిలో "కారు గ్యారేజి" గేటు వికెట్లుగా ఆడేవాడు. దాదర్ యూనియన్‌లో మొదట సభ్యత్వము పొందాడు. నేడు ప్రపంచములో అగ్రగామి "ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్"లలో ప్రథముడు.

హైదరాబాద్ లాల్‌బహదూర్ స్టేడియంలో 1966లో జరిగిన మోయిన్ దౌలా ట్రాఫీ పోటీలో గుర్తింపు పొందిన సునీల్ గవాస్కర్ 1970-71, 75-76, 82-83లలో వెస్టిండీస్, 1971, 74, 75 (వైస్ కెప్టెన్) 79, 82 (కెప్టెన్), 1983, 86లో ఇంగ్లాండు, 1977- 78,80-81 (కెప్టెన్) 85-86 ఆస్ట్రేలియా, 1978-79 (వైస్ కెప్టెన్), 82-83 (కెప్టెన్) 84-85 (కెప్టెన్) పాకిస్తాన్, 1985-86 శ్రీలంక పర్యటించాడు. అదే సంవత్సరము ఆస్ట్రేలియాలో "రెస్టు ఆఫ్ వరల్డ్" జట్టుతో ఆడాడు. మన దేశ జట్టునకు 47 సార్లు సారథ్యము వహించి తొమ్మిది విజయాలు, ఎనిమిది ఓటములు, 30 డ్రా అయినవి. 1975-76 నుండి 66 సార్లు బొంబాయి జట్టుతో రంజీ ట్రాఫీ పోటీలలో ఆడారు. దులీప్ ట్రాఫీలో పశ్చిమ మండలం జట్టుకో 22 సార్లు పాల్గొన్నారు. ఇరానీ ట్రాఫీలో 12 సార్లు ఆడారు. రంజీట్రాఫీలో 5335, దులీప్ ట్రాఫీలో 1859, ఇరానీ ట్రాఫీలో 733 పరుగులు చేసారు. మూడు అనధికార "టెస్టులలో" పాల్గొన్నారు. 1971, 74, 79 ఇంగ్లాండు పర్యటనలలో 1000కు పైగా పరుగులు, 1970-71లో వెస్టిండీస్‌తో ఆడిన పోటీలో 774

భార్య, కుమారునితో సునీల్ గవాస్కర్



క్రికెట్‌కి గవాస్కర్ "గుడ్ బై"

ప్రముఖ ముఖసాముద్రికవేత్త ఎండిట్ విద్యాపతి శర సునీల్ గవాస్కర్ గురించి పరిశీలించి 1987 తర్వాత అంతర్జాతీయ క్రికెట్ పోటీ లలో పాల్గొను అవకాశములు కనిపించుట లేదని అన్నారు (ఆం ప వారపత్రిక ది 3-9 ఏప్రిల్ 87) సాముద్రిక శాస్త్రము నందు నమ్మకము లేనివారు అంతగా పట్టించుకో లేదు ఆగస్టు 21 శుక్రవారం గవాస్కర్ ప్రకటన యదార్థము చేసినది విశ్వ క్రికెట్ రంగములో అత్యధిక టెస్టు పోటీలలో పాల్గొని ఎక్కువ సెంచరీలు సాధించిన మన లిటిల్ మాస్టర్ ప్రకటన ఎంతో సమంజసము అనిపించినది ఎం సి సి క్రికెట్ సమాఖ్య 200వ వార్షికోత్సవ సందర్భమున రెస్టు ఆఫ్ వరల్డ్ – ఎం సి సి మధ్య జరిగిన పోటీలో ఆడుచు తాను యింతవరకు సాధించిన రికార్డులతో తృప్తి చెందుచున్నట్లు తెల్పారు ఇప్పటికి 125 అధికార టెస్టు పోటీలలో ఆడి 10 122 పరుగులు 34 సెంచరీలు సాధించి ప్రపంచ రికార్డులు నెలకొల్పారు ఆఖరి అయిదు రోజుల టెస్టు పోటీలో ఆడి 188 పరుగులు చేసారు రాబోవు ప్రపంచ కప్ క్రికెట్ పోటీలలో మాత్రము ఆడాలను వేడ్కయుంటే తో కాని సాధ్యేక యితర పోటీలలో ఆతను ఆడ తమ నిర్ణయము తెల్పారు గవాస్కర్ 349 వివిధ స్థాయిల ప్రథమశ్రేణి క్రికెట్ పోటీలలో 556 యిన్నింగులలో ఆడి మొత్తం 2578? పరుగులు చేయుట ఆశ్చర్య కరము కలిగించును అంతేగాక 81 సెంచరీలు కూడా చేసారు 103 సార్లు యాభైకు పైగా పరుగులు చేసారు గవాస్కర్ 124 పోటీలలో కెప్టెన్‌గా ఉన్నారు అందులో 47 టెస్టు పోటీలు 39 రంజీట్రాఫీలో పాల్గొన్న బొంబాయి జట్టుకు ఆడినారు ... అయినారు

ఇరానీ ట్రాఫీ పోటీలు కలవు

గవాస్కర్ మొదటిసారిగా హైదరాబాద్‌లో జరిగిన మొయినుద్దౌలా గోల్డ్ కప్ పోటీలో వజీర్ సుల్తాన్ స్పోర్ట్స్ క్లబ్‌నకు ఆడారు 1966 మార్చిలో జరిగిన యీ పోటీలో ఆడారు రంజీ పోటీల్లో 300 పరుగులు తొమ్మిది డబుల్ సెంచరీలు 20 వికెట్లు సాధించారు

గవాస్కర్ సాధించిన విజయాలు సృష్టించిన రికార్డులు ప్రపంచ క్రికెట్ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించ బడ్డాయి గవాస్కర్ ప్రథమశ్రేణి పోటీల నుంచి విరమించు కొనుటకు తీసుకొన్న నిర్ణయముతో ఒక శకం పూర్తి అయినట్లుగా యున్నది


సునీల్ మనోహర్ గవాస్కర్ 1949 జూలై 10న బొంబాయిలోని పురందారు ఆసుపత్రిలో రాత్రి సరిగా 8-42కు జన్మించారు అప్పటివరకు బొంబాయిలో వర్షములులేక నీటి ఎద్దడిగా యుండినదట గవాస్కర్ జనన సమయమున భారీ వర్షము కురిసి ప్రజలను నీటి కరువు నుండి కాపాడినదట గవాస్కర్ పుట్టిన తర్వాత మరొక వింత జరిగినది సునీల్ తల్లి ఉన్న ప్రసూతి వార్డులో ప్రక్క మంచముపై ఒక బెస్త వనిత కూడా మగపిల్ల వానిని కన్నది ఆసుపత్రి ఆయాలు పిల్లలను స్నానము చేయించినప్పుడు పొరపాటు జరిగి పిల్లలు మారి పోయారు సునీల్ కుడి చెవి వద్ద పుట్టుమచ్చ యున్నది అది మేనమామ అయిన నారాయణ మజారేకర్ గుర్తించాడు మరుసటి రోజు తల్లి ప్రక్కన ఉన్న పిల్లవానికి ఆ గుర్తు కనిపించక పోవటం మేనమామ గుర్తించి పిల్లవాడి మార్పు తెలుసుకొన్నాడు అసలు సునీల్ బెస్త ప్రజల యునాడు ఆ పొరపాటు అప్పుడు గుర్తించి యుండకపోతే ప్రపంచ అగ్రగామి క్రికెట్ యోధుడు ఇప్పుడు ఎక్కడ ఎలా ఉండేవాడో!

సునీల్ తల్లి తండ్రులకు క్రికెట్ అంటే అభిమానం తండ్రి మనోహర్ గవాస్కర్ కూడా క్రికెట్ ఆటగాడు 1940 లలో బొంబాయి ఎల్ఫిన్‌స్టోన్ కళాశాల జట్టుతో ఆడేవాడు తండ్రి ఆట తిలకించుటకు వెళ్ళేవాడు సునీల్ క్రాస్ మైదానం లో పిల్లలతో మొదట క్రికెట్ ఆట ఆడటం ప్రారంభించాడు తండ్రి రెండు వందల రూపాయిలు సంపాదించు చిరు ఉద్యోగి కుటుంబ పోషణ కష్టముగా యుండెడిది మనోహర్ గవాస్కర్ ఎంతో కష్టపడి సునీల్‌ను పోషించాడు సునీల్ చిన్న వయసులో కుస్తీ అంటే ఆసక్తి కలిగి యుండేవాడు కింగ్‌కాంగ్ బ్లాక్‌స్కార్పియన్ జోకర్లను అభిమానించే వాడు ఇంటిలో తల్లి సరదాగా బంతిని బౌలు చేసేది తల్లి ప్రథమ గురువు

విద్యార్థిగా సునీల్ ఉన్నప్పుడు అతని తోటి విద్యార్థి రమేష్ నాగదేవ్ మంచి ఆటగాడు 1969లో ఆస్ట్రేలియాతో ఆడిన మన జట్టులో ఆడాడు ప్రస్తుతము కాలిఫోర్నియాలో ఉన్నాడు బొంబాయిలోని చికల్‌వాడి లో బాల్యం గడిచినది మిల్లింద్ రౌజీ వీధిలో కారు గారేజి గేటు వికెట్లుగా ఆడేవాడు దాదర్ యూనియన్‌లో మొదట సభ్యత్వము పొందాడు నేడు ప్రపంచములో అగ్రగామి ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్ లలో ప్రథముడు

హైదరాబాద్ లాల్‌బహదూర్ స్టేడియంలో 1966లో జరిగిన మొయినుద్దౌలా ట్రాఫీ పోటీలో గుర్తింపు పొందిన సునీల్ గవాస్కర్ 1970-71 75-76 82-83లలో వెస్టిండీస్ 1971 74 79 (వైస్ కెప్టెన్) 79 82 (కెప్టెన్) 1983 86లో ఇంగ్లాండు 1977- 78 80-81 (కెప్టెన్) 85-86 ఆస్ట్రేలియా 1978-79 (వైస్ కెప్టెన్) 82-83 (కెప్టెన్) 84-85 (కెప్టెన్) పాకిస్తాన్ 1985-86 శ్రీలంక పర్యటించాడు అదే సంవత్సరము ఆస్ట్రేలియాలో రెస్టు ఆఫ్ వరల్డ్ జట్టుతో ఆడాడు మన దేశ జట్టునకు 47 సార్లు సారథ్యము వహించి తొమ్మిది విజయాలు ఎనిమిది ఓటములు 30 డ్రా అయినవి 1975-76 నుండి 66 సార్లు బొంబాయి జట్టుతో రంజీ ట్రాఫీ పోటీలలో ఆడారు పశ్చిమ జోనులో పద్నాలుగు సంవత్సరాలు జట్టులో 22 సార్లు పాల్గొన్నారు ఇరానీ ట్రాఫీలో 12 సార్లు ఆడారు రంజీ ట్రాఫీలో 5335 దులీప్ ట్రాఫీలో 1855 ఇరానీ ట్రాఫీలో 733 పరుగులు చేసారు మూడు అనధికార టెస్టులలో పాల్గొన్నారు 1971 74 79 ఇంగ్లాండు పర్యటనలలో 1000కు పైగా పరుగులు 1970-71లో వెస్టిండీస్‌తో ఆడిన పోటీలో 774

భార్య కుమారునితో సునీల్ గవాస్కర్



పాఠకుల శీర్షిక

చిన్నారి బాలల దీనగాథలు

ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి

విరిసీ విరియని ఆ లేత హృదయాలలో నైరాశ్యం చోటుచేసుకొంటుంది. ఆకళ్ళలో కాంతి వుండదు. ఆ పెదవిపై చిరునవ్వు వుండదు. చింపిరిజుట్టు, చిరిగిన బట్టలు, వాడిపోయిన శరీరం. తమ ఎదురుగానే తమ తోటి వాళ్ళు చక్కగ బడికి వెళుతుంటే తమకు లేని ఆ అదృష్టం తలుచుకొని కుమిలిపోవాలా?



ఫోటో : మాస్టర్ రమణ

అమ్మ, నాన్నల మధ్య కేరింతలు కొడుతు తమ ముందు నుంచి వెళుతున్న తోటి వాళ్ళని చూసి తమకు అమ్మ నాన్న లేరని ఆ పసి హృదయాలు ఆవేదన చెందాలా? అమ్మ ఆప్యాయతను, నాన్న ఆదరణను ఆ పసివాళ్ళు ఎందుకు పొందలేక పోతున్నారు? నీకు నాన్న లేరట. మా అమ్మ చెప్పింది అందుకే నువ్వు మా యింట్లో పని చేస్తున్నావట. మా డాడీ మాకు ఎంచక్కా నన్ను రోజు బడికి కారులో తీసుకు వెళతారు అని గొప్పగా చెప్పి వాళ్ళ ముందు కొన్ని పసి హృదయాలు ఎందుకు కన్నీరు కార్చాలి? అందరిలాగ ఆనందంగ ఆ పసి హృదయాలు ఎందుకు జీవించలేవు?

విధివశాత్తున బొమ్మలుగ ఎందుకవుతున్నారు? ఎక్కడుంది లోపం, ఎవరు దీనికి కారకులు? ఆడదాన్ని మోసం చేసి చేయి దులుపుకొని మరో ఆడదానికి తాళికట్టి ఏమి ఎరగనట్టు ప్రవర్తించేవారు కొందరు. మోసపోయిన ఆడది కన్నెగానే తల్లి అయితే నిర్దయగ కన్నబిడ్డను వదులుకోలేక నవమాసాలు మోసి కంటె ఆ పసివాడికి తండ్రిఆదరణ వుండదు. నీకు నాన్న లేరని ఆ పసి హృదయాన్ని గాయపరుచుతుంది సమాజం. కూలి చేయగ వచ్చిన డబ్బులతో సారా దుకాణంలో దూరే తండ్రులుంటె ఆనందంగ జీవించ వలసిన ఆ పసివాళ్ళు కుటుంబభారం నెత్తిన వేసుకొని ఏదో పని చేసుకుంటూ పొట్ట నిండితే చాలనుకొంటుంటె వారి పనికి తగ్గ వేతనం లభిస్తుందా? రోజుకి 12 గంటలు పని చేయించుకొంటు పసివాళ్ళు పొట్టలు గొట్టి తమ పొట్టలు నింపుకొంటున్న స్వార్థపరులు. చేసిన పనిలో లోపం వుందని చిత్రహింసలు చేసే యజమానులు. తమ పిల్లల వంటివారే ఆ పసిపిల్లలు కాని. ఆస్తి అనే ముసుగులో వుండి పసివాళ్ళని హీనంగ చూసే ధనవంతులు. పాసింజర్స్ తిన్న ఎంగిలి ప్లేట్లు తీయడంలో ఏ మాత్రం పొరపాటు జరిగిన నానా మాటలనే పాసింజర్స్. 10 పైసలు ధర్మం చేయండి అని దీనంగ అడిగితే వారి ఆస్తిలో ఆ 10 పైసలే తక్కువై పోతాయేమో అని చీదరించు కొనే వాళ్ళు కొందరు, వూరికే 10 పైసలు ఇస్తే తమ ప్రిస్టేజ్‌కే భంగమని ఏదో ఒక పని చేయించుకొని గాని 10 పైసలు ఇవ్వని వాళ్ళు కొందరు. విరబూసే మల్లెల వాసనను నలుదిక్కుల వెద జల్లకుండ చేయడానికి వీరందరూ కారకులు కాదా? పరిస్థితుల ప్రభావం మానవులపై ఎంతగానో వుంటుంది అటువంటిది ఆ చిన్నారి బాలలు అడుగడుగునా అవమానాలు ఎదుర్కొంటుంటే ఆ లేత హృదయాలలో ఏదో తెలీని పగ ద్వేషం రగిలి దొంగతనాలు, జూదం మొదలగునవి అలవడుటలో ఆశ్చర్యం లేదు.

వికలాంగులకు ఇచ్చే రాయితీలలో



అన్యాయాలు, అక్రమాలు దీనికి ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలి. సంక్షేమ పథకాల అమలుకు నిజాయితీ గల అధికారులను నియమించాలి. కేవలం ప్రభుత్వమే కాదు సమాజంలో వున్న ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి. ఎవరికి తోచిన సహాయం వారు చేయాలి. సహాయం చేయలేని ఎడల ఆ పసివాళ్ళను చీదరించుకో కూడదు. ఆదరణతో దగ్గరికి తీసుకోవాలి, సున్నిత మైన వారి మనస్సులను గాయపడేటట్లు చేయకూడదు అప్పుడే ఆ పసివాళ్ళ జీవితంలో వెలుగు రేఖలు ప్రసరిస్తాయి. ఆ బాలలే భావి భారత పౌరులవుతారు.

-కొల్లి శ్రీదేవి, భీమిలి. □

కూపన్

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

చిన్నారి బాలల దీన గాథలు

రచన పంపిన వారి పేరు : ....

పూర్తి చిరునామా : ....

....

....

పిన్ కోడ్ :



శతచిత్ర నటి సుమలత సమాధానాలు!

శంఖం రమణమూర్తి, బిట్రగుంట

ప్ర : సుమగారూ! మిత సంతానం గురించి ఘోషించేందుకు బదులు అసలు పెళ్ళిళ్ళే నిషేధిస్తే....?

జ : కల్యాణ మండపాలు నిర్మించిన వారు, పురోహితులు, సన్నాయివాళ్ళు కోర్టులో 'రిట్' వేస్తారు.

వై. ఎల్. సుచరిత, నూజివీడు

ప్ర : నిజం చెప్పండి! ప్లీజ్. అందరూ దేనికి భయపడతారు?

జ : మీ ప్రశ్నలోని మొదటి పదానికి.

సి. హెచ్. సుధీర్‌కుమార్, సత్తెనపల్లి

ప్ర : సినీరంగంలో వారసత్వం పెరిగిపోతూంది. అలాగే మీ చెల్లెలు సినీరంగంలోకి వస్తుందా?

జ : మీకా భయం అక్కర్లేదు. ఆ అమ్మాయికి ఆ ఇంటరెస్ట్ ఉన్నట్లు లేదు.

ఎల్. మునిరత్నం, జమ్మికుంట

ప్ర : సుమగారూ! స్మితాపాటిల్‌ను మరపించే నటి ఎవరైనా వస్తారా?

జ : వచ్చినా, స్మితాపాటిల్‌ను ఎవ్వరూ మరిచిపోలేరు.

పోతార్లంక నరసింహారావు, గుంటూరు

ప్ర : ఆడదాని వయస్సు, మగవాని జీతం అడగొద్దంటారు. ఎందువలన?

జ : అడిగితే కరెక్ట్ జవాబులు రావు గనుకేమో?

ఆర్. పద్మరాణి, పాణ్యం

ప్ర : నేనీ గృహం అనబడే పంజరంలోంచి బయట పడాలని చూస్తున్నాను. తమ ఉపదేశమేమిటో?

జ : బయట ప్రపంచం అంతకన్నా పెద్ద పంజరం! జాగ్రత్తండోయ్!

తంగెళ్ల పద్మారావు, పాయకరావుపేట

ప్ర : కొందరికి మీకు ప్రశ్నలు పంపడం కన్నా వేరే పని లేనట్లుంది...

జ : మీకు మాత్రం కానట్లు!

ఎస్. వెంకటేశ్, జువారినగర్ (గోవా)

ప్ర : ఇంటికి దీపం ఇల్లాలు అని ఒకరంటున్నారు. భర్త లేనిదే ఇల్లంతా చీకటని ఇంకొకరంటున్నారు. మరి మీరేమంటారు?

జ : ఇంటికి భార్య ప్రమిదె అయితే, అందులో వెలిగే జ్యోతి భర్త.

ఉత్తమ ప్రశ్న

ఎస్. జోహార్‌బేగం, కొవ్వూరు

ప్ర : నటిగా పేరు ప్రఖ్యాతులు వచ్చిన తరువాత జనం మధ్యన స్వేచ్ఛగా తిరగడం అనేది కష్టమే అవుతుంది. అంటే, స్వేచ్ఛని కోల్పోయినట్లే కదా?

జ : అలా నేననుకోవడం లేదు.

కె. సాజన్‌రావు, పర్లాకిమిడి

ప్ర : ఆఫీసులో కొత్త యజమాని రుస రుసలు... ఇంట్లో కాపురానికొచ్చిన అర్ధాంగి చిటపటలు... వీటి మధ్య చిక్కి నా గతి ఏమవ్వాలి?

జ : కొద్ది రోజుల్లో మీకు అలవాటై పోతుందిలెండి. ఆ తర్వాత ఆ రుసరుసలూ, చిటపటలూ లేకపోతే, మీకు జీవితం నిస్సారంగా తోస్తుంది.

సి. శమంతకమణి, పిఠాపురం

ప్ర : కొందరు ఎప్పుడూ తమ గురించి తాము ఎందుకు గొప్పగా చెప్పుకుంటుంటారు?

జ : అది వాళ్ల తత్వం. అలాగే చెప్పుకోనివ్వండి. మనదేం పోయింది!

పి. వి. నాగరాజరావు, కర్నూలు

ప్ర : అత్త లేని కోడలు ఉత్తమురాలు. కోడలు లేని అత్త గుణవంతురాలు... దీనిపై మీ వ్యాఖ్య ఏమిటి?

జ : పల్లె పదాలు పాడుకోటానికి ఎంతో బావుంటాయి.

మద్ది వసుంధర, సింగరేణి కాలరీస్

ప్ర : కష్టాలను భరించలేనప్పుడు ఏం చేయాలక్కయ్యా?

జ : కళ్ళు మూసుకుని పడుకుంటే, మంచి కలలైనా వస్తాయి. అంతకు మించిన సుఖం లేదు. పైగా, మర్నాడు మేలుకొనేసరికి కొత్త కష్టాలను భరించే శక్తి కాస్త చేకూరుతుంది.

ఎం. జి. భాషా, గుంటకల్

ప్ర : నాకు ఒక ఫ్లాప్ చిత్రం తీయాలని వుంది. అందుకు మీ సలహా ...?

జ : అందుకు ఎవరి సలహా అక్కర్లేదే!

చావలి అప్పారావు, పర్లాకిమిడి

ప్ర : ఆకాశంలో అసంఖ్యాక నక్షత్రాలకు ఒకే ఒక చంద్రుడున్నాడు. అలా కాకుండా చంద్రుళ్ళు కూడా ఎక్కువగా ఉండి ఉంటే ...?

జ : అమావాస్యలూ ఎక్కువగా ఉండేవి. □

కూపన్

ఆంధ్ర సచిత్ర వారపత్రిక

సుమలత సమాధానాలు

ప్రశ్న...

....

....

పంపినవారి పేరు..

పూర్తి చిరునామా...

అభిమాన తారలపై అభిప్రాయం

డేరింగ్, డేషింగ్, డైనమిక్ సుప్రీమ్ హీరో "చిరంజీవి" నా అభిమాన నటుడు, ఆయన నటించిన చిత్రాలలో 90 శాతం నేను చూస్తూ వుంటాను. 8 సంవత్స





రాలలో ఎందరో మనస్సులను దోచుకున్నాడు–మన సుప్రీం హీరో 'చిరంజీవి' తెలుగు చలనచిత్ర రంగంలో చిరంజీవిగారు ఎంతో ఎదిగి పేరు ప్రఖ్యాతులు గడించారు. ఈ సంవత్సరములో 26 కేంద్రాలలో ఘన విజయము సాధించి రికార్డు సృష్టించింది రాక్షసుడు. ఈ చిత్రములో చిరంజీవి చాలా బాగా నటించారు. "చక్రవర్తి" మిగతా చిత్రాలు కూడా బాగుంటాయని ఆశిస్తున్నాను.

ఎ. రాజా, ప్రొద్దుటూరు

* * *


"మాపల్లెలో గోపాలుడు" చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైన అర్జున్ నా అభిమాన నటుడు. మొదటి చిత్రం లోనె ఎంతో అనుభవం గల నటుడుగా నటించి ప్రేక్షకులచే శభాష్ అని అనిపించుకొని "మన్నెంలో మొనగాడు", "కోనసీమ కుర్రోడు"గా సుస్థిరమైన స్థానాన్ని ఏర్పరుచుకొనెను. "త్రిమూర్తులు" చిత్రంలో ప్రేమికుడుగా నటించి మహిళా ప్రేక్షకుల ఆదరణ సంపాదించి "డాక్టరు గారి అబ్బాయి"గా రాబోవుచున్నాడు. "చిన్నారి దేవత", "కుట్ర" వంటి చిత్రాలలో ఫైట్స్ ఎంతో నేర్పుగా చేసిన కరాటికింగ్ అర్జున్. "సినిమారంజని పత్రిక" ద్వారా ఉత్తమ పోలీస్ ఆఫీసర్‌కు బహుమతులు ప్రకటించడం నా

లాంటి అభిమానులకు ఆనందకరముగా యున్నది. భవిష్యత్తులో కూడ యిలాంటి కార్యక్రమాలు ప్రవేశ పెడతారని ఆశిస్తున్నాను.

–కప్పెజు ప్రకాష్, కట్టుబోలు(విశాఖ)

"పండంటి కాపురం"లో పుట్టి అనతి కాలంలోనే ప్రేక్షకుల హృదయాల్లో "మల్లెపూవు"లా గుభాళించిన అగ్రనటి జయసుధ నా అభిమాన నటి.




గ్లామర్ చెప్పుకో తగ్గంతగా లేకపోయినా తన నటనా ప్రతిభతో ఆంధ్రలోకాన్ని అలరించి అగ్రస్థానంలో చేరిపోయింది. నటిగానే కాకుండా ప్రస్తుతం నిర్మాతగా మారి ప్రేక్షకులకు మంచి చిత్రాలు అందించాలని తాపత్రయ పడుతూంది. త్వరలో దర్శకత్వం వహిస్తానని జయసుధ ఇచ్చిన ప్రకటన చూసి ఆనందించాము. ఆమె దర్శకత్వంలో తయారయ్యే చిత్రాల్లో సమాజానికి పనికి వచ్చే అంశాలు. సందేశాలు వుండాలని కోరుకుంటు న్నాను.

–యన్. శివానంద్, బెల్లంపల్లి ☐

సినిమా

విశేషాలు

—జి.వి.జి.

త్వరలో "చందమామ రావే"

అశ్లీల, అసభ్యత అంశాలు చొప్పించకుండా అన్నివర్గాల ప్రేక్షకులకూ స్పందన కలిగించేరీతిలో చక్కని చిత్రాలను ప్రణాళికాబద్ధంగా రూపొందించి, ఉన్నతప్రమాణాలకు ప్రతీకగా నిలిచిన సంస్థ నిర్మాత రామోజీరావుగారి ఉషాకిరణ్ మూవీస్. వీరి పై చిత్రం త్వరలో విడులవబోతోంది. "శ్రీమంతుల కుటుంబాలలోని పిల్లలు, పెద్దల ఆడంబరాలవల్ల, అశ్రద్ధవల్ల మమతానురాగాలకు దూరమవుతుంటారు సాధారణంగా. ఒక ఐశ్వర్యవంతుని కుటుంబంలో పుట్టిన. పిల్ల పరిస్థితుల ప్రభావం మూలంగా పూరిపాకల్లోకి చేరుతుంది. ఆ నిరుపేదలలోని ఆప్యాయత, అనురాగం, మానవత్వానికి ఆకర్షితురాలై, అక్కడే ఉండిపోవాలనుకుంటుంది. అక్కడుండే కొందరు దొంగల్ని కూడా సన్మార్గులుగా దిద్దుతుంది. ప్రధాన పాత్ర నాలుగైదేళ్ళ పాపది" అన్నారు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ అట్లూరి రామారావు. ఈ చిత్రంలో బేబీ సుజిత, చంద్రమోహన్, నూతన్‌ప్రసాద్, వంకాయల, మల్లికార్జునరావు, మాడా, చిట్టిబాబు, విద్యాసాగర్, ప్రకాష్, కల్పన, రాజ్యలక్ష్మి, పద్మిని, తాతినేని రాజేశ్వరి, కృష్ణవేణి, చిలకరాధ పాల్గొన్నారు. కాశీ విశ్వనాథ్ కథ, మాటలు రాశారు. వేటూరి గీతాలు, సత్యం సంగీతం, నవకాంత్ ఛాయ, భాస్కరరాజు శిల్పం, శివసుబ్రహ్మణ్యం నృత్యాలు, గౌతంరాజు కూర్పు, మౌళి దర్శకుడు.

"వెన్నెల్లో ఆడపిల్ల"

"నాగరిక ప్రపంచానికి దూరంగా మారు మూల ప్రదేశంలో మూఢాచారాలతో భారంగా బ్రతుకు సాగిస్తున్న ఒక అనాగరిక జాతి వారిలో చైతన్యం తీసుకు రావడానికి, అక్కడ నిస్సహాయురాలిగా ఉన్న ఒక యువతికి నవ జీవితాన్ని కల్పించడానికి ఆదర్శ భావాలు గల ఓ యువకుడు కృషి చేస్తాడు. ఇతను ఒక శిల్ప కళాశాలలో పరిశోధకుడుగా ఉంటూ, తన జీవితంలోని ఓ దుర్ఘటనను మరచి పోవడానికని ఆ ప్రాంతానికి వెళ్ళినప్పుడు నాయికతో పరిచయ మవుతుంది. మతం, ఆచారాల పేరుతో కొందరు స్వార్థపరులు అమాయకులను పీడించే విధానాన్ని తూర్పార బడుతుంది చిత్రం. తూర్పు గోదావరి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలైన రంపచోడవరం, మారేడుమిల్లి, అడ్డతీగల, చిలకమామిడి వగైరా చోట్ల షూటింగ్ చేశాం. సెప్టెంబరులో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం." అన్నారు రేలంగి మల్లిక్. ఈయన స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో తమలంపూడి శ్రీనివాస రెడ్డి, పంతం నానాజీ, ఆర్. అచ్యుత రామారావు నిర్మించిన వెన్నెల క్రియేషన్స్ వారి పై చిత్రంలో సర్వదమన్ బెనర్జీ, నిషాంత, రాళ్ళపల్లి, శుభలేఖ సుధాకర్, భీమ్, మల్లికార్జునరావు, హేమసుందర్, పి. జె. శర్మ, టి. జె. రామనాథం, కృష్ణ చైతన్య, సంయుక్త, వై. విజయ, అనిత పాల్గొన్నారు. రాంగుబాల్ కథకుడు. తనికెళ్ళ భరణి సంభాషణల కర్త. సీతారామశాస్త్రి గీతాలకు ఎస్. పి. బాలసుబ్రహ్మణ్యం స్వరకర్త. లోకేశ్వర్ ఛాయ, తోట యాదు శిల్పం, సుందరం–ప్రమీల నృత్యాలు, అప్పాజీ సాహసాలు, జయప్రసాద రెడ్డి సహకార దర్శకత్వం, అనిల్ మల్నాడ్ కూర్పు నిర్వహించారు.



"ఓ ఇంటి కాపురం"లో భానుప్రియ

కోదండరామిరెడ్డి చిరంజీవిలతో "కొండవీటి దొంగ"

"ఇది చిరంజీవి 100వ చిత్రం. 70 ఎం. ఎం. లో సెప్టెంబర్ 1 నుంచి షూటింగ్" అన్నారు విజయలక్ష్మి ఆర్ట్ పిక్చర్స్ టి. త్రివిక్రమరావు. వి. ఎస్. ఆర్. స్వామి ఛాయాగ్రాహకుడు. ఎ. కోదండరామిరెడ్డి దర్శకుడు.

అర్జున్ "పిడుగు రాముడు"

శేఖర్ కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో నూనె అచ్యుతరామయ్య నిర్మించే శ్రీ కృష్ణ తులసి పిక్చర్స్ వారి పై చిత్రంలో అర్జున్, కల్పన, వేలు, రాళ్ళపల్లి, వినోద్, రామరాజ్, పెమ్మసాని రామకృష్ణ, వనితశ్రీ నటిస్తున్నారు. భరత్ మాటలు. కృష్ణ– చక్రి సంగీతం, కె. ఎస్. మణి ఛాయ, విజయకుమార్ శిల్పం, సత్యం ప్రొడక్షన్, సూపర్ సుబ్బరాయన్ సాహసాలు. నాయని మహేశ్వరరావు కూర్పు నిర్వహిస్తున్నారు.

సినిమా

"బావా మరుదుల సవాల్"లో ఎం. ఎల్. ఎ. తతంగం



''బావా మరుదుల సవాల్''లో రమ్యకృష్ణ

రంజిత్‌కుమార్ (శరత్‌బాబు) రాగానే ఎమ్మెల్యే "నమస్కారమయ్యా" అన్నాడు. ఇంతలో ఒక నౌకరు ట్రేలో విస్కీ, సోడా సీసాలు తీసుకొచ్చాడు. "ఇప్పుడు ఈ సెటప్ పెట్టారేమిటి?" అడిగాడు రంజిత్‌కుమార్.

"చేపలు నీట్లో ఈదినట్లు నువ్వీ మందులోనే ఈతకొడుతున్నావని నాకు తెలీదనుకున్నావా? కానియ్!" అంటూ గ్లాసు అందించాడు ఎమ్మెల్యే.

గుక్కెడు తాగి "ఏవో డాకుమెంట్లమీద సంతకాలు చెయ్యాలని ఫోన్‌చేశారు? ఏమిటా డాకుమెంట్లు?" అడిగాడు రంజిత్‌కుమార్.

"అదేనయ్యా, గాజువాక దగ్గర పాతిక ఎకరాల స్థలం కొన్నానుకదా? దాన్ని నీ పేరున రిజిస్ట్రేషన్ చేయిస్తున్నాను."

రంజిత్‌కుమార్‌కు బాగా కైపెక్కింది. "వద్దంటున్నా తాగించేశారు. ఆ డాకుమెంట్లు యిస్తే, సంతకాలు....." అంటూ తడబడ్డాడు.

కొన్ని డాకుమెంట్లకింద కొన్ని తెల్లకాగితాలుంచి యిచ్చాడు ఎమ్మెల్యే.

"ఇన్ని పేపర్లున్నాయేమిటి?" అన్నాడు రంజిత్‌కుమార్ మరింత తూలుతూ.

"ఈ రిజిస్ట్రేషన్‌లో ఎన్ని గొడవలున్నాయో తెలుసుకదా? మూడడుగుల స్థలం కొంటే చాలు - ముప్పై అడుగుల కాగితాలమీద సంతకాలు పెట్టాలి. జాగ్రత్తగాపెట్టు" అంటూ ఎమ్మెల్యే కలం అందించాడు.



''పెళ్ళి కాని ఇల్లాలు''లో వరలక్ష్మి

తనను తాను మరచిన స్థితిలో రంజిత్‌కుమార్ సంతకాలుపెట్టేశాడు.

పాలమరశెట్టి అన్నపూర్ణ సమర్పించే క్వాలిటీ పిక్చర్స్ "బావా మరుదల సవాల్" చిత్రాన్ని సి. వి. గణేశ్ దర్శకత్వంలో పి. అప్పారావు నిర్మించారు.

"తాతయ్య కంకణం"



''మదన గోపాలుడు''లో రాజ్యలక్ష్మి

"ఆస్తి పాస్తులను పోగొట్టుకున్న ఇద్దరు అమాయకులైన మిత్రులలో ఒకని కుమారుడు లతాంగి అనే దేవకన్య వల్ల తాతయ్య కంకణాన్ని పొంది, తిరిగి తన ఆస్తిని ఎలా పొంద గలిగాడన్నది కథాంశం. సెప్టెంబర్ విడుదల," అన్నారు కొమ్మినేని. ఈయన కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో బ్రహ్మాజీ, నున్నా వెంకట్రామయ్య, ప్రభాకర్ నిర్మించిన శ్రీ ప్రభ ఆర్ట్స్ వారి పై చిత్రంలో నరసింహరాజు, జె. వి. సోమయాజులు, పద్మనాభం, నాగేష్, వంకాయల, శ్రీరాజ్, పొట్టి ప్రసాద్, రాంబాబు, గొకిన రామారావు, ప్రభ, ఎస్. వరలక్ష్మి, జయమాలిని, శ్రీదుర్గ, రోహిణి, సూర్యకళ, చిలక రాధ, సుజాత, చంద్ర, మాస్టర్ రాజేష్ పాల్గొన్నారు. కర్పూరపు ఆంజనేయులు మాటలు, ఆత్రేయ- ఆరుద్ర పాటలు, కె. వి. మహదేవన్ సంగీతం, హెచ్. ఎస్. వేణు ఛాయ, శేషు- శివశంకర్ నృత్యాలు, వేమూరు వీరభాస్కర్ సహకార దర్శకత్వం, కందస్వామి కూర్పు, గొడవర్తి రామారాయుడు ప్రొడక్షన్‌తో రామరాజు సమర్పణ.



"చుట్టాలబ్బాయి"లో సుహాసిని

కృష్ణ దర్శకత్వంలో శ్రీ వెంకట పద్మావతీ పిక్చర్స్ చిత్రం


"ఈ సమాజంలో న్యాయ ధర్మాలు ఎలా చలామణీ అవుతున్నాయో, వాటి ప్రతిఫలం ఏమిటో నన్నది ప్రధాన ఇతివృత్తం. ధర్మం కోసం పాటుపడే అన్న అపర కర్ణుడు. న్యాయానికి ప్రతినిధి అయిన లాయర్ విజయుడు. ఈ అన్నదమ్ముల మధ్య సంఘర్షణకు లోనయ్యే వదిన.... క్రయిమ్ ఎలిమెంట్ ఉన్న కుటుంబ కథాచిత్రం," అన్నారు కృష్ణ. ఈయన స్క్రీన్‌ప్లే, కూర్పు, దర్శకత్వంలో డి. కాశీ విశ్వనాథరావు నిర్మిస్తున్న శ్రీ వెంకట పద్మావతీ పిక్చర్స్ చిత్రంలో అన్నదమ్ములుగా కృష్ణ, రమేష్, వదినగా జయప్రద, ఇతర పాత్రలలో మోహన్‌బాబు, సత్యనారాయణ, కోట శ్రీనివాసరావు, గొల్లపూడి మారుతీరావు, పద్మనాభం, మల్లికార్జునరావు, గెస్ట్‌గా మురళీమోహన్ పాల్గొంటున్నారు. వియత్నాంవీడు సుందరం కథకు పరుచూరి సోదరులు సంభాషణలు రాశారు. వేటూరి గీతాలకు చక్రవర్తి స్వరకర్త. వి. ఎస్. ఆర్. స్వామి ఛాయ, సలీం- రఘు నృత్యాలు, వి. జగదీశ్ ప్రొడక్షన్ నిర్వహిస్తున్నారు. ఆగస్ట్ 21 నుంచి సెప్టెంబర్ 10, సెప్టెంబర్ 21 నుంచి 30 వరకు జరిగే షెడ్యూల్స్‌తో చిత్రీకరణ ముగుస్తుంది. జమిందారుగా, మధ్య తరగతి మనిషిగా, శ్రామికుడుగా తన పాత్ర మూడు దశలుగా సాగుతుందని హీరో కృష్ణ తెలిపారు.



ఇతను నా ఫ్యాన్!

"రౌడీ రాజ్యం"

"పుట్టుకతో ఏ వ్యక్తీ దుష్టుడు కాడు; పరిస్థితుల ప్రభావం వల్ల మానవుడు దానవుడవు తూంటాడు అనే ప్రాతిపదిక మీద అల్లబడిన కథ. సెప్టెంబర్ నుంచి నవంబర్ వరకు షూటింగ్. చివరి షెడ్యూల్‌ను అరకులోయలో, వైజాక్ ప్రాంతాలలో ప్లాన్ చేశాం," అన్నారు అనిల్ కుమార్. ఈయన దర్శకత్వంలో సాయికృష్ణ ఫిలిమ్స్ డివిజన్ నిర్మించే పై చిత్రంలో అర్జున్, శారద, నూతన్‌ప్రసాద్, గొల్లపూడి మారుతీరావు, వేలు, సిల్క్ స్మిత పాత్రధారులు. ఆర్. వి. సెల్వరాజ్ కథకు సి. వి. రమణ స్క్రీన్‌ప్లే, పూసల మాటలు రాశారు. సీతారామశాస్త్రి, జాలాది గీతాలకు కృష్ణ- చక్ర స్వరకర్తలు. శరత్ ఛాయ, రాంచంద్రసింగ్ శిల్పం, సత్యం- నాగేశ్వరరావు కూర్పుతో వి. సి. సుధాకర్, జి. వి. ఆర్. నిర్మాతలు.



"బాలమురళి ఎం. ఏ."లో కళ్యాణచక్రవర్తి, అశ్వని

సినిమా

గీతా కృష్ణా కంబైన్స్ "బాలమురళి ఎం. ఎ."గా కల్యాణ చక్రవర్తి

"1986లో కేరళ ప్రభుత్వపు అవార్డులు అందుకున్న 'టి. పి. బాలగోపాలం ఎం. ఎ' అనే విజయవంతమైన మలయాళ చిత్రం మాతృక. జూలై 17 నుండి నెలాఖరు వరకు, ఆగస్టు 15 నుండి నెలాఖరు వరకు రాజమండ్రి ప్రాంతాలలో షూటింగ్," అన్నారు ముక్కామల రామకృష్ణ. స్క్రీన్‌ప్లే, దర్శకత్వంలో చింతా రామకృష్ణారెడ్డి, ఎన్. భాస్కరరెడ్డి నిర్మించే పై చిత్రంలో కల్యాణ చక్రవర్తి, అశ్వని, గొల్లపూడి మారుతీరావు, 'శుభలేఖ' సుధాకర్, పొట్టి ప్రసాద్, మల్లికార్జున రావు, శుభ, వై. విజయ, నిర్మల, వరలక్ష్మి పాల్గొంటున్నారు. ఆకెళ్ల సంభాషణలకర్త. ఆత్రేయ, సీతారామశాస్త్రి గీతాలకు కె. వి. మహాదేవన్ స్వరకర్త. పి. లక్ష్మణ్ ఛాయ, పి. వి. రావు శిల్పం, కె. గణేష్ సహకార దర్శకత్వం, నల్లూ రవి ప్రొడక్షన్, బెనర్జీ కూర్పు నిర్వహిస్తున్నారు.


"టార్జాన్ సుందరి"

"ముఖ్యమయిన సన్నివేశాలకోసం రెండు లక్షల వ్యయంతో సెట్ వేశాం. 70 రోజులపాటు జరిగిన షూటింగ్‌తో చిత్రం పూర్తయింది. కొంతభాగం 3-డిలో షూట్ చేశాక ప్రస్తుత వ్యాపారరీతికి అనుగుణంగా సినిమాస్కోప్‌లోకి మలచాం" అన్నారు వసుంధరా ఎంటర్‌ప్రైసెస్ అధినేతలు వై. నాగేశ్వరరెడ్డి, జగదీష్. ఆరడుగుల బొంబాయి అందాల వనిత జమున ప్రధానపాత్ర నిర్వహించిన ఈ చిత్రంలో వినోద్, సిల్క్‌స్మిత, జయప్రకాష్, మాడా, థమ్, వై. జి. మహేంద్రన్, షాయికిరణ్, రేఖ, బబిత, ఫెటీనా నాగేశ్వరరావు, రెండు ముఖ్య పాత్రలలో రామకృష్ణ, మంజుల నటించారు. వేటూరి, రాజశ్రీ గీతాలను ఇళయరాజా స్వరపరిచారు. నంబి, సాహుల్, బాబు, రామలింగం ప్రభృతి సాంకేతికవర్గంతో పి. శ్రీరామమూర్తి నిర్వహణ బాధ్యతలు వహించారు. కె. ఆర్. సమర్పణ.

శ్రీ రవికిరణ్ మూవీస్ చిత్రానికి ఆదిత్య దర్శకత్వం

"స్త్రీ సమస్యాత్మక ఇతివృత్తం. అక్టోబర్ 20 నుంచి రాజమండ్రి ప్రాంతాలలో ఒకే షెడ్యూల్లో షూటింగ్," అన్నారు ద్వారంపూడి నరసారెడ్డి. ఈయన "ఉదయం" అనంతరం నిర్మించే శ్రీ రవికిరణ్ మూవీస్ ద్వితీయ చిత్రంలో శారద, రాజశేఖర్, శరత్‌బాబు, సుధాకర్, నాయికగా ఒక నవ నటి పాల్గొంటారు. అప్పలాచార్య మాటలు, కె. వి. మహాదేవన్ సంగీతం. రఘునాథ రెడ్డి ఛాయ, అంగిటపల్లి నరసింహారెడ్డి నిర్మాణతతో టి. గోవింద రెడ్డి సమర్పించే ఈ చిత్రానికి ఆదిత్య కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు వహిస్తారు. □

ఎంతో కాలంగా ఉత్తమత్వంలో తమకు గల గుర్తింపును హెచ్ ఎమ్ టి వెలుగు లోనికి తెస్తోంది



హెచ్. ఎమ్. టి గడియారాలకు, ట్రాక్టర్లకు, యంత్ర పరికరాలకు, సి.ఎన్.సి. యంత్రాలకు నాణ్యతలో ఖచ్చి తత్వంలో గల అంతర్జాతీయ ఖ్యాతికి హెచ్. ఎమ్.టి బల్బులు మరియు ట్యూబులు ప్రతిబింబాలు.

హెచ్. ఎమ్. టి ల్యాంపులోని ప్రతి భాగమూ హెచ్. ఎమ్. టి వారే తయారు చేస్తారు. ఇవి 75 అతి కఠినమైన నాణ్యత పరీక్షలకు గురై మీ డబ్బుకు మరింత విలువ నిస్తాయి.

అందుకే, హెచ్. ఎమ్. టి బల్బులు మరియు ట్యూబులను ఎన్నుకోండి. అవి తమ పేరుకు తగ్గట్లు గా చిరకాలం మన్నుతాయి.

hmt
బల్బులు మరియు ట్యూబులు

పటిష్ఠమైనవి. విశ్వసనీయమైనవి.

hmt
Lamps

మీ జీవితంలో వెలుగు.

MAA (S) HMT C1 TEL 87

మనమే బోఫోర్స్ వెంట పడ్డామా?!

మనం చాలా పొరపాటు పడ్డాం. స్వీడన్ వాళ్ళు మనకు లంచం ఇస్తున్నారని, తమ నిష్ప్రయోజకమైనటువంటి శతఘ్నులతో, స్విట్జర్లాండ్‌లోని నంబర్డ్ ఖాతాలతో వాళ్ళు మనవెంట పడుతున్నారని మనం ఇంతకాలమూ అనుకుంటూ వచ్చాం. కాని చూడగా ఇందుకు సరిగ్గా వ్యతిరేకంగా జరుగుతున్నట్టున్నది. మనమే స్వీడన్ వాళ్ళ వెంటబడి వాళ్ళ శతఘ్నులు మనకమ్మవలసిందిగా బ్రతిమిలాడినట్టున్నది. ఇంకేమేమి అడిగామో ఆ భగవంతుడికే తెలియాలి. గత కొద్ది నెలల్లో రాజీవ్‌గాంధీ, ఆయన బృందం స్టాక్‌హోమ్‌కు అన్ని సార్లు ఎందుకు వెళ్ళారో దీన్నిబట్టి అర్థమవుతుంది. అంతెందుకు, మొన్ననే శ్రీ నరసింహారావు స్టాక్‌హోమ్‌లో ఉన్నారు. టి. వి. మీద కూడా కనబడ్డారు. ప్లాజాలో నాట్యం చేస్తూ ఎప్పటి వలెనే గంభీరంగా ఉన్నారు. ఆయనను వధ్యశిల మీదికి నడిపించుకు పోతున్నారేమోనని ఎవరయినా అను మానించేటంత గంభీరంగా ఉన్నారు.

మొన్నొక రోజు స్టాక్‌హోమ్‌లో నోబెల్ అధిపతి "మేము ఏ లంచాలూ ఇవ్వలేదు" అని అన్నాడు. "మా శతఘ్నులను సంపాదించాలని భారత ప్రభుత్వం ఆత్ర పడుతుండగా మాకు లంచం ఇవ్వవలసినటువంటి అవసరం ఎందుకొస్తుందో నాకు అర్థం కావడం లేదు" అని కూడా అన్నాడాయన. నిరుపయోగకరమైన శతఘ్నులు అమ్ముకోదలచుకున్నప్పుడు పళ్ళు బిగబట్టి అబద్ధాలాడక తప్పదు గనుక ఇప్పుడు కూడా ఆయన అబద్ధమాడుతూ ఉండి ఉండవచ్చు. కాని ఈ సారి మరీ అంత పచ్చి అబద్ధం ఆడుతున్నాడని నాకుఅనిపించడం లేదు. లంచాలు ఇచ్చేటటువంటి విషయాలలో చాలా పేరు గడించి ఉన్న ఫ్రెంచి వాళ్ళకన్నా, లేదా, ఆస్ట్రియన్ల కన్నా స్వీడన్ వాళ్ళు పెద్ద మొత్తంలో లంచాలు ఇవ్వజూపారు గనుక రాజీవ్, ఆయన బృందం బోఫోర్స్ శతఘ్నుల్ని కొనడం పై శ్రద్ధ చూపారు. రెండో కారణమూ, చాలాముఖ్యమైన దయినటువంటి కారణమూ కూడా అయినదేమంటే, రాజీవ్ బృందానికి స్టాక్‌హోమ్‌లో ఒలాఫ్ పాల్మె అనే నమ్మకస్తుడు ఉండేవాడు. ఆయన ఆ దేశానికి ప్రధానమంత్రి కూడా. పాల్మె వంటి మహానుభావుడు అటువంటి పనులు చేయడని మీరు భావించేటట్లయితే, ఆయన ఒక సోషలిస్టని మీరుగుర్తుంచుకోవాలి. లంచగొండి కానటువంటిసోషలిస్టును ఒక్కరినైనా నేనింత వరకు కలుసుకోలేదు. అటువైపు మంచి మిత్రుడు ఒలాఫ్‌పాల్మె చేతుల్లో కళ్ళాలుండగా, ఏమి చేసి అయినా తప్పించుకు పోవచ్చు. ఫ్రాన్స్‌తో గాని, ఆస్ట్రియాతో గాని అటువంటి వ్యవహారం కుదరదు. సందర్భవశాత్తూ ఈ దేశాలన్నీ సోషలిస్టు ప్రభుత్వాలను కలిగి ఉన్నాయని, రాజీవ్ బృందం ఆదేశాలతో వ్యాపారం చేయడానికి ఆసక్తి చూపడంలో అది కూడా ఒక కారణమని గుర్తించాలి.

కాని నేను అసలు విషయం వదిలేసినట్టున్నాను. ప్రభుత్వాధికారులకు గాని, రాజకీయ వేత్తలకు గాని లంచాలేమీ ఇవ్వలేదని నోబెల్ అధిపతి చెప్పిన మాట నిజమే కావచ్చు. నిజానికి వాళ్ళసలు లంచాలే ఇచ్చి ఉండక పోవచ్చు. వాళ్ళు ఇచ్చిన పర్లా కమిషన్లు – దాదాపు కచ్చితంగా విన్ చడ్దాకు అవి అందాయి. ఆయన ఢిల్లీలోని బిగ్‌బాస్‌కు, అతని స్నేహితులకు ఇవ్వడంతో పాటు ఇవ్వవలసిన వాళ్ళందరికీ ఇచ్చాడు. బిగ్‌బాస్ కుటుంబానికి ఇచ్చి ఉండక పోవచ్చు, గుర్తుంచుకోండి. ఆ డబ్బు రహస్య ఖాతాల లోకి, అంత రహస్యం కానటువంటి ఖాతాలలోకి చేరింది. నాకేమనిపిస్తున్నదంటే, ప్రతిపక్షంలోని మన మిత్రులు తమ ప్రతినిధి వర్గాన్ని స్టాక్‌హోమ్‌కు పంపేసరికి, తాము ఎటువంటి మాయకు గురయ్యారో తెలుసుకుంటారు. వాళ్ళకు స్విస్ ఖాతా గురించిన వివరాలన్నీ ఇచ్చినప్పటికీ, ఆ డబ్బంతా ఛడ్దా ఖాతాలో చేరిందని వాళ్ళు గుర్తిస్తారు. ఆ ఖాతాను ఇప్పటికి రద్దు చేసి ఉంటారనేది దాదాపు కచ్చితమైన విషయం. ఈ పని ఢిల్లీలో మాఫియాకు చెందిన ఇతర సభ్యులకు తెలిసే జరిగి ఉంటుంది కూడా. నిజానికి అన్ని స్విస్ ఖాతాలూ ఆ పాటికి మూసేయబడి ఉంటాయి. విషయం స్విట్జర్లాండ్ చేతుల్లో ఉన్నదని తెలుసుకుని మన మిత్రులు వట్టి చేతులతో తిరిగి వస్తారు.

న్యూఢిల్లీ లేఖ



డా. జయదుబాషి

మీరిక్కడ ఒక విచిత్రమైన విషయం గమనించారా? బోఫోర్స్‌తో ప్రత్యక్షంగా సంబంధం కలిగినటువంటి ప్రతి ఒక్కరూ మెల్లమెల్లగా అదృశ్యమై పోవడం లేదూ? ఛడ్దా వెళ్ళి పోయాడు. కచ్చితంగా ఢిల్లీలోని బిగ్‌బాస్ ఆశీర్వాదంతోనే వెళ్ళి పోయి ఉంటాడు. ఆయన ఎక్కడ దాక్కుని ఉన్నాడో ఎవరికీ తెలియదు. ఆయన అదృశ్యం గురించి ప్రభుత్వం పెద్ద ఎత్తున గగ్గోలు పెడుతున్నది గాని, ఆయన కనాట్ ప్లేస్ పట్టుకుని వేళ్ళాడకుండా వెళ్ళి పోయినందుకు ప్రభుత్వం ఎంతగానో ఆనందిస్తూ ఉండి ఉంటుంది. అజితాబ్ బచ్చన్ కూడా అదృశ్యమయ్యాడు. కొందరి అంచనా ప్రకారం బ్రస్సెల్స్ లోనో, మరికొందరి అంచనా ప్రకారం అమెరికాలోనో ఆయన ఛడ్దాలకు సాహచర్యాన్ని నెరపు తున్నాడు. అద్భుతమైన బచ్చన్‌ల కుటుంబంగురించి, కష్టపడి పని చేసే తన సోదరుడు సూరత్‌లో రైతులకు మాత్రలూ, ఔషధాలూ అమ్ముకుంటూ పైకెట్లా వచ్చాడనే విషయం గురించి కొన్ని వారాల క్రింద దాకా పత్రికలకు ఇంటర్వ్యూలు ఇస్తూ ఉన్న ఆ గొప్ప ఆట పాటల మనిషి పలుకే బంగారమయిపోయింది. బచ్చన్‌లు ఎక్కడున్నారు? ఎవరికీ తెలియదు. చూడగా ఎవరికీ పట్టినట్టు కూడా లేదు. ఒక ఢిల్లీ పత్రికలో వచ్చిన వార్త ప్రకారం 1986 మార్చితో ప్రారంభించి ఒక సంవత్సరంలోపే అజితాబ్ బచ్చన్ స్విట్జర్లాండ్‌లో 4 కోట్ల రూపాయలకు పైగా పెట్టుబడులు పెట్టాడు. ఈ తేదీ చదవగానే మీకేమీ గుర్తురాక పోతే, మీ పాత పత్రికలు వెతకండి. 'బోఫోర్స్ కొనుగోళ్ళ ఒప్పందంపై సంతకం చేసినది ఆనెలలోనే.

మళ్ళీ నేను అసలు విషయం వదిలేస్తున్నట్టున్నాను. ఎందుకో గాని, బోఫోర్స్‌గురించి అన్ని చర్చలు ఢిల్లీలోని బిగ్ బాస్, స్వీడన్‌లోని కంపెనీ చుట్టే తిరిగాయి. విషయం రసవత్తరంగా ఉండేటందుకు ఛడ్దా వంటి కొందరు మనుషులకు కూడా స్థానం దొరికింది. కాని మీరు హఠాత్తుగా ఒక

(65 వ పేజీ చూడండి)